RNI No. APTEL/2003/12253

# భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 17 Issue No. 3(2) Monthly March 2020 ISSN No. : 2456-4702 Rs. : 15/-

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం






మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 17 - Issue. 3 - March (2) 2020 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil
(Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

# స్త్రీ అబల కాదు సబలే

"కార్యేషు దాసీ
కరణేషు మంత్రీ
భోజ్యేషు మాతా
శయనేషు రంభా"

అని మహాకవి చెప్పినట్లుగా ప్రతి మగాడి విజయంలో స్త్రీ పాత్ర లేనిదే అతడికి మనుగడ లేదు. స్త్రీని శక్తితో పోలుస్తాం. స్త్రీలోని విశేష లక్షణం సహనం. భూదేవికున్నంత సహనం. ఈ సహనంతో స్త్రీ సాధించలేనిది ఏదీ లేదు.

చదువు, ఉద్యోగం, రాజకీయ, సంసారం, సంఘ సంస్కరణ, శాస్త్రాలు, చట్టాలు, సాంకేతికత ఇలా చెప్పుకుంటూపోతే స్త్రీలు అన్ని రంగాలలో చదువుల వల్ల వచ్చే సామర్థ్యాలతో సాధించే కార్యాలే కాకుండా అనుభవం, ధైర్యం, తెలివి, త్యాగభావం వల్ల వచ్చే యోగ్యతలతో సాధించే కార్యాలు కూడా స్త్రీ జాతి మహిమను చాటి చెప్పే సందర్భాలు కోకొల్లలు.

ఒక సహోదరిగా, భార్యగా, తల్లిగా బాధ్యతలను నిర్వర్తించే శక్తి స్త్రీకి మాత్రమే సాధ్యం. ఆహారంతో పాటు సేవ, సంస్కారం, మంచిచెడుల విచక్షణా జ్ఞానం కుటుంబ సభ్యులందరికీ పంచిపెడుతూ పిల్లల్ని క్రమశిక్షణలో ఉంచుతూ భావి పౌరులుగా తీర్చిదిద్దగల నేర్పరి. ఇటువంటి బరువు బాధ్యతల్ని పూర్తిచేస్తూ కూడా తనని తాను అబల కాదు సబల అని నిరూపించుకోగల సమర్థురాలు.

రజియా సుల్తానా, ఝాన్సీ లక్ష్మీభాయి, ధాయిపన్నా, మదర్ థెరిస్సా, విజయలక్ష్మి పండిట్, లక్ష్మీ సెహగల్, అనీబిసెంట్, ఇందిరాగాంధీ, సోనియా గాంధీ మొదలైన వారందరూ ఎటువంటి విషమ పరిస్థితులనైనా ఎదుర్కొంటూ తమని తాము సబలలుగా నిరూపించుకున్నారో లోకవిదితమే. సునీతా విలియమ్స్, కిరణ్‌బేడి, జయలలిత, మాయావతి, మమతాబెనర్జీ వంటి వారు కూడా ప్రత్యక్ష ఉదాహరణలే.

ఈ ఆధునిక ప్రపంచంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ తమని తాము రక్షించుకుంటూ తమ ఇంటినీ తమ పిల్లల్నిమాత్రమే కాకుండా తమలోని సంస్కారాన్ని సంప్రదాయాల్నీ కూడా రక్షించుకుంటూ ముందుకుపోతున్న స్త్రీ జాతికీ నేడు రక్షణ కరువవుతుంది. అన్నీ మారుతున్నాయి, మహిళల పట్ల మన ఆలోచనా ధోరణి తప్ప. అవును "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవత" అని ఆర్యోక్తి. కాని దేవతగా కొలవాల్సిన స్త్రీమూర్తిపై అత్యాచార సంస్కృతి నేటి పరిస్థితుల్లో ఆందోళన కలిగిస్తున్నది.

"మహిళల స్థితిగతులు బాగు పడనిదే సమాజం అభివృద్ధి చెందదు. ఏ పక్షి అయినా ఒక్క రెక్కతో ఎగరలేదు" అన్న స్వామి వివేకానంద మాటలు మరోసారి స్మరిస్తూ సమాజ నిర్మాణంలో సగభాగమైన స్త్రీ సమానత్వాన్ని కాంక్షిద్దాం, సాధిద్దాం అదే మన ప్రగతికి మూలం.

- సంపాదకవర్గం

# Contents (విషయ సూచిక)

| | | | |
|---|---|---|---|
| 1. | అనువాదంలో ప్రక్రియ | - ఎవివికె. చైతన్య | 6 |
| 2. | బంజారాల ఆవిర్భావ వికాసం | - బానోతు క్రిష్ణ | 11 |
| 3. | తెలుగు సాహిత్యానికి కళాదీపిక పత్రిక దోహదం | - బి. శ్రీనివాసులు | 15 |
| 4. | ప్రజాకవి కాళోజి పరిచయం | - భూక్య నరేందర్ | 18 |
| 5. | పులుల బోనును చేధించిన సజీవ సాక్ష్యం "ఇనాక్" గారు | - డా॥. వై. సుభాషిణి | 23 |
| 6. | శాసన పరిశోధకుడిగా గురజాడ | - డా॥. భూక్య తిరుపతి | 27 |
| 7. | తెలుగు భాష ప్రస్తుత పరిస్థితి | - డా॥. ఇ. వాసు | 30 |
| 8. | సమీక్షకుడుగా జానమద్ది హనుమచ్ఛాస్త్రి | - డా॥. శిరీష ఈడ్పుగంటి | 33 |
| 9. | తెలుగు సాహిత్యంలో గిరిజనులు - ఆర్థిక విధానం | - కె.ఎస్.ఎస్. రత్నప్రసాద్ & <br> - డా॥. జరుపుల రమేష్ | 36 |
| 10. | వేమన ధర్మనిరతి | - డా॥. యమ్.విజయశ్రీ | 44 |
| 11. | బంజారా వంశ చరిత్ర చారిత్రక నేపథ్యం | - డా॥. నెహ్రూనాయక్ | 46 |
| 12. | విమర్శ ఎందుకు ? | - డా॥. పి.ఎ. సత్యనారాయణ | 51 |
| 13. | కుమారస్వామి కవిత్వంలో మానవతా మహోదయం | - డా॥. పి. విజయకుమార్ | 54 |
| 14. | పూర్వబాల్యదశలో వాక్కు వికాసం | - డా॥. బి. ప్రసాద్ బాబు | 57 |
| 15. | కథానిక - కొన్ని పరిశీలనలు | - డా॥. జి. స్వర్ణలత | 61 |
| 16. | హేతువాద రచనలు - సామాజిక చైతన్యం | - డా॥. తరపట్ల సత్యనారాయణ | 66 |
| 17. | వేయిపడగలు నవలలో గిరిక భగవద్భక్తి | - డా॥. వై. శ్రీలత | 70 |
| 18. | దిగంబర పయనం | - డా॥. వెంకటరామయ్య గంపా | 74 |
| 19. | బి. పి. కరుణాకర్ కథల్లో మానవీయ కోణం | - జె. రజిత | 78 |
| 20. | కాళోజీ కైతల కవాతు | - జె. శంకర్ | 82 |
| 21. | దర్గామిట్ట కతలు - హిందూ ముస్లిం సమైక్యత | - కొండయ్య కోసూరు | 85 |
| 22. | తెలంగాణ తొలి దళిత వాగ్గేయకారుడు మాస్టార్జీ | - ముత్తారెడ్డి రాజు | 89 |
| 23. | సాహితీ సార్వభౌములు | - పి. అన్వేష్ గౌడ్ | 93 |
| 24. | శ్రీ నారాయణతీర్థలవారి శ్రీ కృష్ణలీలాతరఙ్గిణి | - పసుమర్తి వేంకట రమణ | 94 |
| 25. | రాయలసీమ జనపదాలలో పదప్రయోగాలు | - ఆచార్య ఎం. రామనాథంనాయుడు | 101 |
| 26. | జానపద సాహిత్యం - లోక సాహిత్యం | - రొండి అర్జున్ | 111 |
| 27. | మహాకవి గురజాడ - అభ్యుదయానికి అడుగుజాడ | - సాలి రాజా | 114 |
| 28. | "పల్లెకు దండం పెడతా (దీర్ఘ కవిత) - ఒక పరిశీలన | - మల్లె చెంచురామారావు | 117 |
| 29. | ఆధునిక తెలుగు సాహిత్యం - ప్రకృతి | - కె. సుధాకర్ | 123 |
| 30. | కడప జిల్లా జానపద కళారూపాలు - ఒక పరిశీలన | - యన్.వి. వసుమతి | 126 |
| 31. | వట్టికోట ఆళ్వారుస్వామి నవల "ప్రజల మనిషి" – ప్రజాచైతన్య | – డా॥. మరపతి మాంతయ్య | 130 |
| 32. | Assessment Patterns - Reading | - B. Rohini | 133 |

# అనువాదంలో ప్రక్రియ (Genre in Translation)

- ఎవివికె. చైతన్య, గెస్ట్ ఫ్యాకల్టీ, తెలుగు శాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

ప్రక్రియకు ఆంగ్లంలో Genre అన్న పదం సమానార్థకం. "A Genre comprises a class of communicative events, the members of which share some set of communicative purposes which are recognized by the expert members of the parent discourse community and there by constitute the rationale for the genres. This rationale shapes the schematic structure of the discourse and influences and constrains choice of content and style (Swales. 1999, 58). ఒక రచనను చదవడానికి ముందు అది ఏ ప్రక్రియకు చెందినదో తెలియడం వల్ల పాఠకుడికి ఆ రచనకు సంబంధించి కొంత సమాచారం తెలియడంతోపాటు ఆ రచన నుండి ఏమి ఆశించవచ్చో కూడా తెలుసు కుంటాడు. ఉదా: కథ సాహిత్య పరమైన ప్రక్రియ అదే వ్యాపార ప్రకటన సమాచార వ్యాప్తికి చెందిన ప్రక్రియ. పాఠకుడు ఈ రెంటినీ చదివి అర్థం చేసుకోవడంలో తేడాలుంటాయి. అందుకు కారణం రెండు ప్రక్రియల కున్న లక్షణాలలోని వైరుధ్యం. కనుక ఇక్కడ ప్రక్రియలను వేరు చేస్తున్నది వాటి లక్షణాలే అన్న విషయాన్ని గుర్తించాలి. ఆధునిక ఆంగ్ల సాహిత్యంలో ప్రధానంగా నాలుగు సాహిత్య ప్రక్రియలు కనిపిస్తాయి. అవి : Poetry, Fiction (ఇందులో కథ, నవల చేరుతాయి), Drama, Nonfiction. ఈ విభజన ఆయా ప్రక్రియలకున్న లక్షణాల ఆధారంగానే చేశారు. వీటిలో అనేక ఉప ప్రక్రియలు కూడా ఉన్నాయి. ప్రక్రియ, పాఠరకం(ువఞుఎజావ) పరస్పర సంబంధం కలిగి ఉంటాయి. ఇక్కడ పాఠరకం అంటే ఒకే విధమైన నిర్మాణం, శైలి, అంశాలు కలిగిన రచనలు. ఇటువంటి రచనలలోని/పాఠ రకాలలోని సారూప్య లక్షణాలన్నీ కలిసి ప్రక్రియను ఏర్పరుస్తాయి. ప్రక్రియ కేవలం నిర్మాణ పరమైన అంశాలకే పరిమిత మైనది కాదు. సామాజిక, సాంస్కృతిక అంశాలు కూడా ప్రక్రియ లక్షణాలలో భాగమే. ప్రక్రియా పరిణామంలో పై రెండు అంశాలకు భాగం ఉన్నందువల్ల ప్రక్రియను పరిశీలించేప్పుడు సామాజిక, సాంస్కృతిక అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వవలసి ఉంటుంది. అంటే ప్రక్రియలోని భాషా నిర్మాణాన్ని కూడా ఈ అంశాలు ప్రభావితం చేస్తాయి. కనుక ప్రక్రియ అనువాదంలో వీటిని కూడా పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ప్రక్రియపై సంస్కృతి ప్రభావం కారణంగానే భిన్న సంస్కృతుల మధ్య సాహిత్య ప్రక్రియల పరిణామాన్ని అర్థం చేసు కోవడానికి అనువాదం తోడ్పడుతుంది. అనువాద నాణ్యతను నిర్ణయించడానికి తొలితరం అనువాదకులు మూడు అంశాలను ముఖ్యంగా పరగణలోకి తీసుకున్నారు. సమానత, మూలవిధేయత, నిజాయితీ. తెలుగులో అనువాద విధానాలపై, సిద్ధాంతాలపై గ్రంథాలు రాసిన చాలామంది అనువాదం మూల విధేయంగా ఉండాలనే చెప్పారు. కానీ వీరు చెప్పిన సిద్ధాంతాలు తెలుగులో కనిపించే అనువాద రచనలు వేరు వేరు దారుల్లో నడిచి నట్టు అనిపిస్తుంది.

నేటి తరం అనువాదకులు అనువాదంలో సమానత అనే అంశానికి అంతగా ప్రాధాన్యం ఇవ్వడం లేదు. సంస్కృతీ పరమైన కారణాలవల్ల కొన్ని సార్లు అనువాదంలో సమానత సాధ్యం కాదనేది వీరివాదం. దీనికి బదులుగా సొంతం/స్వాయత్తం (Adaptation) అన్న విధానానికి విలువ ఇస్తున్నారు. స్వాయత్తం అంటే మూల రచనను అనువదించే సందర్భంలో లక్ష్యభాషా సహజత్వానికి దగ్గరగా మార్పు చేసి అందించడం. ఇందుకుగాను కేవలం భాషా శాస్త్ర సూత్రాలపైనే ఆధారపడితే సరిపోదు. 'In such a prospective view of Translation the structure and the actual linguistic makeup of the TT then are not determined by the Source Text (ST) but more importantly also by other various

factors such as the intended purpose and function of TT, the text typological and/or genre conventions, the addressee's background knowledge and their communicative needs (Schaffner.2000:18). మొత్తంగా చూస్తే ప్రతి రచనా ఏదో ఒక ప్రక్రియకు సంబంధించింది అయి వుంటుంది. అందువల్ల అనువాదకుడు అనువాదం మొదలు పెట్టడానికి ముందు తను ఎంచుకున్న రచన తాలూకూ ప్రక్రియ లక్షణాలను తెలుసుకోవాలి. ఉదా: రాజ్యాంగ బద్ధమైన చట్టాన్ని అనువదించే క్రమంలో చట్టాలను రాసే ప్రక్రియను కూడా ద అష్టిలో ఉంచుకోవాలి. దీనిని బట్టి వివిధ శాఖలలో అనువాదం చేయడానికి ఆయా శాఖలపై అవగాహన అవసరం అని తెలుస్తుంది.

## ప్రక్రియ - అనువాదకుడు :

అనువాదకునికి అనువదించబోయే ప్రక్రియకు సంబంధించిన అవగాహన ఉన్నపుడు అనువాదం ఎలా చేయాలో? ఏ విధమైన భాషను వాడాలో? అనువాద లక్ష్యం ఏమిటో? తెలుస్తాయి. ఎక్కువ మంది అనువాదకులు తమ అనువాదాలలో భాష, వ్యాకరణం, అర్థం వంటి అంశాలకే ప్రాధాన్యం ఇస్తారు. ప్రక్రియను పట్టించుకోకపోతే కొన్నిసార్లు మూల రచనలోని ప్రక్రియ లక్షణాలు అనువాదంలో లోపించే ప్రమాదం ఉంది. అపుడు మూల రచనకు ఆ భాషా సాహిత్యాలలో గల స్థాయిని లక్ష్యభాషలో అనువాదం అందుకోలేదు. హార్వే, డికిన్స్, హిగ్గిన్స్ అనే అనువాద శాస్త్రజ్ఞులు ప్రక్రియను ఐదు రకాలుగా విభజించారు. అవి సాహిత్యపరమైనవి, మతపరమైనవి, సాంకేతికమైనవి, తాత్వికమైనవి, ప్రభావవంతమైనవి. ఇందులో ప్రతీ రకానికి నిర్దిష్ట లక్షణాలు ఉంటాయని చెబుతూనే వాటిలో ఉప ప్రక్రియలు కూడా ఉంటాయన్నారు. అనువాదకుడు పదం, వాక్యం. భావం అనే స్థాయిల్లో కింది నుండి పైకి అనువదించడం వల్ల ప్రక్రియను సాధించలేడు. పై నుండి కిందకు అంటే ప్రక్రియ స్థాయి నుండి కూడా అనువాదకుడు మూల భాష గ్రంథాన్ని అర్థం చేసుకున్నపుడే అనువాదం మంచిగా జరుగుతుంది. ఉదా: పద్యంలో ఉన్న పదాలు, భావాలను అనువదించినంత మాత్రాన అనువాదం కూడా పద్యం లానే తయారవుతుందని చెప్పలేము. మూల భాష, లక్ష్య భాషల మధ్య ఉన్న ఛందస్సు, వ్యాకరణం, రచనా పద్ధతులు, మొత్తంగా పద్య ప్రక్రియపై అనువాదకుడికి అవగాహన ఉండాలి. అనువాదకుడికి మాత్రమే కాదు లక్ష్యభాష పాఠకుడికి కూడా ప్రక్రియపై అవగాహన ఉండాలి. పాశ్చాత్య సాహిత్యంలో "హైకూ" ప్రక్రియ తర్వాత ఇతర దేశాల సాహిత్య ప్రక్రియలు అంతగా ఆదరణ పొందలేదు. కారణం పాశ్చాత్య పాఠకులకు ఆయా ప్రక్రియలపై అవగాహన లేకపోవడం. అలాగే ఆ ప్రక్రియలకు దగ్గరగా ఉండే ప్రక్రియలేవీ వారి భాషలో లేకపోవడం. అనువాదకులు ఇటువంటి సందర్భాలలో లక్ష్యభాష పాఠకులు కొత్త ప్రక్రియలను ఎంత వరకు ఆదరిస్తారన్నది అంచనా వేసి అనువాదానికి పూనుకోవాలి. "If the genre is not widely not known in the target culture, no amount of skill on the translator's part can make the translation a success in that culture"(Andre Lefevere. 1992: 33).

## తెలుగు సాహిత్య ప్రక్రియలు - అనువాదం :

పాశ్చాత్య సాహిత్యం కన్నా భారతీయ సాహిత్యం ప్రక్రియను నిర్వచించడంలో ఎక్కువ శ్రద్ధను కనబరిచింది. పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు, నాటకాలు వంటి ప్రక్రియల లక్షణాలను భారతీయ లాక్షణికులు సవిస్తరంగా వివరించారు. తెలుగు కవులు కూడా సాహిత్య నిర్మాణంలో ప్రక్రియా లక్షణాలను పాటించారు. పురాణ సంబంధ వస్తువును తీసుకున్నా కూడా సంస్క అత సర్గబంధ ప్రక్రియా లక్షణాలతో జోడించి ప్రబంధ ప్రక్రియా నిర్మాణం చేశారు. ప్రాచీన తెలుగు కావ్యాల వస్తువులన్నీ ఎక్కువగా పురాణాల నుండి తీసుకున్నవే. కానీ వాటిలో ఎక్కువగా కావ్య ప్రక్రియా లక్షణాలే కనిపించడం వల్ల సాహితీవేత్తలు వాటిని కావ్యాలుగానే గుర్తిస్తున్నారు. అందువల్లనే ఇవి తెలుగులో స్వతంత్ర కావ్యాలుగా గుర్తింపు పొందాయే తప్ప అనువాదాలుగా కాదు. ఇక్కడ గుర్తించవలసిన విషయం అనువాదంగా గుర్తింపబడడానికి మూలభాషలోని ప్రక్రియ అదే

రూపంలో లక్ష్యభాషలోకి చేరాలి. ఒకవేళ వేరొక భాషా ప్రక్రియలో రచనలు చేయాలనుకుంటే ఆ ప్రక్రియకు సంబంధించిన లక్షణాలను తెలుసుకుని సొంత భాష పద జాలంతో రచనలు చేయవచ్చు. ఆధునిక సాహిత్య ప్రక్రియ లైన నవల, జీవిత చరిత్ర, స్వీయచరిత్ర, గజల్, నానీలు ఈ విధంగానే తెలుగులో చేరాయి. ఒక ప్రక్రియలో ఉన్న వస్తువు లక్ష్యభాషలో మరొక ప్రక్రియలోకి మారడం ప్రాచీన తెలుగు సాహిత్యంలో కనిపిస్తుంది. ఇది ఆనాటి కవులకు చెల్లింది కానీ ఈనాడు మూల రచయితల అంగీకారం లేకుండా ఇటువంటి మార్పులను చేయడం కుదరదు. అయితే సొంత రచన చేసే సందర్భంలో భిన్న ప్రక్రియల లక్షణాలను కలపడం వంటివి ఆధునిక రచయితలు చేశారు. తెలుగులో ఆత్మకథాత్మక నవలలు 'అనంతం, లోపలి మనిషి'లను ఇందుకు ఉదాహ రణలుగా చెప్పవచ్చు. అలాగే నవలలు, నాటకాల్లో పద్యా లను చేర్చినవారు, సుదీర్ఘ విజ్ఞాన సంబంధ విషయాలను చర్చించినవారు తెలుగు సాహిత్యంలో కనిపిస్తారు. ఉదా : విశ్వనాథ సత్యనారాయణ, త్రిపురనేని గోపీచంద్, రావిశాస్త్రి. రచన ఏ విధంగా ఉండాలి? ఏ ప్రక్రియలో కొనసాగాలి? అన్న విషయాలు రచయిత మీద, సమ కాలీన రచనా విధానాల మీదా ఆధారపడతాయి. అనువాదకుడు వీటిని అర్థం చేసుకుంటూ సమకాలీన లక్ష్యభాషా రచనా సంప్రదాయాలను కూడా ద అష్టిలో ఉంచుకుని అనువాదానికి పూనుకోవాలి.

## నవలా ప్రక్రియ - అనువాదం :

లక్ష్యభాషా పాఠకులకు ప్రక్రియపై అవగాహన ఉన్నపుడు, కొత్త ప్రక్రియను అందిస్తున్నపుడు అను వాదకుడు ప్రక్రియా లక్షణాలకు కూడా అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా కొత్త ప్రక్రియను అందిస్తున్నపుడు మూలంలో ఆ ప్రక్రియకున్న లక్షణాలు పూర్తిగా లక్ష్యభాషా రచన(అనువాదం/సొంత రచన) లో వ్యక్తం అయినాయో? లేదో సరిచూసుకోవాలి. తెలుగులో రంగరాయ చరిత్రను కొంతమంది సాహితీవేత్తలు తొలి నవలగా ఒప్పుకొనక పోవడానికి కారణం, రచయిత నరహరి గోపాలక అష్ణమశెట్టి నవలా ప్రక్రియ లక్షణాలను పూర్తిగా పాటించకపోడమే. సాహిత్యాన్ని గుర్తించడానికి లక్షణాలు ఉన్నట్టే ప్రతీ సాహిత్య ప్రక్రియను గుర్తించడానికి లక్షణాలు ఉన్నాయి. కొన్ని సాహిత్య ప్రక్రియల లక్షణాలలో పోలికలు ఉండ వచ్చు. పోలికని బట్టి రెండు సాహిత్య ప్రక్రియలను ఒకటిగా చెప్పలేము. ఉదాహరణకు కథకు, నవలకు ఇతివ అత్తం, శైలి వంటి లక్షణాలలో పోలికలు ఉన్నాయి. కానీ ఈ రెండు ప్రక్రియలను అనుసరించి వాటిలో భేదాలు, పరిమితులు వేరువేరుగా ఉంటాయి. ప్రక్రియలు వేరు వేరు అయినపుడు వాటిని అనువదించే విధానాలు కూడా వేరుగానే ఉండాలి.

ఏ ప్రక్రియకు ఎటువంటి అనువాద విధానాలను వాడాలన్నది ఆ ప్రక్రియ లక్షణాలను బట్టి ఉంటుంది. '"genres are not only features of texts but also connect text markers and interpreters. Assigning a text to a specific genre certainly influences the way the text is read and interpreted. The Genres are distinguished by particular conventions of content and form"(Chandller.1997:03). లక్ష్యభాషలో అనువాదం మూలభాషలో ఉన్న ప్రక్రియ గుర్తింపునే పొందాలనేది కొందరు అనువాదకుల అభిప్రాయం. కవిత్వంలో (ఉదా: ఇంగ్లీషు సానెట్ లేదా సంస్క అత పద్య అనువాదం )ఇటువంటి సూత్రం పాటించడం కష్టమేమో గానీ వచన సాహిత్యంలో సాధ్యం అవుతుంది. తెలుగు ఆధునిక వచన సాహిత్యం చాలా వరకు ఇంగ్లీషు సాహిత్య ప్రక్రియల ప్రేరణతో వచ్చింది కనుక మూలరచనకు చెందిన ప్రక్రియా లక్షణాలను అనువాద కులు అనుసరించి అనువదించడంలో సమస్యలు తక్కువ. ఒకవేళ మూల రచనా ప్రక్రియ లక్ష్యభాషకు పూర్తిగా కొత్తదైతే అనువాదకుడు మూలానికి దగ్గరగా ఉన్న లక్ష్యభాషా ప్రక్రియను అనుసరించ వలసి ఉం టుంది. తెలుగు సాహిత్య అనువాదకులకు ఈ విషయంలోనూ మినహాయింపు ఉంది. తెలుగువారు నూతన సాహిత్య ప్రక్రియలను మొదటి నుండీ ఆదరి స్తున్నారు. దాశరథి, సినారె గజళ్ళు, గోపీ నానీలు, వచన

సాహిత్యంలో చైతన్య స్రవంతి వంటి శైలులు ఇతర భాషల నకళ్ళుగానే తెలుగులో చేరాయి. కనుక తెలుగు సాహిత్యానువాదకులు అందులోను వచన సాహిత్య అనువాదకులు కొత్త ప్రక్రియలను మూలాన్ని అనుసరించే అనువదించవచ్చు. అయితే మూల ప్రక్రియను అనువాదం ఎంత వరకు ప్రతి బింబిస్తున్నది? అనేది ఇక్కడ ప్రశ్న. మూల ప్రక్రియతో అనువాదాన్ని పోల్చి ఎవరో ఒకరు చెప్పే వరకు ఈ విషయం తేలదు. కనుక అనువాదకుడు మూల రచనను సంపూర్ణంగా అన్నికోణాలలో (ముఖ్యంగా ప్రక్రియ పరంగా) అర్థం చేసుకుని అనువదించాలి. అప్పుడు కూడా మూలం అందించిన స్థాయిలో అనువాదం పాఠకులపై ప్రభావం చూపకపోవచ్చు. కారణం మూల భాష చరిత్ర, సంస్కృతులను మూలభాషా రచన ఎంతోకొంత అనుసరిస్తుంది. అందువల్ల మూలభాషా పాఠకుడికి రచన అందించే భావాలు బలంగా ఉంటాయి. ఉదా: రెండో ప్రపంచ యుద్ధం తరువాత ఇంగ్లీషు సమాజాల నుండి నవలా సాహిత్యం అధికంగా వెలువడింది. ఈ నవలల్లో ఎక్కువగా యుద్ధకాలంలో, ఆ తరువాత ఏర్పడిన సామాజిక పరిణామాల చర్చ ఎక్కువగా ఉంటుంది. ఆ కాలంలో భారతదేశంలో ముఖ్యంగా దక్షిణ భారతంలో ఇటువంటి పరిస్థితులు తక్కువగా కనిపిస్తాయి. కనుక ఆ కాలం నాటి ఇంగ్లీషు నవలలు మూలంతో పోల్చితే పాఠకుడిపై కలిగించే ప్రభావం తక్కువ. భిన్న సంస్కృతులకు చెందిన రచనకు చెందిన అనువాదాల మధ్య కూడా ఇటువంటి ప్రభావమే కనిపిస్తుంది. ఉత్తర భారతానికి, దక్షిణ భారతానికి చెందిన రచనలు, వాటి అనువాదాలు ప్రభావితం చేసినంతగా ఇంగ్లీషు సాహిత్యం ప్రభావం చూపలేదు. ప్రక్రియను పరిశీలించడం వల్ల అనువాదానికి ఎంచుకున్న మూల భాషా రచన ఏ విధమైనదన్న ప్రాథమిక అంచనా అనువాదకుడికి ఏర్పడుతుంది. ఆ ప్రక్రియ పరంగా అంత వరకు జరిగిన పరిశోధనలు, అనువాదాలు ప్రస్తుత రచన అనువాదానికి సాధనాలుగా ఉపయోగపడతాయి. ప్రక్రియపై అవగాహన ఉన్న అనువాదకుడు రచనలోని సూక్ష్మాంశాలను అవగాహన చేసుకొని అనువదించే వీలు కలుగుతుంది. ఉదా: నవలా ప్రక్రియలో వస్తువుకు ప్రాధాన్యం ఉన్నట్టే నేపథ్యానికీ ప్రాధాన్యం ఉంటుంది. వాతావరణం, ఆహారం, వస్త్రధారణ నేపథ్యంలో భాగంగా ఉంటాయి. మూల రచన నేపథ్యం గురించి తెలిసిన అనువాదకుడికి అందుకు తగిన నేపథ్యాన్ని లక్ష్యభాషలో అందించడం సులువవుతుంది. “With the generic features of target text in mind, the translator can organize its structure and select the appropriate words and expressions in a more efficient and effective manner” (ZhishengWEn, Edward . 2004 : 04).

ఈ సూత్రం పద్య సాహిత్యం, శాస్త్ర సాహిత్యం అనువాదానికి వర్తించినంతగా నవలానువాదానికి వర్తించదు. నవలలో భాషను నిర్ణయించేది రచయిత, సందర్భం, పాత్రలు, కనుక నవలలోని భాష ఏదో ఒక రూపానికి కట్టుబడి ఉంటుందని చెప్పలేము. అయితే ప్రతీ నవలకు విడివిడిగా ఈ సూత్రాన్ని అన్వయించుకోవచ్చు. నవల విషయానికి వచ్చే సరికి నవలకున్న విస్తృతి వల్ల అందులో రచయిత సాహిత్యేతర విషయాలు కూడా చెప్పే అవకాశం ఉంది. ఉదా: ఇంగ్లీషులో Moby-Dick, Mother, The Tale of Two Cities, Good Earth వంటి నవలలు, తెలుగులో వేయి పడగలు, గడియపడని తలుపులు వంటి నవలలను పరిశీలిస్తే చేపలవేట, మార్క్సిస్టు భావాల ప్రసంగాలు, చెప్పులు కుట్టడం, వ్యవసాయం, భారతీయ సంప్రదాయం, మానసిక వికాసం వంటి విషయాల వివరణలు సుదీర్ఘంగా కనిపిస్తాయి. కనుక అనువాదకుడు ఇటువంటి అంశాల అనువాదానికి కూడా సిద్ధపడి ఉండాలి.

**ముగింపు :**

నవలానువాదంలో పాటించవలసిన అంశాలను గురించి డా. భార్గవీరావు ఈ విధంగా అన్నారు. “నవలానువాదం అనేది వచనానువాదంలో భాగమే అయినా ప్రత్యేకత కలిగిన అంశంగా పరిగణించాలి. ఇతర వచన

రచనలను అనువదించినట్లుగా దీనిని అనువదించటం సాధ్యం కాదు. స అజనాత్మక ద అష్టితోనే అనువాదం సాగాలి. నవలానువాదంలో గుర్తించాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. అవి: నవల ఇతివ అత్తం, రచనా కాలం, శైలి, సంస్క అతి ప్రత్యేకత, సంఘటనల వరుస, భాష, ప్రయోజనం"(భార్గవీరావు. 2౦౦6 :66). పైన చెప్పిన అంశాలన్నీ నవల లక్షణాలలో భాగాలే. కనుక నవలాను వాదంలో నవలా లక్షణాలను కూడా అనువాదకులు పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం ఉందని అర్థం అవుతుంది. ఈ క్రమంలో తెలుగు నవలానువాదకులు తమ అనువాదాలలో నవలా లక్షణాలకు ఇచ్చిన ప్రాధాన్యాన్ని పరిశీలించాలి.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ఆనందరామం, సి. 199౦. తులనాత్మక సాహిత్యం -నవలా ప్రక్రియ (వ్యవస్థాగత ద అక్పథం). హైదరాబాదు: సి. ఉమ.
2. కుటుంబరాయ శర్మ, బడ్డుపాటి. 1971. ఆంధ్ర నవలా పరిణామము. హైదరాబాదు: గాయత్రీ ప్రచురణము.
3. భీంసేన్, నిర్మల్. 2౦౦౦. అనువాదశాస్త్రం. హైదరాబాదు: తెలుగు అకాడమి ప్రచురణ.
4. మ అణాళిని, సి. 1988. సాంఘిక నవల - కథన శిల్పం. హైదరాబాదు: తెలుగు పరిశోధన ప్రచురణలు.
5. సుజాతారెడ్డి, ముదిగంటి. 199౦. తెలుగు నవలానుశీలనం. హైదరాబాదు: రోషణమ్ పబ్లికేషన్స్.
6. సుదర్శనం, ఆర్. యస్. 1973. తెలుగు నవల - నూరు సంవత్సరాలు. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# బంజారాల ఆవిర్భావ వికాసం

- **భానోతు క్రిష్ణ**, తెలుగు అధ్యాపకులు, అశోక్‌నగర్ సైనిక్‌స్కూల్, నర్సంపేట్, తెలంగాణ.

బంజార ప్రజలు గిరిజన తెగలతో పోల్చుకుంటే ప్రత్యేకంగా కన్పిస్తారు. భారతదేశంలోని అనేక రాష్ట్రాలలో బంజారల వేషభాషణాలు, ఆచార్య వవ్యవహారాలు, జీవన విధానాలను వివిధ పేర్లతో కలిగి ఉంటారు. దేశంలో వీరి ఉనికిని, వలసలను పరిశీలిస్తే బంజారాలు ఉత్తర భారతదేశంలో ఉండేవారని, కొన్ని కారణాల వలన క్రమంగా దక్షిణ భారతదేశానికి వలస వచ్చారని చరిత్ర కారులతో పాటు బంజారాలు కూడా అభిప్రాయపడు తున్నారు. మరికొందరు బంజారాలు విదేశాలలో కూడ సంచార జాతులుగా నేటికి ఉన్నారని పేర్కొనుచున్నారు. బంజారాల వంశ చరిత్ర, పండుగలు, ఆచార వ్యవ హారాలు కూడ రాజపుత్రల నేపథ్యాన్ని సూచిస్తాయి. కాని కొన్ని కారణాల వలన రాజపుత్రుల నుండి విడిపోయి ప్రత్యేక తెగగా ఏర్పడ్డాయని చరిత్రకారులు పేర్కొం టున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో బంజారాల సంస్కృతి సంప్ర దాయాలు పూర్వ కాలంలో ఉన్న విధంగా వర్తమాన కాలంలో పాటించడం లేదని చెప్పవచ్చు. ఉదాహరణకు వస్త్ర అలంకరణ, చాలా వరకు బంజారా స్త్రీలు వారి వస్త్రాలు ధరించడం లేదు. బంజారాలను లంబాడీలని, సుగాలీలు అని ఇలా అనేక రకాలుగా పిలువ బడు తున్నారు. బంజారాలు రాజస్థాన్‌కు చెందిన రాజ వంశీయులు వేయి సంవత్సరాల క్రితం మహ్మదీయుల అరాచకాలకు బలై, భారతదేశ నలు దిశలకు వెళ్ళి సంచార తెగలుగా జీవనం కొనసాగిస్తున్నారు. ఇలా భారతదేశ చరిత్రలో ప్రసిద్ధిగాంచిన పృద్వీరాజ్ చౌహాన్, చాంద్ బర్‌దాయి వంటివారు, రాణా ప్రతాపసింహుని చరిత్రకు సంబంధించిన గాథలను బంజారాల వంశ చరిత్రలో గమనిస్తాం.

**చారిత్రక నేపథ్యం :**

ఢిల్లీ పాలకుడైన పృథ్వీరాజ్ చౌహాన్‌కు, మహ్మద్ ఘోరికి మధ్య జరిగిన రెండవ తరాయిన్ యుద్ధం 1192 సంవత్సరంలో జరిగింది. ఈ యుద్ధంలో పృథ్వీరాజు మహమ్మద్ ఘోరీ చేతిలో ఓడిపోయాడు. పృథ్వీరాజ్ చౌహాన్ ఓడిపోవుటకు ప్రధాన కారణం తన తోటి రాజపుత్రుడైన జయజంద్రుడు వారి మధ్య శత్రుత్వాన్ని ఆసరాగా చేసుకొని పరాయి దేశీయుడైన మహామ్మద్ ఘోరీకి సైనిక సహాయం చేసి పృథ్వీరాజ్ ఓటమికి కారకుడైనాడు. మహ్మమ్మద్ ఘోరీ, పృథ్వీరాజ్ కళ్ళను పొడిపించి తుజకిస్తాన్‌కు తీసుకెళ్ళి ఇనుపగొలుసులతో బంధిస్తాడు. ఈ విషయం తెలుసుకున్న రాజభక్తి పౌరుడు చాంద్‌భట్ తుజకిస్తాన్‌కు వచ్చి ఘోరీని కలుసుకొని పృథ్వీరాజుకు 'శబ్దభేద విద్య' వచ్చునని చెప్పి, ఘోరీ అనుమతి ఇవ్వడంతో పృద్వారాజ్‌చే శబ్దభేద విద్యను ప్రయోగింపచేసి మహమ్మద్ ఘోరి శిరస్సును ఖండింప చేస్తాడు. తరువాత ఘోరీసైనికులచేత మరణించడం కంటె మనమే చంపుకోవడం మేలని తలచి ఒకరి చేతిలో ఒకరు మరణిస్తారు.ఈ పరిణామంలో మహమ్మద్ ఘోరీ సైని కులు చౌహాన్ యొక్క రాజ్య సైనికులు, ప్రజలపై పగపట్టి వారిని హతమార్చటం మొదలు పెట్టారు. తురుష్క సైని కులు అడవుల్లో చౌహన్ రాజ్యంలోని ప్రజలను వెతికి వెతికి మరీ చంపసాగారు. దీనితో ప్రజలు, సైనికులు తమ వేషభాషల్ని, మార్చుకొని ఉత్తర భారత దేశంలో ధాన్యము వ్యాపారము చేయడం వలన వీరిని బంజారు లుగా పిలువబడుచున్నారు. ఇక కొందరు బంజారాలు అనే పేరుకు బదులు 'లంబాడీలు' అనే పేరు పెట్టుకొని తమ ప్రాణాలు కాపాడుకున్నారు.

**బంజారాల - నమౌచిత్యం :**

భారతదేశంలో గిరిజన తెగల్లో తమదైన విశిష్ట

నేపథ్యాన్ని కలిగి ఉన్న బంజారాలను అనేక రకాల పేర్లతో పిలుస్తున్నారు.

వ్యాపారము, పశు సంపద ముఖ్య వృత్తిగా జీవిస్తున్న వీరు ఉప్పును, ధాన్యమును ప్రధాన వ్యాపార వస్తువుగా జీవితాన్ని కొనసాగించటం మూలంగా కాలంలో మార్పుకు అనుగుణంగా వీరిని లమాన్, లభాన్ అనే పదాలు వాడేవారు. ఆ పదాలు సంస్కృతంలో లవణం / ఉప్పును వ్యాపారం చేయటం మూలంగా కాలక్రమంలో లంబాడీ 'లుగాను, తెలంగాణ ప్రాంతంలో వీరిని లంబాడిలుగానే పిలుస్తున్నారు.

ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాలలో బంజారాలు పోకవక్కల వ్యాపారం చేసేవారు. (పోకవక్కలను సంస్కృతంలో 'సుఫారి' అని పిలుస్తారు). కాల క్రమేణా సుఫారి అమ్మేవారిని సుగాలీలుగాను ఆంధ్రప్రదేశ్‌లో వీరిని సుగాలీలుగా పిలువబడుచున్నారు. వీరినే మరో విధంగా కూడా సుగాలీలు అంటారు. వీరు మంచి ఆవులను (సుగ్వాళీలు) పెంచడం మూలంగా వీరిని సుగాళీలు అని పిలుస్తున్నారని అభిప్రాయపడుతున్నారు చరిత్రకారులు సాధారణంగా సంచారజాతులు వేలాది ఎద్దుల బండ్లతో వ్యాపారం చేయడం వలన వీరిని "బంజారాలు" అనే నామం వచ్చింది. "బంద్‌లు, బంజారాలు" అంటే ఎద్దులపై వ్యాపారం చేసేవారని అర్థం ఉంది. ఒక కాలంలో వీరిని 'లాఖా బంజారాలు' అంటే లక్షల సంఖ్యలో ఎద్దు బండ్లతో వ్యాపారాలు గావించే వారుగా ప్రశంసించబడినారు. వీరికి "వన చర బంజారా" అన్న పదాలు సైతం వాడుకలో ఉన్నాయి. బంజారాల భాషను 'గోర్‌బోలి' అనీ కూడా అంటారు.

మైసూరు పాలకులైన హైదరాలీ, టిప్పుసుల్తాన్‌లు బంజారాల సేవలను ఎంతో విశేషంగా గుర్తించి 'నాయక్' అనే బిరుదు ఇచ్చారు. దక్కన్‌లో ముస్లిం సేనాధిపతులు ఎన్నో ప్రశంసాపత్రాలను వీరికి అందించారు. ఇలాంటి సందర్భాలకు చెందిన ఆయా కాలంలోని వారికి అందించబడిన ప్రశంసాపత్రాలు, ఫర్మానాలు నేటికిని అగుపడుతాయి. ఇలా ప్రస్తుత కాలంలో కూడా బంజారాలు వారి పేర్ల తరువాత 'నాయక్' అని పిలుచుకోవడం కనిపిస్తుంది.

## బంజారాల - భాష :

ప్రపంచంలోని ప్రతి మానవుడు తన ఆలోచనలను ఇతరులకు తెలుపడానికి, ఇతరుల ఆలోచనలను తెలుసుకోవడానికి ఉపయోగించుకునే మాధ్యమమే భాష. భాషకు, లిపి, భాషాసూత్రాలు, సాహిత్యము ముఖ్యమైన అంశాలు అయినప్పటికి బంజారాల భాష మౌఖిక భాషకి ప్రత్యేక స్థానమున్నది. బంజారాలు పాడే పాటల్లో సహజసిద్ధమైనప అలంకారాలు కొన్ని కనిపిస్తాయి. ఉదాహరణకు 'మారి పిలె పాటిరి గణ్ గౌర్ సాబత్ రాళి ఏ" అనే గేయ పాదంలో "ర" కారము అనేక సార్లు ఆవృత్తమైనందున ఇదివృత్యానుప్రాస అలంకారమని చెప్పవచ్చు.

బంజారాల భాషపై అనేక భాషల ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. దాదాపు 2వ శతాబ్దాల నుండి బంజారాలు తెలుగునేలపై ఉండటం వలన రోజు వారి కార్యక్రమాలలో తెలుగు పదాలే బంజారా భాషలో మెండుగా కనిపిస్తున్నాయి. ఉదా॥ బడి, కఱ్ఱు, గడ్డపార, ఉర్దూ భాషలో చూసినట్లయితే దర్వాజ, దస్తి, బంద్ మొదలైన పదాలు, ఆంగ్ల భాష విషయానికి వస్తే ట్రాక్టర్, కవర్, బస్ మొదలైన పదాలు ఇలా బంజారాల ప్రజలు వారి నిత్య జీవితంలో అనేక భాషల ప్రభావంతో జీవనం కొనసాగిస్తారు. బంజారా సాహిత్యంలో సామెతలు, పొడుపు కథలకు కూడా ఒక ప్రత్యేక స్థానం ఉంది.

## బంజారాల సంస్కృతి సంప్రదాయం :

బంజారాలు తాము రాముని వారసులుగా తెలుపుకొంటారు. రమానీ, రమాతాజోగి అన్న పేర్లు వీరి సంస్కృతిలో అగుపడుతాయి. ప్రపంచంలో ఏ ప్రాంతం వారైన ఇద్దరు సుగాలీలు కలిస్తే "రాం రాం" అంటూ పలుకరించుకుంటారు. యూరోఫ్ వాసులైన రుమేనియన్ జిప్సీలు, భారతీయ బంజారాలు కలుసుకున్న సందర్భాల్లో ఇలాంటి సంప్రదాయం కన్పిస్తుంది. "రాం రాం" అనడానికి బంజారాలకు మరొక్క నేపథ్యం ఉంది. బంజారాలంతా తురుష్క సైన్యానికి భయపడి, పరాలు మనుషులను చూస్తే భయపడేవారు. అందుకే ఒకరినొకరు కలుసుకున్నప్పుడు "రాం రాం" అని పలకరించడం వలన ఆ

భయం పోతుందనదే వారి నమ్మకం. శ్రీరాముని నామస్మరణ చేయడం వలన భయం పోతుందనేది వీరి ఆచారం బంజారాల సంస్కృతిలో పురాణకాలంలోని సూర్య, చంద్రవంశాల రాజులకు సంబంధించిన వంశావళి మనకు కన్పిస్తుంది. వీరి గాధల ప్రకారం శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, పాండవులవంటి వారితో బంజారాల యొక్క సంబంధాలున్నాయని చెప్పవచ్చు. బంజారా వంశీయులు రాథోడ్, భూక్యా, పవార్, చౌహాన్, జాదవ్ వంటి రాజపుత్ర వంశాలకు చెందిన ప్రసిద్ధ చారిత్రక, పౌరాణిక నేపథ్యాలు గల చరిత్రను కూడా కలిగి ఉంది. గిరిజన తెగల్లో బంజారాల ప్రస్థావన దండి 'దశకుమార చరిత్రము'లో 'గోణీంకృత్వా' అని పేర్కొన్నాడు. బంజారాలలోని వివాహ వ్యవస్థను పరిశీలించినట్లయితే బంజారాలు పెళ్లిలో ముందుగా గోత్రాలను పరిశీలిస్తారు. కొన్ని గోత్రాల వారు మరికొన్ని గోత్రాల వారితో వివాహ సంబంధాలు పెట్టుకోవద్దనే నిషేద ఆజ్ఞాలున్నాయి.

బంజారాలలో కన్యాశుల్కం ఇవ్వడం ఆచారం. కన్యకు, ఆమె తల్లిదండ్రులకు వరుడు పశువులను, ధాన్యాన్ని కన్యాశుల్కంగా అర్పించడాన్ని, "భరోపురాకరేర్" అంటారు. వధువుకు ఆమె తల్లిదండ్రులు కూడా కాంచళి (రవిక), పరికిణి, ముక్కెరను, రూపాయల దండను, ఒక తాంగిడి (గోనెసంచి)ని ఇస్తారు. బంజారాలు వరుడి దేహ దారుఢ్య పరీక్షలో భాగంగా వరుడిని వధువు కుటుంబ సభ్యులు కర్రలతో, రోకళ్ళతో, రాళ్ళతో కొడుతారు. ఎంత కొట్టినా, వరుడిని నోట నొప్పి అనే మాట రాకూడదు. ఈ అవస్థలను భరించినవాడే వధువుకు సరియైన భర్తగా నమ్ముతారు. వివాహానికి వారం రోజుల ముందే తండాలోని స్త్రీలందరూ కలిసి వధువుకు అప్పగింతల సమయంలో ఏ విధంగా ఏడ్వటం నేర్పుతారు. ఈ ఆచారాన్ని 'ఢావ' అంటారు. బంజారాలలోని మరో ఆచారం 'మల్దేరో', తల్లిదండ్రులను, అన్నతమ్ములను స్నేహితులను ఉద్దేశించి తన చిన్ననాటి జ్ఞాపకాలను తలచుకుంటూ దుఃఖించటం, ఇక 'గోట్' అటే విందు అని అర్థం. పెళ్ళి కుమారుడే ఇవ్వాలనే ఆచారముంది. వధువు వివాహ అనంతరం వరుడి యొక్క అమ్మన్నాలనకు ప్రతి రోజు వేడినీళ్ళతో స్నానం, రాత్రి సమయంలో కాళ్ళ నొక్కడం వంటి ఆచారము వంటవిబంజారాల యొక్క సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబం చేస్తాయి.

భారతదేశంలో ఉన్న బంజారాలకు తీజ్ ఉత్సవము ఒక మహా పెద్ద పండుగ. తీజ్ పండుగతో తెలంగాణలోని ప్రతి గిరిజన తండా వైభవంగా జరుపుకుంటారు. ఈ పండుగలో పెండ్లి గాని అమ్మాయిలు ఎంతో భక్తి భావంతో జరుపుకుంటారు. రాజస్థాన్ వాసులు కూడా ఈ పండుగను "గణ్‌గోర్" పండుగగా, మార్వాడిలు, సిక్కులు, వర్షా కాలంలో కనిపించే ఆరుద్ర పురుగును "తీజ్" అని సంభోదిస్తారు. తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగను నవరాత్రి పండుగగా ఏ విధంగా జరుపుకుంటారో బంజారాలు కూడా గోధుమ నారును బుట్టలో పెంచి చివరి రోజు 10వ రోజున బతుకమ్మ లాగ నిమజ్జనము చేస్తారు. ఈ తీజ్ పండుగ 9 రోజులు అమ్మాయిలకు అగ్ని పరీక్షే.

భారతదేశంలోని ఇతర తెగలు, ప్రజల వస్త్రధారణలో అలంకరణలో బంజారాల స్త్రీల వేషధారణనే ఆకర్షణీయంగా అందంగా ఉంటుంది. పురుషులు దోతి, ఖాది, అంగీ, తలకు 24 మూరల పెద్ద పెద్ద రుమాలు కట్టేవారు. భుజం మీద కండువా ధరించి చేతిలో చేతి కర్ర ఉండేది. చెవులకు బంగారు పోగులు, చేతికి వెండి కడియాలు ధరించేవారు. స్త్రీల వస్త్రలు కుట్లతో ఉంటాయి. అద్దాలు పొదిగించిన కాంచళి (రవిక), కుచ్చుల పేటియా (లంగా) అద్దాలు రూపాయి బిళ్లలతో తయారు చేసిన గుమ్‌టో (ముసుగు)ను ధరిస్తారు బంజారాల స్త్రీల ఆభరణాలు అందంగా ఉండటమే కాక బరువుగా కూడా ఉంటాయి. హైదరాబాద్ సమీపంలో పొహ్రాదేవి జాతర బంజారాలకు ప్రత్యేకమైనది.

**ముగింపు :**

ప్రస్తుత సమాజంలో బంజారాలపై విభిన్నమైన అభిప్రాయాలున్నాయి. బంజారాల స్వేచ్ఛ జీవనం స్త్రీ

పురుష సంబంధాలు, సంస్కృతి సంప్రదాయాలు ఈ నాగరిక సమాజంలో ఆసక్తికరమైన అంశాలు అయినప్పటికి బంజారాలలో అనారోగ్యం, అజ్ఞానం, అమాయక ప్రజలపై దోపిడి చేయడం వంటివి ఎంతో విషాదకరమైనవిగా చెప్పవచ్చు. బంజారాల యొక్క భాష, ఆచార సంప్రదాయాలు, సంస్కృతి ప్రత్యేకమైనవి. వీటిని కాపాడుకుంటూ రాబోవు తరాల వారికి ఇస్తున్నారు బంజారాలు.

కాని ఎన్ని ప్రభుత్వాలు మారిన సరైన గుర్తింపు ఇవ్వడం లేదు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాత టి.ఆర్.ఎస్. ప్రభుత్వం తండాలను గ్రామ పంచాయతీలుగా ప్రకటించడం సంతోషదాయకమైనప్పటికీ బంజారాలకు ఇంక సరైన గుర్తింపు దొరకడం లేదు. ఇప్పటికైన బంజారాల సంస్కృతి-సంప్రదాయాలు, పండుగలను అధికారికంగా గుర్తిస్తారని ఆశిస్తున్నారు బంజారా ప్రజలు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. గిరిజన సంస్కృతి - డా॥ పి.రమేష్ నారాయణ
2. బంజారాల చరిత్ర, సంస్కృతి - డా॥ గుగులోత్ వీరన్న
3. గిరిజన సాహిత్యంలో లంబాడీ స్త్రీల జీవన చిత్రణ - డా॥ లావుడ్యా సుజాత
4. "కరీంనగర్ జిల్లా లంబాడీల ఆచార వ్యవహారాలు" - జనపాల శంకరయ్య

# తెలుగు సాహిత్యానికి కళాదీపిక పత్రిక దోహదం

- **బి. శ్రీనివాసులు,** పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ప్రజాస్వామ్యంలో పత్రికారంగాన్ని ఫోర్త్ ఎస్టేట్ అంటారు. ఇది ఎంత జాగరూకతతో పనిచేస్తే సమాజం అంత అభివృద్ధి దశలో నడుస్తుంది. స్థూలంగా చెప్పాలంటే సమాజానికి దశ- దిశ చూపేవి పత్రికలే. ఆ పత్రికలు కేవలం వార్తలను అందించమే కాకుండా వివిధ సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ, వైద్య, వాణిజ్య రంగాలకు చెందిన అంశాలనూ విపులంగా విశ్లేషణా పూర్వకంగా అందించాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా పత్రికలూ తమ పంథా మార్చుకోవాలి. అలాంటి పత్రికలే ప్రజలకు చేరువౌతాయి. అలా చేరువైన పత్రికలల్లో "కళాదీపిక" ఒకటి.

'హితేన సహితం సాహిత్యమ్', 'సహితస్యభావ: సాహిత్యమ్' అని సాహిత్యాన్ని అలంకారికులు నిర్వచించారు. సాహిత్యం హితంతో కూడినదనీ, ధర్మాది సమస్త శాస్త్ర రహస్యాలతో సహితమైనదని దానర్థం. ప్రకృతిలో ఉన్న సత్యాన్ని సౌందర్యవంతంగా, ఆనంద పర్యవసానంగా చిత్రించేది సాహిత్యం. ఉపదేశ ప్రధానాలైన రసపోషకాలైన ప్రాచీన కావ్యనాటకాది ప్రక్రియలూ, ఆధునికాలైన నవల, కథానిక, గేయాలూ సాహిత్యమనబడతాయి. అర్థ వైశాల్యంలో సాహిత్యపరిధి సారస్వతం కంటే చిన్నది. ఇందులో ఉపదేశ, ఆనందాలను ఇవ్వని గ్రంధాలు చేరవు.

### కళాదీపిక - సాహిత్య సేవ :

వాత్సయన ముని ఆరువది నాలుగు కళలు పేర్కొన్నాడు. అందులో సాహిత్యమూ ఒకటి. సమాజానికి సాహిత్యం చుక్కానిలాగా దోహదపడాలంటారు పెద్దలు. మంచి సాహిత్యం ప్రజలకు చేరితే చక్కని ఆదర్శ సమాజం రూపుదాలుస్తుందంటారు గాంధీమహాత్ముడు. అయితే నాణేనికి బొమ్మ బొరుసు ఉన్నట్లే సమాజానికి కీడు చేసే సాహిత్యమూ, మేలు చేసే సాహిత్యమూ ఉంటుంది. వాటిలో మేలు చేసే పత్రికలు ప్రజలకు అందించాలి. అది మంచి పత్రికల నైతిక బాధ్యత కూడా. ఆ బాధ్యతను చక్కగా నిర్వర్తిస్తున్నది శ్రీ వి.ఎస్.రాఘవాచారి గారి సంపాదకీయంలో వెలువడుతున్న "కళాదీపిక" మాస పత్రిక. ఈ పత్రిక 2004 జనవరి నుంచి తిరుపతి కేంద్రంగా మాసపత్రిక వెలువడుతున్నది. ఈ పత్రిక ప్రతి సంచికలోనూ సాహిత్యానికి పెద్దపీట వేస్తున్నది. ఆయామాసంలో జన్మించిన, మరణించిన కవుల జీవిత విశేషాలనూ వివరిస్తున్నది. వారి రచనలను, అందులోని ప్రత్యేకతలను తెలుపుతున్నది.

### కళాదీపికలో వెలువడ్డ వ్యాసాలు :

ఇప్పటి వరకు వెలువడిన కళాదీపిక సంచికల్లో మహాకవి, శ్రీశ్రీ, సారంగపాణి పదాల స్వారస్యం అన్నమయ్య సంకీర్తనలు - సంగీతం, సాహిత్యం కథాకవితల ఝురి కోలపల్లి, ఎస్జీడీలు, ఆధునిక కథాపరిణామం, పద్మశ్రీ పుట్టపర్తి వారి శివతాండవం, తొలితరం కథా వైతాళికలు, పద్మభూషణ్ గుఱ్ఱం జాషువా, అన్నమయ్య సందేశం, కవి సామ్రాట్ విశ్వనాధ సత్యనారాయణ, శంకరం బాడి సాహితీ వారోత్సవం, మనుచరిత్ర, రాయల సీమ ప్రాచీన సాహిత్యం, స్వర్ణధార (నవల), సర్వజ్ఞుని పదాలలో సంసారం, మను చరిత్ర - మానవదృక్పధం, సరస వినోదిని - సమస్యాపూరణం, మాతృభాషకు మరణ శాసనం, పేరడీలు, సింగార నానీలు, హైకులు, తెలుగు భాష (శతకం), డా॥ సినారే వచన కవితారీతులు, మహాభారతంలో మానవీయ విలువలు, 20వ శతాబ్ధి ఆంధ్ర కవిత్వంలో పురాతన వస్తు సామాగ్రి, విజయనగర రాజుల భక్తి సాహిత్యం, బరంపురం - ఆంధ్రసాహిత్యం, భావకవితా చక్రవర్తి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, కవుల భావనలో గణపతి, సాహిత్య ప్రయోజనం, తెలుగు కవిత సంప్రదాయం - ప్రయోగం, స్త్రీవాద కవిత్వ పరిచయం, ఆధునికాంధ్ర కవిత్వంలో మానవతావాదం, కాళిదాసు

సామాజిక స్పృహ, వేమన, శ్రీ వేంకటేశ్వర స్తుతి, శ్రీ కృష్ణ దేవరాయలు, ఆంధ్రాపెల్లి, విజయవిలాసంలో తాపీ ధర్మరావుగారు తడవని చేయకూర రుచులు, తిలక్, శేషేంద్రుల కవితారీతులు, తెలుగు వచన సాహిత్యం - హాస్యరసపోషణ - వంటి వందలాది సాహిత్య వ్యాసాల్లో సవిమర్శకంగా ఉద్దండులైన కవులు, పండితుల చేత రాయించి, ప్రచురించటం జరిగింది.

### కళాదీపిక - వ్యాసకర్తలు :

ఈ పత్రికలో ప్రముఖులైన డా॥ మన్నవ భాస్కర నాయుడు ఆచార్య కె.సర్వోత్తమరావు, డా॥ బాలాంత్రపు రజనీకాంత రావు, డా॥ ఎస్వీడి చంద్రశేఖర్, వక్కంతం సూర్యనారాయణ రావు, డా॥ ఓగేటి ఇందిరాదేవి, యస్.మునిసుందరం, పెరుగు రామకృష్ణ, డా॥ జనుమద్ధి హనుమచ్ఛాస్త్రి, డా॥ సుమనశ్రీ, కొలపల్లి ఈశ్వర్, డా॥ రాధేయ, ఆచార్య తిరుమల రామచంద్ర, డా॥ కాశీభట్ల విశ్వనాథం, శ్రీ ఎ.మల్లేశ్వరరావు, ఆచార్య హెచ్.ఎస్. బ్రహ్మానంద, వైద్యం వేంకటేశాచార్యులు, శ్రీమతి గోమఠం సుందరవల్లి, డా॥ వి.ఆర్.రాసాని వంటి కవులు, కథకులు, విమర్శకులు, పరిశోధకలు, కళాకారుల చేత సామాజిక పరిస్థితులకు అనుగుణంగా రచనలు రాయించి కళా దీపికలో ముద్రించి తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవచేశారు సంపాదకులు.

### కళాదీపిక - సామాజిక స్పృహ :

తెలుగుకు ప్రాచీన భాష హెూదా కల్పించాలని ప్రతి తెలుగువాడు ఆత్మాభిమానంతో ఆత్మవిశ్వాసంతో తెలుగు మాట్లాడాలని, తెలుగును మరిచిపోతే యిక కన్నతల్లిని మరచినట్లేనని భాషాభిమానులు ఇటీవల కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేశారు. వారికి ప్రజలు చేయూత నందించారు. ఆపరంపరలో భాగంగా తెలుగు భాషాభిమానాన్ని కళాదీపిక పత్రిక చాటిచెప్పింది. తెలుగు భాష గొప్పదనాన్ని తెలియజేస్తూ ఎన్నో శతకాలూ, పద్యాలు, గేయాలు, కథలు, నవలలు ధారావాహికంగా ప్రచురించింది. అట్టి వాటిలో ప్రముఖంగా చెప్పుకోదగ్గది తెలుగు శతకం, తెలుగుభాష వైశిష్ట్యాన్ని గూర్చి వైద్యం వెంకటేశాచార్యులు ఆ శతకంలో ఇలా తెలిపారు.

ఆ॥ సోమనాధ కవిసూక్తి వైచిత్రిగా
నవ్యగుణములలో కావ్యరచన
సలిపినాడు తెలుగు జాతీయములు నుడుల్
పలికి తలతునతని తెలుగుభాష

ఆ॥ తాళ్లపాక సుకవి తల్లజుల్ సెప్పిరి
కమ్మనైన తెలుగు కైతలెన్నొ
తెలుగు పలుకుబడుల తెలుగు జాతీయముల్
తెలుగునుడుల జడుల దెలుగుబాష

ఆ॥ తెలుగుజాతివారు తెలుగుపైమక్కువ
గలుగువారుగాదె, కానవార
లవతరింపజేసి రాంధ్ర దేశమ్ము
లలిత వాగ్విభూష తెలుగు భాష

ఆ॥ భాషలెన్నో వచ్చు వారు పల్కిరికదా
భాషయున్న తెలుగుభాషయేంచు
తెలియు మింకనైన దీని తత్వమ్మును
పలుకవలయుగాదె తెలుగుబాష

ఆ॥ కమ్మనైన తెలుగు కావ్యమందారాల
మధువులానియున్న మత్తచిత్త
మితర మెటులగోరు నిలనెంచి చూడగ
పలుకు తీనెలొలుకు తెలుగు భాష

ఇలా తెలుగు భాష ప్రాశస్త్యాన్ని వివరిస్తూ వందకు పైగా పద్యాలు రాశారు. ప్రాచీన కాలం నుంచి నేటివరకు తెలుగుభాష, సాహిత్య పరిణామాలను సోదాహరణంగా పూసగుర్చినట్లు వివరించారు. ఆ పద్యాలు అలతి అలతి పదాలతో అల్లబడినవి. ఈ పద్యాలు పాఠకులను, ఆంధ్ర భాషాభిమానులను ఎంతగానో ప్రభావితం చేశాయి.

### కళాదీపికలోని శీర్షికలు :

'కళాదీపిక'లో కేవలం నాటిక, సాహిత్య అంశాలతో బాటు ఎన్నో విన్నూత సాహిత్య అంశాలు కలగలసి పోయాయి. ఒక్క నాటకం, నాటిక, నాట్యం వంటి వాటితో బాటు తక్కిన శీర్షికలన్నీ సాహిత్యాన్ని తెలియజేసేవే.

ఇందులో ఉన్నన్ని శీర్షికలు మరే పత్రికలోనూ లేవనుట అతిశయోక్తి కాదు. ఇందులో వైతాళిక దీపిక, నీరాజన దీపిక, సాహిత్య దీపిక, సంగీత దీపిక, నాట్య దీపిక, శిల్పకళా దీపిక, చిత్ర కళాదీపిక, నాటకదీపిక, వైద్యదీపిక, యోగదీపిక, వాస్తుదీపిక, జ్యోతిదీపిక, విద్యార్థిదీపిక, కవితాదీపిక, పరిషత్ దీపిక, స్తోత్రదీపిక, ఆధ్యాత్మిక దీపిక, పుస్తక దీపిక, ప్రతిభాదీపిక, కథాదీపిక, క్షేత్రదీపిక, మహిళా దీపిక, సినీ దీపిక, నాటక సమాజ దీపిక, ఆలయదీపిక, భాషాదీపిక, నవలా దీపిక, నాటక సాహిత్య దీపిక, అభినయ దీపిక, రాశి ఫల దీపిక, భవిష్యత్ దీపిక, విశిష్ట వ్యక్తి దీపిక, నృత్యదీపిక, సాంస్కృతిక దీపిక, అక్షర శిల్పి దీపిక, వాగ్గేయ దీపిక, చిత్రకళాదీపిక, ప్రబంధ దీపిక వంటి శీర్షికలతో సాహిత్యంలోని భిన్నపార్శ్వాలను ఈ పత్రిక ప్రచురించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ఆధునిక కాలంలో షడ్రసోపేతమైన భోజనంలాగా అన్ని సాహిత్యాంశాలకు ఒకే అద్వితీయ పత్రిక 'కళాదీపిక' అని చెప్పవచ్చు.

### కళాదీపిక - వచనకవిత :

ఆధునిక కాలంలో అత్యంత ప్రజాదరణ పొందుతున్న ప్రక్రియ వచన కవిత. నేడు అన్ని పత్రికలు వచన కవితలను ప్రచురిస్తున్నాయి. అందుకు అవి సమకాలీన సమాజానికి దర్పణం పట్టడం ప్రధానకారణంగా చెప్పవచ్చు. ఈ వాస్తవాన్ని గుర్తించిన సంపాదకలు కళాదీపికలో చక్కని కవితలు కూడా ఎన్నో ప్రచురించారు. అట్టివాటిలో మచ్చుకు ఒకదాన్ని పరిశీలిద్దాం.

"పేగు బంధమైన జీవికి
భూమ్మీద తొలి ఆసరా అమ్మ
బుడి బుడి అడుగుల నుండి
సడలక పరుగులు నేర్పేది అమ్మ
మాటలకు బాటలు
అక్షరాలకు ఆదిగురువు అమ్మ
బాధలన్నీ బంధువులుగా భావించి
సంతోష తీపిరుచుల్ని పంచేది అమ్మ
సముద్రమంత జీవితాన్ని
ఆదరి నుండి ఈ దరిచ్చేర్చే చుక్కాని అమ్మ
విజయం ఎవరిదైనా అది అమ్మచలవే
అమ్మే అందరికి ప్రాణం
అమ్మతోనే ఆరంభం జీవితం" అంటూ అమ్మ గొప్పదనాన్ని గూర్చి సయ్యద్ జానీభాషా రాసిన కవితను కళాదీపిక ప్రచురించింది.

### ముగింపు :

ఇంకా ఈ పత్రికలో ఆద్యాత్మిక వ్యాసాలు, ప్రసిద్ధ పురుషులు చెప్పిన సుభాషితాలు క్రమం తప్పకుండా ప్రచురించబడ్డాయి. ఒక్క మాటలో చెప్పాలంటే "కళా దీపిక" పత్రిక సకల సాహిత్యాంగాల విశ్లేషణా సమాహార నిధి అని ప్రకటించవచ్చు.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# ప్రజాకవి కాళోజి పరిచయం

- భూక్య నరేందర్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

కాళోజీ అంటేనే నడుస్తున్న చరిత్ర. ఆయన తెలంగాణ మాండలికాల యొక్క ఆవశ్యకతను నొక్కి చెప్పాడు. అందుకే కాళోజీ జన్మదినం పురస్కరించుకొని సెప్టెంబర్ 9న తెలంగాణ మాండలిక భాషా దినోత్సవంగా జరుపు కుంటారు. రంగరావు రమాబాయి దంపతులకు 09-09-1914 కాళోజి 'రట్టహెళ్ళి' అనే ఊర్లో జన్మిం చాడు. ఇది బీజాపూర్ జిల్లాలో ఉన్నది. ఈ ఊరు కర్ణాటక ప్రాంతంలోని పాత బొంబాయి ప్రెసిడెన్సి కింద ఉండేది. కాళోజి చిన్నతనంలో వారి కుటంబం కొన్నేండ్లు మహా రాష్ట్రలోని 'సాయరాం గ్రామంలొ కొంతకాలం, తెలంగాణ లోని ఇల్లేందు తాలూకా కారెపల్లి గ్రామంలోను నివసిం చారు. 1917 వరకు కాళోజి కుటుంబం హన్మకొండలో ఉండేవారు. తరువాత మడికొండకు మారడం జరిగింది. తరువాత కాళోజి ఉన్న రామేశ్వరరావు న్యాయశాస్త్రం చదవడానికి హైదరాబాద్ పోవాల్సి వచ్చింది. దాంతో కాళోజి పాతబస్తిలోని చౌమహల్లా కాన్సిబడిల సెకండ్ ఫారంలో చేరాడు. తరువాత సుల్తాన్ బజార్లోని రెసిడెన్సీ మిడిల్ స్కూల్లో చేరాడు. ఉన్నత విద్యకోసం 1934 ఏప్రిల్ నెలలో వరంగల్ కాలేజి యేట్ హైస్కూల్లో ఇంటర్మీడియట్లో ప్రవేశించాడు. 1939లో 'లా' పూర్తి చేశాడు. 1940లో గవిచెర్ల గ్రామానికి చెందిన రుక్మిణిని వివాహం చేసుకున్నాడు. వీరికి రవికుమార్ సంతానం.

## రచనలు :

నా గొడవ (కవితా సంపుటాలు), అణా కథలు, నా భారతదేశయాత్ర తుది విజయం మనది, ఇది నాగొడవ, బాపూ! బాపూ!!, కాళోజి కథలు, తెలంగాణ ఉద్యమ కవితలు, జీవన గీతిక మొదలైన రచనలు రచించారు. 1996లో కాళోజి అన్న రామేశ్వరరావు గారు చని పోయినపుడు ఎంతో ఆవేదనతో కాళోజి "నేను నా ఆరవ యేట మా అన్న భుజాల మీదకెక్కాను ఆయన మరణించే దాకా దిగలేదు. నేను ఆయన భుజాల మీద కెక్కడం గొప్పకాదు. 70 ఏళ్ళ వరకు ఆయన నన్ను దించకుండా ఉండడం గొప్ప అన్నాడు. ఆ సోదరులకు ఒకరిమీద ఒకరికి అచంచలమైన ప్రేమాభిమానాలు ఉండేవి. అందుకే కాళోజి తన మొదటి కావ్యం "నాగొడవ" ను 1953 అన్న రామేశ్వరరావుకు అంకితంమిచ్చారు. వీరు నా గొడవ కవిత సంపుటి తన కవితల్ని నా గొడవ పేరుతో ఏడు సంపుటాలుగా దినిని "యువాభారతి" వారు ప్రచురించారు.

ఇలా కాళోజి రాసిన ప్రతి కవిత ఆయన చుట్టూ జరుగుతున్న సంఘటనలకు స్పందించి రాసినవే ఆయన రాసిన ప్రతి కవిత ఆయన అనుభవంలోంచి వెలువడినవే నని గమనించాలి.

కాళోజి నారాయణరావు ప్రజాకవి ప్రజల హృదయా లల్లో, నాలుకల మీద నర్తించే విశిష్టకవి. ఆయన జీవితం తెరచిన పుస్తకం. ఆయన "నాగొడవ" ప్రజల గొడవగా ఆయనవాదం మానవతావాదంగా జీవించిన నిజమైన ప్రజాకవి.

అన్యాయాన్నెదిరిస్తే
నా గొడవకు సంతృప్తి
అన్యాయం అంతరిస్తే
నా గొడవకు ముక్తి ప్రాప్తి
అన్యాయన్నెదిరించినోడే
నాకు ఆరాధ్యుడు

అంటూ అన్యాయాన్ని తన రచనల ద్వారా ఖండించిన ప్రజాకవి కాళోజి

జరిగినదంతా చూస్తూ
ఎరగనట్లు పడివుండగ
సాక్షీ భూతున్ని కాను
సాక్షాత్తు మానవుణ్ణి

ఆ మానవున్నీ కాబట్టే చుట్టుపట్లు జరిగే ప్రతి విషయానికి ఆలోచించడం స్పందించడం అవి ప్రజా వ్యతిరేకాలైతే వాటి పట్ల అసమ్మతి నిరసన దిక్కారం ప్రతిఘటన కార్యక్రమం " నేననుకున్న అవకతవకలను సవరించే ప్రయత్నం ఎవరితోనూ సంపూర్ణంగా ఏకీ భవించకపోవడం మరెవరు నాతో ఏకీభవించకపోవడం ఇచ్చియే నా ఈశ్వరుడని కచ్చితంగా నమ్మినవారిని కాళోజి తన ఆత్మకథ "నా గొడవ" లో చెప్పుకున్నాడు. వివిదంగా సమాజంతో జరిగే ప్రతి సంఘటనలకు స్పందించిన కవి కాళోజి భారత ప్రభుత్వం ఇచ్చిన అత్యంత ప్రతిష్ఠాత్మక మైన "పద్మభూషణ్" బిరుదు కంటె ప్రజాకవి అన్న బిరుదుతో తనకు చెప్పుకోవటానికి ఇష్టపడే సాదాసీదా కవి కాళోజి. ఏంత సాదాసీదా మనిషి అంటే,

"మా ఇంట్ల ఒక బీరువా ఉంటుంది. దాంట్లో ఒక అరల కాగితాలు బట్టలు నా వస్తువులు అనదగ్గవి ఉం టాయి. మా ఇంటికి రోజు వచ్చే వారెవరికైనా తెలుసు రామ శాస్త్రికి చేప్తే పంపిస్తడు. "ఈ మాటలను బట్టి కాళోజి వ్యక్తిగత ఆస్తిలేని నిరడంబరుడు అనేది తెలుస్తుంది. కాళోజి ఎక్కడికి వెళ్ళినా ఎక్కడికి వచ్చినా ఎక్కడ తిరిగినా ఈ పూట ఇక్కడ తింటే రాత్రికెక్కడనో ఈ రాత్రి ఇక్క డుంటె రేపక్కడనో ఆయనకే తెలియదు "ఆచరణకు, ఆదర్శణాకి ఏ మాత్రం తేడాలేని జీవితం ఆయనది.

కాళోజి నిరంతర ఉద్యమజీవి తన కాలంలో జరిగిన అనేక ఉద్యమాలలో పాల్గొన్నాడు. ప్రతి విషయాన్ని ప్రశ్నించాడు. కాళోజిలో చిన్ననాటి నుండి నాయకత్వ లక్షణాలు కనిపిస్తాయి. ఆయన 16 సం॥ బాలుడుగా ఉన్న సమయంలో 1930లో కాళోజి మొట్ట మొదటి గణేష్ ఉత్సవ ఉద్యమంలో పాల్గొన్నాడు.

కాళోజి హైస్కూళు చదువుకుంటున్న రోజుల్లో విద్యార్థి నాయకుడిగా ఎన్నికయ్యాడు. ఆర్యసమాజ్ ఉద్యమంలో పని చేస్తుండేవాడు. ఆ తర్వాత ఆంధ్ర మహాసభ ఉద్య మంలో చురుగ్గా పాల్గొన్నాడు. ఆంధ్రమహాసభ ఉద్య మంలో చేరినపుడే కాళోజికి మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి లాంటి తెలంగాణ వైతాళికులతో పరిచయం ఏర్పడింది. 1930 జోగిపేటలో సురవరం ప్రతాపరెడ్డి అధ్యక్షతన మొదటి ఆంధ్ర మహాసభ జరిగింది. ఆ తర్వాత వరుసగా మరో 12 మహాసభలు జరిగాయి. ఈ సభలన్నింటికి కాళోజి హాజరవుతుండేవారు. ఆంధ్ర మహాసభ స్టాండింగ్ కమిటి సభ్యుడిగా ఉండే వాడు. కమ్యూనిస్టులు తమ శక్తినంతా వర్గపోరాటం మీదనే కేంద్రీకరించాలనే వాళ్ళు అప్పుడు కాళోజి మతకల్లోలాల వంటి వాటిని ఎలా నిరసిస్తున్నామో వర్గ పోరాటాన్ని కూడా అలాగే నిరసించాలని స్టాండింగ్ కమిటిలో ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు. ఈ తీర్మానాన్ని ఓటింగ్ పెట్టినపుడు అది ఓడిపోయింది. ఇలా తను నమ్మిన సిద్దాంతం కోసం కాళోజి ఎంతటి వారినైనా దిక్కరించేవాడు. 1944లో అలా కమ్యూనిస్టులను ధిక్క రించి కాళోజి ఆంధ్ర మహాసభల నుండి తప్పుకున్నాడు. తరువాత మూడో కవి సమ్మేళనాన్ని వరంగల్ కోటలోని "ఖుష్‌మహాల్లో" ఏర్పాటు చేసినప్పుడు కొందరు ముస్లిం దుండగులు పందిళ్ళను తగులబెట్టి విధ్వంసం సృష్టిం చారు. అంతేకాక కొంత మంది కార్యకర్తల్ని చితకబాదారు. వాళ్ళు ఆసుపత్రి పాలయ్యారు. అయినా ధైర్యం చెడ కుండా కాళోజి మరి కొందరు కార్యకర్తలతో కలిసి బూడిద నెత్తిపోసి పందిళ్ళను తగులబెట్టిన చోటనే, ముసిపట్ల పట్టాభిరామారావు అధ్యక్షతన దిగ్విజయంగా తిరిగి కవి సమ్మేళనాన్ని నిర్వహించారు.1946లో వరంగల్ కోటలో కొందరు కాంగ్రెస్ నాయకులు మన జాతీయ జెండాను ఎగురవేసిన వాళ్ళల్లో కాళోజి కూడా ఉన్నారు. ఈ సంఘ టన అత్యంత విద్వంసానికి దారి తీసింది. జాతీయ జెండాను ఎగురవేసిన నాయకుల మీద కొందరు రజా కార్లు కత్తులతో, కఠార్లతో దాడి చేశారు. అప్పుడు మొగి లయ్య అనే దేశభక్తుడు ధైర్యసాహసాలతో వాళ్ళను ఎదరు కొని జెండాను ఎగురవేసిన నాయకులందర్ని కాపాడాడు. ఆ తర్వాత చాల మంది రజాకార్లు మొగిలయ్య మీద దాడిచేసి అతన్ని హతమార్చారు. ఈ సంఘటన కాళోజిని తీవ్ర దిగ్భ్రాంతికి, విషాదానికి గురిచేసింది. అప్పుడు కాళోజి ఆవేశంతో రగిలిపోతూ కవిత రాసాడు.

పట్టపగలే పట్టణాల్లో పటిలు
పౌరుల కొట్టి చంపిన
దుష్టకూటమితో ప్రభుత్వం
దొంగ బేరము చేసినట్టే
రక్షణకు ఏర్పడ్డ బలగము
రక్కసుల పక్షంబుచేరిన
రక్షసుల ఇష్టాను సారం
రాజ్యమును నడిపించనట్లే
న్యాయమును పాటించనోల్లని
అదిపత్యం అండయుండిన
హత్య దొపిడి మానభంగాల్
నిత్య కర్మల చేరినట్లే

ఇలా కాళోజి సమాజంలో జరిగే సంఘటనలమీద స్పందించేవారు. వాటి పైన కవితలు రాశారు. ప్రతి కవిత తన అనుభవంలోంచి రాసినదే. కాళోజి నిజాం ప్రభుత్వాన్ని ధిక్కార స్వరంముతో ఎదురించాడు. ఆనాడు నిజాం విధించిన గస్తి నిషాన్‌కు వ్యతిరేఖంగ ఉద్యమం చేసాడు కాళోజి. ఆయన నిజాం ప్రభుత్వాన్ని ఎదురించి చాలా సార్లు జైలు జీవితం గడిపాడు.

1948లో కాళోజి గుల్బర్గా జైల్లో ఖైదీయై ఉన్నాడు. అప్పుడు జనగాం తాలుకాలో బైరన్‌పల్లి గ్రామంలో రజాకార్లు మూకుమ్మడిగా దాడి జరిపి ఎంతోమందిని చంపారు. స్త్రీలపై అత్యాచారం గావించారు. అది తట్టుకో లేని కాళోజిలో కసి పెరిగింది. ఆ భాధతో దు:ఖంలో కోపంతో 'కాటెసి తీరాలే' అనే కవిత రాశాడు. ఆ కవిత ఎంతో మంది యువకులనకు స్ఫూర్తి దాయకమైంది.

మనకొంప లార్చిన మన స్త్రీల చెరచిన
మన పిల్లలను చంపి మనల బంధించిన
మానవాధములను మండలాధీశులను
మరచిపోకుండగ గురుతుంచుకొవలె
కసి ఆరిపోకుండ బుసకొట్టు చుండాలె
కాలంబు రాగానే కాటేసి తీరాలె
తిట్టిన నాల్కలను చేపట్టే కోయలె
కొంగులాగిన వ్రేళ్ళు కొలిమిలో పెట్టాలె
తన్నిన కాళ్ళను డాకలిక విడాలె
కండ కండకోసి కాకులకు వెయ్యాలె
కాలంబురాగానే కాటేసి తీరాలె'

వివిధంగా రజాకార్లపై ఆయన కోపాన్ని పరాకాష్ఠకు చేర్చిన కవిత కాళోజి చేత అంతటి తీవ్రమైన కవిత రాయించింది. తిరుగుబాటు ఆలోచనకు నిరసనకు పరాకాష్ఠ ఈ కవిత.

## రాజకీయ ఉద్యమాలు కాళోజి :

కాళోజి కాంగ్రెసు పార్టీలో సభ్యుడు కాంగ్రెసు పార్టీ తరుపున యం.ఎల్.ఏ గా పోటిచేసి ఓడిపోయాడు. కాంగ్రెసు పార్టి నియమనిబంధనలను పాటిస్తున్నప్పటికినీ (పాతివ్రత్యం) అన్న మాటకు వ్యంగ్యార్థ సూచకంగా పార్టీ వ్రత్యం అని పదాబంధాని కాళోజియే తయారు చేశాడు. పార్టీయే దేవుడు సర్వస్వం అని భావించటం పార్టీ తప్పు చేసినా సమర్థించడం ఇటువంటివి కాళోజికి ఏ మాత్రం ఇష్టం ఉండేవి కావు. తలలేని తనాన్ని ఒప్పుకోడు వ్యక్తిత్వం ఉండాలని ధనానికి లొంగి నలుగురిలో పలచన కావద్దని తలెత్తుకొని తిరిగగలిగే ధీర గుణం ఉండాలని కాళోజి భావించాడు.

నేటి సమాజంలో రాజకీయం వ్యాపారరంగంగా మారి పోయింది. మంచి లక్షణాలు లక్ష్యం గల నేతలు కరువై నారు. అందుకని అంటు సమాజాన్ని జ్ఞానబోధ చేయడం ఇక్కడ కనిపిస్తుంది.

అభ్యర్థి ఏ పార్టి వాడని కాదు ఏపాటి వాడో చూడు
ఎన్నుకుంటె వెలగబెట్టడం కాదు
ఇందాక ఏం చేసాడో చూడు
పెట్టుకొనే టోపి కాదు
పెట్టిన టోపి చూడు
మనిషి చూడు
చరిత్రని చూడు
నడువులు కాదు
నడవడి చూడు

పార్టీలు చూడటం మాని ఎన్నుకునే వ్యక్తి నడవడికని చూసి ఓటు వేయాలని చెప్పడం కనిపిస్తుంది. ప్రస్తుత తరంలో మందుకి, విందుకి ఓటు బలియైపోయింది. కోట్లు పెట్టడం వేలకోట్లు దోచుకోవడం నేటి రాజకీయంగా మారిపోయింది.

## తెలంగాణ ఉద్యమంలో - కాళోజి :

1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో నిండుగా పాల్గొన్న కాళోజి ఎంతో కవిత్వం రాశాడు. తెలంగాణ వాళ్లయి ఉండి తెలంగాణ ఉద్యమానికి విరుద్ధంగా రాసిన వారిని మాట్లాడిన వారిని నిరసిస్తూ కవిత్వం రాశాడు.

వీర తెలంగాణ నాది
వేరు తెలంగాణ కాదు

అని 'సినారె' అంటే

వీర తెలంగాణ నాది
వేరు తెలంగాణ నాది
వేరై కూడా తెలంగాణ
వీర తెలంగాణ ముమ్మాటికి "

అని అన్నాడు కాళోజి.

1969 తెలంగాణ ఉద్యమ కాలంలో నైతేనేమి ఎమర్జెన్సీ కాలంలోనైతేనేమి కాళోజి అచ్చంగా ఫ్రెంచ్ కవి 'లూయీ అరగాన్" వలె ఎక్కడికి పారిపోకుండ తనున్న చోటే నిలబడి కవిత్వం రాస్తూ ఉద్యమంలో పాల్గొన్నాడు జైళ్ళ బంధింపడ్డాడు. ప్రముఖులైన మిగతా కవులు సమైక్యవాదంతోనే ఎమర్జెన్సీ కీర్తిస్తూనో కవిత్వ రాశాడు.

ఒక సందర్భంలో 1969 తెలంగాన ఉద్యమానికి విరుద్ధంగా మాటాడినందుకు తనకు ఇష్టమైన తాను గౌరవించే రావి నారాయణరెడ్డిని పి.వి. నర్సింహారావులను విమర్శిస్తూ కవిత్వం రాశారు. రాయప్రోలు ని కూడా కాళోజి ఉద్యమ సమయంలో నిలదీశాడు నిరసన కవిత్వం రాశాడు.

ఆంధ్ర ప్రాంతపు వారు తెలంగాణ భాషను హేళన చేసినప్పుడు కాళోజి గట్టిన సమాదానం విచ్చాడు కాళోజి. ఆయన దృష్టిలో భాష రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి బడి పలుకుల భాష రెండవది జనం నిత్యవ్యవహారంలో వాడే పలుకుబడుల భాష' ఒక రకంగా చెప్పాలంటే మొదటిది గ్రాంధిక భాష రెండవది, వ్యావహారిక భాష, ఈ వ్యావహారిక భాషయే జీవ భాష. ఏ భాషకైనా జీవధాతువు మాండలికయే కావున కాళోజి ఎప్పుడు జీవభాషవైపే మొగ్గు చూపారు కాళోజిగారు.

రెండున్నర జిల్లాలదే దండి భాష అయినపుడు
తక్కినోళ్ళు నాళ్ళయాస
తొక్కి నొక్క బడ్డప్పుడు
ప్రత్యేకంగా రాజ్యం పాలు
కోరడం తప్పదు

అంటూ కాళోజి ఆంధ్ర ప్రాంతపు భాషా వాదులను హెచ్చరించాడు.

## ముగింపు :

కాళోజి జీవితాంతం ప్రజాస్వామ్యవాదిగా ఉన్నాడు. నీ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా ప్రకటించే నీ హక్కుల కోసం అవసరమైతే నా ప్రాణాలైనా ఇచ్చి పోరాడుతా" అన్న మాటల్ని కాళోజి ఎప్పుడూ గుర్తుచేసేవాడు. ఆ మేరకు బతికాడు. అందుకే మహాకవి శ్రీశ్రీ కాళోజిని ప్రజాకవి, లూయి అరగాన్ తో పోల్చాడు. ఒకే ఒక సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక"అంటు తన రచనల ద్వారా ప్రకం పనలు సృష్టించాడు. అలా తెలంగాణ ఉద్యమంలో భారత స్వాతంత్ర్య ఉద్యమం ఎక్కడ సమస్య ఉంటె అక్కడ ప్రతిఘుంటించే వాడు కాళోజి. 13-11-2002నాడు మరణించిన పిదప ఆయన పార్థివదేహాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు తను ఆశించిన విదంగా అంద జేశారు.

తెలంగాణ తొలి పొద్దు కాళోజి
తెలంగాణ ప్రజల ఉద్యమ ప్రతిధ్వని కాళోజి
రాజకీయ సంఘిక చైతన్య సముహారం కాళోజి
కవిత్వం రాసిన ప్రజాకవి

హక్కులు అడిగిన ప్రజల మనిషి
తెలంగాణ దిశాలి కాళోజి

పుట్టుక చావులు కాకుండ
బ్రతుకంత దేశానికి ఇచ్చిన మహనీయుడు

**ఉపయుక్త గ్రంథాలు:**

1. నా గొడవ కవిత సంపుటి-కాళోజి నారాయణరావు
2. డా॥ తూర్పు మాల్లరెడ్డి -మోనోగ్రాఫ్

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# పులుల బోనును ఛేధించిన సజీవ సాక్ష్యం "ఇనాక్" గారు

– డా॥. వై. సుభాషిణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు సుప్రసిద్ధ కథకులు, నవలాకారులు, నాటకకర్త, కవి, విమర్శకులు. అరవై యేళ్ళుగా సాహిత్య సృజనగావిస్తూ ఉన్నారు. కవిత్వం, కథానిక, నవల, నాటకం, నాటిక, విమర్శ వంటి పలు ప్రక్రియలలో మానవుణ్ణి చైతన్యపరుస్తూ ఉన్నారు. తాడిత పీడిత బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేశారు. ఒక రకంగా చెప్పాలంటే ఆయన సాహిత్యం తోటి మానవుడికి దిక్సూచిగా నిలుస్తుంది. ప్రేరణనిస్తుంది. చైతన్యం కల్గిస్తుంది. ఆవేశాన్నిస్తుంది. ఆవేదననిస్తుంది. ఆలోచన రేకెత్తిస్తుంది. ఇలా బహుజనుల కష్టాన్ని కథా వస్తువుగా మలచడంలో సిద్ధహస్తుడిగా ప్రఖ్యాతిగాంచాడు. ఇలా చిత్రించిన మరో నవల ''పులుల బోను-నేను''. ఈ నవలను ఇనాక్‌గారు 1959లో రాసి కాలమేఘాలు అని పెట్టారు. కాలం అంటే నలుపు, సమయం అని రెండు అర్థాలు. 'నేను నల్ల మేఘమై కన్నీరు కార్చడం, కాలం మేఘంలా బరువుగా కదిలిపోవటం నాకింకా గుర్తే' అంటూ రచయిత ఈ నవలకు రాసిన ముందు మాట 'అనివార్యం' లో తెలిపారు. కన్నీరు ఆవిరై పోయింది. సంఘర్షణ మేఘాలు తొలగిపోయాయంటూ తను ఎదుర్కొన్న వివక్ష స్వరూపాన్ని మన కళ్ళముందుంచారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో నవలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. సామాజిక జీవన చిత్రణలో నవల సాధించిన విజయం ఎంతో గొప్పది. అంతర బాహిర మానవుడి అస్తిత్వం నవలలో ఉంటుంది. తన కోసం తాను, జనం కోసం తాను జీవించే మనిషి నవలలో కనబడటం సహజం. తనకోసం తాను కథానాయకుడు పడిన వేదన "పులుల బోను - నేను" లో చాలా స్పష్టంగా దృశ్యమానమవుతూ ఉంది. పేరులోనే ఇతివృత్తమంతా ధ్వనిస్తోంది. చదువుకోవడానికి కథానాయకుడు ఎదుర్కొన్న ఇబ్బందుల నేపథ్యంలో "పులుల బోను - నేను" నవల నడిచింది. 123 పేజీలు 12 భాగాలుగా వింగడించిన ఈ నవల ఇతివృత్తం అంటరానితనానికే పరిమితమయినా అందులో అంతర్లీనంగా వాస్తవికతను చిత్రీకరించడంతో నవలకు పరిపూర్ణత సిద్ధించింది.

ఆనర్సు చేసిన మూడు సంవత్సరాల కాలంలో చివరి మూడు రోజుల కథ ఈ నవల. ఈ నవలలోని కథంతా గతంతో అనుసంధానం పొందుతూ జరిగింది. కథానాయకుడు ఆంధ్రవిశ్వకళా పరిషత్తులో తెలుగుశాఖలో బి.ఏ ఆనర్సు కోర్సులో విద్యార్థిగా ప్రవేశించి నియమ నిష్ఠాగరిష్టులైన బ్రాహ్మణ ఆచార్యుల దగ్గర విద్యాభ్యాసం చేయడానికి సాహసించి విద్యార్జన పూర్తి చేయడం ఈ నవలకు నేపథ్యం. దళిత నిరుపేద కుటుంబంలో పుట్టి, విశ్వవిద్యాలయ ప్రవేశనియమావళి ద్వారా ఆంధ్రవిశ్వకళా పరిషత్ తెలుగుశాఖలో ప్రవేశం పొందటం, బ్రాహ్మణాచార్యులు బోధించే విద్య కోసం తపించడం, కులం పేరుతో అణగదొక్కాలని చూసినవారికి ఎదురు తిరిగి పోరాడి బి.ఏ ఆనర్సు కోర్సు పూర్తి చేయాలనుకోవడం, ఇంతలో తన పతనం కోరి అమ్మ చనిపోయిందని ఎవరో టెలిగ్రాం పంపడం, ఇది నిజమా? కాదా? అనే సందేహంతో ఊగిసలాడటం చివరికి విశ్వవిద్యాలయంలోని వారెవరూ ఈ పని చేయలేదనే ఆలోచనకు రావడం, ఇది ఇంకెవరి పనైనా అయి ఉండవచ్చుననే భావనతో అమ్మ బతికే ఉంటుందనే ఆశతో బి.ఏ ఆనర్సు ఆఖరి పరీక్షను పూర్తి చేసి తన ఊరికెళ్ళి అమ్మను సజీవంగా చూసుకోవడమే నవల ఇతివృత్తం.

కళాశాలలో, బయట తీవ్రమైన వివక్షకు గురి అవుతున్నా చదువులో రాణించి ఆత్మ విశ్వాసంతో అందని ఎత్తుకు ఎదిగిన పేద దళిత విద్యార్థి కథ ఇది. నాకు చోటివ్వలేదని బయటకుపోవడం అమాయకత్వం. పోరాడి సాధించుకోవడం వీరత్వం అంటారు అంబేద్కరు. ఈ

అంబేద్కర్ సిద్ధాంతాన్ని అక్షరాలా ఆచరించాడు కథా నాయకుడు. ఆచరించడమే కాదు తాను ఎదుర్కొన్న అవమానాలు, వివక్షతను పోరాడి అధిగమించి పులుల బోను నుండి సజీవంగా బయటపడిన వైనం ఈ నవలలో స్పష్టం. దళిత నిరుపేద కుటుంబంలో పుట్టిన కథా నాయకుడు విశ్వవిద్యాలయ ప్రవేశ నియమావళి ద్వారా ఆంధ్రవిశ్వకళా పరిషత్ తెలుగుశాఖలో ప్రవేశంపొందటం, కులం పేరుతో అణగదొక్కాలని చూసిన వారికి ఎదురు తిరిగి పోరాడి తెలుగు సాహిత్యాన్ని అధ్యయనం చేయడం సాహసకృత్యమే ! ఒక విజేతకు ఉండాల్సిన లక్షణాలు సంపూర్ణంగా ఉండటమే ఇవన్నీ సాధించడానికి నిదర్శనం. అంతేకాదు విశ్వవిద్యాలయంలో చదవడం, ఆ చదువును పూర్తి చేసి తన ఊరికి వెళ్ళడం ఆశావహ దృక్పథానికి తార్కాణంగా నిలుస్తుంది.

**అమానవీయత :**

బి.ఏ ఆనర్సు పరీక్షల చివరి మూడు రోజులు తాను పడిన వేదన ఈ నవల ఆద్యంతం కనిపిస్తుంది. విద్యను బోధించాల్సిన గురువులు ఒక విద్యార్థి తక్కువ కులం వాడు కావడం చేత అంటరానివాడిగా చూడడం శోచ నీయం. అతనితో కోర్సు మాన్పించాలని చూడడం, మార్కులు తక్కువగా వేయడం, అతని పతనాన్ని కోరు కోవడం.... ఇవన్నీ మనుషుల్లో ఉన్న అమానవీయతకు, కొరవడుతున్న మానవీయతకు నిదర్శనం. ఎవరెన్ని విధాలుగా ఇబ్బంది పెట్టినా చలించని మనసుతో అనుకొన్నది సాధించేంత వరకు పోరాడిన ధీశాలిగా నిలుస్తాడు కథానాయకుడు. అందుకే ''నవ్వుకంటే కన్నీళ్ళనీ, శబ్దంకంటే నిశ్శబ్దాన్నీ, సుఖాలకంటే గాయాల్నీ, శరీరంకంటే మనస్సునీ ఎక్కువగా ప్రేమించడం ఇనాక్ కవితా సూత్రం'' అంటారు. డా॥ అద్దేపల్లి రామ మోహన్‌రావు (ఆచార్య కొలకలూరి ఇనాక్ సాహిత్యంపై పరిశోధనం, పుట. 20).అదే జరిగింది ఈ నవలలోనూ ! దళిత జీవితంలోని వేదనలను అనుభవించి ఉండటం వల్ల దళితుని జీవిత వాస్తవికత, మానసిక వేదన పూర్తిగా తెలుసుకోగలిగాడు. అందువల్లనే కాబోలు తన జీవిత వాస్తవికతను చెప్తూనే దాని నుంచి అతను బయట పడటానికి పడిన వేదన, ఆరాటం, సాధించాలనే తపన వర్ణనాతీతం. ఆత్మన్యూనతతో కుంచించుకు పోవడం కన్నా ఆత్మ స్థైర్యంతో కృషిచేసి పైకి రావడంలోనే నిజమైన ఆనందం ఉంటుందని, దాన్ని పొందడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలనే ప్రబోధ ఉంది ఈ నవలలో.

**సంఘర్షణ :**

కథలో నాయకుడు అంటే ఎందరికో అసూయ. ఊరు, పల్లె, ఆంధ్ర విశ్వకళాపరిషత్తు ఇలా ప్రతిచోటా తన ప్రతిభతో తనకు తెలియకుండానే శత్రువులను పొందిన ఇనాక్ చాలా సంఘర్షణకు లోనయ్యాడు. ఆనర్సు చివరి సంవత్సరం పరీక్షలో మొత్తం ఎనిమిది పేపర్లు ఉంటాయి. అది ఏడో పరీక్ష పేపరు రాసిన రోజు. ఇంకో మూడు రోజుల్లో చివరి పరీక్ష పూర్తి చేసుకొని వేజెండ్ల వెళ్ళి తల్లిని చూడవచ్చునని కలలు కంటున్న కథానాయకుడికి తల్లి చనిపోయిందని టెలిగ్రాం వచ్చింది. అది తెచ్చి ఇచ్చింది పోస్టుమాన్ అప్పలకొండ. ఆ టెలిగ్రాం మేనమామ చిట్టి పేరు మీదుగా వచ్చింది. చిట్టి మామయ్య నమ్మకస్తుడు. కాని ఈ టెలిగ్రాం చిట్టిమామ ఇచ్చాడా? లేక వేజెండ్లలో నా పతనం కోరుకొనే వారెవరైనా చిట్టిమామ పేరుతో టెలిగ్రాం పంపారా? నిజంగా అమ్మ చనిపోయిందా? ఒకవేళ అమ్మ చనిపోయి ఉంటే చివరి చూపులు చూడ గలనా? వేజెండ్ల వెళ్తే ఆఖరి పరీక్ష రాయలేను. రాయకపోతే మూడు సంవత్సరాల చదువు ఒకే సంవత్సరంలో చదివి రాయాలి. డిస్కంటిన్యూ అయితే స్కాలర్‌షిప్ రాదు. రాకపోతే బ్రతుకు భారం అవుతుందనే సంఘర్షణతో తలమునకలైన స్థితిని దృశ్యీకరింపజేశారు. సరైన 'నిర్ణయం తీసుకోవడం' అనేది జీవన నైపుణ్యాలలో ప్రధానమైంది. నిర్ణయం తీసుకొనే ముందు పది రకాలుగా ఆలోచన చేసి ఒక నిర్ణయానికి రావాలి. అమ్మ కోసం వెళ్ళాలా ? పరీక్ష రాయాలా ? ఈ సమస్య నుండి ఎలా బయటపడాలి అని ఆలోచించిన కథానాయకుడు మంచి నిర్ణయంతో విజేయుడై నిలబడ్డాడు. సమస్య రాగానే కూలిపోవడం అసమర్థుడు చేసే పని. సమర్థుడు ఆ సమస్య నుంచి

గట్టెక్కే ప్రయత్నం చేస్తాడు. అదే చేశారు ఇనాక్‌గారు ఈ నవలలో! ఒక మనిషి పట్ల మరో మనిషికున్న అసూయా ద్వేషాలు ఏ స్థాయిలో ఉంటాయో ఈ నవలలో వ్యక్త మవుతూ ఉంది. ఒక మనిషిని మరో మనిషి ఎంత దారుణంగా హింసించవచ్చో ఆ హింస ఏ పాటి స్థితిలో ఉండగలదో తెలుస్తూ ఉంది. పరీక్ష రాయాలా ? అమ్మ చివరి చూపు చూడాలా ? అనే సంఘర్షణతో అమ్మ బతికే ఉంటుందన్న ఆశతో పులుల బోను నుండి బయటకు రావాలన్న తపనతో ఆరాటంతో సజీవంగా బయటకు రావడానికి పడిన క్షోభ అతీతమైంది. ఒక మనిషిని పులుల బోనులో బంధిస్తే ప్రాణాలతో బయటకు రావడమన్నది అసంభవం.అసంభవమైన దానిని సంభవం చేసిన తేజోమూర్తి కథానాయకుడు. పులుల బోనులాంటి సమాజం నుండి బయటపడటమన్నది విశేషమే ! ఏదైనా సహేతుకంగా ఆలోచించడం, ఆలోచించగలగడం ఇక్కడ అవసరమనే విధంగా రచనా పరిష్కారం చూపిం చారు. ఒక వ్యక్తి ఎంత సంఘర్షణ అనుభవించైనా తన ఆత్మ గౌరవాన్ని కాపాడుకొనే స్థితికి ఎదగాలని ఈ నవల ఉద్బోధిస్తుంది.

**వివక్ష :**

వివక్ష స్వరూపం భీతావహం. ఇది మనిషి స్వభావం లోనే అల్లుకుపోయి ఉంది. చాలా వరకు మనుషులు తోటి మనుషులను తక్కువగా చూసే తత్త్వం కల్గి ఉన్నా రని వ్యక్తమవుతూ ఉంది. వివక్ష ఎంత దారుణమైనదో ఎంత లోతుగా ఉంటుందో ఈ 'పులులబోను - నేను'లో స్పష్టంగా కన్పిస్తుంది. కులవివక్ష, ఆధిపత్య ధోరణి, అసూయ ప్రధానంగా నవలలో దృగ్గోచరమవుతూ ఉంది. అంటరానితనానికి చెందిన వ్యక్తి తరగతి గదిలో ముందు వరుసలో కూర్చోకూడదన్నది దారుణమైన స్థితి కాగా తోటి విద్యార్థులు కూడా మాట్లాడకపోవడం బాధా కరమైన అంశం. ఒక మాదిగ విద్యార్థి తాకిన రిజిష్టర్, చాక్‌పీస్‌లు కూడా తాకకపోవడం, ఆ విద్యార్థిని ఏకాకిని చేసి వివక్ష చూపిన వైనం దయనీయస్థితికి అద్దం పడు తుంది. దళితుల పట్ల పక్షపాత వైఖరితోనూ, కులతత్వం తోనూ ఉండటం శోచనియం. ఇది మనుషుల పట్ల ఇతరులకున్న దృష్టి కోణాన్ని పట్టి ఇస్తుంది. దళితుడు తాకితే అగ్రవర్ణాలకు అంటే మైల గురించి, పరిహారం గురించి తప్ప అలాంటి సమాజంలో దళితుడి జీవిత విధానం, అతని స్థితిగతులు వివరించరు. దళితుల పట్ల అమానుషంగా జరుగుతున్న కుల వివక్ష, అణచివేతను వ్యతిరేకించిన తీరు ద్యోతకమవుతుంది ఈనవలలో ! ఇలాంటి భ్రమ ప్రమాదాలు ఎన్ని సంభవించినా తొణకక బెణకక ముందుకు సాగిన వైనం చాలామందికి ఆదర్శ వంతంగా ఉంది. పులులబోనులో నుంచి సజీవంగా, విజయవంతంగా బయటపడిన కథానాయకుడు. తన జీవితం పదుగురికి మంచి బాటను, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందింపజేయాలన్న తపన ఈ నవలలో కనబడు తుంది. అతి చిన్న విషయాలకే ఆత్మహత్యలు చేసుకొని, భయపడి పారిపోయే వారికిది గొప్ప వ్యక్తిత్వ వికాసం పెంపొందింపజేసుకొనే పుస్తకంగా ఉపయోగపడుతుంది. కవిలోని బాధ, ఆంతర్యం వ్యక్తీకరించి సమాజానికి కనువిప్పు కల్గించిన తీరు ఒక కొత్త దృక్కోణం. అంటరాని తనాన్ని ఎత్తి చూపిన వాళ్ళ దగ్గరే తాను బి.ఏ. ఆనర్సు పూర్తి చేయడం సాహసమే. ఒక వ్యక్తి ఎంత సంఘర్షణ అనుభవించైనా తన ఆత్మగౌరవాన్ని కాపాడుకొనే స్థితికి, ఉన్నతికి చేరాలనే ఆంతర్యం బోధపడుతుంది. ఇది నేటి యువతకు చాలా అవసరమైన అంశం కూడా.

ఇనాక్‌గారి రచనలను ఉద్దేశించి "బ్రతుకు తోటలో పూసిన నిప్పుల పూలు" అంటారు డా॥ రావూరి భరద్వాజ. అలా పూసిన ఒక పువ్వే "పులులబోను-నేను". సమాజంలో అడుగడుగునా ఎదురవుతున్న సమస్యల్ని ఆర్తితో, వివేచనతో అనుశీలించారు. కథలో ప్రతిభావంతంగా ప్రతిష్ఠించారు. ఆ సమస్య నుండి బయటపడే మార్గాల్ని, అందులో ఎదురయ్యే అవరోధాల్ని వివరించారు. లక్ష్య సాధన కోసం తనని తాను సిద్ధం చేసుకొంటూ, మార్గ నిర్దేశంతో చైతన్యవంతమై అనుకొన్నది సాధించిన తీరు ఆశావహ దృక్పథానికి , పదుగురికి ఆత్మవిశ్వాసం పెంపొం

దించడానికి నిదర్శనంగా నిలుస్తోంది ఈ నవల. రచన ప్రధానోద్దేశ్యం సమాజ శ్రేయస్సు. సామాజికంగా జరుగుతున్న అన్యాయాల్ని, అక్రమాల్ని వెలువరించడం, పేదబీద జనాల కష్టసుఖాలను వివరించడం, అలా వివరించిన ఒక రచనే "పులులబోను - నేను". ఈ రచనలో ఆవేదన ఉంది. సమస్య ఉంది. పరిష్కారముంది. సహించడం ఉంది. తిరగబడ్డమూ ఉంది. మనిషిలోని మానసిక దౌర్భల్యాలను ప్రదర్శిస్తూ ఉంది. పరిష్కారాలను సూచించడమూ ఉంది. అదే రచయిత ప్రత్యేకతగా కనబడుతూ ఉంది.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# శాసన పరిశోధకుడిగా గురజాడ

– డా॥. భూక్య తిరుపతి, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు & అనువాద అధ్యయన శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ఆధునిక సాహిత్య యుగకర్తలుగా ఇద్దరు సుప్రసిద్ధులు వారే గురజాడ మరియు రాయప్రోలు గార్లు. కందుకూరి సాంఘిక విప్లవమును, గిడుగు భాషా విప్లవమును తనలో సమన్వయించుకొని, సరికొత్త సాహిత్య విప్లవమును లేవనెత్తిన నవయుగ వైతాళికుడు గురజాడ వెంకట అప్పారావుగారు. అప్పారావు వెంకట రామదాసు, కౌశలమ్మ దంపతులకు 1861లో విశాఖ పట్నం జిల్లాలో జన్మించారు. గురజాడ బాల్యం పేద రికంలోనే సాగింది. గిడుగు రామమూర్తి, గురజాడ అప్పారావు ఇద్దరు బాల్యస్నేహితులు. గురజాడ కన్యాశు ల్కం నాటకం రచనాకాలం నుండే వ్యావహారిక భాషకు పునాది ఏర్పడింది. నీలగిరి పాటలు, ముత్యాలసరాలు, లవణరాజు కల, కొండుభట్టీయం, బిల్హణీయం, కన్యక, దిద్దుబాటు కథానిక, మొదలైన రచనలన్నింటిలోనూ ఆధునిక ధోరణలు, సంఘ సంస్కరణోద్యమ భావాలు కనిపిస్తాయి.

తొలి తెలుగు కథానిక దిద్దుబాటు తెలుగు కథా సాహిత్యంలో ఒక నూతన ఒరవడిని సృష్టించింది. అలాగే నాటక రంగంలో కన్యాశుల్కం గొప్ప ప్రయోగం. 1909లో కన్యాశుల్కం నాటకం ద్వితీయ ముద్రణ పీఠికలో వ్యావ హారిక భాషా ఉపయోగాలు గురించి వివరించారు. గుర జాడ కవిత్వంలో చేసిన నూతన ప్రయోగాలు ప్రాచీన సాహిత్య యుగంలో దేశి కవిత్వోద్యమాలలోను కనిపి స్తాయి. ఇదే విషయాన్ని సినారె గారు ఇలా అంటారు - "గురజాడ కవిత్వ రంగమున చేసిన సాహస ప్రయోగాలు ప్రాచీన కవులలో పాలకురికి సోమనాథుని ప్రయోగము లను తలపింపజేయును. ఇరువురు దేశి సాహిత్య ప్రవర్త కులే. ఇరువురును తమ కాలమున వ్యవహారములో ఉన్న పదములను, పలుకుబడులను గ్రాంథికత కల్పిం చిన వారే. పాలకురికి జాను తెనుగును ప్రతిపాదించగా, గురజాడ తెలుగు పలుకుబడికి ప్రాణం పోసెను. ఇరువురును సంఘ వ్యవస్థను వాంఛించిరి. ఛందస్సులో ఇరువురు క్రొత్త మార్గములు త్రొక్కిరి. ఇరువురుకీ కల భేదమంతా ఒక్క విషయంలో - ఒకరిది శివభక్తి, మరొ కరిది మానవాభ్యుదయాసక్తి. ఈ ప్రయోగములన్నింటికీ కేంద్ర బిందువు దేశి సాహిత్య పునరుద్ధరణ కాంక్ష". అని అన్నారు. ప్రధానంగా అప్పారావు గారి రచనలపై దేశి సాహిత్య రచనలతోపాటు పాశ్చాత్య సాహిత్య ప్రభావం ఉంది. ముఖ్యంగా వర్డ్సువర్త్ ప్రభావం ఎక్కువగా ఉంది. వర్డ్స్ వర్త్ ప్రభావంతో సామాన్యుల జీవితాలు, సహజత్వాలను తీసుకొని సముచిత భావనా సమ్మేళనంతో రచనలు చేశారు అప్పారావుగారు. రవీంద్రుడు, గురజాడ గార్లు సమకాలికులు. రవీంద్రుని రచనలు గురజాడ గార్ని బాగా ఆకర్షించాయి. ఇద్దరి రచనల్లోను జాతీయత, దేశభక్తి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

నవ్యయుగ వైతాళికుడుగా ప్రథమాంధ్ర గద్య నాటక రచనయితగా, విమర్శనారంగముననూ సముచిత స్థానమునలంకరించిన గురజాడ వెంకట అప్పారావు. ఇతను విజయనగర కళాశాలలో ఆచార్యులుగా, శాసన పరిశోధకుడిగా రాజవంశస్థుల ఆంతరంగిక కార్యదర్శిగా ఉన్నాడు. వ్యావహారిక భాషావాదమునకు ప్రాతినిధ్యం వహించాడు. అప్పారావుగారు నిరంతర గ్రంథ పరిశీ లకుడు. ఆనంద గజపతి ఆస్థానములో నిత్యం జరిగే కావ్యగోష్ఠులు, చర్చలయందు పాల్గొనేవాడు. అలాగే విమర్శనాత్మకంగా ఉపన్యాసాలు ఇస్తూ ఉండేవాడు.

గిడుగు వెంకటరామమూర్తి పంతులు, గురజాడ వేంకట అప్పారావు బాల్యమిత్రులు, ప్రాణస్నేహితులు. ఇద్దరు పదమూడేళ్ళ ప్రాయంలో కలుసుకొన్నారు. ఆ తరువాత 1875లో ఇద్దరూ ఒకేసారి మెట్రిక్యులేషన్ పరీక్ష పాసైనారు. ఆ తరువాత 1879లో గురజాడగారు బియ్యే

పరీక్ష పాసైనారు. అన్ని కోర్సులలోనూ చరిత్రను ఐచ్ఛిక పేపరుగా అప్పారావుగారు ఎంచుకొన్నారు. ఐచ్ఛికంగా చరిత్రను ఎంచుకోవడం ద్వారా ఆ పేపరుపై అప్పారావు గారికి మరింత అభిమానం, ఉత్సాహం పెరిగింది. అప్పారావుగారు 1889 నుండి చరిత్ర పాఠాలు అదనంగా విద్యార్థులకు బోధిస్తూ ఉండేవారు. గిడుగు గురజాడ లిద్దరు చరిత్రకు సంబంధించిన విషయాలు గురించి చాలా చదివారు. సమకాలిక ప్రచురణలు అన్నీ చదివి నోట్స్ రాసుకునేవారు. మద్రాసులో ఉన్న ప్రాచీన వస్తు విశేషాలలోని అంశాలు, సూయల్ దొర గారి లిస్టులో ఉన్న విషయాలు అలాగే ఇండియన్ ఏంటిక్వరీ సంపుటాల్లో, మోడ్రన్ జర్నల్ ఆఫ్ లిటరేచర్ అండ్ సైన్స్ సంచికలో ఉన్న విషయాలు కలిసి చదివేవారు. పాత శాసనాలు, కళింగ రాజ్య చరిత్ర, తమ ప్రాంత చరిత్ర మొదలైన అనేక అంశాలమీద విస్తృతంగా చదివి అధ్యయనం చేశారు. అప్పారావు 1892లో స్థానిక పురాతత్త్వ పరిశోధనలో విశేషమైన కృషి చేసి తెలుగు మార్పు పత్రికలో 'An earnest labourer in the field of local archaeology' అనే బిరుదును పొందారు.

1895 నుండి అప్పారావు శాసనాలమీద మరింత విస్తృతంగా పరిశోధనలు చేశారు. అదే సంవత్సరంలో శాస్త్రీయ పద్ధతులలో శాసనాలను వాటి ప్రతిబింబాలను ఎలా తీయాలో కూడా వివరించారు. "బ్రష్‌తో రాతి పలకను చక్కగా తుడిచి నీళ్ళలో కడగవలెను. కాగితమును నీటిలో ముంచి, పైకి తీసి, శాసనపు పలకమీద జాగ్రత్తగా నిండుగా పరచి, బ్రష్‌తో నొత్తవలెను. శాసనంలోని అక్షరములు కాయితం మీద పడేవరకు బ్రష్‌తో అదమవలెను. నీళ్ళలో కాగితాన్ని ముంచేటప్పుడు దానిని టబ్బులో బాగా ఉంచాలి. నౌకరు మొదట నాసిక పేపరును ఉంచాడు. దానిపై పెంటింగ్ పేపరును పరచాడు. రాయి మోటుగా వుండి అక్షరములు స్ఫుటముగా పడనప్పుడు, వొక సీసాలో దీపపు మసీ, యింకు పౌడరూ వేసి సిరావలె తయారయేటట్టు నీళ్ళు పోయాలి. పేడ్‌పై కొద్ది కొద్దిగా ఈ సిరాను చిమ్ముతూ మెల్లగానొత్తవలెను. అక్షరములు స్పష్టపడేవరకూ అలాగున యింకును పోస్తూనే ఉండవలెను" అని అప్పారావుగారు అన్నారని ఆరుద్రగారు తెలియచేశారు. 1896లో గురజాడగారికి విజయనగరం సంస్థానం శాసన పరిశోధకుడిగా ఉద్యోగం లభించింది. బెంగళూరులో హుల్ష్ దొరగారిని కలిసి తను శాసన పరిశోధనల గురించి అతనితో చర్చించారు. కృష్ణదేవ రాయల కాలం నాటి రెండు శాసనాలను పరిష్కరించే ప్రయత్నం చేశారు. 1897లో ఆనంద గజపతి మరణానంతరం సంస్థానం చిల్లర దావాలతో, పెద్ద దావాలతో ఎప్పుడు తీరిక లేకుండా ఉండేవారు. గురజాడగారికి తీరిక లేకపోయిన శాసన పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. దావాల కోసం కూడా అనేక రకాలైన పరిశోధనలు చేశారు.

గురజాడ గారి డైరీల వలన ఇతర నోట్స్ వలన వారు మద్రాస్ ప్రాచ్యలిఖిత గ్రంథాలయంలోను, బెంగళూరు శాసన పరిశోధక కార్యాలయంలోనూ వ్రాసుకున్న వివరాలు మనకు కొన్ని తెలుస్తాయి. మల్లంపల్లి సోమశేఖర శర్మగారు ఏడు శాసనాలను సేకరించి పరిష్కరించారని అంటే గిడుగు సీతాపతిగారు "గురజాడ అప్పారావుగారు రెండు చిన్న శాసనాలు మాత్రమే చదివి ఎపిగ్రాఫియా ఇండికాలో వ్యాసము ప్రకటించినారు అని అన్నారు.

అప్పారావు శాసన సేకరణా, పరిష్కరణ చేయడం మానుకొన్న తరువాత ఇతరులు వివిధ పత్రికల్లో ప్రచురించే శాసన పాఠాలను, చర్చలను శ్రద్ధగా చదివేవారు, వినేవారు. 1911లో హిందూ దినపత్రికకు వివిధ అంశాల మీద ఉత్తరాలు రాసేవారు. నన్నయ కాలం కంటే ముందు ప్రాచీనమైన శాసనాల గురించి, ప్రభుత్వ శాసన పరిశోధన గురించి, పరిశోధకుల గురించి వారి సామర్థ్యం గురించి కూడా లేఖలు రాసేవారు. వాడుక భాషగురించి చర్చలు జరుగుతున్న సందర్భంలో పండితులు దిద్ది పారేసిన పదాల అసలు రూపాల కోసం శాసనాలపై ఆధారపడేవారు. నెల్లూరు శాసనాల గురించి అప్పారావుగారు హిందూ పత్రికకు రాసిన లేఖలో పేర్కొన్నారు.

శాసనాలు సేకరించడం అప్పారావుగారు విరమించినా యువ పరిశోధకులకు ప్రోత్సాహం ఇవ్వడంతోపాటు

శిక్షణ కూడా ఇచ్చేవారు. ఇదే విషయాన్ని ఆరుద్రగారు ఇలా అంటారు - "అప్పారావుగారు రామమూర్తిగారు తాము స్వయంగా శాసన సేకరణలు విరమించినా యువ పరిశోధకులకు ప్రోత్సాహమూ, శిక్షణా ఇచ్చేవారు. వీరి ప్రోత్సాహముతోనే, నేనే కాక చిలుకూరి నారాయణరావు, మండా నరసింహరావు, భావరాజు కృష్ణారావు, రాళ్ళబండి సుబ్బారావు మొదలైన వారు ప్రాచీన లిపి చదువుట అలవర్చుకొని శాసనాలు ప్రకటిస్తూ వచ్చిరి" అని గిడుగు సీతాపతిగారు రాశారని ఆరుద్రగారు తెలియచేశారు. యువ పరిశోధకులకు శాసనాలు అందుబాటులో ఉండేటందుకు నకలు కాపీలను, శాసనపు నకళ్లను మద్రాసు మ్యూజియంలో భద్రపర్చవలెనని అప్పారావుగారు హిందూ పత్రిక లేఖలో సూచించారు. బుర్రా శేషగిరిరావు, వంగోలు ముని సుబ్రహ్మణ్యంగారు అప్పారావుగారి దగ్గర శిష్యులుగా, సహాయకులుగా పనిచేశారు.

అప్పారావుగారు కళింగదేశ చరిత్రను రాయాలని ఆలోచించారు. దానిని "విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి" వారు అచ్చువేస్తామని తెలియచేశారు. అప్పారావు గారు వాడుక భాషలో రాస్తానంటే కొమర్రాజు లక్ష్మణరావుగారికి నచ్చలేదు. దానితో ఆ చరిత్ర రచన ఆగిపోయింది. 1913లో వ్యావహారిక భాషకోసం ఉద్యమం నడుస్తున్న కాలంలో చరిత్ర రచన ప్రారంభించాలనే కోరిక మరీ ఎక్కువైంది. కాని 1914 నుండి అప్పారావుగారి ఆరోగ్యం క్షీణిస్తూ వచ్చింది. వైద్య పరీక్షలకోసం, చికిత్సకోసం విశాఖపట్నం వచ్చారు అప్పారావుగారు. అక్కడ రామమూర్తి పంతులుగారు అప్పారావుగార్ని కలిశారు. అక్కడ అనారోగ్యంగా ఉన్న అప్పారావుగారు రామమూర్తి పంతులుగారితో చారిత్రక విషయాల గురించి, సారస్వత విషయాల గురించి చర్చించారు. శరీరంలో శక్తి లేకపోయిన చర్చలు జరుపుతుంటే వైద్యుడు చూసి, రామమూర్తి పంతులుగారితో మీరు అప్పారావుగార్ని కలవడంగాని, లేఖలు రాయడంగాని చేయకండి వారి ఆరోగ్యం అసలు బాగోలేదని అన్నారు. అప్పటినుండి రామమూర్తి పంతులు గారు చర్చలు చేయడంగాని, ఉత్తరాలు రాయడంగాని చేయలేదు. ఆ తరువాత క్రీ.శ. 1915లో అప్పారావుగారు మరణించారు. అప్పారావుగారు రాచరికపు అండదండలతో శాసన పరిశోధనలు ప్రారంభించారు. రాజులను, భూస్వాములను, జమీందార్లను, భక్తి మిన్నగా భావించే రోజుల్లో గురజాడ దేశభక్తిని బోధించారు. గురజాడ అప్పారావుగారు ఆధునిక యుగకర్తగా నాటక కర్తగా కథా రచయితగా, వ్యావహారిక భాషాభిమానిగా, అలాగే శాసన పరిశోధకుడిగా తెలుగు జాతికి విశేష సేవలందించారు.

**ఆధార గ్రంథాలు :**

1. ఆరుద్ర. (2007). సమగ్ర ఆంధ్ర సాహిత్యం.
2. డా. సి. నారాయణరెడ్డి (1999). ఆధునికాంధ్ర కవిత్వము: సంప్రదాయము ప్రయోగములు.
3. చేకూరి రామారావు, నడుపల్లి శ్రీరామరాజు (సం.) (2005). మరోసారి గిడుగు.
4. డా. ఎస్వీ రామారావు. (2007). తెలుగులో సాహిత్య విమర్శ.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# తెలుగు భాష ప్రస్తుత పరిస్థితి

- డా॥. ఇ. వాసు, తెలుగు అధ్యాపకులు పి.వి.కె.ఎన్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి), చిత్తూరు.

"దేశభాషలందు తెలుగు లెస్స" అని శ్రీకృష్ణదేవ రాయలు "సుందర తెలుగు" అని సుబ్రమణ్యభారతి "జాన తెలుగు" అని నన్నె చోడుడు, "ఆంధ్రభాష యమృత మాంద్రాక్షరంబులు, మురువు లొలుకు గుండ్ర ముత్తియములు ఆంధ్రజాతి నీతిననుసరించు" అని వేటూరి సుందరరామమూర్తిగారు మొదలగు అనేక మంది పండితులు తెలుగు భాష యొక్క గొప్పదనాన్ని గురించి తెలియజేశారు. కానీ నేడు తెలుగు భాషయొక్క పరిస్థితి దీనికి భిన్నంగా తయారయ్యింది. ప్రస్తుతం వివిధ సమావేశాలలో, సభలలో, పాఠశాలలో, కళాశాలలో, విశ్వ విద్యాలయాలలో, తెలుగులో మాట్లాడలేమని చెప్పడం, తెలుగులో రాయలేమని చెప్పడమే చాలా గొప్ప విషయం గానూ, తమ అర్హతను, స్థాయిని పెంచే లక్షణంగానూ తయారయ్యింది. ఇదంతా మనకు మన భాషపై స్వాభిమానం లేదని చెప్పడానికి నిదర్శనంగా చెప్పవచ్చు. దీనికి కారణాలు అనేకం. నేటి కుటుంబ వ్యవస్థ యాంత్రికంగా మారడం, లోపభూయిష్టమైన విద్యా విధానం, ప్రభుత్వాల బాధ్యతారాహిత్యం, మాతృభాషపై మమకారం మాతృభాషాభిమానం తగ్గడం, ఆంగ్లభాషా వ్యామోహం మొదలైనవి కారణాలుగా చెప్పవచ్చు.

ఆంగ్లేయులు మన దేశాన్ని విడిచిపెట్టి 70 సంవత్స రాలు దాటిపోయినా, నేటికి కూడా మనం ఆంగ్లభాషా సంకెళ్ళు నుండి విముక్తి పొందలేపోతున్నాము. ఇలా జరగడానికి కారణం నాటి ఆంగ్ల విద్యావిధానమే. ఎంతో ముందుచూపుతో ఆంగ్లేయులు ఆనాడు చేసిన ద్రోహమే ఈనాడు తెలుగుభాష మనుగడను ప్రశ్నార్థకం చేసింది. అది ఎంతగా ప్రభావం చేసింది అంటే 1947లో బ్రిటీష్ ప్రభుత్వం మనదేశం నుంచి వెళ్లిపోయినా ఆంగ్ల విద్యా విధానాన్ని మనం వదలుకోలేక పోతున్నాం. నాడు ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టడానికి ఆంగ్లేయుల స్వార్థము, స్వప్రయోజనాలు కేవలం రెండే. అవి ఒకటి దీని ద్వారా వారికి ఉపయోగకరమైన రీతిలో ఉద్యోగులను తయారు చేసుకోవడం. అంటే బ్రిటీష్ ప్రభుత్వానికి పనికివచ్చే విధంగా భారతయుల్ని తయారుచేసుకోవడం, రెండు. క్రైస్తవ మత వ్యాప్తి. కాని ఆ నిర్ణయం నేడు భారతదేశం లోని అనేక స్థానిక భాషలు తమ ఉనికిని కోల్పోయేలా చేసింది. అందులో తెలుగు కూడా ఉండటం మన యొక్క దురదృష్టము. మరియు దానికి బాధ్యులు కూడా మనమే. ఇటీవల కాలంలో తెలుగు భాషా, సంస్కృతుల పరిరక్షణపై చర్చోపచర్చలు, ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో వివిధ రంగాలలో తెలుగు పరిస్థితి ఎలా ఉందా ఒకసారి పరిశీలిద్దాం.

### విద్యారంగంలో తెలుగు :

ప్రాథమిక స్థాయిలో విద్యాబోధన మాతృభాషలోనే జరగాలని సుప్రీంకోర్టు 25 సంవత్సరాలు క్రితమే చెప్పినా ఖాతరు చేయకుండా అన్ని విద్యాలయాలలో ప్రాథమిక స్థాయి నుండే ఆంగ్లాన్ని ప్రారంభిస్తున్నాయి. ఒకప్పుడు తెలుగు మాధ్యమంలోనే విద్యాబోధన జరిగేది. నేడు ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత స్థాయి అని తేడా లేకుండా అన్ని స్థాయిలలో ఆంగ్లంలో బోధిస్తున్నారు. ప్రాథమిక స్థాయిలో తెలుగులోనే భోదించాలి. 5వ తర గతిలో ఆంగ్లభాషను ద్వితీయభాషగా, 6వ తరగతిలో హిందీని తృతీయ భాషగా అమలు చేయాలి అనే విద్యా విధానాన్ని నేడు పాటించడం లేదు. ఫలితంగా తెలుగు కేవలం ఒక సబ్జెక్టుకే పరిమితమైపోయింది. "ఇంగ్లీషు చదవిన ఒక కుర్రాడికి మునసబ్ ఉద్యోగం వచ్చింది" అని కన్యాశుల్కం నాటకంలో అగ్నిహోత్రావధానులు భార్య వెంకమ్మ అగ్నిహోత్రావధానుతో అంటుంది. అంటే ఇంగ్లీషులో చదివితే ఉద్యోగం వస్తుంది అనే భావన మనకు 100 సంవత్సతరాల క్రితమే ప్రారంభమై నేటికి

బాగా బలపడిపోయింది. అందుకే అందరూ తమ పిల్లల్ని ఆంగ్లమాధ్యంలో చదివించడానికే ఆసక్తి చూపిస్తున్నారు. ఏ అతికొద్ది మంచి పేదవారే, ప్రైవేటు స్కూల్‌లో చదివించలేని స్తోమత లేనివారే తెలుగు మాద్యంలో చదివిస్తున్నారు. అటే ధనవంతులు పిల్లలు ఆంగ్లమాధ్యమం, పేదవారు తెలుగు మాధ్యమం అనే వ్యాత్యాసం ఏర్పడడంతో, ధనవంతులతో పోటీపడి పేదవారు అప్పులు చేసి అయినా తమ పిల్లల్ని ఆంగ్లమాధ్యమ పాఠశాలకు పంపించాడనికి సిద్ధమౌతున్నారు. ఈ విధంగా పాఠశాలలు మొత్తం ఆంగ్లమాధ్యం అవుతున్న తరుణంలో తెలుగు భాష మనుగడ ఉనికి ప్రశ్నార్థం కానున్నాయి.

## పరిపాలనారంగంలో తెలుగు :

మన దేశంలోని వివిధ రాష్ట్రాలలో వారి వారి స్థానిక మాతృభాషలలోనే పరిపాలనా వ్యవహారాలు నిర్వహించాలి. అనగా రాష్ట్ర స్థాయి నుండి గ్రామ స్థాయికి వరకు ప్రభుత్వం చేసే అన్ని రకాల కార్యక్రమాలు, రికార్డులు, చట్టాలు, సవరణలు, శాసనాలు, దస్తావేజులు అన్నీ కూడా తెలుగులోనే ఉండాలి. అలాగే న్యాయ స్థానాలలోని తీర్పులు అన్నీ తెలుగులోనే ఉండాలి. దీని ద్వారా అన్నీ విషయాలు ప్రజలకు సులభంగా అర్థమౌతాయి. పారదర్శకత ఏర్పడుతుంది. అప్పుడు ప్రజలకు ప్రభుత్వంపై గౌరవం పెరుగుతుంది. దక్షిణ భారత దేశంలోని నాలుగు ప్రధాన రాష్ట్రాలలో మిగతా మూడు రాష్ట్రాలు అంటే తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాలు తమ తమ మాతృభాషలోనే ఆయా రాష్ట్రాల పరిధిలోగల సచివాలయ స్థాయి నుండి గ్రామస్థాయి వరకు అన్ని రకాల పాలనా వ్యవహారాలను సులభంగా, నిరాటంకంగా అమలు జరుపుతుండగా ఒక్క మన ఆంధ్రరాష్ట్రంలో తెలుగును పూర్తి స్థాయిలో అమలు జరిపించుకోలేకపోవడం ఎంతో విచారకరం. అలాగే ప్రభుత్వాలు కూడా మాతృభాషగా, అధికార భాషగా, పరిపాలనా భాషగా తెలుగునకు ఇవ్వవలసిన గుర్తింపును గౌరవాన్ని ఇవ్వడం లేదు.

## నిజ జీవితంలో తెలుగు :

నిత్యవ్యవహారంలో అనగా మనం ప్రతిరోజూ ఉదయం లేచిన దగ్గర నుండి పడుకునే వరకు ఇంటా, బయటా స్నేహితులతో, బంధువులతో అనేక సందర్భాలలో మాట్లాడుకోవడం సాధారణంగా నిరక్షరాస్యులు, పల్లె ప్రలు తమ వ్యవహారంలో చాలా వరకు తెలుగులోనే మాట్లాడుతున్నారు. అంటే తెలుగు భాష వెలుగొందడానికి వీరే ప్రధాన కారణం. అంటే తెలుగు భాషను పెంచి, పోషిస్తున్నది నిరక్షరాస్యులైన పల్లెవాసులే అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే నేడు ఆధునిక జీవన విధానాలు రవాణా సదుపాయాలు అభివృద్ధి చెందడంతో పల్లెవాసులు జీవనోపాధికోసం పట్టణాలకు వలసలు వెళ్ళి, వస్తున్నప్పుడు వారికి తెలియకుండానే వారు కూడా ఆంగ్లభాషా పదాల వలయంలో చిక్కుకుంటున్నారు. అంతే కాకుండా దూరదర్శిని, చరవాణి మొదలగు సాధనాలు సామాన్యులకు అతి తక్కువ ఖర్చుతో, సులభంగా చేరువ కావడంతో, అందులోని ఉపయోగించే భాష కూడా ఆంగ్లమయం కావడంతో భవిష్యత్తులో తెలుగు పరిస్థితి ఏమిటి? అనే ఆందోళన ఇక్కడ కూడా కన్పిస్తుంది.

## తెలుగుకు పొంచి వున్న ముప్పు :

ప్రస్తుతం ఆంగ్లభాష ప్రభావం కారణంగా ఆంధ్రభాష మనుగడకు ముప్పు రాబోతుందని భాషాపండితులు ఆవేదన. అంతే కాదు యునెస్కో వారి హెచ్చరిక ప్రకారం, ప్రపంచంలో వాడుకలో ఉన్న 6000 భాషలలో సుమారు 3000 భాషలు అంతరించిపోయాయి. పరిస్థితులు ఇలాగ కొనసాగితే రాబోయే రోజులలో మరిన్ని భాషలు అంతరిస్తాయి. అందులో తెలుగు కూడా ఉంటుంది అనేది ఈ రోజు తెలుగు భాషకు పొంచి ఉన్న ప్రమాదం. ఈ విధంగా రాబోయే రోజుల్లో తెలుగుభాష అంతరించిపోతుంది అనేది యావత్ తెలుగు ప్రజల సమస్య. తెలుగు అంతరించిపోతే తెలుగు జాతి ఉనికి, ఆత్మ గౌరవం కూడా అంతరిస్తాయి. ఇది అంతా ఒక అపోహ మాత్రమే. అలా జరగదు అని కొంతమంది చెబుతున్నా ప్రస్తుతానికి అటువంటి ప్రమాదం లేకున్నా... రాబోయే

రోజులలో అదే జరగబోతుందని చాలా మంది పండితుల అభిప్రాయం. ఏవిధంగా అంటే విద్యారంగంలోనూ పాలనారంగంలోనూ, సినిమారంగంలోనూ, ఇలా అన్ని రంగాలలో కనుమరుగవుతూ వస్తే చివరికి వ్యవహారంలో కూడా ఇదే పరిస్థితి ఎదురైతే తెలుగుకు ప్రమాదమే అనేది ఎవరూ కాదనలేని వాస్తవం. అలా జరగకుండా ఉండాలంటే ముందుగానే తెలుగు ప్రజలు అప్రమత్తం అవడం చాలా అవసరం.

**తెలుగు పరిరక్షణకు మార్గాలు :**

మన పిచ్చితనం గానీ, మాతృమూర్తికే దిక్కులేని ఈ సమాజంలో మాతృభాషను పట్టించుకునేవారు ఎవరు? పాశ్చాత్య వ్యామోహంలో పడి కొట్టుకుపోతున్న మన యువత మాతృభాషను పట్టించుకుంటుందా....? ఇలాంటి ప్రశ్నలు వేసుకుని చీకట్లో కూర్చోవడం కన్నా, ఒక చిన్నదీపం వెలిగించచడానికి ప్రయత్నం చెయ్యాలి. ఆ ప్రయత్నాలు

- తెలుగు భాషను మనమే గౌరవించుకోవాలి. మాట్లాడుకోవాలి.
- అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు తెలుగులోనే జరగాలి. చట్టసభలు, శాసనసభ, శాసన మండలి, అధికారిక సమావేశాలు, సభలలో మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అందరూ చక్కనైన తెలుగులో మాట్లాడాలి.
- ప్రభుత్వాలు విద్యావిధానంలోని నియమాలు సక్రమంగా అమలు జరపాలి.
- ఉత్తరాది రాష్ట్రాలలో మూడు భాషల (త్రిభాషా) సూత్రాన్ని ఖచ్చితంగా అమలు జరిపించాలి.
- ప్రసార మాధ్యమాలు, పత్రికలలో వీలైనంత ఎక్కువ తెలుగు పదాలు మాటలను ఉపయోగిస్తూ, తద్వారా ప్రజలలో విపరీతమైన చైతన్యాన్ని కలిగించాలి.
- ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో భాషాంశాలు, భాషా నైపుణ్యాలలో నైపుణ్యం ఉన్న వారికి అధిక ప్రాముఖ్యం ఇవ్వాలి.
- ఆత్మ న్యూనతా భావాన్ని తగ్గించుకుని, భాషాభిమానంలో తమిళులు, బెంగాళీయుల్ని ఆదర్శంగా తీసుకోవాలి.

మాతృభాష పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత. మన భాషా క్షేమం మన చేతుల్లోనే ఉంది.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు భారతి - పరిశోధనా వ్యాస సంకలనం.
2. తెలుగుదేల యన్న - విశిష్ట సంపుటి
3. తెలుగదేలయన్న దేశంబు తెలుగు - వ్యాససంపుటి
4. తెలుగు భాషా చరిత్ర - వెలమల సిమ్మన్న

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# సమీక్షకుడుగా జానమద్ది హనుమచ్ఛాస్త్రి

- డా॥. శిరీష ఈడ్పుగంటి, న్యూఢిల్లీ.

తెలుగు సాహిత్యంలో జానమద్ది హనుమచ్ఛాస్త్రిగారిని ఒక గొప్ప సమీక్షకుడుగా చెప్పుకోవచ్చు. ఈయన అనంత పురం జిల్లా రాయదుర్గంలో జానకమ్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి గారికి 20-10-1925 న జన్మించారు. గత సంవత్సరం ఫిబ్రవరి 28 తేదిన 2014 మరణించారు. వయసు తొంభై సంవత్సరాలు. తెలుగు సాహిత్యాభివృద్ధి కోసం పాటుపడిన వ్యక్తి. నలభై వరకు రచనలు, మూడువేలకు పైగా వ్యాసాలు రాశారు. చివరిదశ వరకు కూడా ఈయన రచనలు చేస్తూనే ఉన్నారు. వీరి వ్యాసాలు పత్రికలలో వస్తూనే ఉన్నాయి. రచనాదృష్టే కాకుండా అనేక సాహిత్య కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఎంతోమంది సాహిత్య వేత్తలను సత్కరించారు. ఈయన కూడా ఎన్నో సన్మానాలు, సత్కారాలు పొందారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో జన్మించి, బళ్ళారిలో చదువు పూర్తి చేసి, నెల్లూరు, గుంటూరు, కడపలో ఉపాధ్యాయునిగా ఉండి సాహిత్య రచనలు చేశారు. కడపలో సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయం అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయడంలో ప్రధాన పాత్ర వహించారు. ఈ గ్రంథాలయ ప్రాంగణంలో వివేచన పేరుతో సాహిత్య సమావేశాలు జరిపేవారు. గాడిచర్ల ఫౌండేషన్, రచయితల సంఘం మొదలైన వాటిని ఎంతో జయప్రదంగా నడిపారు.

శాస్త్రిగారి బాల్యానికి సంబంధించి ఆయన ఆత్మకథలో చెప్పిన విషయాన్ని ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. 'ఈయన ప్రాథమిక విద్య రాయదుర్గం కోటలోని వీరభద్రస్వామి ఆలయంలో జరిగింది. అది ఒక వీధిబడి. ముంజోజి అనే ఒక ఫించనుదారు ఆ బడిని నడిపేవాడు. ఒకటి రెండు తరగతుల విద్యార్థుల నుండి పావలా, అర్ధ రూపాయి ఫీజు వసూలు చేసేవాడు. ఒక నోట్‌బుక్ లో కొన్ని ఊర్లపేర్లు, తాలుకా పేరు, ఎక్కాలు, నెలలు తిథివార నక్షత్రాల పేర్లు రాసి ఇచ్చేవారు. ఉదయాన్నే కృష్ణశతకం, సుమతీశతకం పద్యాలు చదివించేవారు. ఆరోజులలో వీధిబడులలో చదువుకోవటం అనేది ఉండేది.' ఈయన కూడా మూడవ తరగతి వరకు ఆవిధంగానే చదువు కున్నారు. మిగిలిన తరగతులు జిల్లా ఎలిమెంటరీ స్కూల్లోనూ, హైస్కూల్లోనూ చదువుకున్నారు. హైస్కూల్ చదువు ముగిసిన తర్వాత ట్రైనింగ్ స్కూల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ గా పనిచేశారు. ఉద్యోగం చేస్తూ చదువు కున్నారు.

## రచనల సమీక :

శాస్త్రిగారి రచనలను బట్టి ఆయన తెలుగు సాహిత్యా నికి గొప్ప సమీక్షకుడు అని చెప్పుకోవచ్చు. ఈయన రచనలలో మచ్చుకకు కొన్ని రచనలను ఇక్కడ ప్రస్తావిస్తు న్నాను. వారి మొదటి రచన మాసీమకవులు. ఇందులో రాయలసీమ కవులను వారి జీవిత విశేషాలను, వారివారి కాలాలతో పాటుగా పరిచయం చేశారు. కవితాశక్తి కలిగిన మహాకవుల రచనలు ఎన్నో మరుగునపడి ఉన్నవి. వాటిని సేకరించి ప్రచురించుట, ఆ కవులను వెలుగులోకి తీసు కుని రావడం కర్తవ్యంగా భావించారు. ఈ రచన ద్వారా ముప్పైమంది కవుల పరిచయ వ్యాసాలు రాశారు. కవుల కృషిని, వారివారి వ్యక్తిత్వ విషయాలను పుట్టుపూర్వోత్త రాలు (కాలం, విద్య మొదలైన వాటితో సహా) గూర్చి సంక్షిప్తంగా వ్యాసాల రూపంలో మనకు అందించారు. ఈ రచన ఆయనకు సాహిత్యం పట్ల గల ఆసక్తిని తెలియజేస్తుంది. వీరు కవులకాలం, విద్య తదితర అంశాల కంటే సాహిత్య రచనా కృషికి ఎక్కువ ప్రాధాన్యత నిచ్చి ఈ రచన చేశారు. వీరి వ్యాసాలు తెలుగు సాహిత్యంలో మరుగున పడిపోతున్న కొంతమంది కవుల స్థానాన్ని తిరిగి నిలబెట్టగలిగాయి. శాస్త్రిగారి రచనా నైపుణ్యాన్ని తెలియజేసే మరొక రచన సుప్రసిద్ధుల జీవిత విశేషాలు. ఇందులో శాస్త్రిగారు మనదేశీయులే కాకుండా

విదేశీయులైన థామస్ మన్రో, కల్నల్ మెకంజీ వంటివారు తెలుగు సాహిత్యానికి చేసిన సేవల్ని వివరించారు. స్వాతంత్ర్య సమరయోధుల గూర్చే కాక మన భారతదేశ సంస్కృతిలోను, ప్రగతి శీలతను పాలుపంచుకోవడానికి అందులో భాగస్వాములైన నిర్మాతలను, సంఘ సేవకులను, భాషాసేవకులను, శాస్త్రవేత్తలను వివరణాత్మకంగా పరిచయం చేసే నిమిత్తం సుప్రసిద్ధుల జీవిత విశేషాలు శీర్షికతో పుస్తకాన్ని తెచ్చారు. సంఘసంస్కర్తల, సాహితీవేత్తల జీవిత విశేషాలను వివరించే రచన . కులాలు, పుట్టిన ఊర్లు, వ్యక్తిలోని బలహీనతలు మొదలైన అవాంఛనీయ అంశాల జోలికి వెళ్ళకుండా కృషికి మాత్రమే ప్రాధాన్యమిచ్చి రచించారు. శాస్త్రిగారి మరొక రచన వ్యాసభారతి. ఇందులో ఆయన సాహితీ కృషి కనిపిస్తుంది. ఓర్పుతో సర్వ విషయ సేకరణ ఆయన ప్రత్యేకత. ఈ రచనలో నలభై ఐదు వ్యాసాలున్నాయి. ఈ వ్యాసాలను సాహిత్య భారతి, కళాభారతి, విజ్ఞానభారతి, సమైక్యభారతి అని నాలుగు విభాగాలుగా చేసి రచించారు. సాహిత్యం, కళలు, విజ్ఞానం మొదలైన వివిధ రంగాలకు సంబంధించిన వ్యాసాలను రాశారు. ఒక్కొక్క రంగంలోను కృషి చేసిన గొప్పగొప్ప వ్యక్తుల పరిచయాలు, వారివారి కృషిని వ్యాసాల రూపంలో ఈ రచనలో పేర్కొన్నారు. శాస్త్రిగారి వ్యాసాల్లో సామాజిక చైతన్యం, లౌకికవాదం కనిపిస్తుంది. సంగీత కళాకారులు, వైజ్ఞానికులు, సాహిత్యవేత్తలు, సంఘ శ్రేయాభిలాషులు, దేశభక్తులు మొదలైనవారి గూర్చి ప్రస్తావించారు. ఎవరెవరు ఏయే రంగాలలో నిపుణులు, ఏయే రంగాల పట్ల ఆసక్తి కనబరిచారు, ఏవిధంగా కృషి చేశారు, ఆ మహానుభావుల విలువల్ని వ్యాసాల రూపంలో మనముందుంచారు. " తెలుగు కవులు, కళాకారులను గూర్చి వ్యాసాలను కన్నడంలో రాసి బెంగుళూరు నుండి వెలువడే సుబోధ కన్నడ మాస పత్రిక కు పంపేవారు. నన్నయ, తిక్కన, పోతన, ఆధునిక కవులు, జాషువా, కృష్ణశాస్త్రి, విశ్వనాథలను గూర్చి వ్యాసాలు సుబోధ పత్రిక ప్రచురించింది. అలాగే కన్నడ కవులు పంప, కుమార వ్యాస, సర్వజ్ఞ శివరామకారులగారి జీవిత విశేషాలను కృష్ణపత్రికకు పంపేవారు" (హనుమచ్ఛాశాస్త్రి, జానమద్ది. 2011 : 655). ఈ రీతిలో తెలుగు కన్నడ సాహిత్యవేత్తల పరిచయ వ్యాసాలు చేశారు. రెండు భాషలలోని సాహిత్యాన్ని పరస్పరం పరిచయం చేశారు. అలాగే వీరి మరొక రచన నీరాజనం ఆధ్యాత్మిక పౌరాణిక వ్యాస సంకలనం. పరిశోధనాత్మకంగా రచించబడింది. నేటి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా

ఉండేవిధంగా రచించారు. ఈయన నివసించిన తిరిగిన ప్రాంతాలలో ఏయే ప్రసిద్ధ క్షేత్రాలున్నాయో వాటి పుట్టుపూర్వోత్తరాలు, సుప్రసిద్ధ వ్యక్తుల పాండిత్యం గూర్చి వ్యాస రూపంలో రాశారు. ఎందరో మహానుభావులు రచనలో వివిధ రంగాలలో చెరగని ముద్ర వేసిన మహానుభావుల జీవితాల్లోని అపురూపమైన సన్నివేశాలను పేర్కొన్నారు. మహనీయుల జీవిత చరిత్రలే ఏ దేశ చరిత్రకైనా మూలకందాలు. చరిత్రకెక్కిన చరితార్థుల జీవితాలు సమకాలీనులకే కాక భావితరాల వారికి కూడా స్ఫూర్తిదాయకాలే. మనిషిని అల్పుడుగా చేసే సంఘటనలు ఉన్నట్లే అతన్ని మహోన్నతునిగా చేసే సంఘటనలు కూడా ఉంటాయి. అటువంటి సంఘటనలతో కూడిన రచన ఇది. సాంఘికసేవ, దేశభక్తి, సాహిత్యం, ఉదార హృదయం, గొప్పతనాన్ని సాధించుకోవడం, నిజాయితీ, కష్టపడటం, మంచిమనసు, పట్టుదల, సాహస కృత్యాలు, మేధస్సు చాకచక్యం, చమత్కారం, ఆప్యాయత, ఆత్మీయత, గౌరవభావాలు, సంస్కారం, అంకితభావం మొదలైన అంశాలతో కూడిన సంఘటనలు కలిగిన మహానుభావుల పరిచయాలు చేశారు. అంతేకాకుండా ఆ మహానుభావుల ఫోటోలు, కాలాలతో సహా వారివారి జీవిత సన్నివేశాలను తెలియజేయడం జరిగింది. ఇవన్నీ సేకరించి రచన చేయడం సామాన్య విషయం కాదు. ఎందరో మహానుభావుల లక్షణాలు, వారివారి జీవితాలలోని ఘట్టాలు ఇవన్నీ మనకు మార్గదర్శకత్వం కలిగించేవి. ఇటువంటి రచన చేసిన శాస్త్రిగారిలో కూడా ఈ లక్షణాలన్నీ కనిపిస్తాయి. అయితే ఈ లక్షణాలన్నీ శాస్త్రిగారిలో సహజంగానే

ఉండడం వలన ఈ రచన చేశారని చెప్పవచ్చు. అందుకే అటువంటి అంశాల పట్ల ఆయన ఆకర్షితుడై ఈ రచన చేసి ఉండవచ్చు. ఈ రచనలోని మహానుభావులతో పాటుగా ఈ రచన చేసిన మహానుభావుడు శాస్త్రిగారు కూడా మనకు మార్గదర్శకులే. మరొక రచన రసవద్ఘట్టాలు లో దేశ, విదేశాలకు చెందిన మేధావులు, కవులు, గాయకులు, శాస్త్రవేత్తలు, నటులు, రాజనీతి విశారదులు, దేశభక్తులు మొదలైనవారి జీవితాల్లోని రసవద్ఘట్టాలను వ్యాసాల రూపంలో రాశారు. ఎంతోమంది వ్యక్తుల జీవితాల్లోని రసవద్ఘట్టాలను సేకరించి రచన చేయడం ఎంతో కృషి చేస్తేనే తప్ప ఈ రచన చేయలేరు. అనేక గ్రంథాలను అధ్యయనం చేసి, ఎన్నెన్నో విషయాలను సేకరించి రచన చేశారు. వారివారి జీవితాలలో మధురమైన సరసమైన చారిత్రకమైన సంఘటనలను సేకరించి తమదైన శైలిలో క్లుప్తత, స్పష్టత, పఠనీయత ఉండేవిధంగా రాశారు. ఈ రచన ద్వారా మరపురాని సంఘటనలను మనకు అందించిన మహానుభావుడు శాస్త్రిగారు. గణపతి రచన శాస్త్రిగారిలోని దార్శనిక ప్రవృత్తికి నిదర్శనం. ఈ రచన కన్నడం నుండి తెలుగులోకి ఆంగ్లంలోకి అనువదించారు. గణపతి విగ్రహాలకు సంబంధించిన చారిత్రకాంశాలను పేర్కొన్నారు. ఆలోకనం ఆత్మకథలో ఆయన జీవితానుభవాల చర్చ కనిపిస్తుంది. అలాగే బళ్ళారి రాఘవ జీవిత చరిత్ర రాశారు. కస్తూరి కన్నడ సాహిత్య సౌరభం లో సోదరభాషా వైశిష్ట్యాన్ని వివరించారు. తెలుగు కన్నడ భాషల మధ్య సమన్వయాన్ని తెలియజేస్తూ రచన చేశారు. కన్నడ సాహిత్యవేత్తల, కళాకారుల పరిచయాలు చేశారు. దేవుని కడప - స్థల చరిత్ర రచనలో కడప స్థలచరిత్రను సేకరించి ఆధారాలతో రచించి మన సంస్కృతి విశేషాలను భద్రపరిచారు. కడపజిల్లా విజ్ఞాన విహార దర్శిలో కడపజిల్లాకు చెందిన ముప్పైఆరు పర్యాటక ప్రాంతాల గూర్చి విద్యార్థులకు ఉపయోగపడే రీతిలో రంగు చిత్రాలతో తీర్చిన రచన. ఇంకా సి.పి. బ్రౌన్ చరిత్ర, మోనోగ్రాఫ్, అనువాదాలు మెకంజీ కైఫీయత్తులు - మొదటి భాగం మొదలైన రచనలు చేశారు. 'జాతీయ సంస్కృతిని జీర్ణించుకున్న విజ్ఞులు. మనిషి ఎదగడానికి చదువు ముఖ్యం. ఆ స్పృహతోనే శాస్త్రిగారు గ్రంథాలయోద్యమాన్ని జీవితలక్ష్యంగా స్వీకరించారని, జగ్గయ్యగారు శాస్త్రిగారి అభినందన సంచికలో పేర్కొన్నారు'.

### రచనాశైలి :

చిన్న చిన్న వాక్యాలతో, డైరక్టుగా విషయంలోనికి చొచ్చుకునిపోవడం, చారిత్రక విషయాలను వెలికి తీయడం, పరిశోధనా దృష్టి, విషయంలో విశిష్టత కనిపిస్తుంది. విషయ సేకరణలోను, విశ్లేషణలోను శాస్త్రిగారిది ప్రత్యేకమైన శైలి. ఓర్పుతో సర్వవిషయ సేకరణ చేస్తారు. ఈయన రచనలు అన్నీ కూడా పునర్ ముద్రణలు పొందాయి. ప్రతిమనిషికి బలం, బలహీనతలు (మంచి-చెడు) రెండూ ఉంటాయి. కాని శాస్త్రిగారు కేవలం మనిషిలోని మంచితనం, కృషిని మాత్రమే గ్రహించి అటువంటి కోణంలోనే రచనలు చేశారు. ఇటువంటి ధోరణిలో వచ్చే రచనల వలన సమాజానికి ఎంతో మేలు కలుగుతుంది.

### ముగింపు :

ఎక్కడెక్కడో ఉన్న విషయాలను సేకరించి, వెలికితీసి పరిశోధనా దృష్టితో వ్యాసరూపంలో రచనలు చేశారు. సేవాతత్పరతతో, ఆదర్శజీవితం గడిపారు. అధ్యాపకుడుగా, సాహితీవేత్తగా, అనువాదకుడుగా అన్నింటికి మించిన గొప్ప సమీక్షకుడుగా నేటి యువతరానికి మార్గదర్శకులు.

### ఉపయుక్త గ్రంథసూచి :

1. రమాపతి రాజు, వీణా. 2003 నవంబర్. కడపజిల్లా సంస్కృతి (అభినందన సంచిక)
2. హనుమచ్ఛాస్త్రి, జానమద్ది. 2008. ఆలోకనం (ఆత్మకథ) . మిత్రసమూహ ప్రచురణ. కడప.
3. హనుమచ్ఛాస్త్రి, జానమద్ది. 2011 ఆగస్టు. నేను నా సాహితీ సేవ (సంపా. శ్రీమండలి బుద్ధప్రసాద్). కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రచురణ. విజయవాడ.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# తెలుగు సాహిత్యంలో గిరిజనులు - ఆర్థిక విధానం

- కె.ఎస్.ఎస్. రత్నప్రసాద్
అసోసియేట్ ప్రొఫెసర్, ఆంగ్ల విభాగము, ఎస్.ఆర్. & బి.జి.యన్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి), ఖమ్మం.

- డా॥. జరుపుల రమేష్
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగము, ఎస్.ఆర్. & బి.జి.యన్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి), ఖమ్మం.

నేటి ప్రపంచ పరిస్థితులు గిరిజనుడి జీవన విధానానికి అనువైనవికావు. ఎందుకంటే ప్రపంచం వేగంగా మారుతోంది. మనం ఆ మార్పుకు తగ్గట్టుగా జీవించినప్పుడే మనుగడ సాధిస్తాం. ప్రతిచోటా పోటీతత్వం నెలకొని ఉంది. ప్రపంచం మొత్తం ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ లాంటి పదాలతో మార్మోగిపోతుంది. పాలకుల విధి విదానాలే ప్రత్యేకంగానో, పరోక్షంగానో శాసిస్తున్నాయి. భారతదేశం ఇందుకు మినహాయింపు కాదు. అంటే రానున్న కాలంలో ప్రభుత్వ పాత్ర తగ్గనుంది. దీంతో రాజీలేని పోటీతత్వం, తెలివిగలవాడే ముందుకుపోయే పరిస్థితులు, ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గిపోవడం లాంటి పరిస్థితులేర్పడతాయి. నిజానికి నేటికి ఆ పరిస్థితి ఉంది. ఇలాంటి సమయంలో నూతన అవకాశాలకోసం, మనం అభివృద్ధి చెందాల్సిన విధానం మీద ప్రత్యేకమైన దృష్టిని కేంద్రీకరించాల్సి ఉంటుంది. మరి గిరిజనుడి పరిస్థితి ఏమిటి?మార్పులకు అనుగుణంగా గిరిజనుడు అనుసరిస్తాడా! లేని పక్షంలో అతి వేగంగా తిరోగమనం చెందడం ఖాయం.

చరిత్రను వర్గపోరాటాల చరిత్రగా, సమాజాన్ని వర్గ సమాజంగా చూస్తుంది మార్క్సిజం. మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలేనని కూడా చెప్తుంది. ఏంగెల్స్ గతితార్కిక సిద్ధాంతాన్ని మార్క్స్ చారిత్రక గతితార్కిక భౌతికవాద సిద్ధాంతాన్ని విశ్లేషించాక ప్రపంచ మానవ చరిత్ర పరిణామానికి కొత్త వెలుగులు వచ్చాయి. మానవ సమాజ చరిత్రను పరిశీలించినట్లైతే ఎప్పుడూ ఒక వర్గం పీడించేదిగానూ, ఒక వర్గం పీడింపబడేదిగానూ ఉంటుంది. కొంత కాలానికి పీడితులలో చైతన్యం వచ్చి పోరాటం ద్వారా సమాజంలో మౌలిక మార్పును తీసుకువస్తారు. ఫలితంగా సమాజ స్వరూపం మారుతోంది.

భారతదేశంలో గిరిజనుల జీవనం, వారి ఆర్థిక వ్యవస్థ యావత్తూ అడవులతోనే పెనవేసుకుపోయింది. అత్యధిక గిరిజన జనాభా పూర్తిగా అడవుల్లోనే జీవిస్తూ అటవీ ఉత్పత్తులతోనే జీవనోపాధి కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా దుంపలు, గడ్డలు వారికి ఆహారంగా ఉపయోగపడుతున్నాయి. చిన్నచిన్న అడవి జంతువులను వేటాడి ఆహారంగా భుజిస్తుంటారు. అయితే వేట ప్రధానంగా జీవిస్తున్న గిరిజనుల సంఖ్య తక్కువే. ముఖ్యంగా ఒరిస్సా, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో వారి జనాభా కొంతవరకు వుంది. ఇప్పపూలు, విత్తనాలు, తునికాకు, దుంపలు, వెదురుబొంగు, చింతపండు, కుంకుడు కాయలు మొదలైన అటవీ ఉత్పత్తుల మీద ఆధారపడి వీరి జీవనం సాగుతోంది. తెలుగు సాహిత్యంలో గిరిజనుల ప్రస్తావన ఉన్న రచనలు చాలా తక్కువ. వారి జీవితాల గురించి ప్రాచీన రచనల్లోనూ, ఆధునిక కాలంలో కథలు, నాటకం, కవిత్వం, నవలల్లో కొంత చిత్రణ కనిపిస్తుంది. పూర్తి స్థాయిలో గిరిజనుల పై రచనలు అనేవి ఆధునిక కాలంలో కొన్ని వచ్చాయి. అవన్నీ కూడా సానుభూతి సాహిత్యంగానే వచ్చాయి. వాటిలో గిరిజనుల ఆర్థిక స్థితి ఎలా ఉందో ఈ వ్యాసంలో పరిశీలించడం జరుగుతుంది. సాధారణంగా అడవితోనే వారి యొక్క జీవన విధానం కాబట్టి, వాటిలో సాధారణంగా పన్నులు, శ్రమదోపిడీ, లైంగిక వేదింపు మొదలైన వాటితో వారి యొక్క ఆర్థిక స్థితి సాహిత్య రచనల్లో కనిపిస్తుంది.

"భారతదేశ గిరిజన ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలోని ఇతర ఆదిమ తెగల ఆర్థిక వ్యవస్థకు భిన్నంగా ఏ మాత్రం లేదు. ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికే గిరిజనులు తమ కార్యకలాపాలను కేంద్రీకరిస్తారు. అందువల్ల వీరి ఆర్థిక వ్యవస్థను 'ఉత్పత్తి - వినియోగ ఆర్థిక వ్యవస్థ'గా పేర్కొంటారు. ఈ వ్యవస్థను ఇతర వ్యవస్థలతో మజుం దార్ (1967) పోల్చి చూశారు. మిగులు ఆర్థిక వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచీ మానవుడు తన మౌలిక అవసరాలైన ఆహారం, మైథునం, గృహవసతులతో సంతృప్తి చెంద కుండా అనేక ఇతర సదుపాయాలు కోరుకుంటున్నాడని పేర్కొన్నారు. ఈ అవసరాలను సంతృప్తి పరచుకోవడానికే "ఉత్పత్తి - వినియోగం - పంపణి" ఆర్థిక వ్యవస్థ ఏర్పడిం దని నదీం హస్నైన్ పేర్కొన్నాడు." అందువల్ల గిరిజన ఆర్థిక వ్యవస్థ అడవితో ముడిపడి ఉంటుందనేది గుర్తించాల్సిన విషయం. కాని ఆర్థిక జీవన విధానంలో గిరిజనుల ఎక్కడ వెనకపడిపోతున్నారు? అని అలోచిస్తే వ్యవస్థలో వివిధ రకాలైన లోపాలున్నాయిని తెలుస్తోంది.

### గిరిజనులు - పన్నులు :

పన్ను కట్టే సంప్రదాయం తరతరాల నుండి వస్తోంది. రాజ్యాన్ని పాలించడానికి ప్రతి రాజు తన సరిహద్దులో ఉన్న ప్రజల పై పన్ను విధించడం జరుగుతుండేది. కాల క్రమంలో పన్ను అరాచకత్వం ఎక్కువై రాజ్యాలు కూలి పోయిన సందర్భాలనేకం కనిపిస్తాయి. గిరిజనులు అడవుల్లోనే ఉంటారు. వాళ్ళకు ఏమి పన్నులుంటాయి అనే ఆలోచన ప్రతివారికి కలగకమానదు. ప్రపంచంలో ప్రతిమూలా కొన్ని శక్తులుంటాయి. అవి వ్యవస్థను ఆధారంగా చేసుకొని ప్రజలను పిల్చి పిప్పి చేస్తుంటాయి. అలా పీడింపబడుతున్న వాళ్ళు గిరిజనులు. పరాయి పాలనపోయింది. అన్యాయపు రాజరికం అంతమయింది. ఇక ఇప్పుడు రాజులు లేరన్నారు మహానాయకులు. నిజాం నిరంకుశాధికారపు ఉక్కుపాదం కింద జీవచ్ఛవాలై, దీనంగా, హీనంగా బతుకులీడుస్తున్న గిరిజనులు ఇకనన్నా మా బతుకులు బాగుపడతాయేమో అనే ఆశతో ఎదురు చూశారు, చూస్తునేవున్నారు. అనేక దశాబ్దాలే గడిచి పోయాయి. కానీ నింగిమారలేదు, ఈ నేల మారలేదు, ఈ అడవి మారలేదు, ఆ అడవుల్లో గిరిజనులు చెట్టుకు, కట్టెకు, ఆకుకు, పుల్లకు, పన్ను కట్టడం కూడా మారలేదు.

'కొమురం భీము' నవలలో "ఏమున్నదత్తా మాటలకు. ఎటు అనుకున్న మనవి దిక్కులేని బతుకులేగద. చేసిన కష్టం చేతికిరాదు. చేతికొచ్చింది మూతికి రాదు. నేను పుట్టి బుద్దెరిగిన దగ్గరి నుండి చూస్తున్న. గిట్లనే గీ అడివిల విప్పపూలు ఏరుతున్న. గీ అడివిల చెట్లకింద దొరికే పూలకుపన్నాయో. గడ్డికి పన్నానాయె. మన బతుకంతా పన్నుల కిందనే చెల్లిపోబట్టే. మన బతుకుల చీమ కాలంత సుకం లేకపాయె. గూడాలు ఎలుగడి బడ్డ అడివి సందమే నాయె. ఏమున్నది మరింక మాట్లాడేటందుకు? గదే మాట్లాడ్తన్నం. చిన్న గుల్లలో నిండిన విప్పపూవు పెద్ద గంపలో పోసింది"

'అడవి' నవలలో "ఈ చేను ఎవల్లది? అడిగాడు పట్వారీని. ఇది మాడివి దేవురావుది సర్కార్. మరి గీ చెట్లును ఇట్ల నరికి కుప్పవెట్టిండేంది? అడు 'చౌబీనా' కట్టిండా లేదా?. లేదు సర్కార్. ఈ నడమనే కొట్టిండు. ఏం పట్వారి...ఇవన్నీ నువ్ జూసుకోవాల.ఏం జేస్తున్నవెందో! పిలిపియ్ గాడిదకొడుకుని. ఈ గోండుముండ కొడ్కుల తోని, నాయకపోళ్ళతోని, కొలామోల్లతోని మా ప్రాణం ముక్కుల కొస్తున్నది. అన్ని ఉల్టా సీదా పనులు ఇప్పు డానికి ఈ చెట్టుగొట్టె పనేముండె' అని ఇంకేమేమో తురకంలో అరుచుకుంటూ ఊళ్ళోకొచ్చాడు.....ఈ సారికి ఎట్టన్న మమ్మల్ని మాఫిజెయ్ హుజూర్. అచ్చేట్నించి పైసలు మీరు అడగకముందే మీకు జమకడ్తం. ఈ సారికి ఎట్టన్న... అని అంటుండగానే...ఈ సారికి మీ పెండ్లాలను ఒకగంటసేపటికి అమ్మి పైసల్దెచ్చి కట్టు"

మనిషిని వేధించడానికి కొన్ని పద్ధతులను పాటించే వాళ్లని ఈ నవలను పరిశీలించిన తర్వాత తెలుస్తోంది. పన్నులు కట్టినా గానీ, కట్టలేదనే నెపంతో, లేదా గిరిజన గుడిసెలు కాలబెట్టడమో చేసేస్తే కట్టిన రశీదు ఉండదు. మామూలు ప్రజల లాగా దాచుకోవడానికి గిరిజనులకు ప్రత్యేకమైన సదుపాయాలంటూ ఏమీ ఉండవు కాబట్టి

దాన్నీ అధికారులు గ్రహించి గుడిసెలను కాలబెట్టడం నేర్చుకున్నారు. దాంతో గుడిసెలో దాచిపెట్టిన రశీదు కాలి పోతుంది. మళ్ళీ పన్ను రూపంలో గిరిజనులను దోచు కోవచ్చు. ఒక విధంగా చూసినట్లయితే గిరిజనులు అనాది కాలం నుండి బాగా వెనకపడి పోవడానికి అనేక కారణా లల్లో పన్ను చెల్లించడం కూడా ఒక ప్రధాన కారణం. పంటలు పండిన, ఇప్పపూవు వేరుకున్న, ఆకులు తెప్పిన, తునికాకు తెప్పిన, బంకతీసినా పన్నులు చెల్లించాల్సిదే. పై అంశాలను గిరిజన నవలలు విస్తృతపరిధితో వివరిం చాయి. గిరిజనులు జీవితాంతం పన్ను కట్టలేక నిరాశ జీవితాన్ని జీవిస్తుంటారు. అందుకే అనేక అంతర్నిగూఢ అంశాలను ఈ నవలలు చిత్రించాయి.

## శ్రమ దోపిడి :

భూతలంపై సంచరించు ప్రతి జీవరాసి, సంఘంగానే జీవిస్తాయి. సంఘం లేక గుంపుగా జీవించడానికి ప్రకృతి కూడా సహకరిస్తుంది. మానవుడు, జంతు పశుపక్ష్యాదులు పొట్టపోసుకోవటానికి శ్రమిస్తాయి. శ్రమ లేకుండా జీవిం చడం కేవలం ఉన్నత వర్గానికే సాధ్యం అవుతుంది. లేదా మధ్యతరగతి కుటుంబాల్లో వారసత్వ సంపద వస్తే అలా జీవించడం చేస్తారు. ప్రతి వాడు ఏదో ఒక రూపంలో కష్టపడాల్సి ఉంటుంది. కష్టపడడం మనిషి లక్షణం. శ్రమ మనిషిని బానిసత్వం నుండి విముక్తి చేస్తుంది. శ్రమకు తగిన ప్రతిఫలం రావటం లేదనేది ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు వస్తున్న సిద్ధాంతం.

ఒక వ్యక్తి చేత పని చేయించుకొని తగిన శ్రమకు ప్రతిఫలం ఇవ్వకపోతే దానిని శ్రమదోపిడీ అంటారు. మార్క్స్ టెక్నికల్ శ్రమ దోపిడిని వివరించాడు. ఒక వ్యవస్థలో ఒక వస్తువును తయారుచేయడానికి శ్రామికులను ఉపయోగించుకొని, అదనంగా లాభాలు పొంది శ్రామికులను వంచించడాన్నే మార్క్స్ వివరిం చాడు. ప్రపంచీకరణ నేపథ్యంలో మార్క్సని మళ్ళీ ఒకసారిగా ముందుకు తెచ్చింది సమాజం. దానితో శ్రామికవర్గానికి రావల్సినంత గుర్తింపు రాలేదు.

కృష్ణశాస్త్రి నిర్వచనాన్ని పరిశీలించినట్లయితే "పీడంప బడేవాళ్లూ పీడించేవాళ్లూ వున్న యీ వర్గసమాజం ఉం డాలని ఎవరూకోరరు. రానున్న విధానంలో సాధారణ మానవుడే మకుటదారి. పురోగమిస్తున్న లోకాన్ని ప్రతిఘటింపజూచేవారు ఎప్పుడూ అభ్యుదయవాదులు కాజాలరు. ఈ ధనికసమాజం పోవాలనుకోవటమే అభ్యు దయం. ఇది మనసులో పెట్టుకొని వ్రాసేది అభ్యుదయ రచన" ఈ నిర్వచనం మార్క్స్ దృక్పథంతో వచ్చిందే.

శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదని ప్రకటించిన అభ్యుదయ కవిత్వం కార్మికలోకపు కళ్యాణా నికి, శ్రామిక లోక సౌభాగ్యానికి సాధనంగా నిలిచింది. శ్రీశ్రీ "నైలునదీ నాగరికతలో - సామాన్యుని జీవనమెట్టిది? తాజ్‌మహల్ నిర్మాణానికి - రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?" అని ప్రపంచాన్నే శ్రామిక వర్గం కోసం ప్రశ్నించాడు.

కత్తి పద్మారావు "భారతీయ శ్రామికవర్గం 'ధనిక - పేద' విభేదం తప్ప మరే విభేదాలు గుర్తించటం లేదా? కులం,జాతి, ఎక్కువ, తక్కువ లాంటి భేదాలను పేద వర్గం గుర్తించటం లేదా? ధనిక వర్గానికి వ్యతిరేకంగా శ్రామిక వర్గం చేపట్టే ఆచరణాత్మక కార్యక్రమంల్లో వివిధ శ్రేణులుగా విభజింపబడి వున్న శ్రామికవర్గ ఐక్యత కోసం ఎటువంటి 'ఐక్యవేదిక'ను ఆశించాలి? శ్రామిక వర్గాల 'ఐక్యవేదిక' లేకుండా శ్రామికవర్గ విప్లవం ఎలా సంభ విస్తుందని" అన్నారు.

గిరిజన నవలల్లో శ్రామిక విధానం అనేక విధాలుగా చెప్పబడింది. 'చివరిగుడిసె' నవలలో మణియం అనే వ్యక్తి ఊరికి దొర. తమ పొలాన్ని ఎలుకలు నాశనం చేసస్తున్నాయనే ఉద్దేశంతో యానాది కులస్తుడైన మన్నుగాడికి ఆ పని చెప్తాడు. చెప్పిన తరువాత కూలీ విషయంలో ఇద్దరి మధ్య జరిగిన సంభాషణను గమనించినట్లయితే "మన్నుగాడు గొంతు సవరించుకుని యానాది మిట్ట ఎలుకలకు పుట్టినిల్లు గద.పక్కనే అడ్డగుట్ట ఉండాది. పంటల్లేనప్పుడు ఎలుకలన్నీ గుట్ట మీదకు చేర్తాయి. పంట ఎక్కగానే గుట్ట దిగొస్తాయి. వాటి గోత్రాలన్నీ నాకు దెల్సు దొర" అన్నాడు.

మణియం అవి తెలివిమీరి పోయినాయిగా. మందు పెట్టే పెంకుల్దగ్గరికే పోవటంలేదు అన్నాడు. మన్నుగాడు ఔ దొరా. మందు పెట్టే ఆమడదూరం నుంచే వాసన పట్టేస్తాయి. నాకు దెల్సు దొరా. ఐతే వాటి ఆటలు నా దగ్గిర సాగవు. ఈ రాతిరంతా మేలుకున్నానంటే తెల్లారే సరికి ఇత్తానానికి గూడా ఒక ఎలుక మిగలదు. తెల్లారి నాక నాకష్టం జూసి నీకు తోచింది ఇయ్యి దొరా" అన్నాడు. మణియం తొక్కులాడుతున్న గుర్రాని అదుపులోకి తెచ్చి, ఇచ్చేదెందిరా. పట్టిన ఎలుకలన్నీ నువ్వే తింటావుగదా. మళ్ళా ఇనావులేంది? అన్నాడు.

మన్నుగాడు ప్రాధేయపడుతూ ఈ పాయకట్టుకే దొరవు. నువ్వే అట్టంటే యట్ట? మూటుపెట్టాలంటే నోటి మాటలా దొరా. నోటితో ఊది ఊది సోషతప్పి పోయేదాక ఊదాల. ఎలుకల్ని బయటకు తియ్యాలంటే నేలంతా కుళ్ళగించాల. తొవ్వి తొవ్వి రెక్కలు పడిపోతాయి. పనంతా అయిపొయ్యేటప్పటికి నేను, నా కొడుకూ ఇద్దరం పడకెయ్యాల్సొస్తుంది'' అన్నాడు. మణియం కాసేపు ఆలోచించి "సరే. ఒక్కొక్క ఎలుకకు దుగ్గాని ఇస్తాను. సరేనా? అన్నాడు.''

పై విధానాన్ని పరిశీలించినట్లయితే ప్రకృతి సంపద మీద కూడా ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నట్టుంది. జీవ జంతు జాలం పైన ఎవరికి హక్కులేదు. ఇక్కడ యానాదుల శ్రమను దొచుకున్న తీరును చూస్తే కళ్ళకునీళ్ళు రాక మానదు. రాత్రంతా కష్టపడి ఎలుకల్ని పట్టితే మీకు తోచింది ఇవ్వండి దొరా? అంటే ఇచ్చేదెందిరా. పట్టిన ఎలుకలన్నీ నువ్వే తింటావుగదా. మళ్ళా ఇనాంలేంది రా? అన్నాడు. యిది ఎంత శ్రమ దోపిడి. చివరికి కొన్ని పైసలు ఒప్పుకున్న చేసిన పాపానికే ప్రాణాలే వదలాల్సిన అవసరం మన్నుగాడికి పట్టింది. గిరిజనులను శ్రామికంగా ఎంత వేదనకు గురిచేస్తున్నారో తెలుస్తోంది.

మన కడుపు సంగతి ఆల్లకెందుకు? ఆకలి అంటే ఆల్లకేం ఎరుక. ఆల్ల ఖానూన్‌లు, ఖాయిదాలె మనవి గీ దిక్కులేని బతుకులకు దెచ్చినయి' అన్నాడు ఆకలితో చికాకుగా ఉన్న పడుచు కినాక భీము. 'ఏందిరా... ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నావ్. కండ్లు నెత్తికెక్కినయా' అని కళ్ళింత చేసుకొని బెదిరించి మళ్ళీ తనే...'ఆ మీకు ఆకలైతే నాకేం, మీరు ఏ గంగల పడితే నాకేం. పని గావాల నాకు పని.''

ప్రతి మానవుడికి ఆకలి అనేది సహజం. అందరికి ఆకలి ఒకేలాగా ఉంటుంది. గిరిజనులకు వేరే వ్యవస్థను దేవుడు సృష్టించలేదు. యాజమానులు, ఫారెస్టు అధి కారులు గిరిజనులను శ్రమను దోచుకోవడమే కాకుండా, మానసికంగా వేధింపులు కూడా తప్పడం లేదని తెలు స్తుంది. పని చెయ్యాలంటే మనిషికి కనీస తిండి ఉండాలి. తిండి లేకపోతే అదే యాజమాని చెయ్యగలడా? లేదు కదా? అందువల్ల ఆ పరిస్థితిని వాళ్ళు అర్థం చేసుకోలేక గిరిజనులకు ఆ తిప్పలు తప్పడం లేదు. గిరిజన ఆశేష ప్రజానీకం కూడా ఇలాంటి బాధలకు గురవుతున్నారు.

శ్రమ దోపిడీ వల్లనే, మానవుల మధ్య శతృవర్గాలు ప్రారంభమవుతున్నాయి. శ్రమని దోచే వర్గానికి అందేవి కలిమీ, సౌఖ్యమా! శ్రమని పోగొట్టుకునే వర్గానికి అందేవి లేమీ, దాస్యమా! ఈ విషయాలు తెలిసివుంటే శ్రమదోపిడీ లేదని ఏలా చెప్పగలము. గిరిజన రచయిత్రులుగా జ్ఞానపీఠ అవార్డు పొందిన ఒరిస్సా గిరిజన రచయిత గోపినాథ్ మహంతి తన 'పరజ' నవలలో, బెంగాలీ గిరిజన రచయిత్రి మహాశ్వేత దేవి 'ఒకతల్లి' 'రూఢాలి' మొదలైన నవలల్లో గిరిజన జీవితాలను చిత్రించి ఆశేష ప్రజల అభి నందలు పొందారు. అయినా గానీ వివిధ ప్రభుత్వంలో ఆశించనంతగా మార్పులు రాలేదు. గిరిజన గూడెంల్లో శ్రమదోపిడీ ఇంక తగ్గలేదు.

## గిరిజన స్త్రీ - లైంగిక వేధింపులు :

గిరిజనుల పై జరిగే లైంగిక వేధింపులు ఆర్థిక సమస్యలతో ముడిపడి ఉంటాయి. గిరిజనులు ఆర్థికంగా సమాజంలో బాగా వెనకబడి ఉంటారు. అందువల్ల పనులు చేయడానికి పట్టణ ప్రాంతాలకు వెళ్ళడం ఒక కోణమైతే, ఆర్థికంగా వెనకబడి ఉంటారు కాబట్టి అధి కార్లుకు దాసోహంగా ఉండడం మరోకోణం. గిరిజనులు ఆర్థికంగా బలంగా ఉంటే వాళ్ళు అధికార్ల మాటలు వినరు

కదా! ఒక రకంగా గిరిజనులను ఆర్థికంగా ఎదగకుండా అడ్డుపడుతుంది గిరిజనుల నుండి ఆశిస్తున్నవారే. అంటే సమాజం మొత్తం ఆర్థిక కోణంలో నడుస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

'ఎల్లి' నవలలో "ఆ వూళ్ళో పోకిరీ కుర్రోళ్ళు బాజిని చూసి యీలలెయ్యటం కన్నుగీటటం చేస్తూనే వున్నారు. బాజి తనను కానట్టు మెదలకుండా వూరుకుంది. అసలే ఆళ్ళు ఆస్తికి కులానికి పెద్దోళ్ళు. ఆ సంగతి బాజి యెప్పుడూ తల్లికి కూడా చెప్పలేదు. మన మంచి మన దగ్గిరుంటే వీళ్ళేం చేస్తారులే అనుకుంది....ఆ కుర్రోళ్ళల్లో వొకడు బాజికి బాగా దగ్గిరిగా వొచ్చి తెలిసికూడా నీ పేరింటి పిల్లా అన్నాడు...వొస్తే డబ్బులిస్తాం వొద్దు అంది యెలాగో గొంతు పెగల్చుకుని. వొద్దా. పోన్లే వూరికే రా అని జబ్బు పట్టుకున్నారు యిద్దరూ.నేనురాను నన్ను వొదలండి అని గింజుకుంది. యేమిట్రా ఆలస్యం అన్నాడు అందులో వొకడు ఆత్రపడిపోతూ. బాజి యెంత గింజుకున్న వొదల్లేదు. భయంతో అరిచినా ఆ చుట్టుపక్కల వినే వాళ్ళు యెవరూలేరు...బంగారమంటి పిల్ల బతుకు నట్టేట్లో ముంచారు సచ్చినోళ్ళు అంది వో తల్లి. రాజ్జం ఆళ్ళది మనమేం చెయ్యగలం అంది నాగమ్మ వుస్సురని..... మరుసటి రోజు సందేలకి చిన్న కుక్కిమంచంలో వొక శవాన్ని తీసుకొచ్చారు సుబ్బన్న గుడిసెకి. తీసుకొచ్చింది అల్లుడు కోటయ్య. అలా కాలవలో పడిన బాజి శవం గుండారుగుడెం లాకులకి పట్టింది."

బాజి చేసుకున్న పాపం ఏమిటి? అని అలోచిస్తే ఒంటరిగా చిగురుకు వెళ్ళడమే తప్పు అనిపిస్తోంది. ఎరుకుల కులంలో పుట్టిన బాజి జీవితాన్ని చిగురిస్తున్న చిగురాకులా మొలకల్లోనే తెంపేసినట్టు నాశనం చేశారు. వసంతంలాగా ఎదుగుతున్న తరుణంలో, తెలిసితెలియని వయస్సులో లైంగికంగా హింసించి కోల్కోకుండా చేసి, చివరికి పిచ్చిదై, కాలువలో మరణించిన బాజికథ చదివిన ప్రతివాడికి గుండె పగిలినట్టువుతుంది. అలా కావడానికి కారణమైన గిరిజనేతర యువకులను ఏం చేస్తే బాగుంటుంది? పగటిపూట గిరిజన స్త్రీ ఒంటరిగా తిరిగితేనే బాజిలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. గాంధీ గారు చెప్పినట్టు ఏ అర్థరాత్రో ఒంటరిగా తిరిగితే, ఆ సన్నివేశం చూద్దామన్నా గిరిజన గూడెంలో కనిపించదు.

'ఎల్లి' నవలలో "మేము నల్గొండ జిల్లా నుంచి వచ్చినం అని కళ్ళు తుడుచుకుని విషయం చెప్పింది. ఆమెకి వొక కూతురుంది. వాళ్ళిక్కడికి రాబోయే ముందు పెద్దదైంది. పెళ్ళయిన పిల్లె. యింకా కాపరానికి పంపలా యీ యేడాది చెరుక్కొట్టుడయిపోయినాక. కాసిని రాళ్ళు యెనకేసి సారెగాని అత్తోరింటికి పంపుగామను కున్నారు. యిక్కడ చెరుకు కొడుతూ వుండగా యెట్టా వోనం చేశాడో ఆపాలం ఆసామి కొడుకు. ఆ అమ్మాయిని లొంగదీసుకున్నాడు. వీళ్ళకి తెలియనే తెలియదు. చీటికి మాటకి పిల్చి ఆపని యీపని చేయించు కుంటూ వుండేవాడు. చిన్న పిల్ల అని పనులు చెపుతున్నాడేమో అనుకుని బేఫరవాగా వున్నారు. ఆకరికి కొంపమునిగింది. యిప్పుడా పిల్లకి మూడునెలల కడుపు. యెవరంటే దొరకొడుకని చెప్పింది. యింకేంచేస్తారు వాళ్ళు. యెవరిని అడిగితే యేమొస్తుంది."

సాధారణంగా యజమాని లక్షణాలేంటి? తన క్రింది తరగతులచేత తన ఇంట్లో దాసిగా పనిచేయించుకునేది మనం గమనిస్తుటాం. ఆధునిక కాలంలో కేవలం కింది వర్గాలు మాత్రమే కాదు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న ప్రతి కుటుంబం ఏదో ఒక పని చేయడానికి ముందుంటారు. లేకపోతే బతుకుబండి ముందుకుపోదు. అలాంటి పనిచేయించుకున్న లక్షణాలు కల్గిన యాజమాని తానే మృగంగా ప్రవర్తిస్తే సామాన్యుని పరిస్థితి ఏమిటి? గిరిజన కుటుంబంతో వ్యవసాయ పనులు చేయించుకున్న దొర, దొర అనే ముసుగుతో దొర కొడుకు ప్రవర్తించిన విధానం వల్ల అమాయక గిరిజన స్త్రీ జీవితం బుగ్గిపాలైంది.లైంగిక దోపిడీకి గురైనా కూతురు తల్లిచేత రచయిత్రి "యెవరంటే దొరకొడుకని చెప్పింది. యింకేంచేస్తారు వాళ్ళు. యెవరిని అడిగితే యేమొస్తుంది." ఎంత బాధను దిగమింగు కుంటుందో అర్థమవుతుంది. ఇలాంటప్పుడు గిరిజన స్త్రీ ఒంటరిగా ఎక్కడికి వెళ్ళగలదు?వెళ్లలేదు.

'అడవి' నవలలో ''అటునుండి చూపు పక్కకు తిప్పారు. తల్లి పక్కన బిడ్డకనిపించింది. వయసు పధ్నాలు గేళ్లు. ఇంకా పెద్దమనిషికాలేదు. పేరు మోతి. మోతి నిజంగా ముత్యంలాగా ఉంది. అడవిలో పూసిన దిరిశెన పూవులాగుంది. తేనెలో ముంచిన ఇప్పపూవ్వులా ఉంది. మోతి భయంభయంగా సేరేదార్ వైపు చూసింది. కళ్ళను కప్పేస్తున్న జులపాలు, పాములనే కరిచి చంపే గద్దలాంటి ముక్కు, సారా కంపు, అన్నిటికీ మించి వాళ్ళ అయ్య రక్తంతో తడిసిన బూటుకాళ్ళు. భయంభయంగా చూస్తున్న మోతి చేయిని చటుక్కున అందుకున్నాడు సేరేదార్. గారగార ఈడ్చుకుంటూ పంతులు పట్వారి దివాన్‌ఖానా లోకి ఈడ్చుకుపోయాడు. అది చూసి నలుగురు కొలాములు ధైర్యంతో ముందుకొచ్చారు, సేరేదార్ లోపలినుండి గది తలుపు మూసుకున్నాడు. కొలాములు బలంగా తలుపులు తడుతున్నారు. ఉండీఉండీ తలుపులు ఒక్కసారిగా తెరుచుకున్నాయి. తెరుచుకున్న తలుపుల్లోంచి ముందు తుపాకి గొట్టం తర్వాత సేరేదార్ బయటకొచ్చాడు. 'లమ్డి కొడుకుల్లారా..మా మీదికే లేస్తర్రా. బగావత్ చెస్తార్రా. పిట్టలను కాల్చినట్టు కాల్చిసంపుత. ఏమనుకుంటున్నారో...తెల్సిందా'! అంటూ తుపాకి చౌకిదార్‌కు ఇచ్చి..ఎవ్వడు ముందుకొచ్చినా కాల్సిపారేయ్ ముందు. మల్ల సంగతిమల్లజూసుకుందాం. అంటూ లోపలకు దూరి తలుపులేసుకున్నాడు....అర్ధరాత్రి వరకు అలా కళ్ళు నిలేసి ఆగదివైపు అలా చూస్తూనే ఉన్నారు. అప్పుడు మెల్లగా తలుపులు తెరుచుకున్నాయి.

మోతి తూలుతు బయటకొచ్చింది. వెంటనే చౌకీదార్ తన బాధ్యత జవానుకు అప్పజెప్పి తను మోతీని తీసుకొని పక్కగదిలోకి దూరాడు. ఒకరి తరువాత ఒకరు...ముందు సేరేదార్ తర్వాత చౌకీదార్, మళ్ళీ జవాను, మళ్ళీ ఇంకో జవాను..ఒకరి తర్వాత ఒకరు తుపాకి తూటాను కొలాముల గుండెలకు గురిపెట్టి ఆ ముత్యంతో ఆడు కున్నారు. చూస్తుండగానే తెల్లవారిపోయింది. అటు ఈ ముత్యం నల్లబడిపోయింది. ఇటు చౌకీదార్ వెంట గది లోకి వెళ్ళిన మోతి మళ్ళీ లేచి నిలబడలేదు. ఇంకా సేరేదార్ లేవలేదు. అప్పటికే మోతీ ప్రాణం పోయింది.''

పన్ను వసూలుకు వచ్చి, నచ్చిన తిండి తిని, నచ్చిన గిరిజన స్త్రీని అపహరించడమే అధికారులకు ప్రభుత్వం ఇచ్చిన బాధ్యత? అందుకే కాబోలు గిరిజన స్త్రీలు ఇంతగా లైంగికంగా గురికావడం బహుశా ప్రాచీన కాలం, రాజుల కాలంలో కూడా లేకపోలేదు. మోతి ఇంకా పెద్దమనిషి కాలేని గిరిజన అమ్మాయి. ఆమెను సేరేదార్, చౌకీదార్, చివరికి జవాను కూడా ఆమెను అనుభవించి పూవ్వును రాల్చినట్టు మోతి జీవితంతో అడుకున్నారు. అందుకే గిరిజనులు అడవిలో క్రూరమృగాలన్నా భయపడరేమో, కానీ, ప్రభుత్వ అధికారులంటే, గిరిజనేతరులంటే ఆ జంతువుల కంటే ఎక్కువ భయపడ్తారు.

అధికార్లు గిరిజనులకు హైమన్‌డార్ఫ్ కంటే ఎక్కువ పరిచయమే. కానీ, అతడు గిరిజనులకు సేవ చేయడానికి వచ్చాడు. ఆ అధికారులు అతని కంటే ఎక్కువ సేవ చేయాలనే ఉద్దేశంతో ఆ ప్రాంతాలకు నియమించింది ప్రభుత్వం. వాళ్లు చేస్తున్న సేవ అందమైన గిరిజన స్త్రీలను చేరదీయడం. అందుకే అధికార్లు అంటే గిరిజనులకు భయం. గిరిజన స్త్రీ కొంత చదువుకుంటే కూడా లైంగిక బాధలు తప్పడం లేదు. మార్పు మంచిదే అని పెద్ద లన్నారు. కానీ, ఆ మార్పు గిరిజనుల పట్ల యమ పాశాలుగా మారుతుందని 'సరిహద్దు' నవల తెలుపు తుంది. ముందే చెప్పుకున్నట్టు గిరిజనులు ఆర్థికంగా ఎదిగినప్పుడే ఇటువంటి వాటిని నివారించడం సాధ్య మవుతుంది. అప్పటి వరకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్టుగా ఉంది.

పేదవాడిగా పుట్టటం మనిషి చేసుకున్న పాపం కాదు. అలా అని ధనవంతుడుగా పుట్టటం మనిషి చేసుకున్న అదృష్టం కాదు. అవన్నీ కాలక్రమంలో కనుమరుగై పోతాయి. ఒక్కొక్కసారి పేదవాడే ధనవంతుడుగా మారడం ప్రకృతి భేదంలేని దాన్ని నిరూపిస్తుంది. కాబట్టి గిరిజనులు డబ్బులు లేక ఉన్నవాడి దగ్గర అప్పు తీసుకోవడమే గిరిజనుల చేసుకుంటున్న పాపం. దానివల్ల గిరిజన స్త్రీలు శీలాన్నే అమ్ముకొనే పరిస్థితి వస్తుందని వారికి తెలియదు. ఈ నవలలో వడ్డీ వ్యాపారి అప్పులుగా

డబ్బులిచ్చి, సమయానికి గిరిజనులు చెల్లించలేరని తెలిసే, గిరిజనులను మానసికంగా హింస పెట్టడం, చివరికి గిరిజన స్త్రీలను అపహరించడం జరుగుతుందని రచయిత గిరిజన పార్శ్వాలను బయటికి తీసాడు.

## గిరిజన స్త్రీ- అమ్మకపు సరుకా?

ప్రాచీన సాహిత్యం కావచ్చు, ఆధునిక సాహిత్యం కావచ్చు. ఏదో ఒక రచనల్లో రచయితలు స్త్రీ గురించిన చర్చలాంటిది గానీ, స్త్రీని చిత్రించడం గాని జరుగు తుండేది. మన దేశంలోనే కాక ప్రపంచ దేశాల్లో స్త్రీకి ప్రాచీన కాలం నుండి, అంటే సుమారు వేదాల నుండి, పురాణాల నుండి నేటి వరకు స్త్రీ ప్రపంచానికి మూలమన్న విషయం ప్రకృతిలో ప్రతి ఒక్కరికి తెలుసు. జంతువులు, వివిధ పక్షులు కూడా తమ పుట్టుకకు తల్లిదండ్రి కారణ మన్న జ్ఞానం ఉంటుంది. కాని అవి వ్యక్తంచేయలేవు, మనుషులు వ్యక్తం చేస్తారు. వాటికీ, మనిషికి భేదం. మానవుడు మాత్రం అనాది కాలం నుండి స్త్రీ అంటే ఒక రకమైన గౌరవమిస్తూనే వచ్చారు. కొన్ని కాలాల్లో స్త్రీకి ఆదరణ తక్కువైనా, ఏనాడూ విస్మరించబడలేదన్న విషయాన్ని గ్రహించాలి.

'ఎల్లి' నవలలో గిరిజన స్త్రీ ఏ విధంగా ముడిసరుకుగా మారుతుందో, మార్చుతున్నారో రచయిత్రి యిలా వర్ణి స్తుంది. ''మా బతుకులా యేముందమ్మగారూ యేదో పుట్టింటోళ్ళు వోలి పుచ్చుకుని వొకడికి అమ్మేసుకుంటారు. దానికి మనువని పెద్దపేరూ. యికాడిష్టం. మాలో ఆడదా నికి యిష్టమేముంది అమ్మగారూ. ఆడుయెవడికైనా అమ్మితే ఆడెమ్మట యెల్లిపోవాలి. యిష్టమున్నా లేక పోయినా గొడ్డులాగా, మొగుడు దిక్కుమాలిన సచ్చినోడైతే యింకొకణ్ణి మారు మనువు కట్టుకుందామన్నా ఆ మారు మనువోడు దొరకాలి. దొరికినా యీణ్ణి వొదిలి ఆడెమ్మట యెల్లాలంటే యీడిచ్చిన వోలంతా తిరిగి కట్టాలి. ఆ మారుమనువోడు ఆ డబ్బు కట్టలేక పోయాడనుకోండి యీడిదగ్గర పడుండాల్సిందే. మగోడికి యిష్టం లేకపోయిం దనుకోండి ఆడిష్టమొచ్చినోడికి అమ్ముకుంటాడు. ఆడెమ్మట యెల్లాలిసిందే ఆడదానికిష్టమున్నా లేక పోయినా. ఆడదానికిష్టం లేకపోతే మాలో మారుమనువు వున్నమాట నిజమే. యెవుడైనా డబ్బుపెట్టి కొనుక్కు నువోడు యీడికంటె మంచి సచ్చినోడని నమ్మకమేంటి. యేం బతుకులు మాయి''

గిరిజన కులాల్లో స్త్రీ పట్ల ఎటువంటి వ్యవస్థ నడుస్తోంది ఈ వర్ణనను బట్టి అర్థమవుతుంది. స్త్రీ అంటేనే ఒక వస్తువుగా వాడుకుంటున్నారనిపిస్తుంది. భర్తే స్త్రీని ముడి సరుకుగా అమ్ముకుంటున్న తీరుని ఎల్లి నవల ఎత్తి చూపింది. ఇటువంటి వ్యవస్థ ఉన్నంత వరకు గిరిజన స్త్రీకి స్వేచ్ఛ లభించదు. స్త్రీ పుట్టినప్పటినుండి ఒక వస్తువుగానే చెలామణి అవుతుంది. నేడు లంబాడీ కులాల్లో ఎక్కువగా పిల్లలను అమ్ముకుంటున్నారు. దానికి కారణం లంబాడీల ఆర్థిక పరిస్థితి ఒకటైతే, ఆడపిల్లలనే భయం మరొకటి. ఆడపిల్లలు పుడితే కట్నకానుకలు ఎక్కడినుండి తెచ్చేదనే ఆలోచన వల్ల పిల్లలను అమ్మడం ఎక్కువగా జరుగు తుంది. ఎక్కువ శాతం మాత్రం ఆర్థిక ఇబ్బందుల వల్ల అమ్ముతున్నట్లు వివిధ (తండా) గ్రామాలకు వెళ్ళినప్పుడు వివరించారు. స్వయంగా నేను గిరిజన కుటుంబం నుండి వచ్చినవాడ్ని. అందువల్ల కొన్ని విషయాల పై అవగాహన ఏర్పడింది. వరకట్నం దగ్గర నుండి పిల్లలను కనే దశ వరకు అనేక రకాలుగా స్త్రీ హింసించబడుతుంది. అందువల్ల ఆ విధానం పోవాలంటే గిరిజన స్త్రీలకు తక్షణంగా కావల్సిన పరికరం విద్య. దాని ద్వారా అంత తొందరగా నిర్మూలించకపోయినా కొంత వరకు న్యాయం జరుగు తుంది. అప్పుడే ఆర్థికంగా కొంత బలపడడానికి అవకాశం ఉంది.

## ఉపయుక్త గ్రంథాలు :

1. అరుణ. 2001.ఎల్లి. న్యూ సెలబస్ ప్రచురణలు.
2. కత్తి పద్మారావు. దళిత దర్శనం. పుట:237. లోకాయుత ప్రచురణ

3. కేశవ రెడ్డి. 1993. చివరి గుడిసె. హైదరాబాద్: హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
4. దేశ్‌పాండే, వసంత్‌రావ్ . 1988. అడవి. చతుర ప్రచురణలు.
5. నారాయణ రెడ్డి, సి. 1977.ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయాలు - ప్రయోగాలు. హైదరాబాద్
6. రమేష్, జరుపుల. 2018. తెలుగు నవల - గిరిజన జీవిత చిత్రణ. ఆదిత్య ప్రచురణలు:ఖమ్మం.
7. శ్రీశ్రీ. 1950. మహాప్రస్థానం. హైదరాబాద్: విశాలాంజధ పబ్లిషింగ్ హౌస్.
8. సాహు, అల్లం రాజయ్య.1983. కొమురం భీము. జోడెన్‌ఘాట్: ఆదివాసి ప్రచురణలు.
9. హస్నైన్,నదీం.1995. భారతీయ గిరిజనులు.హైదరాబాద్: ఓరియంట్ లాజ్మన్ లిమిటెడ్.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# వేమన ధర్మనిరతి

– డా॥. యమ్.విజయశ్రీ, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, జె.కె.సి. కళాశాల, గుంటూరు.

మానవ జీవన విధానంపై లోకానుభవముతో వ్యాఖ్యానించే శతకాలు నీతి శతకాలు. ఈ నీతి శతకాలలో రాజనీతి, గృహనీతి, లోకరీతి ఉంటుంది. సమాజ హితం కోసం రచించబడినవి ఈ నీతి శతకాలు. నీతి బోధ ప్రధానంగా ఉంటుంది. నీతి అంటే ధర్మబోధనే. ధర్మరక్షణలో నీతి శతకాలు కూడా తమ వంతు పాత్ర వహిస్తాయి. ఏ సాహిత్య ప్రక్రియ అయినా సమాజ హితం కోసమే. శతక సాహిత్యం కూడా సమాజాన్ని సంస్కరించటానికి, సమాజంపై ఆలోచనలు రేకెత్తించటానికి ఉపయోగపడతాయి.

## రచయిత పరిచయం :

తెలుగు ప్రజానీకానికి వేమన ఒక మహా యోగి. మట్టిలో పుట్టి మహోన్నత శిఖరాలు అందుకున్న మానవతామూర్తి. మనుష్యుల మధ్య తిరుగుతూనే మానవ జీవిత సత్యాసత్యాలను నిత్యము అన్వేషించాడు. అన్వేషణలో అందివచ్చిన అనుభవాలను ఆటవెలదుల్లో అలవోకగా లోకానికి అందించిన మహానుభావుడు. వేమన పద్యం ఒక్కటైనా నోటికి రాని తెలుగువాడుండడు అనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. "ఆయన సూక్తి ఆయన అంతర్వ్యక్తికి అద్దం పట్టిన అభివ్యక్తి, ఆయన సాధకుడు, బోధకుడు, ఆయన ద్రష్ట, స్రష్ట, మహాకవి" అని జి.వి. సుబ్రహ్మణ్యం గారు అక్షరాక్షర సత్యంగా అభిభాషించారు.

వేమన పద్యాలను మొట్ట మొదటగా సి.పి.బ్రౌన్ 1829లో అచ్చు వేయించారు. 1839లో బ్రౌన్ 1200 పద్యాలను రెండవసారి ముద్రించారు. పూర్ణయాచారి బందరులో 1919లో 4000 పద్యాలతో వేమన శతకం అచ్చువేయించారు. వేమన పద్యాలు వివిధ బాషలలో అనువదించబడ్డాయి అంటే వేమన పద్యాల గొప్పదనం అర్థం చేసుకోవాలి. వేమన సమాజాభ్యుదయాన్ని ఆకాంక్షించాడు. వేమన జీవితంలోని వివిధ పార్శ్వాలను బాగా పరిశీలించాడు. జీవితంలోని ముఖ్య సంఘటనలని, సమాజంలోని బలహీతనలని చిత్తశుద్ధితో, సాహసంతో వివరించాడు. నిజాయితి, వివేకం, సత్యం, వీటినుంచే సామాజిక చైతన్యం లభిస్తుందని వేమన పద్యాల సారాంశం.

ధర్మానికి తొలిమెట్టు తల్లితండ్రులను గౌరవించటం. తల్లితండ్రుల పట్ల ప్రేమలేని కుమారుడు పుట్టినా, చచ్చినా ఒక్కటేనని ఈ క్రింది పద్యం ద్వారా తెలియచేశారు.

తల్లిదండ్రి మీద దయలేని పుత్రుండు
పుట్టనేమి ? వాడు గిట్టనేమి ?
పుట్టలోని చెదలు పుట్టదా గిట్టదా ?
విశ్వదాభిరామ! వినురవేమ!

అలాగే పశువుల రంగు వేరైనా పాలరంగు ఒక్కటైనట్లు, పుష్పజాతులు వేరైనా, పూజ ఒక్కటైనట్లు....

పసుల వన్నెవేరు పాలెల్లనొక్కటి
పుష్పజాతి వేరు పూజయొకటి
దర్శనంబులారు దైవంబు నొక్కటి
విశ్వదాభిరామ! వినురవేమ!

పూజల కన్నా బుద్ధి, మాట కన్నా మనస్సు, కులము కన్నా గుణము ప్రధానంగా కలిగి ఉండాలని పేర్కొన్నారు.

పూజకన్న నెంచ బుద్ధి నిదానంబు
మాటకన్న నెంచ మనస్సు ధృఢము
కులము కన్న మిగులు గుణము ప్రధానంబు
విశ్వదాభిరామ! వినురవేమ!

వేమన మానవ స్వభావాల్ని, మానసిక ప్రవృత్తుల్ని జీవన విధానాలలోని మంచి చెడులను లోతుగా పరీక్షించి పద్యాల ద్వారా మన మెదడుకు మేతనందించాడు. మనకు తెలిసిన, తెలిసీ తెలియని, తెలియని జీవిత రహస్యాల్ని మరింత తెలియచేశాడు.

పుత్తడి గలవాని పుండు బాధైననూ
వసుధలోన చాల వార్త కెక్కు,
పేదవాని ఇంట పెండ్లయినను యెరుగరు
విశ్వదాభిరామ! వినురవేమ!

అర్థబలం అధికంగా గలవానికి చిన్న పుండైనా పెద్దవార్తలా చెప్పుకుంటారు జనం. పేదవాడి పెండ్లి పెద్ద వార్త కాదు అంటాడు. సమాజంలో అర్థమునకు (డబ్బు) ఉన్న విలువ ఈ చిన్న పద్యంలో తెలియచేశారు.

మేడిపండు చూడ మేలిమై యుండు
పొట్టవిప్పి చూడ పురుగులుండు
పిరికివాని మదిని బింకమీలాగురా
విశ్వదాభిరామ! వినురవేమ!

వేమన సమాజమనే మేడిపండు పొట్ట విచ్చి పురుగుల్ని చూపించాడు. సమాజంలోని అన్యాయాలకు, దుర్మార్గాలకు కారణాలను అన్వేషించాడు. నీతిబద్ధమైన బాధ్యత గల సమజాన్నే వేమన ఆకాంక్షించాడు.

**ముగింపు :**

ఈ విధంగా వేమన తన పద్యాల ద్వారా ప్రశ్నించాడా! సమాధానం ఇచ్చాడా! సమాజాన్ని ఆలోచింపచేశాడా! చైతన్యపరచాడా! అంటే అన్నీ ఒకేసారి కలిగే నూతన అనుభూతికి లోనై తనను తాను ప్రశ్నించుకుంటాడు, సమాధానపరచుకుంటాడు పాఠకుడు. నవసమాజం నిర్మాణానికి తనవంతు కృషి చేసి తరువాత తరాలకు ప్రేరణ కలిగించారు వేమన. జన సామాన్యంలో వేమన మహాకవిగా, ప్రజాకవిగా సుస్థిర స్థానం సంపాదించుకున్నారు.

**ఆధార గ్రంథ సూచిక :**

1) తెలుగుసాహిత్య చరిత్ర - ద్వా.నా.శాస్త్రి.
2) పుష్పాంజలి - బాలల నీతిబోధ.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# బంజారా వంశ చరిత్ర చారిత్రక నేపథ్యం

- డా॥. నెహ్రూ నాయక్

భారతీయ సంస్కృతి అతి ప్రాచీన కాలంనుండి అవిచ్ఛిన్నంగా విరాజిల్లుతూనే ఉంది. భారతదేశంతో పాటు ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలను కలిగిన ప్రసిద్ధమైన సింధూ, ఈజిప్టు, ఇరాన్, మెసపుటోనియా నాగరికతలు నేడు అంతరించినా, భారతీయ సంస్కృతి మాత్రం అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ ఉంది. భారతదేశంలోని అనేక జాతులను, కులాలను, మతాలను, భిన్న ఆచారాలను కలుప గలిగింది ఇన్నత్వంలోని ఏకత్వం. భారతదేశంలో ఇతర దేశాల వలె అదిమ మానవ జాతులు నివసించిన ఆనవాళ్ళు ఉన్నాయి. భారతదేశ సంస్కృతిలో నాగరిక జాతులే కాక వివిధ ఆదిమ తెగల వారూ ఉన్నారూ. ఆదిమ తెగలు నేటికీ తమ ప్రాచీన ఆచారాలను, సంప్రదాయాలను, జీవన విధానాలనూ నాగరిక సమాజంలో భాగంగా ఆచరిస్తూ జీవిస్తున్నారు.

**బంజారాల పుట్టుక-చరిత్ర :**

భారతదేశంలో నివసిస్తున్న అనేక ఆదిమ జాతులలో 'బంజార' ఒక విశిష్టమైన గిరిజన తెగ. భారతదేశంలోని బంజారాలను 'గోర్' లేదా 'గోర్ బంజారా' అని అంటారు. 'గోర్ లేదా గోర్యా' అనే పాలు గవార్ అనే హిందీ పదం నుండి పరినామం చెందినట్లు చరిత్రకారులు, భాషా శాస్త్ర వేత్తలు పేర్కొంటున్నారు. హిందీలో గవార్ అనగా గ్రామ గ్రామాలు తిరిగేవారని అర్థం. గోసంరక్షణ చేసేవారు కావున బంజారాలను గోర్ బంజారాలని పిలుస్తున్నట్లు ఉంది. గోవుల వీపుమీద ఉప్పు, సుగంధ ద్రవ్యాలు ఇతర వస్తువులు రవాణా చేసేవారు కనుక వీరికి 'గోర్ బంజారా' లని పేరు వచ్చినట్లు చరిత్రకారుల అభిప్రాయం.

బంజారా శబ్ద ఆవిర్భావాన్ని గురించి చరిత్రకారులు వివిధ రకాలుగా పేర్కొంటున్నారు. 'వాణిజ్యం' అనే సంస్కృత పదం నుండి 'బనజ్' అనే హిందీ శబ్దం, జనజ్ నుండి బంజారా రూపొందింది. ఒక స్థిరనివాసం లేక వనాలలో సంచరించేవారిని సంస్కృతంలో వనచరులని అంటారు. కాలక్రమేణా 'వనరచర' శబ్దం వంజరగానూ 'విశ్వడాట్ కాం' అనే వెబ్‌సైట్‌లో బంజారాలకు గోర్, లంబానీలనే పేర్లున్నట్లు పేర్కొంటున్నారు. గోర్ అంటే మనిషి అని అర్థం. బంజారాలు ఎడ్లపై సరుకులను రవాణా చేసేవారని, వారిని బంజారాలని పిలవడమంటేనే వారికి ఇష్టమని, బంజారాలను లాంబానీలని కూడా పిలుస్తారని అందులో తెలియజేశారు. చరిత్రకారుల అంచనాల ప్రకారం బంజారాలు స్వాతంత్ర్యం రాక ముందు ఒక సంచారతెగగా జీవిస్తూ ఉండేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత వీరు ఎక్కడివారక్కడ స్థిరనివాసాలేర్పర్చుకొని తమ జీవితాన్ని సాగిస్తున్నారు. బంజారాలు భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో వివిధ నామాలతో పిలువబడుతున్నారు. లంబాడీలను రాజస్థాన్‌లో 'గవారియా' లేదా గమాలియా, ఢిల్లీ హర్యానాలలో సిరికిబాండ్, పంజాబ్‌లో సిరికివాలా, మిగతా రాష్ట్రాలలో బంజారా, బంజర, వనజ, బ్రాంజారి, బ్రజాస్వి మరియు లదనియాలని పిలుస్తారు. కర్నాటకలో లమాన లేదా లంబాని, లేదా లమాణి, మహారాష్ట్రలో కంగసీయా లేదా సింగాడి బంజారా, కేరళలో గహార్ లేదా గౌరియా అని పిలుస్తున్నారు. తెలంగాణ ప్రాంతంలో బంజారాలను లంబాడీ లేదా లంబాడా, కోస్తా మరియు రాయల సీమలలో సుగాలీలనీ పిలుస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన ఓం ప్రకాశ్ కమల్ తన తాతగారైన కీ.శే. మహంత్ భూతానాధ్‌గారి సంస్మరణార్థం 'గోర్ ఆఫ్ ఇండియా' అనే వెబ్‌సైట్ ఆవిష్కరించారు. బంజారాల కొరకు వెబ్‌సైట్‌ను ఆవిష్కరించి మొదటిసారిగా బంజారాల చరిత్రను ప్రపంచానికి తెలియజేసిన ఓం ప్రకాశ్ కమల్ గారు ఎంతైనా అభినందనీయులు. ఆయన తన వెబ్‌సైట్లలో బంజారాలకు వివిధ రాష్ట్రాల్లోగల పేర్లను చక్కగా తెలియజేశారు.

లంబాడీలను భారతదేశమంతా బంజారాలని పిలుస్తు న్నారు.

## చారిత్రక కథనాలు - బంజారాల వ్యాప్తి :

బంజారాలలోని కథాగాయకులను 'ఢాడి బంజారాల లేదా భాట్ బంజారా అని అంటారు. వీరు బంజారాల వంశ చరిత్రను వారి వారసులకు తమదైన శైలిలో కొన్ని ప్రత్యేకమైన సందర్భాల్లో తెలియజేస్తారు. పృధ్వీరాజ్ చౌహాన్ ఆస్థానంలోని ప్రముఖ కవి, సన్నిహితుడయిన చాంద్ బర్ద్వాయ్ లేదా చాంద్‌భాట్ భాట్ బంజారాయేనని చరిత్రకారుల అభిప్రాయం. అయితే ఆధునిక భారతంలో బంజారా విద్యావంతులు తమ రచనల్లో కూడా బంజారా వంశ చరిత్రను పాటల్లో ప్రకటించడం పరిపాటి. భూక్యా బాలాజీ దాసు రాథోడ్ బంజారాల వంశ చరిత్రను పాటల్లో ప్రకటించడం పరిపాటి. పూర్వం బంజారాలు తమ 'తండా' రాజ్యాన్ని స్థాపించినట్లు కూడా చరిత్ర ఉంది. కల్నల్ ఆడ్, రాల్ఫ్ ఫిచ్‌ల ప్రకారం బంజారాలు బెంగాల్‌లోని లక్నౌతి రాజధానిగా తమ రాజ్యాన్ని స్థాపించారని, వారి రాజధాని ఒక వాణిజ్య కేంద్రంగా విలసిల్లిందని తెలుస్తుంది.

బంజారాలు క్రీ.శ. 1630 ప్రాంతంలో షాజహాన్ చక్రవర్తి ఆదేశం మేరకు అసఫ్‌ఖాన్ దక్షిణ భారతదేశంపై దండెత్తినప్పుడు వారి సైన్యానికి భగవాన్‌దాస్ వడతీయా (జాదవ్) మరియు జంగి, భంగి భూక్యా (రాథోడ్) లు సరుకులు అందించి ఒక ఫర్మానాను అందుకున్నట్లు చరిత్ర ఉంది.

## లంబాడీల పర్యాయ నామాలు :

బంజారాలు దాదాపు దేశమంతా వ్యాపించి ఉన్నారు. వీరు వివిధ ప్రాంతాల్లో వివిధ పేర్లతో పిలువబడు తున్నారు. 'లంబాడీ' అనే పదానికి దాదాపు 37 పర్యాయ పదాలున్నాయి. అవి.

1. బంజారా 2. బంజర 3. వనజర 4. బంజారి 5. బంజరి 6. బ్రంజారి 7. బ్రజ్‌వాసి 8. లమాన్ (కర్నాటక) 9. లంబాణి, లమాణి 10. లంబాడా 11. లంబాడీ (ఆంధ్రప్రదేశ్) 12. లభాన్ లేక లబాన 13. లభాన్ 14. లబని 15. లభాన లేక లబాన 16. బళడియా 17. లదనియా 18. సుగాలి (ఆంధ్రప్రదేశ్, తమిళనాడు) 19. గహర్ లేక గౌరియ (కేరళ) 20. గవారియా (రాజస్థాన్) 21. గవారియా లేక గమాలియా (రాజస్థాన్) 22. గవర 23. కంగ్ లేక కంగసియా (మహారాష్ట్ర) 24. గవారా 25. సిరికిబాండ్ (ఢిల్లీ, హర్యాన) 26. సిరికావాలా (పంజాబ్) 27. సింగడి వనజార (మహారాష్ట్ర).

**బంజార :**

లంబాడీలకు బంజార అనే పేరు విస్తృతమైన ప్రచారంలో కన్పిస్తుంది. భారతదేశ మందంతటా బంజార అనే పదమే విన్పిస్తుంది. ఈ పదం పుట్టుకకు, వ్యాపార వాణిజ్యాలే మూలమని భావింపవచ్చు. బంజార శబ్ద ఆవిర్భావాన్ని వివరిస్తూ ఇ.థర్‌స్టన్ వ్యాపారపరమైన వాణిజ్య అనే సంస్కృత వాణిజ్య శబ్దం హిందీలో బనజ్‌గా పరిణామం చెందిందని వివరించారు. ఇంతేగాక స్థిర నివాసం లేక వనంలో చరించేవారిని సంస్కృతంలోఓ వనచరులంటారు. కాలానుగుణంగా వనచరమే క్రమంగా వంజార బంజారాగా పరిణామం పొంది ఉండవచ్చనే అభిప్రాయం కూడా ఉంది. వాణిజ్య శబ్దమే ప్రాంతీయ వ్యవహారిక భాషల్లో మార్పు చెందిందనీ, మరొక అభిప్రాయముంది. బణజార (రాజస్థాన్) వనజార (గుజరాతీ) బనజార (ఉర్దూ) బంజారి (మరాఠి) గా మరినవని భాషా శాస్త్రజ్ఞులు భావించారు.వ్యాపారం చేసి నందు వల్లనే లంబాడీలు బంజారాలుగా పిలువబడి నారని భావింపవచ్చు. సంస్కృతంలో వాణిజ్య అంటే వ్యాపారం, హిందిలో వాణిజ్య అంటే వ్యాపారం వనజార్ అంటే ఎడ్ల మీద ధాన్యాలను ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి తీసుకెళ్ళి అమ్మే వర్తకుడు అనే అర్థాలున్నాయి. అందుకే లంబాడీలను బనజార్‌లని పిలిచేవారనీ, బనజార్ పదమే వ్యవహారంలో బంజారాగా మారిందని నిర్ధారించ వచ్చు. బణ అంటే గుంపు లంబాడీలు గుంపులుగా నివసిస్తుండడం వల్ల, వీరిని బణచరులు అని పిలిచి ఉండవచ్చు. వ్యవహారంలో బణచరులే బణజారులుగా మారి ఉండవచ్చు. వనంలో చరించడం వల్ల, నివసించి

నందువల్ల వనచరులనే పేరుతో పిలువబడినారనే అంశానికి ఉదాహరణంగా లంబాడీలు ఒక కథను చెప్పుతుంటారు.

**లంబాడి :**

బంజారాలను ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రలో లంబాడి, లమాణి, లంబాడీ, లఖానా, లాభాని మొదలైన పేర్లతో పిలుస్తుంటారు. ఈ శబ్దాలకు 'లవణ' అనే సంస్కృత పదమే మూలంగా కనిపిస్తుంది. లంబాడి శబ్దోత్పత్తిని వివరిస్తూ, సయ్యద్ సిరాజుల్ హసన్ 'లంబా' పొడవు అనే పదం నుండి ఏర్పడి ఉంటుందని తెలిపారు. ఈ తెగవారు ఉప్పు మోయడం వల్ల లవణ అనే సంస్కృత శబ్దం నుండి లభాని, లంబాడీ పదాలు రూపొందాయని ఆ.థర్‌స్టన్ పేర్కొన్నారు. ప్రాచీన కాలంలో లంబాడీలు ఉత్తర భారతదేశం నుండే దక్షిణ భారతదేశానికి ఎడ్లపై ఉప్పు సంచులను వేసుకొని సరఫరా చేసేవారు. నేటికీ లంబాడీలు ఉప్పుసంచులను ఎడ్లబండ్లపై వేసుకొని, తెలుగు రాష్ట్రాల్లో వివిధ ప్రాంతాల్లో ఉప్పును విక్రయిస్తు న్నారు. అందువల్ల లవణం నుండి లంబాడీ పదం పరిణామం చెందవచ్చునని భావింపవచ్చు. ఉప్పును లంబాడీలు 'నున్' అని అంటారు. ఈ నున్ ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి చేరవేయడానికి బాడా అని అంటారు. వ్యవహారంలో వర్గ పంచమాక్షరం అను స్వారంగా మారడం సహజం. నున్+బాడా=నుంబాడా, నుంబాడాన కాగలమనంలో నంబాడాగా ఏర్పడి ఉం టుంది. భాషా శాస్త్ర రీత్య న-లగా మారుతుంది. తెనుగు నుండి తెలుగుగా రూపొందినట్లుగా నంబాడా నుండి లంబాడాగా... లంబాడీగా పరిణామం చెందినదని నిర్ధారించవచ్చు.

**బళదియా :**

లంబాడీలను ఉత్తర భారతదేశంలో బళదియా అనే పేరుత కూడా పిలుస్తారు. బళద్ అంటే లంబాడీ భాషలోనూ, హిందిలోనూ ఎద్దు అని అర్థం ఉంది. పూర్వం లంబాడీల జీవనాధారం ఎద్దులే వీటిని వారు వేల కొలదిగా పెంచేవారు. మహ్మదీయ సేనలతో వచ్చిన లంబాడీల జంగినాయకుని దగ్గర 1,80,000 భంగి నాయకునికి 52 వేల ఎద్దులున్నాయన కంబర్ లేజిసా హ్యాబరు చెప్పియున్నారు. ఇంతేగాక ఆంధ్రప్రదేశ్‌లోని ఇరవై రెండు మంది నాయకులకు నాయకుడైన అజ్మీర నందానాయక్‌కు ఇరవై రెండు వేల ఎడ్లు ఉండేవని ఎనభై ఏండ్లు వయస్సు గల అజ్మీర మంగూనాయక్ గారు తెలిపారు. నేటికీ కూడా కరీంనగర్ జిల్లా మహాముత్తారం మండలంలో కొన్ని తండాల నాయకులకు వేల సంఖ్యలో పశువులున్నాయి. కాబట్టి 'బళద్' ఎద్దు అనే శబ్దం నుండి బళదియా (ఎద్దులున్నవారు) అనే పదం రూపొందిందని నిర్ధారింపవచ్చు.

**లదనియా :**

సంచా జీవులైన లంబాడీలు ఎద్దులపై నిత్యావసర సరుకులను రవాణా చేస్తుండేవారు. హిందీలో లదియా అంటే బరువులు తేవడానికి ఉపయోగించే ఎడ్ల బండి అనే అర్థం ఉంది. కాబట్టి లంబాడీలను లదనియా, లదేనియా అని పిలుస్తుంటారు.

**సుగాలి :**

ఆంధ్రప్రదేశ్ నందలి రాయల సీమ ప్రాంతంలోనూ, మద్రాసులోనూ, కేరళలోనూ లంబాడీలను సుగాలి, సుకాలి అని పిలుస్తుంటారు. లంబాడీలు మొదటి నుండి మేలుజాతి ఆవులను పెంచి పోషించడంలో పేరు పొందిన వారు. హిందీ, లంబాడీ భాషలో 'ఘాయ్' అంటే ఆవులని అర్థం. సు+గాయ్, అంటే మేలుజాతి ఆవులు. ఈ ఆవులను పెంచేవారు సుగాలి, సుకాలి అనే పేర్లతో పిలువబడి ఉండవచ్చు. అంతేగాక సుపారి అంటే వక్క అని అర్థం. సుపారి పదం నుండి సుగాలిగా మారి ఉంటుందని మాగంటి బాపినీడు 'ఆంధ్ర సర్వస్వం'లో పేర్కొన్నారు. సుగాలికి, సుగాయ్ పదానికి మధ్య ఉన్నంత సామ్యం సుపారి పదానికి కన్పించడం లేదు. అందువల్ల సుగాయ్ పదమే సుగాలిగా మారిందని భావింపవచ్చు.

## గహర్ లేక గౌరియ :

బంజారాలను గహార్, గౌరియా, గవారియా,

గమాళియా మొదలైన పేర్లతో కేరల, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాలలో పిలుస్తున్నారు. అరబ్ స్థాన్‌లో రాజశాసనం తయారు చేసే వారికి 'గోరె' అనే పేరుంది. అంతేగాక గోరె అంటే సుందరమైన గౌరవర్ణం గల (స్త్రీ'గమాల్) అంటే రూపలావణ్యవతి అనే అర్థాలు నిఘంటువులు చూపు తున్నాయి. లంబాడీ స్త్రీలు తెల్లగా, అందంగా ఉండటం వల్ల గోరి, గౌరియానా పదాలు వారికి సార్థకం అని అనుకోవచ్చు. గోరి, గమాల్ అనే పదాలే వ్యవహారంలో గహర్, గౌరియాగా పరిణామం చెందాయని ఊహింప వచ్చు. ఇంతేగాక లంబాడీలు ఉల్లేఖించిన ఒక కథలో లంబాడీలు పూర్వం దేమా గురువు సహాయంతో జాజు వ్యాపారం చేసారు కాబట్టి, గౌరియా, గోర్ పదాలు ఏర్పడ్డాయని భావింపవచ్చు.

### కాంగ్ లేదా కంగ్‌సియా :

మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాలలో లంబాడీలను కంగ్, కంగ్‌సియా అనే పేర్లతో పిలవడం కన్పిస్తుంది. పంజాబీ, హిందీలోనూ కంఘి అంటే దువ్వెన అని అర్థం. వీరు దువ్వెనలతో వ్యాపారం చేయడం వల్ల వీరికి కంగిసియా అనే పేరు వచ్చి ఉంటుందని ఊహించవచ్చు.

### సిరికిబాండ్, సిరికివాలా :

ఢిల్లీ, పంజాబ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్ మొదలైన రాష్ట్రాలలో లంబాడీలను సిరికిబాండ్, సిరికివాలా అనే పేర్లతో పిలుస్తున్నారు. సిరికి అంటే ఒక రకపు గడ్డితో చాపలు, పగ్గాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాబట్టి వృత్తిని బట్టి బంజారాలను సిరికిబాండ్, సిరికివాలా అని పిలిచి ఉండవచ్చని నిర్ధారించవచ్చు.

### సింగాడియా :

మహారాష్ట్రలోనూ తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా గాంధారి మొదలైన ప్రాంతాలలోను మధుర లంబాడీలు కన్పిస్తున్నారు. లంబాడీ భాషలో 'సింగ్' అంటే కొమ్ము అని అర్థం. మధురా లంబాడీ స్త్రీలు చిన్న కర్రముక్కను తలపై నిలువుగా పెట్టి దానికి వెంట్రుకలను చుట్టి కడతారు. ఇందువల్ల వీరికి సింగాడియా అనే పేరువచ్చి ఉంటుందని ఊహింపవచ్చు. అంతేగాక వీరు సింగ్ (కొమ్ము)తో వివిధ రకాల వస్తువులను తయారుచేసి అమ్మడం వల్ల లంబాడీలను సింగాడియా అని పిలిచి ఉంటారని ఊహించవచ్చు. లంబాడీలు తమ జీవనోపాధి కొరకై వివిధ వృత్తులను చేపట్టారు. ఆయా వృత్తుల ఆధారంగా ఆయా పేర్లు వారికి సంక్రమించాయని విధిత మవుతుంది. జంగి, భంగిల సేవలకు మెచ్చిన అసఫ్‌ఖాన్ వారికిచ్చిన ఫర్మానా ఇలా ఉంది.

రంజన్ కాపాని, ఛప్పర్‌కా ఘాస్ దిన్ కే తీన్ ఖూన్ మాఫ్!
జహా అసఫ్‌ఝా కే ఘేడే, వహా జంగీ భంగీకే బైల్ ఖడే!!

విజయనగర సామ్రాజ్య అంతంనాటికి అనగా క్రీ.శ.1565 లో బంజారాలు దక్షిణ భారతదేశంలో సంచార జీవనం గడుపుతున్నారని తెలుస్తూ ఉంది. ఆర్ఎస్ వెల్ తన 'ఏ ఫర్‌గొట్టన్ ఎంపైర్' (విజయనగర్) (1900) లో విజయ నగర సామ్రాజ్యాన్ని తరుష్క సైన్యాలు కైవసం చేసుకున్న సందర్భంలో జరిగిన లూటీల్లో అడవుల్లో నివసించే బంజారాలు కూడా పాల్గొన్నట్లు పేర్కొన్నదాన్ని బట్టి ఈ విషయం మనకు తెలుస్తుంది. కాలక్రమేణా బంజారా బిడారులు (లదణి) ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపిం చాయి. భారతదేశ స్వాతంత్ర్యానంతరం దేశంలో వచ్చిన పాలనాపరమైన మార్పుల వల్ల తండాలుగా స్థిర నివాసం ఏర్పరచుకొని కాలానుగుణంగా వ్యవసాయ ప్రధాన వృత్తిగా జీవిస్తు తమ సంస్కృతి, సాంప్రదాయాలను, వేష భాష లను మర్చిపోకుండా ఇప్పటికీ కాపాడుకుంటూ వస్తున్నా రని చెప్పవచ్చు.

### ఆధార గ్రంథాలు :

1. తెలుగుజానపద గేయ సాహిత్యం - రామరాజు.
2. తెలుగు లంబాడీల గేయ సాహిత్యం - జనపాల శంకరయ్య.
3. భారతదేశ చరిత్ర సంస్క ృతి - డా॥ ఎ.బొబ్బిలి.

4. బంజారా చరిత్రలో సంస్కృతి ప్రగతి - చినియా నాయక్.
5. సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు - ఎం.జి.నాయక్.
6. కర్నాటక లంబాణి గళు ఒందు సంస్కృతి అధ్యయనం - ఖండోబా.
7. నవీన బంజారా సాంఘిక సంకీర్తనలు - భూక్య బాలాజీదాసు.
8. బంజారా సాహిత్యం-జీవన చిత్రణ - సూర్యధనంజయ్.
9. బంజారా గేయ సాహిత్యం-తెలుగు ప్రభావం - నెహ్రూనాయక్.
10. లంబాడీల ఆచార వ్యవహారాలు - జనపాల శంకరయ్య.
11. భారతదేశం-గిరిజన సముదాయాలు - మజుందార్.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# విమర్శ ఎందుకు ?

- డా॥. పి.ఎ. సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం.

అవును విమర్శ జీవితంలోనైనా సాహిత్యంలో నైనా ఎందుకు అవసరం అవుతుంది అంటే సమతూకాన్ని సామరస్యాన్ని సాధించడానికి అని అర్థమవుతుంది. అసలు విమర్శ ఎవరు చేస్తారు ఎందుకు చేస్తారు ఎవరి సామరస్యం కోసం ఎవరి సమతూకం కోసం అన్న ప్రశ్నలు ఎదురవుతాయి అంటే విమర్శ అంటే నిబంధనలు అని అర్థం అవుతుంది క్రమ పరచటం అని అర్థమవుతుంది. క్రమరాహిత్యాన్ని క్రమ పరచటంలో విమర్శ పెత్తందారిగా వ్యవహరిస్తుంది అంటే క్రమం తప్పనివ్వకుండ చేస్తుంది. కాబట్టి క్రమరాహిత్యం నుంచి క్రమంలోకి నడిపిస్తుంది అంటే కఱ్ఱపెత్తనం చేస్తుందన్నమాట. ముందే విమర్శకుడు కొన్ని ప్రమాణాలను సిద్ధం చేసుకుని వాటికి సరిపడే రచనలకు ఎక్కువ విలువకడతాడు అన్నమాట. తమ కొలతలకు సరిపడని రచనల్ని న్యూనత పరుస్తాడు అన్నమాట అసలు ఈ నిబంధనలు విమర్శకుడు ఎక్కడినుంచి తీసుకొస్తాడు అంటే సామాజికంగా సాంస్కృతికంగా గొప్పగా చలామణిలో ఉన్న రచనల నుండి లక్షణాలను రూపొందించుకున్నాడు అన్నమాట. అవే లక్షణాలకు చర్విత చర్వణంగా తరువాత రచనలు లోబడి ఉండాలని నిబంధన అన్నమాట ముందే సిద్ధం చేసుకున్న కొలతలకు అనుగుణంగా లేని రచనలను విస్మృత పరచడంలో కీలకపాత్ర వహిస్తాడు అన్నమాట.

సాహిత్యాన్ని స్థూలంగా వస్తు రూపాలుగా మిగడిస్తాం. ఆధునిక సాహిత్య పరిభాషలో చెప్తేరూపాన్ని అభివ్యక్తి అంటాం శైలి శిల్పం పాకం వగైరా అభివ్యక్తి పరిధిలోకి వస్తాయి అన్నమాట వస్తువు సమాజం నుంచి కవి ఎంపిక చేసుకుని తన ఇష్టానుసారం ఏదో ప్రయోజనార్థం లేదా తన కుతూహలం కొద్దీ తనదైన శైలిలో దానికి రూపురేఖలు ఇచ్చి సృజనగా ఆవిష్కరిస్తాడు అయితే అది సిద్ధాంతీకరించబడి ఆయా ప్రమాణాలకు ప్రాతిపదిక అవుతుంది. ఈ ప్రమాణాలను ఆధారంగా చేసుకుని పారంపర్యంగా వచ్చే రచనలు ఉండాలన్నమాట.

అయితే నిబంధనలకు అనుగుణంగా ఉన్న రచనలకు కూడా విస్మృత అవస్థలు పడక తప్పదనటానికి మనకు అనేక దృష్టాంతాలు కనిపిస్తాయి విమర్శకుడికి నచ్చకపోతే ప్రమాణాలకు లోబడి ఉన్నా సరే వాటిని చర్విత చర్వణం మూస పద్ధతిలో ఉన్నాయి అనుకరణ ప్రాయాలని సృజన సాహిత్యాలను కొట్టిపారేయడం జరుగుతుంది. ఇదంతా విమర్శకుడి కనుసన్నల్లోనే ఉంటుందన్నమాట విమర్శకుడికి నచ్చకపోతే చెడ్డది విమర్శకుడికి నచ్చితే మంచిది అని ఆ రచనకు ముద్రలు ఆపాదించబడతాయి అన్నమాట. మొత్తం మీద విమర్శకుడి వల్లనే సృజన దానితాలూకా వస్తువు అభివ్యక్తులూ నిర్ణయం అవుతాయి అన్నమాట. అయితే కవిని అతని సృజనను సృజనతాలూకు అభివ్యక్తిని నిర్దేశం చేయటానికి విమర్శకుడు ఎక్కడి నుంచి ఊడి పడతాడు? విమర్శకుడు కవిని శాసించే స్థాయిలో కవి కంటే ఉన్నతమైన స్థానంలో కూర్చుని కవికి ఎలా మార్గదర్శనం చేయగలుగుతున్నాడు ఒక కవిని మహాకవి; మరొక కవి కుకవి అని ఎలా జమకట్టి గలుగుతున్నాడు అసలు విమర్శకుడు తీర్పరి ఎలా అవుతాడు అన్నవి మన ముందున్న ప్రశ్నలు. విమర్శకుడిగా అభీష్టం కొలది క్రమం తప్పిన అంటే తాను నిర్దేశించుకున్న ప్రమాణాలకు లోబడి ఉన్న రచనలను కూడా ప్రతిభావంతమైనవిగా తన వాదన బలంతో సిద్ధాంతీకరిస్తాడు. అంటే మూస పద్ధతి పక్కనపెట్టి కొత్త దారులు కనిపెట్టాడు అని కూడా ఆకాశానికి ఎత్తి గలుగుతాడు. సాహిత్య చరిత్ర అధ్యయనంలో మనకు కుకవి నింద మొదలు; యుగాలు, యుగకర్తలు లాంటి తమ ప్రత్యేకతను నిలబెట్టే మార్గాలు తెలియజేసి పడికట్టు మాటలు అడుగడుగునా కనిపిస్తాయి. విమర్శకుడు కఱ్ర

పెత్తనంతో సాహిత్య వస్తువు దాని అభివ్యక్తిని దానిని నిర్మించే కవిని ఉపేక్ష కు గురి చేయడం లేదా ఆకాశానికి ధ్రువతారగా నిలపటం చేయగలుగుతున్నాడు అంటే మరి ఎక్కడ నుంచి వచ్చింది విమర్శకుడుకే శక్తి. తన కనపడని శాసనకర్త ఎలా కాగలిగాడు అన్నది ప్రశ్న విమర్శకుడి చేతిలోకి ఈ కర్ర పెత్తనం రావటానికి సాంస్కృతిక ప్రాతి పదికలు కారణం అవుతాయి. అంటే ఒక సమాజం తాలూకు ఒక శ్రేణిని వర్గాలన్నీ బలమైన శ్రేణి అనుకరించే నేపథ్యంలో ఈ సాంస్కృతిక ప్రాతిపదిక సిద్ధం చేయబడు తుంది అనుకరణ ఆర్థిక మూలాలను అనుసరించి ఉం టుంది మొత్తంమీద ఆర్థికంగా బలమైన వర్గాలను వారి సంస్కృతిని కి అభిముఖంగా ఉన్న ప్రసన్న మాత్రంగా ఉన్న వాళ్ళ చేతుల్లోకి ఈ కర్ర పెత్తనం సమకూరుతుంది అన్నమాట అప్పటి నుంచి ఈ కర్ర పెత్తనానికి అనుకూలం గానే సాహిత్య వస్తువు ఎంపిక, దాని అభివ్యక్తి ఎంపిక అసలు సాహిత్యాన్ని సృజించే కర్తల ఎంపిక జరుగుతూ వస్తుందన్నమాట. అంటే రాజు మెచ్చించి రంభ అన్నట్టు అందాల పోటీలు కమిటీ నిర్దేశించే కొలతలకులోబడి అందం ఉన్నట్టు కొలతలను అతిక్రమించిన ది అసలు అందమే కానట్టుగా ఈ ఎంపికలు జరుగుతాయి అన్న మాట.

సాహిత్యవస్తువు దాని అభివ్యక్తిని, దార్శనికతను నిర్దేశించే నిర్ధారించే పనిముట్టు చేజిక్కించుకున్న విమర్శ కుడు ఒక సమాజం తాలూకు వర్గాల సొత్తు కాదన్నమాట అంటే ఒకటి రెండు వర్గాలు సృష్టించిన సాహిత్యం దాని తాలూకు వస్తువు అభివ్యక్తి, ఉపేక్షించే పడతాయ్ అన్నమాట. మరి ఇలాంటి స్థితిని అధిగమించి ఉనికిని చాటుకునే పరిస్థితి అన్ని వర్గాలకు ఎలా వంటపడుతుంది అన్న ఆలోచన నుంచి ఘర్షణ మొదలవుతుంది ఘర్షణకు దారితీసే కొత్త సిద్ధాంతాలు ప్రాతిపదికగా కొత్త రచనలు ఆ రచనలలో వస్తువు అభివ్యక్తులు సమాజానికి సమకూరుతాయి అన్నమాట.

ఈ నేపథ్యంలో భిన్న సిద్ధాంతాలు కు అనుగుణంగా విభిన్న అభిరుచులు గల పాఠకులు తయారవుతారు. ఏ గూటి పిట్ట ఆగూటికి చేరినట్టు ఆయా సిద్ధాంతాలను కు ఆకర్షితులైన ఆయా శ్రేణులు ఆయా వర్గాలుగా విభజించ బడతాయి అన్నమాట ఆయా వర్గాల సిద్ధాం తాలు సమాంతరంగా సాహిత్యంగా ప్రవహిస్తాయి ఆయా సాహిత్య సిద్ధాంతాలకు అనుగుణంగా వాటి వస్తూ రూపాలను విలువ కట్టే విమర్శకులు పుట్టుకొస్తారు అన్నమాట. ఒక్కోసారి ఒక వస్తువుకు నిబద్ధుడైన విమర్శకుడు మరో వస్తువు చెడ్డదిగా తీర్మానించడం కూడా జరుగుతుంది అదే వస్తువును మరో విమర్శకుడు చాలా గొప్పదిగా కీర్తంచడం కూడా జరుగుతున్నది. ఈ విలువల సంక్లిష్ట తూకంలో ఉనికి కోసం ఆయా రచనలు అనుక్షణం తలపడతాయి. కవి లోకంలో తను చూసిన విషయాలను తనదైన వ్యాఖ్యానాలతో సిద్ధాంతీకరించాలనుకున్నప్పుడు ఆ సిద్ధాంతాలను వస్తువుగా చేసుకొని తనదైన శైలిలో వినూత్న అభివ్యక్తితో సాహిత్యీకరించాలి అనుకున్నప్పుడు ఆ సాహిత్యం ఎవరినైతే లక్ష్యంగా చేసుకున్నదో వారికి చేరాలనుకున్నప్పుడు విమర్శకుడి అవసరం రావచ్చు ఎందుకంటే పాఠకుడు చేరుకోలేకపోయే అంశాలను ఒలిచి పెట్టినట్టుగా పాఠకుడి ముందు పెట్టడంలో విమర్శకుడి పాత్ర కాదనలేనిది. అంటే కావ్య వస్తువు కవి ఆశించిన ప్రభావాన్ని పరిణామాన్ని సమాజంలోకి తీసుకురావటం లోనూ కవికి తన కావ్యానికి ఆదరణ నిమిత్తం పాఠకుడు విమర్శకుడు అవసరమవుతారు. కవుల్ని తెరవెనుక శాసనకర్తలు అనడం పరిపాటి అంటే సమాజం రుగ్మతల్ని సరిచేయటానికి అవసరమైన మార్పులు చేర్పులు చేయడానికి క్రాంత దర్శిగా కవి కొన్ని నివారణోపాయాలు కనిపెడతాడు వాటిని సాహిత్యంగా పాఠకుల ముందుకు తీసుకువస్తాడు. వాటి మీద చర్చ జరిగి వాటిని సమాజం ఆకళింపు చేసుకోవటానికి అనువర్తింపచేసుకోవటానికి వీలు కలిగించే వాతావరణం విమర్శకుడు ఇవ్వాల్సి ఉంటుంది.

ఈ నేపథ్యంలో కవి లోక శ్రేయస్సునుద్దేశించి తన ఆలోచనల్ని సమాజంలోకి చొచ్చుకుపోయేలా చేయటానికి విమర్శకుడు, మాధ్యమాలు శక్తిమంతమైన మాధ్యమంగా

ఉపయోగపడతాయి. కాబట్టి కవి నిలబడతాడు కాబట్టి కవి తన సైద్ధాంతిక ప్రచారం కోసం విమర్శకుల్ని పాఠకుల్ని తయారు చేసుకోవాల్సి ఉంటుంది. అంటే కవి తన సిద్ధాంతాలకు ఆకర్షితులైన విమర్శకుల్ని తయారు చేసుకుని ఒక ధోరణిగా తన సిద్ధాంతాన్ని నిలబెట్టు కోవలసిన నేపథ్యంలో విమర్శకుడి గొంతు చాలా అవసరం అవుంతుంది అంటే లోక శ్రేయస్సు కోసం కవి విమర్శ కుడు కలిసి పాఠకుల్ని మెలుకువ పరుస్తారు అన్నమాట. అంటే కవి వర్గానికి చెందిన పాఠకుల్ని కవి సిద్ధాంతం చేరుకోవానికి విమర్శకుడు అతిపెద్ద మాధ్యమం అన్నమాట. కవి సిద్ధాంతానికి వ్యతిరేకమైన ప్రత్యామ్నాయ సిద్ధాంతాలను ఎండగట్టడానికి కవికి విమర్శకుడి గొంతు బలమైన ఆయుధంగా పనిచేస్తుంది కాబట్టి ప్రగతిశీల మార్పు కోసం కవి అభీష్టాన్ని విమర్శకుడు నెరవేరుస్తాడు అన్నమాట.

విమర్శకుడు తన విమర్శ ద్వారా చాపకింద నీరులాగా అంతర్లీన భావజాల వాహికగా బలమైన పాత్ర పోషిస్తాడు. కవిని సాహిత్య వస్తువు అభివ్యక్తిని మాత్రమే కాకుండా పాఠకుల అభిరుచుల్ని కూడా ప్రభావితం చేయగలుగు తాడు కవులు శాసనకర్తలు అని అంటారు కానీ విమర్శ కుడు కనపడని శాసనకర్త. ఎందుకంటే కవి; వస్తువును అభివ్యక్తిని పాఠకుల అభిరుచి మార్చగలిగే వాడు కాబట్టి పలానాది మంచిది మంచిదికాదు అని అది అందమైనది మరొకకటి అందవిహీనమైది అని పదే పదే నినాదం ప్రాయంగా చెప్పటం వల్ల అది సమాజంలో అంతర్లీనంగా ఆచారంగా అవుతంది భావజాలం అంతర్లీనంగా కనపడని శాసనంగా తయారు కావడం మనం సంప్రదాయం అన వచ్చు సంప్రదాయాన్ని అతిక్రమిస్తే చట్టాన్ని అతిక్రమించి నట్టు కాదు కానీ సంప్రదాయం చట్టం కంటే బలంగా పనిచేస్తుంది అనటానికి మనకు చాలా ఉదాహరణలు లభిస్తాయి. ఏదిఏమైనా మనిషి తన అభిరుచుల్ని తన నడతను, ప్రేరకాలను, ఎంపికను, ప్రభావితం చేసేది బలమైన భావజాలం మాత్రమే. అందుకే ప్రాచీన కాలం నుంచి ప్రస్తుతం దాకా ప్రజలు ఇన్ని తేడాలు ఇన్ని వైవిద్యాలు, ఇంతకు ముందు గొప్పగా ఉన్నది ఇప్పుడు ఉదా సీనంగా అనిపిస్తున్నది ఇంతకు ముందు న్యూనతగా చూడబడింది ఇప్పుడు ప్రతిష్టాత్మకంగా ఉన్నది దీనికంత టికి కారణం భావజాలమే. ఈ భావజాలాన్ని మార్చేది ప్రభావితం చేసే బలమైన శక్తి విమర్శకుడు. తను బలమైన శక్తిగా అంటే తెలివైన వ్యక్తిగా తనకుతాను ఆపాదించుకుని; జనం చేత నమ్మించబడుతూ ఉం టాడు. తన సిద్ధాంతాలకు అనుగుణంగా లేని వాటిని తుంగలోకి తొక్కి, అనుగుణంగా ఉన్న వాటిని అందలం ఎక్కిస్తాడు.

విమర్శకుడు సృజన చేయకపోయినా సృజనకు రిమోట్ కంట్రోల్ గా వ్యవహరిస్తాడు ఆ విధంగా తన సిద్ధాంతాలకు తన అభీష్టాలను అనుగుణమైన భావ జాలాన్ని సమాజంలోకి వేళ్ళూనుకునేలాగా చేస్తాడు. తన అభీష్టాలకు అనుగుణమైన భావజాలమే చట్టంగా సంప్ర దాయంగా సమకాలీన సమాజాన్ని ప్రభావితం చేయలుగు తుంది. ఇదంతా విమర్శకుడు తన విమర్శ ద్వారానే దానిని అంతర్లీన భావజాలంగా జనాల్లోకి చొప్పించటం ద్వారా సాధ్యం అవుతున్నది. అందుకే విమర్శను శాసనంగా మనం సంభావించవచ్చు అందుకే సమాంతర విమర్శలు ప్రతి విమర్శలు రావడం జాతికి శ్రేయస్కరం. లేకపోతే జాతి తప్పుదోవ పడుతోంది. అరిష్టం సంప్రాప్తి స్తుంది. ప్రగతి నిరోధక శక్తులు విలయతాండవం చేసే అవకాశం ఉంటుంది. అందుకే మేధావులు మౌనంగా ఉండడం శత్రువు కన్నా ప్రమాదకరం అని అంటారు. అందుకని విమర్శ సమాంతర విమర్శ ప్రతి విమర్శ సృజనకు సమాజానికి అత్యంత ఆవశ్యకాలు శిరోధా ర్యాలు.

## ఆధార గ్రంథాలు :

1) సంజీవ్‌దేవ్ వ్యాసాలు 1 - సంజీవ్‌దేవ్
2) సి.ఆర్.రెడ్డి పీఠికలు - భాస్కర్ చౌదరి

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# కుమారస్వామి కవిత్వంలో మానవతా మహోదయం

- డా॥. పి. విజయకుమార్, సహాయ ఆచార్యులు (తెలుగు), ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

కరుణశ్రీ గారి పుష్పవిలాపం విన్నాం. 'పువ్వులు నవ్వుతున్నాయి' అంటూ కుమారస్వామినాయుడు అక్షర సుమాలను సాహితీ క్షేత్రంలో కవితాధారగా మనకందించారు. సమాజవేదనల కొలిమిలో నా హృదయం కాగికాగి కరిగి కరిగి ద్రవంగా మారిపోయింది. నా హృదయం జాజి పువ్వు కాదు, గాజు ముక్కా కాదు అది ఒక ఉక్కుపెట్టె అంటాడు. నా హృదయంలో అనుక్షణం రుద్ర చైతన్య భానుడు ప్రతిబింబించి ప్రతిభకు ప్రగతి కాంతిపథం చూపిస్తుంటాడు అన్న కవి హృదయంలో మానవతావాద ప్రగతిబీజాలు నాటుకొని ఉన్నాయి అన్న అభ్యుదయ భావన కన్పిస్తుంది.

ఊహావాహనంలో ఊపరితలంలో విహరిస్తే అక్కడి నుండి అంతరిక్షయానం హాయిగా కనువిందుగా ఉంది కాని, అక్కడి నుండి ఇలా తలాన్ని ఆలోచనాలోచనాలు తెరసి వీక్షిస్తే ఎన్నో భయానక దృశ్యాలు అడుగడుగునా శోకాలు, చెప్పలేని ఎన్నో విషమ విషయాలు, విందులు చేసుకొనే కాక ఘూకాలు కన్పిస్తున్నాయనడంలో సమాజంలో జరుగుతున్న ఘోరాలు, వాటి ఆర్తనాదాలు, ప్రస్తుత స్థితిగతులను ఆలోచనల లోచనాలతో మనకు ఈ లోకాన్ని తనదైన బాణీలో చూపిస్తున్నారు. భజన చేతిలో సృజన ఓడిపోయిన చిహ్నాలను, చైతన్యాన్ని నిలువచేసిన మనోనేత్రాలను గమనించాడు. నల్లకోటుల కోటల్లో వసిస్తూ హసిస్తున్న అన్యాయాల, తెల్లకోటుల కోటల్లో నల్లసిరుల దరహాసాలు, అధికారం ముసుగులో అవినీతి చేసే వింత వింత విన్యాసాలు కనిపిస్తున్నాయంటాడు.

ప్రగతికి వేసిన నిచ్చెన / పుచ్చిపోయింది
త్యాగంతో వెలిగించిన దీపం / కొడిగట్టిపోయింది
రాచబాటల్లో కాల / విషనాగులు బుసకొడుతున్నాయి
అంకురించిన ఆశాలత / మారాకు వేయకనే /
మాడిపోయింది

రాజకీయ కురుక్షేత్రంలో కౌరవులే గెలుస్తున్నారని, గెలిచి ధర్మాన్ని గేలిచేస్తున్నారని, శాంతిస్వరూపాన్ని రూపుమాపేస్తున్నారని, దుశ్శాసనులు న్యాయానుశాసనాన్ని అనృతం చేస్తున్నారని, సత్యస్వర్గాన్ని పాతాళంలో పాతేస్తున్నారని, ఇవన్నీ చూసి తన కలం కొదమసింగంలా గర్జిస్తుంది అంటాడు. సమాజపు విషవలయంలోని దారుణ పరిస్థితులను గూర్చి తీవ్ర ఆవేదన ప్రతి పల్కులో ప్రతిధ్వనిస్తుంది.

ఎంత పెద్ద దివ్వె వెలిగించినా
వెనుకబడిన వానింటికి
వెలుగు వెళ్ళడం లేదు
తూర్పు కొండల్లో
ఉదయించే సూర్యుడు
మార్పు తెస్తాడని
కొండంత ఆశ పెట్టుకొంటే
పొలిమేరల్లో పొంచి ఉన్నారు
అవినీతి రాహుకేతువులు

సమాజంలో 'అవినీతి' అనే రాహుకేతువులు ఏ విధంగా తిష్ఠవేశారో తెలుస్తూనే ఉంది. అందుకే చీకటికి చిరునామా లేకుండా చేయాలనే ప్రయత్నంలో భాగంగా రాహుకేతు పీడారహిత రవిని రాత్రుల్లో గూడా డ్యూటీ చెయ్యమని శాసిస్తున్నాడు రచయిత. ఈ భావుకత బట్టి అవినీతి 'అనకొండ'ను రూపుమాపాలని రచయిత ఎంత ఆవేదన హృదయంలో గూడు కట్టుకొన్నాడో వ్యక్తమవుతుంది.

కష్టజీవుల కష్టమే కవికి కవితావస్తువు కావాలి. పూలదండలు కోరేది కవి గుండెకాదు. కన్నీటికి కరిగేది విషాదాన్ని తుడిచేది మాత్రమే కవి గుండె అంటాడు. వ్యధాతాపార్థుల తాపం తీర్చేదే కవిహృదయం. బిరుదులు కోరేవాడు, పైరవీలు చేసేవాడు కవికాడు. చీకటి సంస్థానం

మీద దాడిచేసి అస్తమించని రవిలా వెలిగేవాడే అసలయిన కవి అని కుమారస్వామి భావన. మనిషి చెక్కిన మౌనశిల్పాలు మాట్లాడుతున్నాయి; గతకాలం చరిత్ర నేత్రాలకు వినిపిస్తున్నాయి. శిలలపై చెక్కిన శిల్పాలు కల్పాంతాల వరకు మాట్లాడతాయి. అనల్పార్థాలనెన్నో అందంగా వినిపిస్తాయి. మౌనంగా మహాకావ్యాల నెన్నింటినో మనసుల్లో ముద్రిస్తాయి. గుండెను మరమత్తు చేసుకొంటూ కావ్యదీపికలను వెలిగించుకొంటున్నాను అని 'మౌనశిల్పాలు' కవితలో వెలిబుచ్చాడు.

సమాజంలో చాలామంది మహిళలు అన్యాయంగా బలి అవుతున్నారని వాపోయాడు. పెనుగాలికి తన మీద ముల్లు పడ్డప్పుడు చినిగిపోయి అందులో తన తప్పు లేకపోయినా అందరూ 'కులట' అంటే ఆత్మహత్య చేసుకొన్న అరిటాకును చూసినప్పుడు జాలి కల్గుతుందని సానుభూతిని స్పష్టం చేశాడు.

సూర్యుడస్తమించిన దిశ నుండి
అవినీతితో నిండిన బండి
టాప్‌గేర్‌లో నడుస్తూంది
స్వార్థం స్వాగతం చెబుతుంది
దగాకోరుతనం దారి చూపుతుంది
అక్రమాల చక్రాలు
వక్రవిక్రమంగా తిరుగుతున్నాయి.

ఆక్సిలేటర్ మీద అడుగిడినప్పుడు సామాన్యుడి గుండెలు చిట్లిన చప్పుడు వికటాట్టహాసంతో శకటం సాగిపోతుంది. దీనిని ప్రతిఘటించిన వారికి శృంఖలాలు చుంబిస్తున్నాయి. చెరల గదులు ప్రేమిస్తున్నాయి ఉరికంబాలు వర్తిస్తున్నాయని సహనంతో ఇక లాభం లేదని అందరూ నడుం కట్టి ఆ బండిన ఆపండి, ఆగకుంటే రూపుమాపమని పిలుపునిచ్చాడు. స్వార్థం నేలరాలే కాలమిదని అయినా నిరాశ పడనవసరం లేదంటాడు.

గగనం మండే కాలం
మార్పుగాలితోనే కాలం
స్వార్థం పాపం పండి
నేల రాలే కాలం
త్వరలోనే వస్తుంది
ఆర్తులకు ఓదార్పునిస్తుంది.

బంతిని విసిరికొడితే తిరగబడి పైకి లేస్తుంది. పాము తోక తొక్కితే బుసకొట్టి కాటు వేస్తుంది. మనిషిని తంతే తన తలరాత ఇంతే అని ఒక మూఢవిశ్వాసాన్ని ముడివేసికొంటాడు. తలెత్తయినా చూడడంటాడు. పైగా తన్నేవాడు దివ్యాంశుడని, తాను పాపినని సైతాన్లకు సలాం చేస్తాడు. ప్రతిమనిషీ దివ్యాంశుడేనన్న సత్యం తేటతెల్లమయితే పెద్ద దేవుళ్ళ పటాటోపం బట్టబయలై మానవతా మహోదయమవుతుందంటాడు.

పువ్వులు రాలుతున్నాయి. రాలిపోయిన పువ్వులు నలుగుతున్నాయి, నలిగిపోయిన పువ్వులు నవ్వుతున్నాయి. సంఘం కట్టబాట్లపై తిరగబడి నలిగిపోయిన పువ్వులు నవ్వుతున్నాయంటాడు.

నలిగిపోయిన పువ్వులు సంఘమై
జాతిలో ఒక అంగమై
నీతికి ఆధారమై
ప్రగతికి ఉదాహరణమై
పగలబడి విరగబడి
సంఘం కట్టుబాట్లపై
తిరగబడి
నలిగిపోయిన పువ్వులు
నవ్వుతున్నాయి
నవ్వుతున్నాయి.

చీమలు కట్టిన పుట్టల్లో పాములు బుస బుసలాడుతున్నాయి. అయితే నయవంచన వేషాలన్నీ పసికట్టిన చీమలు తిరగబడతాయేమోనని పాములు అప్పుడప్పుడు గుసగుసలాడుతున్నాయి. చీమలు తిరగబడితే చట్టాల సాగరాలింకిపోయి సమతా సామ్రాజ్యస్థాపన జరిగి చరిత్ర పుటల్లో స్వర్ణాక్షరాల వృక్షాలై తలలెత్తుతాయంటాడు. నేను సూర్యుడిలా ఉదయిస్తాను, విప్లవం నిదుర లేపుతాను, చీకటి శిఖండి శిగ తరుగుతానంటాడు. సమాజంలో చీకటి సామ్రాజ్యాన్ని కూకటి వేళ్ళతో పెకలించాలనే ధోరణి కుమారస్వామి కవితల్లో కన్పిస్తుంది.

అన్యాయాన్నెదిరించడం
నా జన్మహక్కుగా
ఆఖరి క్షణం వరకు పోరుతాను
పోరులో
వీర మరణం పొందితే
కటిక రక్కసులను
పక్కలో బల్లెమై వేధిస్తాను
విప్లవాకాశంలో చుక్కనై నిలుస్తాను
నా తరం తలలో
ప్రబోధరత్నాన్నై మెరుస్తాను
రేపటితరంలో గుండెల్లో
ప్రజల నాన్నై ప్రభవిస్తాను
శుభోదయానికి
స్వాగతగీతం పాడుతాను

అన్యాయాన్నెదరించడమే నా లక్ష్యం అని రేపటి తరానికి ఆదర్శాలను ఐశ్వర్యంగా ఇవ్వాలనే తలంపు కనిపిస్తుంది. శ్రమజీవి అర్ధాంగి అర్ధాకలితో అలమటిస్తూనే ఉంది. మానం కప్పుకోవడానికి చినిగిన చీరయినా లేక సమస్యల వలువలు చుట్టుకొని ఏ విలువ లేకుండా బ్రతికేస్తుందంటాడు.

త్యాగాన్ని పండించి
స్వార్థాన్ని ఖండించి
దానవతను దండించి
చేతనాన్ని రగిలించి
మార్పు వచ్చిందేమోనని
చూస్తున్న
మహనీయుల దృక్కులు చుక్కలు

ముసురుతున్న మసకచీకట్లలో మినుకుమినుకమంటున్న వెలుగురేఖలు యువకులను చుక్కలు లాంటి వారంటాడు. గద్దెలు చిక్కినప్పుడల్లా పెద్దలు పండుగలు చేసుకుంటున్నారు. దీపం ఉన్నప్పుడే మూడు నాలుగు తరాల వరకూ తరగని ఇంధనాన్ని, నల్లధనాన్ని, చీకటిని మూటగట్టుకుంటున్నారు. ఇదంతా మేలుకున్న జనం చూస్తునే ఉన్నారు. జరుగుతున్నది నాటకమని తెలియలేకున్నారు అంటాడు. స్వర్గం, నరకం, నీచేతిలోనే ఉన్నాయి. విప్లవానికి చెయ్యిలేపితే స్వర్గం, బానిసతనానికి చెయ్యి చాపితే నరకం అంటూ స్వర్గం, నరకాల వ్యత్యాసాన్ని వివరించాడు. ఇలా మోడు బ్రతుకులను పల్లవింపజేయాలని సమసమాజాన్ని మానవతా పురోగతిని సాధించాలనే సంకల్పంతో 'పువ్వులు నవ్వుతున్నాయి' కవితా సంపుటి వెలువరించి తన తన కవితాశక్తినీ, మానవతా మహోదయాన్ని నిరూపించుకున్నారు.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# పూర్వబాల్యదశలో వాక్కు వికాసం

# SPEECH DEVELOPMENT IN EARLY CHILDHOOD

- డా॥. బి. ప్రసాద్ బాబు, సహాయ ప్రాంతీయ సంచాలకులు, ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో), ప్రాంతీయకేంద్రం, విజయవాడ.

మాట్లాడటానికి పునాది శైశవదశలో వేయబడుతుంది. పూర్వబాల్యదశలో ఇంతకముందే వేయబడిన పునాది పైన ఆధారపడి వాక్చాతుర్యం అభివృద్ధి చెందుతుంది. కాని పూర్వకాలంలో వాక్చాతుర్యానికి నమూనా (మోడల్) ఏర్పడుతుంది. వాక్చాతుర్యం ఈ నమూనా మీద ఆధార పడి ఉండటం వల్ల పూర్వబాల్యదశ చాలా ముఖ్యమైన దశగా ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. చిన్న తనంలో వాక్చాతుర్యాభివృద్ధి, చలన నైపుణ్యాభివృద్ధి ఒకదానిని అనుసరించి మరొకటి ఏర్పడతాయి. నరాలు, కండరాలు పరిపక్వత చెందేకొద్ది వాక్చాతుర్యం, చలన నైపుణ్యం అభివృద్ధిచెందుతాయి. పరిసరాల్లో గల అవ కాశాలు కూడా రెండు నైపుణ్యాలు ఒకేసారి అభివృద్ధి చెందడానికి దోహదం చేస్తాయి. ముఖ్యంగా పూర్వబాల్య దశలో సాంఘికీకరణకు వాక్చాతుర్యం ఎంతో అవసరం. ఆటలాడుకొనేటప్పుడు స్నేహితులతో మాట్లాడటానికి వాక్చాతుర్యం అవసరం. ఇతర పిల్లలతో చాతుర్యంగా మాట్లాడి, వారు మాట్లాడే మాటలు అర్థం చేసుకుంటేనే పిల్లలు బాగా సాంఘికీకరింపబడతారు. బాగా మాట్లాడ గలిగితేనే విద్యావిషయంలో, సాంఘికంగా కూడా పిల్లలు ముందంజ వేయగలుగుతారు. లేకపోతే పిల్లలు తమ సమవయస్కుల అందుకోలేక అన్ని విషయాల్లో వెనకబడి పోతారు.

మానవుడిని మిగిలిన జంతువుల నుండి వేరు చేసే అంశం వాక్కు. వాగ్రూపాలు క్రమంగా భాషగా అభివృద్ధి చెందాయి. తన భావాలను మానవుడు ఇతరులకు తెలియజేసే సాధనమే భాష. భాషకు శబ్దాలు సంకేతాలుగా ఉండి అని స్పష్టమైన అర్థాన్నిస్తాయి. తెలుగు, హిందీ, ఆంగ్లం... భాషేదైనా తన శబ్ద సంకేతాల ద్వారా ఒక మనిషిలోని భావనలను ఇంకొకరికి అందిస్తుంది. అయితే భాషను బట్టి శబ్ద సంకేతాలు మారుతూ ఉంటాయి. ఈ సంకేతాలు భాషను బట్టి మారుతుంటాయి. భారత దేశంలో హింది, ప్రపంచంలో ఇంగ్లీషు ఎక్కువగా ఉప యోగించబడే భాషలుగా చెప్పవచ్చు. మానవుడు జన్మించినప్పటి నుండి తన వాక్కును అనేక రూపాలలో ఉచ్చరిస్తూ ఉంటాడు. పుట్టిన వెంటనే భాష రాదు కనుక తన భావాలను బహిర్గతం చేయడానికి శిశువు అనేక సంకేతాలను వినియోగిస్తాడు. ఈ సంకేతాలే ప్రాగ్భాషా రూపాలు. ఈ ప్రాగ్భాషా రూపాలు క్రమేపి పరిణితి చెంది భాషారూపాలుగా మారుతాయి. భాషావికాసానికి అభ్యసనం, పరిణితి దోహదం చేస్తాయి.

## వాక్కు వికాసం (Development of Speech) :

మాట్లాడటానికి పునాది శైశవ దశలో వేయబడుతుంది. పూర్వబాల్యదశలో ఇంతకుముందే వేయబడిన పునాది పైన ఆధారపడి వాక్చాతుర్యం అభివృద్ధి అవుతుంది. కాని పూర్వబాల్యదశలో వాక్చాతుర్యానికి నమూనా ఏర్పడు తుంది. తరవాతి వాక్చాతుర్యం ఈ నమూనా పైన ఆధార పడి ఉండటం వల్ల పూర్వబాల్యదశను చాలా ముఖ్య మైనదశగా చెప్పవచ్చు. చిన్నతనంలో వాక్చాతుర్యాభివృద్ధి, చలన నైపుణ్యాభివృద్ధి ఒకదానిని అనుసరించి మరొకటి ఏర్పడతాయి. నరాలు, కండరాలు పరిపక్వత చెందే కొద్దీ వాక్చాతుర్యం, చలన నైపుణ్యం అభివృద్ధి చెందుతాయి. పరిసరాలలో గల అవకాశాలు కూడా రెండు నైపుణ్యాలు ఒకేసారి అభివృద్ధి చెందడానికి దోహదం చేస్తాయి. ముఖ్యంగా పూర్వబాల్యదశలో సాంఘికీకరణకు వాక్చా

తుర్యం ఎంతో అవసరం. ఆటలాడే సందర్భంలో స్నేహితులతో మాట్లాడటానికి వాక్చాతుర్యం అవసరం. ఇతర పిల్లలతో చాతుర్యంగా మాట్లాడి, వారు మాట్లాడే మాటలు అర్థం చేసుకొంటేనే పిల్లవాడు బాగా సాంఘికీకరించబడతాడు. బాగా మాట్లాడగలిగితేనే విద్యావిషయంలో, సాంఘికంగా కూడా పిల్లలు ముందంజ వేయగలుగుతారు. లేకపోతే పిల్లలు తమతోటి పిల్లల కన్నా వెనుకబడిపోతారు.

## వాక్చాతుర్యాభివృద్ధిలో గడించవలసిన నైపుణ్యాలు (Speech Development -- Acquiring Skills) :

మాట్లాడటం నేర్చుకోవాలంటే సరిగా అర్థంచేసుకోవడం, తగిన పదజాలాన్ని ఉపయోగించడం, ఉచ్చారణను నేర్చుకోవడం, కొన్ని పదాలను కలిపి వాక్యాలుగా మాట్లాడటం తప్పనిసరి. ఇవి అత్యంత ముఖ్యమైన నైపుణ్యాలు. భాషలో వీటి అవసరం చాలా ఉంటుంది. ఈ నైపుణ్యాలు పూర్వబాల్యదశలోనే నేర్చుకోవాల్సి ఉంటుంది. ఈవిధంగా నేర్చుకోడానికి తగిన అవకాశాలు, సలహాలు పిల్లలకు లభించకపోతే సమవయస్కులతో పోలిస్తే ఈ తరహా పిల్లల వాక్చాతుర్యం తక్కువగా ఉంటుంది.

### అవగాహన శక్తి (Comprehension) :

పిల్లలు ఇతరులతో మాట్లాడటానికి వాళ్ళు తనతో ఏమి మాట్లాడుతున్నారో గ్రహించి, అవగాహన చేసుకోవాలి. లేకపోతే ఇతరులు మాట్లాడే మాటలకు, పిల్లవాడు ఇచ్చే సమాధానానికి సంబంధం ఏమాత్రం ఉండదు. ముఖ్యంగా శ్రవణ లోపం గల పిల్లలు సరిగా వినకపోవడంవల్ల అర్థంలేని సమాధానాలు ఇస్తారు. అందువల్ల సాంఘిక సంబంధబాంధవ్యాలు కుంటుపడతాయి. అంతే కాక ఒంటరితనంగా ఉండటం అలవాటవుతుంది. ఇంట్లో ఒక భాష, పాఠశాలలో మరో భాష వ్యవహారంలో ఉన్నప్పుడు కూడా పిల్లల వాక్చాతుర్యం దెబ్బతింటుంది. ఎందుకంటే పాఠశాలలో తనతోటి వారు మాట్లాడే భాషకు, తనకు ఇంట్లో మాట్లాడే భాషకు పోలిక ఉండదు. అయినప్పటికీ చిన్నవయస్సులో పిల్లలు ఇతరుల ముఖకవళికలు, వారు చేసే సంజ్ఞల ఆధారంగా వాళ్ళు మాట్లాడేభాష అర్థం చేసుకొంటారు.

### వాక్చాతుర్యాభివృద్ధి (Speech Development) :

ప్రాక్ పాఠశాల వయస్సు మొత్తంలో పిల్లల భాషా జ్ఞానం అభివృద్ధి చెందుతుంది. పిల్లలకు కొత్తపదాలు నేర్పడం వల్ల కొత్తపదాల అర్థాలు నేర్చుకోవాలనే కుతూహలం పిల్లవానిలో జనించడం వలన కూడా వాక్చాతుర్యం అభివృద్ధి చెందుతుంది. పిల్లవాడు కొత్తకొత్త పదాలు నేర్చుకోవడమే కాకుండా నేర్చుకొన్న పాతపదాలకు కొత్త అర్థాలు గ్రహిస్తాడు. అర్థంలో అతిసూక్ష్మ భేదాలను మాత్రం పిల్లలు ఈ వయస్సులో గ్రహించలేరు.

### ఉచ్చారణ (Pronunciation) :

పిల్లవాని ఉచ్చారణ త్వరగా అభివృద్ధి చెందవలసి ఉంటుంది. పిల్లలు నివసించే పరిసరాల్లో నివసించే ఇతరులు మాట్లాడే వారి తీరు, పిల్లల ఉచ్చారణ పైన పెద్దలు తీసుకొనే శ్రద్ధ తదితర అంశాలు మీద పిల్లల ఉచ్చారణ ఆధారపడి ఉంటుంది. కొన్ని శబ్దాలు కఠినంగా ఉండటం వల్ల పిల్లలు సరిగ్గా ఉచ్చరించలేకపోతారు. దీన్ని సహజలక్షణంగా గుర్తించాలి.

### వాక్యాలు మాట్లాడటం (Speaking Sentences) :

పూర్వబాల్యదశలో వాక్యాలు కూర్చడం ఒక నిర్ణీత క్రమపద్ధతి ప్రకారం జరుగుతుంది. రెండు సంవత్సరాల వయస్సు వచ్చేసరికి పిల్లలు రెండు లేదా మూడు పదాలతో వాక్యాలు కూరుస్తారు. పిల్లలు ఎక్కువగా నామవాచకాలను వాక్యాల్లో ఉపయోగిస్తారు. క్రియలు, ఉపసర్గలు, సంబంధవాచకాలు వాళ్ళ వాక్యాల్లో తక్కువగా ఉంటాయి. అలాగే, పిల్లలు ప్రయోగించే వాక్యాలు సంపూర్ణంగా కూడా ఉండవు. సుమారు మూడు సంవత్సరాల వయస్సు వచ్చేసరికి పిల్లలు ఆరు నుంచి ఎనిమిది పదాలతో ఉండే వాక్యాల్ని ప్రయోగించే నైపుణ్యాన్ని పొందుతారు. ఆరేళ్ళు వచ్చేసరికి అన్ని వాక్యాలను ప్రయోగించే పూర్తి నైపుణ్యం వారికి వస్తుంది.

**మాటల తప్పులు (Speech Errors) :**

మాట్లాడటం నేర్చుకోవడం చాలా కష్టం. పిల్లలు తప్పులు లేకుండా మాట్లాడలేరు. కొంతమంది పిల్లలు మాత్రం మాటలను స్పష్టంగా ఉచ్చరిస్తారు. మరికొందరు ఆవిధంగా చేయలేరు. సుమారుగా మూడు లేదా నాలుగు సంవత్సరాల వరకు పిల్లలు సరిగ్గా ఉచ్చరించలేరు. క్రమంగా ఐదు లేదా ఆరు సంవత్సరాల వయస్సుకు వచ్చేసరికి పిల్లలు స్పష్టంగా ఉచ్చరిస్తూ మాట్లాడతారు. అలాగే 3, 4 సంవత్సరాల వరకు వాళ్ళ మాటల్లో వ్యాకరణ దోషాలు ఉంటాయి. ముఖ్యంగా సరైన సర్వనామాలు, క్రియలు, కాలాలు ఉపయోగించడంలో దోషాలు ఉంటాయి. వచన, బహువచన ప్రయోగంలో తప్పులు చేస్తారు. సాధారణంగా మూడు సంవత్సరాల వయస్సు నుంచి పదజాలాన్ని యోగించడం నేర్చుకున్నప్పటికీ వ్యాకరణంలో తప్పులు ఎక్కువగా ఉంటాయి.

**భాషా క్రమభంగాలు (Speech Disorders) :**

కొన్ని శారీరకమైన లోపాల వల్ల కొన్ని భాషా క్రమ భంగాలు (దోషాలు) వస్తాయి. ఉచ్చారణ లోపాలు ఆంగిక లోపం వల్ల ఏర్పడతాయి. నాసికారంధ్రాల్లో ఏదైనా అడ్డం ఉన్నా, దండాల నిర్మాణంలో లోపాలు ఉన్నా, దవడలు, పెదవులు, చిరునాలిక నిర్మాణంలో లోపాలు ఉన్నా, నాలిక కదిలించలేని పరిస్థితి ఉన్నా మాట్లాడటంలో దోషాలు ఏర్పడతాయి.

పూర్వబాల్యదశలో సాధారణంగా మూడు విధాలైన భాషా క్రమభంగ దోషాలు ఏర్పడతాయి. అవి...

అ) ముద్దుపలుకుల దోషము (Lisping)

ఆ) అస్పష్టంగా త్వరగా మాట్లాడటం (Slurring) మరియు

ఇ) నత్తిగా మాటాడటం (Stuttering)

**ముద్దుపలుకుల దోషము** (Lisping) :

సామాన్యంగా పిల్లలు పూర్వబాల్యదశలో కొన్ని అక్షరాలకు బదులు వేరే అక్షరాలు ఉపయోగిస్తారు. ఉదాహరణకు "సున్న" బదులు "తున్న", "వస్తావా" బదులు "వత్తావా", "రాను"కు బదులు "లాను", "చూస్తున్నా" బదులు "తూత్తున్నా" మొదలైనవి. పాలపళ్లు ఊడి శాశ్వతదంతాలు వచ్చేటపుడు కొన్ని తొర్రలేర్పడటం వల్ల కూడా కొన్నిసార్లు ఈ విధంగా పిల్లలు అస్పష్టంగా మాట్లాడతారు. అప్పుడే సరిదిద్దితే అవి అలవాటుగా మారకుండా సరిగా మాట్లాడటం నేర్చుకుంటారు.

**అస్పష్టంగా మాట్లాడటం (Slurring) :**

పెదవులు, నాలిక, దవడలు సరిగా కదలకపోవడం వల్ల పిల్లలు అస్పష్టంగా మాట్లాడే అవకాశం ఉంది. సామాన్యంగా పిరికితనం వల్ల లేదా జరిగిన విషయాలు త్వరగా చెప్పాలనే కుతూహలం, అతురత, ఉద్వేగ ప్రకోపం వల్ల మాటలు త్వరగా దొర్లుతాయి. దీంతో వాటి భాషం చాలా అస్పష్టంగా ఉంటంది. కానీ పూర్వపాఠశాల వయస్సులో నిదానంగా స్పష్టంగా మాట్లాడటం నేర్పించాల్సిన అవసరం ఎంతో ఉంది.

**నత్తిగా మాట్లాడటం (Stuttering) :**

ఒకే అక్షరాన్ని లేదా పదాన్ని అనేక సార్లు మళ్ళీమళ్ళీ చెప్పడాన్నే నత్తి అంటారు. ఒక్కొక్కసారి మాటలు దొర్లకుండా నత్తి ఏర్పడుతుంది. అప్పుడు ఆ వ్యక్తి అసలు ఏ శబ్దాన్ని చేయలేకుండా ఉంటాడు. కొంతసేపైన తరవాత మాటలు ధారాళంగా వస్తాయి. ఈ విధంగా నత్తిగా మాట్లాడటం కూడా నరాలు ఉద్వేగాల ప్రకోపం వల్ల ఏర్పడుతుంది. సాధారణంగా 2-4 సంవత్సరాల వయస్సులో ఉండే జంకు వల్ల కూడా మాట్లాడిన మాటనే తిరిగి మాట్లాడటం జరుగుతుంది. క్రమంగా 5,6 సంవత్సరాల వయస్సు వచ్చేసరికి పిల్లలకు నత్తి ఉందా లేదా అనే విషయం స్పష్టంగా తెలుస్తుంది.

పుర్వబాల్యదశలో మాటకు మంచి పునాది పడుతుంది. సాధారణంగా 5 ,6 సంవత్సరాల ప్రాయంలో పిల్లలు ఇల్లు వదిలి కొత్త సంఘంలో తిరగడం, అందరితో మాట్లాడటం అవసరం. కాబట్టి ఈ రెండు దశలు పిల్లల జీవితంలో చాలా క్లిష్టమైన దశలుగా ఉంటాయి. మామూలుగా బిడ్డలు మాటలు నేర్చుకోవడానికి ముందు కొంత నత్తిగా మాట్లాడటం సర్వసామాన్యమైన విషయం.

### మాటల్లోని విషయాలు (Content of Speech) :

మొదట్లో మాటలు చలనశీలతతో వెలువడి తరవాత గట్టిగా ఆలోచించడం జరుగుతుంది. ఉదాహరణకు పిల్లలు ఈ వయస్సులో రైలుబొమ్మతో ఆడుకొంటూ 'రైలును మీద నడిపిస్తానని' గట్టిగా చెప్పి నడిపిస్తారు. అంటే తాను చేసే ప్రతికార్యం గురించి గట్టిగా ఆలోచిస్తారన్నమాట. చెబుతున్న విషయాలు జరుగుతున్నట్లు మాట్లాడతారు. కాని మరొకరితో ఏమీ చెప్పరు. స్వగతంగానే మాట్లాడతారు.

### సలహా ఆవశ్యకం (Importance of Advice) :

పిల్లవాడిని సాంఘికీకరించాలంటే తోటి స్నేహితులతో సవ్యంగా ఏ విధంగా మాట్లాడాలో నేర్పించాలి. తప్పులు మాట్లాడటం అలవాటుకాకుండా ఎప్పటికప్పుడు తప్పులు సరిదిద్ది, సలహాలు ఇవ్వాలి. అంతేకాకుండా పెద్దవాళ్ళతో మర్యాదగా మాట్లాడటం నేర్చుకోవాలి. ఆవిధంగానే ఇతరులను పేర్లు పెట్టి పిలవడం, విమర్శించడం, స్వంత విషయాలను గురించి ప్రగల్భాలు పలకడం వంటి అలవాట్లు చిన్నప్పుడే రూపుమాపాలి.

### మాటలలో వ్యత్యాసాలు :

చిన్నపిల్లలు మాట్లాడే విషయాల్లో ఎన్నో భేదాలు ఉంటాయి. ఈ వ్యత్యాసాలు పిల్లల మేధాశక్తి పైనకాకుండా అభ్యసించగల అవకాశాల మీద ఆధారపడి ఉంటాయి. సమష్టి కుటుంబాల్లో మొదట పుట్టిన పిల్లలకు (జ్యేష్ఠ పుత్రుడు లేదా పుత్రికకు) పెద్దవారితో మాట్లాడే ఆవకాశాలు వారి తర్వాత పుట్టే పిల్లల కన్నా ఎక్కువగా ఉంటాయి. అనాథ శరణాలయాల్లో పెరిగే పిల్లలు వాక్చాతుర్యాభివృద్ధిలో వెనకబడేందుకు అవకాశం ఉంది. ఎందుకంటే ఈ సంస్థల్లో పిల్లలకు మాట్లాడటానికి తగిన అవకాశాలు ఉండవు. ఒకవేళ ఏదైనా అవకాశం ఉన్నా ఆ అవకాశాలు చాలా తక్కువ. పిల్లల కుటుంబ ఆర్థిక స్తోమత పెరిగేకొద్దీ వాళ్ళ పరిసరాల్లో బాగా మాట్లాడేవారు ఉంటారు. అందువల్ల ఆవిధంగా బాగా మాట్లాడేవారిని అనుకరించడం వల్ల, వారి నుంచి తగిన ప్రోత్సాహం లభించడం వల్ల పిల్లలు బాగా మాట్లాడగలుగుతారు.

### ముగింపు (Conclusion) :

తల్లిదండ్రులు తమ పిల్లలు మిగతా పిల్లల కంటే ఎక్కువ భాషలు నేర్చుకోవాలనే ఉద్దేశ్యంతో ద్విభాషా ప్రయోగం చేస్తుంటారు. ఇంట్లో మాట్లాడే భాష బడిలో పిల్లలు మాట్లాడకపోతే ఆ రెండు భాషల్లోను పిల్లల వాక్చాతుర్యం కుంటుపడుతుంది. పిల్లలు ఎంత మాట్లాడతారనే విషయంలోనే కాకుండా ఎట్లా మాట్లాడతారు, ఏ విషయాలు మాట్లాడతారు, ఎవరెవరితో మాట్లాడతారు అనే విషయాల్లో కూడా వ్యక్తిగత భేదాలు ఉంటాయి. మేధావంతులు, పరిపక్వం చెందినవారు ఎక్కువగా మాట్లాడతారని కొన్ని పరిశీలనలు తెలియజేస్తున్నాయి. తల్లిదండ్రుల క్రమశిక్షణ విధానం కఠినంగా ఉండే ఇళ్ళలోని పిల్లలకంటే ఎక్కువ స్వతంత్రాన్ని ఇచ్చే కుటుంబాల్లో ఉండే పిల్లలు ఎక్కువగా మాట్లాడతారని మరికొన్ని పరిశీలనలు తెలియజేస్తున్నాయి. కాబట్టి తల్లిదండ్రులు మొదటగా పిల్లలకు ఒక భాషను నేర్పిన తరువాత ఇంకొక భాషను నేర్పించడం మంచిది.

### పరిశీలించిన గ్రంథాలు (Reference Books) :

1. శిశు కుమార సంవర్థనం, తెలుగు అకాడమి ప్రచురణ, హైదరాబాద్.
2. విద్యామనోవిజ్ఞాన శాస్త్రం, తెలుగు అకాడమి ప్రచురణ, హైదరాబాద్.
3. పిల్లల ప్రవర్తన తల్లిదండ్రుల పాత్ర, తెలుగు అకాడమి ప్రచురణ, హైదరాబాద్.
4. బాల కౌమార మనోవిజ్ఞాన శాస్త్రం, తెలుగు అకాడమి ప్రచురణ, హైదరాబాద్.
5. అమ్మ, నాన్న, బుజ్జాయి, శ్రీ రాఘవేంద్ర పబ్లిషర్స్, విజయవాడ.
6. బాల్యదశ - వికాసం, శ్రీ నాగార్జున పబ్లిషర్స్, గుంటూరు.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# కథానిక - కొన్ని పరిశీలనలు

**- డా॥. జి. స్వర్ణలత,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, ప్రభుత్వ మహిళా కళాశాల, గుంటూరు.

కథానికా ప్రక్రియ ఆధునికతకు పర్యాయపదం. కథానిక సామాజిక చైతన్యాన్ని వాగ్దానం చేస్తుంది. మత్తు నుండి మేల్కొల్పుతుంది. ఆదర్శాలను బోధిస్తుంది. సత్యాన్ని శోధిస్తుంది. ప్రేమించడం నేర్పిస్తుంది. ద్వేషాన్నీ చవిచూపిస్తుంది. మానవత్వపు జాడల్ని తెలియ పరుస్తుంది. కఠిన అంతరంగాలను బహిర్గతపరుస్తుంది. జీవితపు విలువల్ని తెలియపరుస్తుంది. వెరసి జీవితాన్ని ఆవిష్కరిస్తుంది. మనం గొప్పకథలుగా అనుకుంటున్నవన్నీ ఆయా కథకుల అనుభవాల్లోంచి, అవగాహనలోంచీ పుట్టుకొచ్చినవే కనుక జీవితమే ప్రతి కథకూ ముడిసరుకు. ఈ కోణంలో చూసినపుడు ప్రతి ప్రక్రియకూ జీవితమే వనరు అనిపిస్తుంటుంది కూడా. అయితే కళాదృష్టిలేని సృజన రచయిత ప్రతిభను బట్టి ఆలోచన రేకెత్తించగల దేమో గాని రచనను మాత్రం సౌందర్యమయం చెయ్య లేదు. ఈ సౌందర్యం చిత్రలేఖనం, నాట్యం, శిల్పాలలో ప్రత్యక్షంగా కనబడవచ్చు. గానీ సంగీత సాహిత్యాలలో అది అనుభవైకవేద్యం. సాహిత్యాన్ని ప్రత్యేకించి చెప్పు కుంటే రచనలో సౌందర్యాన్ని తీసుకురావాలంటే రచయిత గొప్ప సౌందర్యదృష్టి, ఆత్మసౌందర్యం కలిగివుండాలని అనిపిస్తుంది. "బాహ్య జగత్తులో వస్తువు ఎంత అద్భు తమైనదైనా సరే అది కథకుడి అంతరంగ జగత్తులో ఆవిర్భవించే ఒక కళాదృష్టితో సమన్వయం కుదుర్చుకుని తనదైనపుడు తప్ప ఆ రచయిత ఆ వస్తువును స్వీకరించడం మూర్ఖత్వం" అన్న ప్రముఖ కథారచయిత బుచ్చిబాబు మాటలు రచయిత సౌందర్యదృష్టికోణం సృజనలో ఎంత ప్రముఖమైనదో సూచిస్తాయి. కేవలం పరిశీలించి రాయడం కాక ప్రేమించి సజీవంగా తన లోంచి ఎంతో సహానుభూతితో ఆ అంశాన్ని ఆవిష్కరించి నపుడు ఆ కథ సౌందర్యమయం అవుతుంది.

Frey tag అనే జర్మన్ రచయిత కథానికలోనని ముఖ్యాంశాలను ఈ క్రింది గ్రాఫ్ రూపంలో పేర్కొన్నాడు.



తన 'Short Story Technique' అనే రచనలో 'John Boulevard' "కథా ప్రారంభంలో కథలో వచ్చే ప్రధాన పాత్రలు, అవి ఎదుర్కొనే సమస్యలు పరిచయం అవుతాయి. మధ్యభాగం వచ్చేసరికి ఆ సమస్యల నెదుర్కొనేందుకు జరుగుతున్న కృషి స్వరూపం తెలుస్తుంది. ఇక ముగింపులో ఆ కృషిలో పొందిన సాఫల్య వైఫల్యాలు వుంటాయి" అన్న మాటలు సంక్షిప్తంగా Frey tag గ్రాఫ్‌ను విశదీకరిస్తాయి. ఈ సందర్భంలో 'Modern Short Story' అనే రచనలో H.E బేట్స్ పేర్కొన్న మాటలు కూడా విలువైనవే. "కథా రచన అనేది అగ్గిపుల్లలతో మేడ కట్టడం లాంటిది. ఒక దశవచ్చేసరికి ఒక్క పుల్ల ఎక్కువయినా మొత్తం కూలిపోతుంది. ఇంత శ్రద్ధగా సమతౌల్యం చేయవలసిన ఆవశ్యకత ఒక్క కథారచనలో తప్పించి మరెక్కడా కనిపించదు. అందుచేతనే సృజనాత్మక వచన సాహిత్య ప్రక్రియలన్నింటిలోకీ కథారచన క్లిష్టమైనదిగా నేను భావిస్తాను" అన్న మాటలు కథారచననలో బిగింపు తీసుకొని రావడానికి రచయిత తీసుకోవలసిన శ్రద్ధను సూచిస్తాయి. మంచికథ రాయడం కష్టతరమైనదన్న భావనను ధృవీకరిస్తాయి.

కథలో బిగింపును తీసుకురావాలంటే రచయిత ప్రధానంగా ఆరు అంశాలమీద దృష్టి పెడతాడు. 1) ఎత్తుగడ (Begining), 2) పాత్రచిత్రణ (Characterization), 3) నేపథ్యం (Setting), 4) సంఘర్షణ (Conflict), 5) సంభాషణలు (Conversations), 6) ముగింపు (Ending).

ప్రతి రచయిత ప్రతి కథలోనూ ఈ ఆరు అంశాలపై సమదృష్టి పెడతాడని ఆశించలేంగాని ఒక్కో రచయిత ఒక్కో అంశంపై లేక కొన్ని అంశాలపై ఎక్కువ దృష్టి పెడతారని కొన్ని కథలను పరిశీలిస్తే తెలుస్తుంది.

**ఎత్తుగడ :**

కథకు మంచి ఎత్తుగడ ఉన్నప్పుడు ఆ కథ పాఠకుడిని ఆకట్టుకుంటుంది. పఠనీయతను పెంచుతుంది. కథను ఫలానా దగ్గరే ఆరంభించాలన్న నియమం లేదు. ఎక్కడ నుంచైనా మొదలుపెట్టవచ్చు. కథానికా శిల్పంలో ఎత్తుగడ ఒకానొక కీలకమైన అంశం. ఉదాహరణకు రావి శాస్త్రి సబ్బుబిళ్ళ కథా ప్రారంభంలో "ఉదయం ఎనిమిదిన్నర అయింది. తన స్టడీరూమ్‌లో ఉస్సురుమని కూర్చొని దొంగను పట్టుకు రమ్మని కబురంపేడు లక్ష్మీపతి. దొంగను ఏం చెయ్యాలి. ఏమిటో అతనికేం తోచకుండా వుంది. తన నలభైఏళ్ళ జీవితంలోనూ అతనెన్నడూ ఇటువంటి అవస్థలో, పరిస్థితిలో పడలేదు." అనే ఎత్తుగడ పాఠకులలో చాలా ప్రశ్నలను రేకెత్తించి కథాంశం మీద ఉత్సుకతను కలిగించి ఆసాంతం చదివిస్తుంది. సంభాషణలతోనే, ప్రకృతి వర్ణనతోనో, పాత్ర వర్ణనతోనో ఒక వ్యాఖ్యానంతోనో కథానిక ఎత్తుగడ ఉండవచ్చు. కవితాత్మకమైన ఎత్తుగడను పేర్కొనాలంటే పాలగుమ్మి పద్మరాజు గారి పడవప్రయాణాన్ని ఉదహరించాలి. "పొద్దు కుంకిన తర్వాత లోకమంతా దిగులుగా వుంది. పడవ మెల్లగా నీటి మీద జారుతోంది. నీరు పడవ పక్కని కలకలమంటూ రాసుకుంటోంది. చూపు మేరల్లా జీవసంచలనం లేని ప్రపంచం నిశ్శబ్దంగా జుమ్మంటోంది. ఆ ధ్వని చెవులకు వినపడక దేహాన్నంతటినీ తాకుతోంది. మనస్సులోలోపల అది నిండుగా కంపిస్తున్నట్లు ఉంటుంది. ఏదో బ్రతుకు చివరన ఆఖరయి పోతున్న నిస్పృహ, ప్రశాంతమయిన నిరాశ మనస్సులో నిండుకుంటాయి". ఈ ఎత్తుగడలో ఒక భౌతిక పరిస్థితి, అది పాఠకుడి మనస్సుపై కలిగించే ఒక అవ్యక్త విషాద భావస్థితిని కూడా రచయిత వర్ణిస్తున్నాడు. ఎత్తుగడ ప్రాముఖ్యత దృష్ట్యా ప్రయోజనాత్మకమైన ప్రారంభమే ఎత్తుగడ అనవచ్చు.

**పాత్ర చిత్రణ :**

కథను నడిపించేవారూ, కథావస్తువును భరించేవారూ, కథాంశాన్ని సూచించేవారూ పాత్రలు. కథారచయిత జీవితానుభవమూ, శిల్ప సామర్థ్యమూ ఆయా పాత్రల చిత్రణ తెలియజేస్తుంది. నార్ల చిరంజీవి కథ "మగ్రినీడా, మల్లెతీగా!" అద్భుతమైన పాత్ర చిత్రణ చూపిస్తుంది. దేవుడిమాన్యాన్ని రాంసామికి కౌలుకిప్పించి స్నేహం ముసుగులో అతడి కష్టాన్ని దోచుకుతిని అతడి కూతురును అనాధగా మార్చిన ధర్మకర్తను పెట్టుబడిదారీ

వ్యవస్థకు ప్రతీకగా చిత్రించిన తీరు, రాంసామి మంచి తనాన్ని అవకాశవాదానికి ఎరగా ఉపయోగించిన తీరు పాఠకులను ఆలోచింప చేస్తాయి. కేవలం రెండు పాత్రల వ్యక్తిత్వ చిత్రణతో పెట్టుబడిదారీ వ్యవస్థ స్వరూపాన్ని కళ్ళకు కట్టారు రచయిత.

కథారచయిత పెద్దిభొట్ల సుబ్బరామయ్య గారి శైలిలో మామూలు మనుషుల్ని విశిష్ట వ్యక్తులుగా మార్చగల మంత్రదండం ఉంది. పెరియనాయకిని ప్రేమించి ఆమెతో సహా పారిపోయి బ్రతుకుదెరువు కోసం తమ ఊరికి వచ్చిన సింగారవేలు హఠాత్తుగా మరణిస్తే, ఆ వేదనతో పెరియనాయకి ఏమైపోతుందోనన్న ఆలోచనతో ఎవరేమనుకున్నా తన ఇంట్లో ఆశ్రయం కల్పించి, కళ్ళలో ఒత్తులేసుకొని ఆమెను ఆమె బంధువులకప్పగించే వరకూ కంటిమీద కునుకేయని సింహాచలం కచ్చితంగా పాఠకుల హృదయాలలో మానవత్వమనే చిరుదివ్వెను వెలిగిస్తాడు.

కథలో ముఖ్యపాత్రలు విశిష్టంగా రూపొందటం సహజమైన విషయం. ఆ పాత్రల మీదనే రచయిత మరియు పాఠకులదృష్టి ఉండడం కూడా సహజమైనదే. అయితే కొన్ని పాత్రలు నిడివి తక్కువగా ఉన్నా, ప్రధాన కథకు దూరంగా వున్నప్పటికీ సహజంగా, మంచి వ్యక్తిత్వంతో వెలుగుతూ కథనంతా సౌందర్యమయం చేస్తాయి. తిలక్ కథల్లోన్ని కొన్ని పాత్రలు అలాంటివే. 'ఆశా కిరణం' అనే కథలో వెంకటేశ్వర్లు వున్న ఉద్యోగం పోగొట్టుకున్న చేతకానివాడు. తాను, భార్య, గంపెడు పిల్లలు ఆకలితో మలమలలాడుతున్నా గుప్పెడు మెతుకులు సంపాదించలేనివాడు. చావుబతుకుల్లో వున్న కన్న కొడుకును నిర్లిప్తంగా చూస్తూ తప్పించుకుని తిరగడం తప్ప ఏమీ చేయలేనివాడు. ఇంటిల్లిపాదినీ బతికించడానికి పెద్దకూతురు జయ లాడ్జికి వెళ్ళడం, అది తెలిసి వెంకటేశ్వర్లు ఇక నేను చావనక్కరలేదు అనుకోవడం ఇందులో కథ. పాఠకులు న్యాయాన్యాయాలు ఉచ్చ నీచాలజోలికి పోకుండా తిలక్ జయను మానవత్వపు సౌందర్యంతో కాంతులీనేట్లు చేసిన తీరుకు అబ్బుర పడతారు. ఆర్థిక దుస్థితి మానవ ఆలోచనల్లో కలిగించే కుదుపును ఈ కథ ప్రతిబింబిస్తుంది.

తిలక్ నల్లజర్ల రోడ్డు కథలోనూ నాగరికత వాసన లంటని సూరీడు గర్భంతో వుండి కూడా పాము కరిచిన రామచంద్రాన్ని కాపాడడానికి పాములు తిరిగే పొదల దగ్గరున్న మొక్కలకోసం ప్రాణాలకు తెగించి అర్ధరాత్రి చీకట్లో దూసుకుపోవడం, భూషణం చూపించిన పచ్చ నోట్లను నవ్వుతూ తిరస్కరించడం ఆమె ఆత్మసౌందర్యాన్ని ద్విగుణీకృతం చేసే అంశాలు.

**నేపథ్యం Setting :**

నేపథ్య చిత్రణ పాఠకులు కథావస్తువును అందుకోవ డానికి తగిన మానసిక స్థితిని "మూడ్"ను కలిగించేలా వుంటుంది. వాస్తవిక చిత్రణ ద్వారా వాతావరణ స్ఫురణ చేసే రచయితలు కొందరైతే వాతావరణ చిత్రణకోసం కవిత్వాన్ని ఎంతో సృజనాత్మకంగా ప్రవేశపెట్టిన కథకులూ ఉన్నారు. మొదటి శైలికి కొడవటిగంటి, రెండవశైలికి రావిశాస్త్రిలను ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. బ్రిటీష్ రచయిత్రి ఎలిజబెత్ బోవెన్ కథానేపథ్య ప్రాముఖ్యాన్ని వివరిస్తూ "Nothing can happen nowhere. The locale of the happening always colours the happening and often to a degree, shapes it" అంటుంది. కొన్ని కథలు కొన్ని నేపథ్యాలలో మాత్రమే జరుగుతాయి. కొన్ని కథలకు స్థలకాలాలు ఉండకపోవచ్చుగానీ బోవెన్ చెప్పి నట్టు కథలోని సంఘటనలకు నేపథ్యం ఒక రంగును ఇవ్వడమే కాకుండా ఆ సంఘటనను తీర్చిదిద్దుతుంది. పాలగుమ్మి పద్మరాజు పడవ ప్రయాణం, గాలివాన కథల్లో వాతావరణ చిత్రణ సృష్టించిన మూడ్ పాఠకుడి దృష్టిని క్షణం కూడా కథాంశం మీద నుంచి పక్కకు పోనీయదు. గాలివాన కథలోని వస్తువు నైతికాహంకారం. కథలోని ముఖ్యవ్యక్తి 'రావుగారు' వేదాంతి. తాను క్రమశిక్షణ ఉన్న వాడిననీ, నీతిమంతుడననీ ఎలాంటి పరిస్థితిలోనైనా తాను తన అధీనం తప్పి ప్రవర్తించననీ అతని నమ్మకం. ఒక గాలివాన (వాతావరణం) అతనిలోని విరుద్ధ స్వభావాన్ని బయటకు తీసిన చిత్రణలో రచయిత శిల్ప నైపుణ్యం, నేర్పరితనం ఉన్నాయి.

Settingలోని మరొక ముఖ్యమైన అంశం భాష. కథలోని వాస్తవికతకు భాషకూడా దోహదం చేస్తుంది. ఎందుకంటే స్థలానికి సీమితమైన భాష ఒకటుంటుంది. పాత్రలు మాట్లాడే ప్రాంతీయ సామాజిక మాండలిక భాష భౌతిక, బౌద్ధిక నేపథ్యాలలాగే ఆ పాత్రల పట్ల పాఠకులకు నమ్మకం కలిగిస్తుంది. అందుకే గ్రాంథిక భాషలో మొదట తాను రాసిన దిద్దుబాటు కథను గురజాడ వ్యావహారిక భాషలోకి మార్చాడు. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, మా గోఖలే, కరుణకుమార మొదలైన కథకులు నేపథ్యానికీ, పాత్రలకూ, కథాంశానికీ మధ్య భాషద్వారా ఒక సజీవ సంబంధాన్ని చిత్రించారు.ఈ ప్రయత్నాన్ని రవిశాస్త్రి, కాళీ పట్నం, బీనాదేవి మొదలైనవారు శిఖరాగ్రాలకు తీసుకొని పోయారు.

## Conflict సంఘర్షణ :

ఆయా పాత్రల అంతరంగ లేదా భౌతిక సంఘర్షణ కథకు ఒక స్థాయి తీసుకొస్తుంది. మంచికథ అనిపించు కోడానికి రచయిత కథలో సంఘర్షణను ఎంతగాఢంగా చిత్రించగలిగాడు అన్నదాన్ని బట్టి ఉంటుంది. రచయిత అభిరుచిని బట్టి, అతని జీవితానుభవాన్ని బట్టి, ఆయా రచయితలు సంఘర్షణను చిత్రిస్తారు. ఇద్దరు వ్యక్తుల మధ్య, రెండు సిద్ధాంతాల మధ్య రెండు భావాల మధ్య ఒకే వ్యక్తిలోని రెండు అంశాల మధ్య, మానసికంగా, లేదా భౌతికంగా అయినా ఈ సంఘర్షణ ఉండొచ్చు. నిర్దిష్ట జీవిత దృక్పథం ఉన్న రచయిత తప్పకుండా కథలో తన దృక్పథాన్ని ప్రతిఫలనం చేసే సంఘర్షణను చిత్రిస్తాడు.

మ(రినీడా మల్లెతీగా కథ ఇంతకు ముందే పేర్కొన్న విధంగా రెండు విరుద్ధ వ్యవస్థల మధ్యనున్న సంఘర్షణను చిత్రిస్తుంది.

డాక్టర్ కొమ్మూరి వేణుగోపాలరావు గారి "మర మనిషి" మరగా మారిన మనిషి మళ్ళీ మనిషిగా పునర్జన్మ ఎత్తడానికి ఎంతటి మానసిక సంఘర్షణ అనుభవించాడో చెబుతుంది. రచయిత ఆదివిష్ణు శైలి సరదాగా, నవ్విస్తూ కవ్విస్తూ పాఠకులను ఆకర్షిస్తుంది. అయితే 'ఉద్యోగం' అనే వీరి కథ కరుణరస ప్రధానమైంది. కథ అంతా ఉత్తమ పురుషలో స్వగతంలా నడుస్తుంది. అమ్మ నాన్నలు లేని ఈ పాత్ర గతిలేక అన్నావదినెలకు చాకిరీ చేస్తూ వ్యక్తిగా ఎదగాలని తపించి ఉద్యోగంకోసం తన మామయ్య ఇంటికి వెళ్ళినా అక్కడ కూడా వాళ్ళు వంటమనిషిగా చూస్తున్నప్పుడు ప్రేమ వివాహం చేసుకొని యింటికి దూరమైన అక్క భర్త అనారోగ్యంతో ఉండడంతో వారింటికి పయనమై అక్కడ చాకిరీకి తనంతట తానే సిద్ధమవడం దీనిలోని కథ. మనసులోని సంఘర్షణను స్వగతంలా ముందుకు తీసుకెళ్తున్న తీరు పాఠకులను కన్నీరు పెట్టిస్తుంది.

## సంభాషణలు :

కథలోని పాత్రల స్వభావాన్ని అర్థం చేసుకోడానికి సంభాషణలు చక్కగా ఉపకరిస్తాయి. కథా కథనాన్ని, రచయిత దృష్టికోణాన్ని అర్థం చేసుకోవడానికి కూడా కథలోని వ్యక్తుల సంభాషణలు ఉపయోగపడతాయి. కథలో సంభాషణలు తక్కువగానే ఉన్నప్పటికీ వాటివల్ల చేకూరే ప్రయోజనం పెద్దదై వుండడం మంచి కథకుల ప్రత్యేకత.

'వాయులీనం'లో రాజ్యం ప్రేమగా చూసుకునే ఫిడేలును ఆమె అనారోగ్యం నిమిత్తం అమ్మివేసి మిగిలిన డబ్బుతో ఆమెకు చీర కొనుక్కొస్తాడు భర్త "నాలుగు కాలాలపాటు వుంటుంది కదా అని కొనేశాను అని చీర సగం విప్పేసి రాజ్యం భుజం మీద కప్పేశాడు వెంకట ప్పయ్య "జ్ఞాపకంగా వుంటుంది లెండి" అంది రాజ్యం'. ఇంతటితో కథ అయిపోతుంది. రాజ్యం దృష్టిలో చీరకు విలువే లేదని, ఆమె ఫిడేలును ఎంతగా ప్రేమించింది అన్న విషయం ఆ ఒక్క మాటలో ధ్వనింపచేస్తాడు రచయిత.

"మరమనిషి"లోని సంభాషణలు కూడా సార్థకంగా ఉంటాయి. కొమ్మూరి వేణుగోపాలరావు స్వతహాగా వైద్యుడు కనుక యంత్రంలా ఉన్న వ్యక్తి మనిషిగా మారాక అతడిలో కలిగే భావాలెలా ఉంటాయో చక్కగా చిత్రించాడు. శ్రీధర్ మనిషిగా మారిన సందర్భంలో భార్యతో బయటికి చూడమన్నప్పుడు ఆమె ఏముందక్కడ అనగానే

"కావలసినంత వుంది. అస్తమించే సూర్యబింబాన్ని కప్పేసిన మేఘాలు, నన్ను చూసి నవ్వేగాలి, వెక్కిరించే వృక్షసమూహాలు" అంటాడు. ఈ మాటల్లో అతడి మానసిక స్థితి అంతా వ్యక్తమౌతుంది. తానింతవరకూ గడిపిన జీవితం పట్ల అతని దృక్పథం మారినట్లు, తానింతవరకూ అర్థరహితంగా, ఎబ్బెట్టుగా బ్రతికినట్టు అతనికి అర్థమై అతడు మనిషిగా మారినట్టు పాఠకులకు స్పష్టమౌతుంది.

**ముగింపు :**

కథానికకు ప్రారంభం ఎంత ముఖ్యమో ముగింపూ అంతే. కథానికలోని ముగింపు పాఠకుడు ఊహించేదిగాను లేక పాఠకుణ్ణి విస్మయ చకితుణ్ణి చేసే కొసమెరుపు (ఓ హెన్రీ కథలు) గానో లేక కథాంశం మీద కొత్త వెలుగును ప్రసరింపచేసే కొసమలుపుగానో కూడా ఉండవచ్చు. (జీవని - వి.చంద్రశేఖర్రావు) ఒక పతాక సన్నివేశంలో అంతమయ్యే విధంగానో (యజ్ఞం), Never before and never later అనిపించే విధంగా ఒక కీలక బిందువు దగ్గర ముగించే కథలూ (మురళీ వాళ్ళమ్మ - రంగనాయకమ్మ) ఉన్నాయి. కొన్ని కథల్లో కథ ఆగిపోతుంది గానీ ముగిసిపోదు (మా గోఖలే కథలు) మా గోఖలే కొన్ని జీవన శకలాల్ని చిత్రించి వదిలేస్తాడు గానీ ప్రత్యేకించి వాటికి ముగింపులుండవు. దీనివల్ల ఆ కథలు సహజంగా అనిపిస్తాయి. ఆంగ్ల రచయిత్రి ఎలిజబెత్ బోవెన్ "Many of my stories are questions asked, many end with a swing a query or to the readers "Over to you" అంటుంది. ఆమె మాటల్లో ముగింపులోని మరింత వైవిధ్యాన్ని చూడొచ్చు. ఏ రకపు ముగింపైనా అది కథానికలోని ఆరంభం తోనూ మిగిలిన కథాంశాల తోనూ సమన్వయిస్తూ చివరకు అన్ని అంశాల్నీ తనలో సంలీనం చేసుకొనేదిగా ఉండాలన్నది నిర్వివాదాంశం. ఈ వ్యాసంలో శీర్షిక సూచించినట్లు కొన్ని పరిశీలనలు మాత్రమే చేయడం జరిగింది. ఆ దృష్ట్యా ఇది అసమగ్రమే. కథలకు సార్థకంగా పేర్లు పెట్టడం, ఒక కథకుడిపై సమకాలీన రచయితల ప్రభావం, సంస్కృతి, పరిస్థితుల పరిసరాల ప్రభావం (Ethos), రచయిత కంఠస్వరం (Tone), ఆధునిక వాదాల ప్రభావం (Realism, Absurdism, Surrealism మొ॥నవి) క్రొత్త కథాంశాలు ఎన్నుకోవడం (Selection of themes ఉదా॥ కాఫ్కా, కెమూ) కథ చెప్పే తీరులో కొత్త పద్ధతులను (Modern Techniques) అవలంబించడం లాంటి చాలా విషయాలపై తెలుగులో సమగ్ర చర్చ జరగవలసిన అవసరం ఉంది.

**ఆధార గ్రంథాలు :**

1. కథానిక - పాఠాలు, సం. వల్లూరు శివప్రసాద్, మే 2016, అరసం, గుంటూరు.
2. కథాశిల్పం, వల్లంపాటి వెంకట సుబ్బయ్య ఆగస్టు 2016, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ.
3. కథాభారతి తెలుగు కథానికలు సం. వాకాటి పాండురంగారావు, పురాణం సుబ్రహ్మణ్య శర్మ, 1993, నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా.
4. కథా స్రవంతి పెద్దిభొట్ల సుబ్బరామయ్య కథలు, జనవరి 2015, సం. రాచపాళం చంద్రశేఖర్ రెడ్డి, అరసం, గుంటూరు.
5. కథాస్రవంతి మా గోఖలే కథలు సం॥ డా॥ పాపినేని శివశంకర్, జనవరి 2019, అరసం, గుంటూరు.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# హేతువాద రచనలు - సామాజిక చైతన్యం

– డా॥. తరపట్ల సత్యనారాయణ, తెలుగు శాఖాధిపతి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

ఆధునిక తెలుగు సాహిత్యంలో వైజ్ఞానిక దృష్టితో, తర్కబద్ధంగా నిజాన్ని నిర్భయంగా, అగ్నికణంలా అసలైన సత్యాలను సమాజానికి అందించి అందరిని ఆలోచింప చేసే సాహిత్యం ఏదైనా ఉందంటే అది హేతువాద సాహిత్యమే అవుతుంది. ఒక శాస్త్రీయ దృక్పథంతో విజ్ఞానాన్ని నలుదిశలా వ్యాపింపచేయడానికి సమాజంలో వున్న అనేకమైన దురాచారాలు, సాంఘిక అసమానతలు, మూఢాచారాలు వంటి అనేక రుగ్మతలను జనం ముందుకు తీసుకొచ్చే ప్రయత్నంలో హేతువాద సాహిత్యం ఒకడుగు ముందుకు వేసి సరికొత్త కోణంలో సరికొత్త ఆలోచనలకు వేదిక అయింది. ఒక కొత్త ప్రయోగానికి ప్రయోజనానికి నూతన అధ్యయాన్ని నెలకొల్పుకుంది. హేతువాద సాహిత్యం. అందుకే హేతువాద సాహిత్యంలో విభిన్న ప్రక్రియల్లో హేతువాద భావాలను అతి తక్కువ కాలంలో సమాజానికి అందించి శాస్త్రీయ కోణంలో నూతన శకాన్ని ప్రారంభించింది.

## ముఖ్య ఉద్దేశ్యం :

హేతువాద సాహిత్యం రావడానికి అనేక కారణాలున్నాయి. అకస్మాత్తుగా హేతువాద ఉద్యమం రాలేదు. పాశ్చాత్య సాహిత్యంలో దాని స్థానం అత్యున్నతమైంది. మొట్ట మొదటిగా 1895లో లండన్ రేషలిస్ట్ ప్రెస్ అసోసియేషన్ హేతువాదానికి సంబంధించి ఒక నియమావళిని తయారుచేసింది. మానవ సమస్యలను హేతువాద దృక్పథంతో చూడడం, అలాగే మతపరమైన విషయాల్లో అసలు నిజాన్ని శాస్త్రీయతను గుర్తించడం వంటి అంశాలపై హేతువాదం ఆ నిర్ణయం రావడం జరిగింది. అప్పటి నుండి ఇప్పటి వరకు హేతువాద సాహిత్యంలో ఎన్నో నూతన ఆవిష్కరణలు జరిగాయి. వాటిలో సాహిత్యం ద్వార సామాజిక జన చైతన్యం ఎంతవరకు వచ్చిందో సంక్షిప్తంగా తెలియచేయడమే ఈ పరిశోధన పత్రం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

## హేతువాద సాహిత్య నేపథ్యం :

11వ శతాబ్దంలో నన్నయ భారత ఆంధ్రీకరణతో తెలుగు సాహిత్యం ప్రారంభమైందని నన్నయ ఆదికవి అనే ప్రచారం శిష్ట సాహిత్య పండిత వర్గం అద్భుతంగా 21వ శతాబ్దం వరకు బహుళ ప్రచారం కొనసాగిస్తుంది. అసలు నన్నయ తెలుగు వాడు కాదనే ప్రశ్న రాకుండా, తెలుగు సాహిత్యానికి అతడే ఆదికవి అని, అతడే యుగకర్తగా భావించిన వారు ఉన్నారు. ఆంధ్రీకరణ కవి అనే పేరు మచ్చుకైనా ప్రస్తావించని పుంభావ సరస్వతీ పుత్రులు పుట్టిన దేశం మనది అని గర్వపడాలి. నారాయణ భట్టు చేసిన సహాయం నన్నయ అలంకార ప్రాయంగా పాయక పాకశాసనానికి భారత ఘోర రణంబులో కృష్ణుడు అర్జునునికి సాయమందించినట్లు చెప్పినా ఆ పద్యంలో ఉన్న అసలు రహస్యాన్ని ఎవ్వరూ ఇప్పటికి నిర్భయంగా చెప్పలేదు. అలాగే వేమన వచ్చే వరకు అసలు నిజాలు బయటకు రాలేదు. మొట్టమొదటి ప్రజా భాషలో ప్రజా సమస్యలను, దురాచారాలను నిర్భయంగా ఖండించి హేతవాద భావనలతో అందరికి గుప్పెడు గుప్పెడు ప్రసాదంలా పంచిపెట్టి అసలైన నిజాలను చెప్పిన మానవతావాది హేతువాది వేమన.

హేతువాదమనే పదం లేకుండానే మన ప్రాచీన దార్శనికులు తమ దర్శనాల్లో కార్యకారణ రూపంలో కొంత వరకు తర్కించినట్లు అధారాలు వున్నాయి. ప్రతీ కార్యానికి కారణం వుంటుందని, కారణం లేని కార్యం ఎక్కడా ఉండదని కాణాదుడు తన వైశేషికంలో చెప్పాడు. మొట్ట మొదటగా యురప్‌లో ఆధునిక హేతువాద భావన బయటకు వచ్చింది. దానికి అవసరమైన వైజ్ఞానిక వికాశం కూడా అక్కడ పురోగమించింది. ఈ నేపథ్యంలో 1899లో

ఇంగ్లాండ్‌లో రేషన్‌లిస్ట్ ప్రెస్ అసోసియేషన్ తొలిసారిగా నిర్వచించి దానికి లక్ష్యాలను ప్రకటించారు. 1) హేతువాదతత్వాన్ని నిర్నిబంధంగా ఆమోదించాలి. 2) అహేతుక భావాలను, ప్రమాణాలను, నిరాకరించాలి. 3) ప్రయోగం ద్వారా మాత్రమే నిరూపణ చేసుకోవడానికి వీలైన జీవిత తత్వాన్ని నీతిశాస్త్రాన్ని నిర్మించుకోవాలి. 4) ఈ లక్ష్యాలున్నా మానసిన వైఖరే హేతువాదం అన్నారు. 20వ శతాబ్దపు ప్రథమ దశలో త్రిపురనేని, గోరా రచనల వలన అటు హేతువాదం, ఇటు నాస్తికవాదం ఆంధ్ర దేశంలో విస్తరించడం ప్రారంభమయ్యింది.

## సామాజిక చైతన్యం కలిగించిన - సైద్ధాంతిక రచనలు :

హేతువాద సాహిత్యంలో ఒక రకమైన శాస్త్రీయత కనిపిస్తుంది. వాస్తవాల వక్తీకరణకు కార్యకారణ సిద్ధాంతాన్ని, వైజ్ఞానిక సిద్ధాంతాల ఆధారాలను రుజుమార్గంలో వివరించే ఒక నూతన ఒరవడిని గమనించవచ్చు. కట్టుకథలు, కల్పనా కథలు, కృత్రిమ రత్నాల్లా శోభిల్లిన పుక్కిటి పురణాలు, హేతువాద సాహిత్యంలో విమర్శలకు గురి అయ్యాయి. కొన్ని సందర్భాలలో హేతువాద రచయితలు నిర్మోహమాటంగా, బాహాటంగా యదార్థాన్ని నిష్పరవ్వలా పేల్చారు. దాంతో మతపరమైన అంశాల జోలికి వెళ్లొద్దని హేతువాదం అతివాదులు మితవాదుల్లా రెండు చీలికలయ్యాయి. అయినా వారి రచనలలో వాస్తవమైన అంశాలే ప్రాధాన్యత వహించాయి. అటువంటి వారిలో ముఖ్యంగా చెప్పుకోవలసినవారి రచనలను పరిశీలిద్దాం.

**సామినేని ముద్దు నరసింహనాయుడు - హితసూచిని :**

1792లో జన్మించిన వీరు తెలుగు ప్రజల చైతన్యం కోసం సాహిత్యాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించుకొని అర్థం అయ్యే భాషలో హితసూచిని రాసారు. బాల్య వివాహాల ఖండన, వితంతు పునర్వివాహ ప్రోత్సహం చైతన్యం కావాలంటే వ్యవహారికి భాషలో రచనలు వుండాలని గిడుగు కంటే ముందుగా ఉద్యమాన్ని నడిపి అందరికి ఆదర్శంగా హితసూచిని తీసుకొచ్చారు. వారు వాడుకభాషలో కూడా ఒక అడుగు ముందుకు వేశారు. తొలి వ్యవహారిక భాషా వచన గ్రంథం హితసూచి. ఈ గ్రంథంలో ప్రధానంగా హేతువాద భావనలతో పునాణాల్లో కల్లబొల్లి కథలున్నాయని, ధర్మశాస్త్రలలో ప్రక్షిప్తాలు, వైరుధ్యాలు కోకొల్లలుగా వున్నాయని, మంత్రాలకు జబ్బులు తగ్గవని, మసూచి, కలరా, స్ఫోటకం వంటి రోగాలకు అమ్మవారేనని మూఢనమ్మకాలను, ఆరోగ్య పరమైన సూచనలు ఎన్నో చేశారు. అలాగే కొలవులు, జాతరలు, తీర్థాలు, ప్రస్తావిస్తూ గంగలో మునిగినా, గుడిచుట్టూ ఎన్ని ప్రదక్షణలు చేసినా ఫలితం లేదన్నారు. అలాగే కృత్రిమ బంగారం చేయడం అబద్ధమని స్పర్శనేది ఒక అభూత కల్పనని, భూతాలు, దెయ్యాలు, పిశాచాలు లేవని, కుండ బద్దలు కొట్టినట్లు ఆనాడే హితసూచిలో వివరించారు. ఆత్మలు, ప్రేతాత్మలు, పిండాలు, తద్దినాలు ఇవన్నీ ఆచారాలలో భాగమని, వాటిలో వాస్తవాలు లేవని అన్నారు. సామినేని భావనలను ఆరోజుల్లో అర్థం చేసుకోలేకపోయారు. తరువాత అవే రచనలు సమాజానికి గొప్ప చైతన్యం తెచ్చాయి. వీరి తరువాత కందుకూరి, గురజాడ వంటి మహనీయులు హేతువాద దృష్టిలో విజ్ఞాన గ్రంథాలను అందించారు.

**తాపీధర్మారావు :**

తార్కిక దృష్టికి, వైజ్ఞానిక దృష్టికి తాపీ ధర్మారావు గారు రాసిన దేవాలయాల మీద బూతు బొమ్మలు, ఇనపకచ్చడాలు, పెళ్లి దాని పుట్టుపూర్వోత్తరాలు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. త్రిపురనేని, గిగుడు రామమూర్తి వంటి మహోన్నత వ్యక్తుల పరిచయంతో వీరి దృష్టిలో మార్పు వచ్చిందని చెప్పవచ్చు. ప్రాచీన కాలంలో జీవరాశి మనుగడకు సృష్టి కార్యం కారణమని అందుకే పూర్వులు స్త్రీ పురుష మర్మాంగాలను పూజించడం జరిగిందని, గుడిలో ఉపయోగించే గంట, దీపపు స్థంభం, శివలింగం వంటివి వాటి పరమార్థం తెలుసుకోకపోవడం దురదృష్టం అని అవన్నీ ప్రకృతి ఆరాధన పద్ధతులు ఆధునిక కాలంలో దైవం ఆరాధించేలా స్థితి వచ్చిందని హేతువాద దృష్టిలో

రాసారు. ప్రాచీన కాలంలో అమ్మాయి మెడలో తాటాకులు ధరించే పద్దతి తాళిగా మారిన విదానం బహుభతృత్వం, బహు భార్యత్వం అన్ని విషయాలు కూలంకుషంగా వివరించారు.

**యలమంచిలి వెంకట అప్పయ్య :**

హేతువాద ఉద్యమాలలో వీరికి ఒక ప్రత్యేకమైన స్థానం వుంది. వీరు రాసిన వేదాలంటే ఇవేనా ! దేవుళ్లు ఎవరి కొరకు, పుష్కరాలు ఎవరి కొరకు, తులసి రామాయణం అంటే ఇదేనా! కులమేది, అనేవి ఆ రోజుల్లో పెద్ద విప్లవాత్మకమైన చైతన్యాన్ని తీసుకొచ్చాయి. ప్రజల్లో నూతన ఆలోచనలను రెకెత్తించాయి. అప్పటి వరకు వీటిలో ఏదో పవిత్రత ఉందనుకునే భావనను గుట్టురట్టు చేసారు. పూజారి వ్యవస్థ, మత వ్యవస్థ దేవుడు పేరుతో దోపిడి, యజ్ఞాలు, యాగాలు, పూజలు, వ్రతాలు పేరుతో దోపిడి, భక్తి ముసుగులో జరిగే హేయమైన కార్యకలాపాలు ఇవన్నీంటిని కూలంకషంగా వివరించి హేతువాద ఉద్యమానికి దోహదపడ్డారు. 1923లో కాకినాడలో భారతీయ కాంగ్రెస్ సభలు జరిగినప్పుడు 5 వేల మందికి పెద్ద పాక నిర్మిస్తే అందులో కులవివక్షతతో బ్రాహ్మణులకు వేరే దడి, అడ్డుగా కడుతుంటే దాన్ని అడ్డగించి అందరూ ఒకటే అనే భావనను తీసుకొచ్చి సాంఘిక చైతన్యనాన్ని రగిలించిన గొప్ప సంఘ సంస్కర్త రచయిత వెంకట అప్పయ్య. త్రిపురనేనితో కలిసి మంత్రాలు లేని వివాహాలు, వర్ణాంతర వివాహాలు జరిపించారు. వీరి సాహితీ సేవకు మెచ్చి తెలుగు విశ్వవిధ్యాలయం కవి రాజు త్రిపురనేని పురస్కారాన్ని ఇచ్చి గౌరవించింది.

**గోరుబోయిన పొలయ్య :**

వీరు హేతువాద దోరణిలో సాంఘిక చైతన్యాన్ని తెచ్చిన గొప్ప ఉపాధ్యాయుడు. వీరి రచనలలో ముఖ్యంగా పురాణాలలో బూతు, విమర్శ రామాయణం అనేవి. ఇవి గొప్ప సంచాలనాలతో ఆనాడు సమాజంలో గొప్ప ప్రకంపనలను సృష్టించాయి. అనేక చర్చలకు దారి తీసాయి. వీరి ఉపన్యాసాలతో యువత సంస్కరణ వైపుకు మళ్లారు.

**సి.వి. రచనలు :**

చిత్రజల్లు వరహాలరావు గారు తెలుగు సాహిత్య ప్రపంచంలో సివిగా పేరు పొందారు. వీరు వ్రాసిన ఏ రచన అయినా గొప్ప చర్చకు దారి తీయవలసిందే. వాటిలో ముఖ్యముగా ఏడు కొండలవాడా గోవిందా గోవింద, డార్విను పరిణామ వాదం, హేతువాద నాస్తికోద్యమం, మద్య యుగాల్లో కులవ్యవస్థ, మనుధర్మశాస్త్రం, శూద్ర దళిత భానిసత్వం, చర్వాక వాదం వంటి రచనలు చేసి సహేతుక భావాలతో హేతువాద సాహిత్యాన్ని సమాజానికి అందించారు. వీరి రచనలలో నేటి అసమానతలు, అమాయకులపై భక్తి పేరుతో, మతం పేరుతో కులం పేరుతో జరుగుతున్న అనేక అంశాలపై స్పందిస్తూ రచనలు చేస్తూ సాంఘిక చైతన్యాన్ని తెస్తున్నారు సి.వి.

**రావిపూడి వెంకటాద్రి :**

వీరు వ్రాసిన గ్రంథాలు సైద్ధాంతికపరమైన శాస్త్రీయ దృష్టితో రాసినవి. హేతువాద ఉద్యమం అంటేనే రావిపూడి అనే పేరు వినపడుతుంది. వీరు రాసిన 50కి పైకి గ్రంధాల్లో ముఖ్యంగా విశ్వాన్వేషణ, జీవమంటే ఏమిటి? శాస్త్రం - పురాణం, హేతుత్వం - మతతత్వం, భావ విప్లవం - వర్గ చైతన్యం, జ్యోతిష్య శాస్త్రం, శాస్త్రం - మతం హేతువాదాలపై నైతిక విప్లవం, మనోధర్మశాస్త్రం - మానవ ధర్మ శాస్త్రం వంటి గ్రంథాలు వీరి హేతువాద భావనకు నిదర్శనం. ఈ సమాజంలో జరుగుతున్న దోపిడి, స్వాములు, పీఠాధిపతులు చేస్తున్న దోపిడి, ఆచారాల పేరుతో చేస్తున్న మోసాలు వంటి అంశాలపై రచనలు చేసి సాంఘిక చైతన్యాన్ని కలిగించారు రావిపూడి. వీరు హేతువాది అని పత్రికను నడుపుతూ సామాజిక చైతన్యాన్ని రగిస్తున్నారు.

**ఎన్.వి. బ్రహ్మం :**

ఎం.ఎన్. రాయ్ ప్రభావంతో హేతువాద ఉద్యమంలోకి వచ్చిన వీరు క్రైస్తవ మత వ్యవస్థలో ఉన్న లోపాలను పరిశీలించి నిష్కర్షంగా విమర్శ చేసి రాసిన గ్రంథాల్లో బైబిల్ బండారం ఒకటి. దీనిపై కోర్టులకు

వెళ్ళవలసి వచ్చింది. నిషేదంగా వచ్చిన గ్రంథంపై విజయం సాధించారు. అలాగే బైబిల్‌లో వున్న కొన్ని కట్టు కథలను సహేతుకంగా విమర్శించారు.

**పెనుమత్స సుబ్బరాజు :**

వీరు క్రైస్తవ వ్యవస్థలో వుండే లోపాలను ఎత్తి చూపే విధంగా అన్నీ అంశాలపై సహేతుక విమర్శ చేసారు. వాటిలో ముఖ్యంగా బైబిల్ దేవుడి ఆటకట్ట. నా పరిశీలనలో బైబిల్, బైబిల్ ఏమంటుంది అనే గ్రంథాలు రాసి క్రైస్తవ వ్యవస్థలో వున్న అనేక అంశాలపై చర్చనీయంశంగా రాసారు.

**త్రిపురనేని రామస్వామి చౌదరి :**

హేతువాద కవిత్వమంటేనే మొట్టమొదటిగా గుర్తుకు వచ్చేది త్రిపుననేని రామస్వామి చౌదరి, వీరి సూత పురాణం, భగవద్గీత చెప్పుకోదగినవి. వీరు సూతాశ్రమం స్థాపించి హేతువాద భావజాలాన్ని ప్రచారంలోకి తెచ్చారు. కులవ్యవస్థపైనా, మత వ్యవస్థ పైనా అందులో వున్న లోపాలను పూర్తిగా దుయ్యబట్టారు. పూజా విధానంలోను, పూజారుల్లోను ఉన్న అనేక హేయమైన అంశాలను వీటిలో ప్రస్తావించారు. త్రిపురనేని రామకోటి రాస్తే వచ్చేది స్వర్గం కాదని పుణ్యం కాదని విమర్శించారు. సూత పురాణం రాసి సంచలనం సృష్టించారు. భగవద్గీత రాసి మరో సంచనం సృష్టించారు. భగవద్గీతలో బ్రహ్మనాయుడు తన కుమారునికి హితోపదేశం చేస్తూ

మతములేపుట్టకున్న యెడ మారణకర్మములన్నీ సాగునే
ప్రతిదినవసమ్ము భారతధర్మస్థలి ! నేనిటువంటి కర్మసం
తతులను సైచువాడనే సనాతన ధర్మ ముకండె యుంచిన
మ్మి తెరుగువారికెల్లపుడు మేలొడ గుర్చుచునొండు బ్రమమై

అంటూ భారతదేశంలో జరుగుతున్న మత మారణ కాండను వివరిస్తూ మతమే పునాదిగా ఉన్న ఈదేశంలో అనేక అసమానతలు, అవమానాలు వున్న సమాజమే కనిపిస్తుంది అని అంటాడు. అందుకనే త్రిపురనేని పూజారి వ్యవస్తను నిరసించాడు. మంత్రాలను విసర్జించి అర్ధ మయ్యేరీతిలో, భాషలోనే జరగాలని ప్రత్యక్షంగా అనేక వివాహాలు జరిపించారు త్రిపురనేని. అంతేకాదు ఆర్య ద్రవిడ జాతుల మధ్య అగాధాన్ని సహేతుకంగా వివరించారు.

**ముగింపు :**

హేతువాద భావనలతో తెలుగు సాహిత్యంలో అనేక మంది వారి రచనల ద్వారా సాంఘిక చైతన్యాన్ని తీసుకొని వచ్చి అసలు విషయాన్ని, నిజాన్ని తెలియజేసే ప్రయత్నం చేసి సఫలీకృతుడయ్యారు. అలాగే వేమన, పోతులూరి వీరబ్రహ్మం వంటి మహనీయులు వారితో పాటు ఇదే దోరణిలో వ్యసాలు, కవితలు రాసిన వారు ఉన్నారు. హేతువాద ఉద్యమం సమసమాజ స్థాపనకు కృషి చేసారు.

**ఆధార గ్రంథాలు :**

1) ఆంధ్రప్రదేశ్‌లో హేతువాద ఉద్యమం - తెలుగు అకాడమీ ప్రచురణ
2) పురాణాలు మరోచూపు - డా॥ బి. విజయ భారతి

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# వేయిపడగలు నవలలో గిరిక భగవద్భక్తి

– డా॥. వై. శ్రీలత, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బంటుమిల్లి, కృష్ణా జిల్లా.

ఆధునిక ఆంధ్రకవులలో కళాప్రపూర్ణ కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు అగ్రేసరులు, సర్వ సాహిత్య ప్రక్రియల్లో విశారదులు. మహాకావ్యాలు, ఖండ కావ్యాలు, గేయ కావ్యాలు, నాటకాలు, నవలలు, కథానికలు, విమర్శలు మొదలైన ఎన్నో ప్రక్రియలు వారి కలంనుండి జాలువారి విశిష్టతను సంతరించుకున్నాయి.

విశ్వనాథవారి గద్యరచనల్లో 'వేయిపడగలు' నవల వన్నెలో, వాసిలో విశిష్టమైన రచనగా పేరుపొందింది. నవల పేరులోనే ఆధ్యాత్మిక భావం, విశాల విశ్వ ప్రపంచం ఇమిడిఉంది. విశ్వనాథవారి ఆధ్యాత్మిక దృక్పథాన్ని సంపూర్ణంగా ఈ గ్రంథం ప్రతిబింబిస్తుంది. ఈ గ్రంథం నాటి సాంఘిక, సాంస్కృతిక, రాజకీయాది సర్వ విషయాలకు ప్రతిబింబం వంటిది. రెండు విభిన్న సంస్కృతుల మధ్య ఏర్పడ్డ సంఘర్షణను ఈ నవలలో అపూర్వంగా చిత్రించి 1930వ సంవత్సరంనాటి తెలుగు జీవిత సంక్షోభం, ఎత్తుపల్లాలను వ్యక్తపరచారు విశ్వనాథవారు. మతం, బాల్య వివాహాలు వంటి సాంఘిక దురాచారాలు, విద్యాసంస్థల తీరుతెన్నులు, వైద్యం, జమీందారీ వ్యవస్థ లాంటి అంశాలెన్నో చర్చించబడటం ఒక ఎత్తు, తత్త్వ బోధన మరొక ఎత్తు.

సాధారణంగా, తత్త్వాన్ని ఉపదేశించే పద్ధతులు మూడువిధాలుగా కనిపిస్తాయి. కథ చెబుతూ అందులోని పాత్రల రూప, గుణ, స్వభావాల వర్ణనలద్వారా తత్త్వాన్ని బోధించడం మొదటి పద్ధతి. పాత్రల సంభాషణల ద్వారా తత్త్వ విషయం వెల్లడించడం రెండవ పద్ధతి. ఇతివృత్తం లేకుండా పూర్తిగా వేదాంతాన్ని బోధించడం మూడవ పద్ధతి. ఈ మూడింటిలో ఈ నవలలో విశ్వనాథవారు మొదటి రెండు పద్ధతులను పాటించినట్లుగా తెలుస్తున్నది.

వేయిపడగలు నవలలో ఎన్నో పాత్రలు కనిపిస్తాయి. అందులో భగవద్భక్తులుగా కృష్ణమనాయకుడు, గిరిక, హరప్ప, గోపన్న, ధర్మారావు, గణాచారి, రామేశ్వర శాస్త్రి, రుక్మిణమ్మారావు, సరోజినీదేవి మొదలైనవారు కనిపిస్తారు. వీరందరూ భగవద్భక్తి కలిగి, నిరంతరం భగవత్సేవలో తరించి భగవదనుగ్రహానికి పాత్రులైనారు. భగవంతునిపై భక్తికలవారు భాగవతులు. భాగవతుల లక్షణాలు విష్ణు పురాణంలో యమధర్మరాజు చేత చక్కగా వివరింపబడినవి.

## గిరిక భక్తి :

గిరిక భోగాంగన రత్నగిరి కూతురు. దేవదాసిగా జీవితం గడిపింది. వేశ్యాకులంలో పుట్టినప్పటికీ గుణంలో మాత్రం గోపాలస్వామి మహాభక్తురాలు. భగవదర్పణ బుద్ధితో నిష్కామంగా ఆచరించరించేదంతా విధివిహితమైన కర్మ అనబడుతుంది. నవలలో గిరిక తన కుల వృత్తియైన నాట్యాన్ని నేర్చుకొని భగవదర్పణ బుద్ధితో పరమాత్మ ఎదుటే ఆ కర్మను ఆచరించింది.

భాగవత సిద్ధాంతం ప్రకారం జీవుడు సదాచార్యుని ఆశ్రయించుట క్షేమదాయకం. ఈ నవలలో గిరిక ఆశ్రయించిన సదాచార్యుడు ధర్మారావు. నాట్యం చేయడానికి లాక్కొని రమ్మని కాసావానినొకణ్ని రామేశ్వరం గిరిక వద్దకు పంపగా అది ఇష్టంలేని గిరిక ధర్మారావు పంచన చేరుతుంది. అతనివద్దే భాగవతాన్ని చదివి అర్థాన్ని తెలుసుకొని జ్ఞానవంతురాలౌతుంది. ఇంకా, లీలాతరంగిణి, గీత గోవిందం మొదలైన గ్రంథాలు చదివి తత్త్వాన్ని అవగాహన చేసుకుంటుంది. ఇక్కడ గిరిక అనే జీవుడు రామేశ్వరమనే అజ్ఞానానికి లోబడక, ధర్మారావు అనే సదాచార్యుని చేరి పరమాత్మ జ్ఞానాన్ని తెలుసుకుందని స్పష్టమౌతున్నది.

పోతన భాగవతంలో చెప్పిన నవవిధ భక్తులు గిరికలో కనిపించడం విశేషం. వేణుగోపాలస్వామికి కళ్యాణోత్సవాలు జరుగుతాయని తెలియగానే పట్టలేని సంతోషం

ప్రకటించడం, భాగవతాన్ని పఠించడం, కృష్ణుని విగ్రహాన్ని తన గదిలో ఉంచుకొని పూజించడం, స్వామికి తన సర్వస్వాన్ని సమర్పించడం, రాత్రి నిద్రపోయేవరకూ స్వామిని ధ్యానించడం, 'స్వామి లేనిది, నాతో మాటాడనిది నేను జీవించను. చెరువునపడి ప్రాణముల విడుతునని తలంచుట' మొదలైనవన్నీ గిరిక భక్తి తత్పరతకు చిహ్నాములు.

సాటి భక్తులపై ప్రేమను చూపించడమేకాక భగవంతునికి సంబంధించిన వస్తువులపైకూడా ప్రేమను చూపించుట భాగవతుని లక్షణం. ఒకసారి - ఆలయంలోని స్వామి యొక్క మణి క్రిందపడినప్పుడు దాన్నితీసి అర్చకుడు గిరికకు చూపించాడు. అప్పుడు.... "సముద్రుడు తన కూతురు లక్ష్మిని స్వామి కొసగుచు ఆమె గుండెలోని ప్రేమంతయు కూడా బిండి మణియాకారమున చేసి ఆతనికి కానుకగా నిచ్చెనా ఏమి? స్వామి ప్రేమకు నోచుకొనిన ఆ మణిని చేతులలోనికి తీసుకొని ఎదకు హత్తుకొనిన నెంత బాగుండును?" అని గిరిక తలచింది.

స్వామికి ఇష్టమైన పని చేయడం సేవకుని విధి. తెల్లని వస్తువులను చూడగానే పాలసముద్రం గుర్తుకు వచ్చి స్వామికి సంతోషం కలుగుతుందని భావించి గిరిక స్వామి ఆలయానికి వచ్చినప్పుడల్లా తెల్లచీరను ధరించి రావడం ఆమె సేవాభావానికి నిదర్శనం.

భక్తులెల్లప్పుడూ స్వామి సాలోక్య సామీప్య సారూప్య సాయుజ్యాలను కాంక్షిస్తారు. "గుడిలో ప్రభువున కెదురుగ నిల్చున్నపుడున్నంత సుఖము నాకింటి వద్ద కలుగుట లేదు. ఎప్పటికి నిచ్చటనేయుండవలెనని భావన కలుగ చున్నది" అని గిరిక ధర్మారావుతో అనడం ఆమె స్వామి సామీప్యమును కోరుకుందనడానికి నిదర్శనం.

"గిరిక యొక్క తెల్లని పలువరస సుదర్శ నాయుధపు టంచుల వలెను, చెవులు శ్రీకారములై పాంచజన్యములట్లు, కన్నులు కమలములవలె, నాసిక కౌమోదకి వలెను, భ్రూయాగము శార్ఙ్గము ద్విధావిభక్త మైనట్లును, మొత్తము మీద ఆమూర్తి వికుంఠియై మనోజ్ఞమయ్యెను" అని విశ్వనాథవారు గిరికను వర్ణించిన తీరు గిరికను స్వామి సారూప్యాన్ని పొందిన భక్తురాలిగా తెల్పుతుంది.

స్వామి దయ కలుగలేదని బాధపడడం, దు:ఖించడం ఆర్తిగలవారి లక్షణం. అటువంటి లక్షణం గిరికలో కనిపిస్తుంది. "బాధహరింపు వరింపు మాధవా" అని స్వామిని ప్రార్థించి నాథుడెప్పటికయినా నన్ను క్షమించునా? స్వామి కరుణించని ఈ మొండి బ్రతుకెందులకు ఒక్కసారిగా ఈమెడ నరుకు కొనమందువా" అని ధర్మారావుతో గిరిక పలికిన పలుకులు ఆమె ఆర్తిని సూచిస్తున్నాయి.

మాట్లాడుతూ మాట్లాడుతూనే దు:ఖించడం, శరీరం మైమర్చడం మొదలైన లక్షణాలు భక్తి పరాకాష్టకు చేరిన వారి లక్షణాలు.

అరుంధతీరథంతరులు గిరికనుగూర్చి 'స్వామిరాకకై వేచియున్న గోపిక మా గిరిక' అని ఎప్పుడూ చెప్పేవారు. గిరిక నిర్మలమైన భక్తికలది. కనుకనే అందరూ ఆమెను గోపికగా గుర్తించారు. పరమాత్మను తెల్సుకున్న భక్తుడు తాను మరొకరికి ఋణపడి ఉండటానికిగానీ, భోగ్య వస్తువుగా మారడానికిగానీ అంగీకరించడు. గిరిక అటువంటి లక్షణాలు కలది. ఒకసారి గిరిక స్వామి సన్నిధికి వెళ్తుండగా వీధిలో రామేశ్వరం కలసి "పిల్లా! ఎచటికి వెళ్ళుచున్నావని" పలకరించగానే తనదేహం, తన అలంకారం మైలపడిందని భావించి ఇంటికి వచ్చి అలంకారాలు తీసి, స్నానంచేసి మళ్లీ స్వామి సన్నిధికి వెళ్లింది. అలా వెళ్లేప్పుడు గిరిక నల్లని చీర ధరించడంవల్ల నల్లనివాడైన స్వామి సారూప్యాన్ని కోరి నల్లనిచీర కట్టినట్లుగా భావించడానికి అవకాశం ఏర్పడింది. దుష్టుల అపకారంవల్ల ఒక్కొక్కప్పుడు భగవద్విషయంలోగానీ, భక్తుల విషయంలోగానీ ఉపకారంగానే పరిణమిస్తుందనే ఆప్త వాక్యం గిరిక పట్ల నిరూపితమైంది.

స్వామి పట్ల అనురాగం అధికమైనప్పుడు భక్తుడు తనలోతాను మాట్లాడటం, ఏవేవో ఊహించుకోవడం చేస్తూ ఉంటాడు. గిరిక తన కలలో స్వామిని ఎన్నోసార్లు సేవించింది. అడుగడుగునా ఆ దేవదేవుని చింతన అనే సుధామాధుర్యానికి ఆమె మేను పరవశించింది. తన ప్రాణాన్ని స్వామికి ముడుపుకట్టింది. విరహంతో కూడిన

తన్మయత్వపు స్థితిలో ఆశలు పెంచుకొని జీవించింది. అలాంటి గిరిక " గోపాలస్వామికి కల్యాణం జరిగినప్పుడు నేనెట్లుండుదునో? నేను రాధను, గోపికను, రుక్మిణిని, సత్యభామను" అని తలచింది. అంతలోనే "స్వామికి కల్యాణము కావలయునుగాని ఆయనకు నేనేమీ కాను. ఆయన కాలి దుమ్మునగుదును... స్వామి వేణువును స్వీకరించి ఆతని హస్తాంగుళులకు విశ్రాంతి కల్గించెదను, కల్యాణమంటపమునకు నడచివచ్చునపుడు స్వామి పాదములు కందకుండ నాచేతులపై నడిపించుకొన వచ్చువీలుండునో"...? అని పలువిధాలుగా భావించింది.

స్వామి సన్నిధిలో భక్తుడు అహంకార మమకారాలను విడిచి తన దుస్థితిని వివరించినప్పుడే స్వామి భక్తుడిని అనుగ్రహించే అవకాశం కల్గుతుంది. "సాత్త్వికగుణరాశి యైన స్వామికి దమోగుణరాశినైన నేనెట్లు పనికివత్తును? నామనస్సు తమోదూషితమైనది" అని గిరిక భావించి తన దుస్థితిని వెల్లడించింది.

భగవంతుని సేవా కార్యక్రమాలలో పాల్గొనడం, స్వామి ప్రసాదాన్ని స్వీకరించడం మొదలైన విషయాలు భక్తుడికి 'పేదవానికి పెన్నిధి దొరికినట్లు'గా ఉంటాయి. కన్నుల్లో దివ్యజ్యోతులు, దేహంలో దైవత్వాన్ని కలిగిన గిరిక సప్తాహ సందర్భంగా వెల్లటూరి ఆంజనేయులుగారు బాలగోపాల తరంగమును ప్రారంభించినప్పుడు తాను ఆ నిమేష స్థితిని పొందింది. సప్తాహం జరిగినన్ని రోజులు రోజంతా స్వామి ఆలయంలోనే ఉండి అర్చకుడిచ్చిన దేవుడి ప్రసాదం, అరుంధతీ రథంతరులు తెచ్చిపెట్టిన ప్రసాదాన్ని స్వీకరించింది. పురాణాలను వింటూ కాలక్షేపం చేసింది.

కృష్ణపరమాత్మ కల్యాణోత్సవాలలో గిరిక స్వామి దశావతారాలను అభినయించింది. ఆమె మొదటిరోజు మత్స్యావతార స్ఫూర్తిని కలిగించే అలంకరణ చేసుకొని స్వామి సన్నిధిలో నాట్యం చేసి మత్స్యమూర్తిలో తాను కలిసిపోయిన భావన పొందింది. గిరిక నాట్యం చేయ డానికి ముందు స్నానంచేసి స్వామి అవతారానికి తగిన అలంకరణ చేసుకొని కృష్ణదేవుని విగ్రహం ఎదుట పద్మాసనంలో కూర్చొని మంత్రోచ్చారణ ప్రారంభించేది. అలా కూర్చొని తర్వాతిరోజు స్వామి సన్నిధికి నాట్యం చేయడానికి వెళ్లేవరకూ మంత్రోచ్చారణ చేసి స్వామి అవతారాన్ని అభినయించడానికి తగిన స్ఫూర్తిని గిరిక పొందేది. ఈ విధంగా మిగిలిన అవతారాల్లోనూ స్వామిని దర్శించుకొని తగిన స్ఫూర్తిని పొందింది. ప్రతీ అవతారం లోనూ తాను ఐక్యం చెందినట్లుగా భావించడం ఆమె పరజ్ఞానానికి (భగవత్ విషయంతో తాను కలసిఉన్న భావన) నిదర్శనం.

"స్వామిలేనిది నేను జీవించలేను. స్వామి కృప చూడని ఈ దేహం ఎందులకు? నన్నెప్పుడు కరుణించును? స్వామిచే సమాదృతము కాని ఈ దేహముతో నేనుండ లేను" అని అన్నతో పలుకుట, పలుమార్లు భావించుట గిరిక పరమభక్తికి చిహ్నం. జీవుడు ప్రాపంచికమైన బాధ లను భరింపలేక మనిషిలోని దుర్బలత్వాన్ననుసరించి "భగవంతుడు నన్ను కరుణించలేదే? నేనతని చేరలేదే" అని దు:ఖించి, అంతలోనే "భగవంతుడు నాలోనే ఉన్నాడు నాతోనే ఉన్నాడు" అని తృప్తి పడతాడు. నవలలో గిరిక స్వామి అనుగ్రహించలేదే, నాతో మాట్లాడలేదే అని విచారించి "తన స్వామి తనతోడనే కలిసి క్రీడించు చున్నాడు" అని తృప్తిపడింది.

గిరిక మాధవునిలో లీనమయ్యే ఘట్టాన్ని విశ్వనాథ వారు అద్భుతంగా చిత్రించారు. గిరిక శ్రీకృష్ణావతారాభి నయం చేసేప్పుడు ఆమె తన్మయత్వంతో తలమునకలై పట్టరానిదైంది. "మాధవం దర్శయ హే మందార మాధవం దర్శయ" అంటూనే తన స్వామి చిహ్నము లన్నింటిని చెప్పింది. శ్రీ కృష్ణలీలలన్నింటినీ అభినయిం చింది. నృత్యం చేస్తూనే తన్మయత్వంతో మూర్ఛను పొందింది. ఆమె స్థితిని గుర్తించిన ధర్మారావు కుంభ హారతిని వెలిగించే ఏర్పాటు చేయగా, ఆ అఖండ హారతిలో స్వామిని కళ్లవెంట కన్నీటి ధారలతో దర్శించు కుంది. క్రమంగా స్వామి మూర్తి ఆమెలో ప్రవేశించిడంతో, గిరిక పంచేంద్రియాలు, మనస్సు, బుద్ధి, అహంకారం.. సర్వం ఆ దివ్యపురుషుని స్ఫూర్తితో నిండింది. గిరికకు

దర్శనమిచ్చిన దివ్యపురుషుని వర్ణించి ముక్తులు దర్శించే భగవత్స్వరూపాన్ని పాఠకులకు ఈ సందర్భంగా విశ్వనాథ వారు దర్శింపజేసారు.

జీవాత్మను పరమాత్ముని వద్దకు చేర్చేవాడు సదాచార్యుడు. జీవుని స్థితిని, పరాకాష్ఠకు చేరిన అతని పరమభక్తిని గుర్తించిన ఆచార్యుడు పరంజ్యోతి స్వరూపుడైన పరమాత్మను దర్శింపజేసి ఆ ఆత్మను తరింపజేస్తాడు. ఈ నవలలో ఆ పనిచేసింది ధర్మారావు. గిరిక స్థితిని, పరాకాష్ఠకు చేరిన ఆమె పరమభక్తిని గుర్తించి అఖండ హారతిని వెలిగించమని చెప్పి ధర్మారావు గిరికకు పరమాత్మ దర్శనమును సులభతరం చేసి ఆమెను తరింపజేసాడు.

భగవంతుని సన్నిధిలో పదిరోజులు నాట్యం చేసి చివరిరోజు భగవంతుని దర్శనాన్ని పొంది గోపాలస్వామిలో లీనమైన గిరిక సామాన్య భక్తురాలు కాదు. ఉత్తమోత్తమురాలైన భక్తురాలు. భక్తుడు తానొక్కడే పవిత్రుడు, ముక్తుడగుటకు ప్రయత్నించకుండా తోటివారిని కూడా తన మాదిరిగా చేయడానికి ప్రయత్నిస్తాడనే విషయాన్ని విశ్వనాథవారు గిరిక హరప్పను పునీతుని చేసిన సన్నివేశం ద్వారా వివరించారు.

## ముగింపు :

సంపదలు, దారిద్ర్యం, సుఖదు:ఖాలు, సంయోగ వియోగాలు వీటన్నింటినీ దాటుకొని ఆకాశమార్గంలో ప్రయాణించబోయే మహా జ్యోతిలా అరుంధతీ ధర్మారావులకు కనిపించిన విశిష్టురాలు గిరిక. ఆమె తనకులం వారినుద్ధరించడానికి అవతారమెత్తిన మూర్తిగా, దేవదాసిగా చెప్పబడినా అరుంధతీ రధంతరులచే సేవించబడుతూ వాణీపార్వతులతో సేవించబడిన 'మహాలక్ష్మి'లా వేయిపడగలు నవలలో ప్రకాశించింది.

## ఆధార గ్రంథాలు :

1. భాగవత వైజయంతిక (వ్యాస సముచ్ఛయము), ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ, హైదరాబాదు ప్రచురణ, 1983
2. వేయిపడగలు-విశ్లేషణాత్మక విమర్శ, డాక్టర్ ఎస్. గంగప్ప, స్వీయ ప్రచురణ, 1987
3. వేయిపడగలు - శ్రీ విశ్వనాథ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాదు, 2014

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# దిగంబర పయనం

- డా॥. వెంకటరామయ్య గంపా, అసిస్టెంట్ ప్రొఫెసర్, భారతీయభాషల అధ్యయన కేంద్రం, ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ.

తెలుగులో కొంతమంది కవులు వారి రచనలను దిగంబర సాహిత్యంగా పేర్కొన్నప్పుడు సాహిత్యలోకం వారిని వింతగా చూసింది. వారు సాహిత్యంలో ఉపయోగించిన పదజాలాన్ని విమర్శకులు బూతు అని పేర్కొన్నారు. మరికొంతమంది ఈ బూతును భరించడం కష్టమని వాపోయారు. కవులు ఆనాడు ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వారి ఆవేదనను తెలియచేయటానికి, ఆ పదజాలాన్ని ఒక సాధనంగా చేసుకున్నారు. ఈ సాహిత్య చర్చ ఇరవయ్యో శతాబ్దంలో ఒక ప్రజాస్వామ్య దేశంలో జరిగింది.

కానీ దాదాపు వెయ్యి సంవత్సరాల క్రితం ఒక కవయిత్రి తన లక్ష్యాన్ని చేరుకోవటానికి దిగంబరంగానే తన పయనాన్ని కొనసాగించింది. ఆమే అక్కమహాదేవి. ఆమె లక్ష్యం శివునిలో ఐక్యం కావడం. అందుకోసం ఆనాడు ఆమె తనకు ఆటంకంగా నిలిచిన సనాతన సంప్రదాయాలను కూల్చివేసి తన గమ్యంవైపు పయనించింది. ఆ విరాగిని జీవితచరిత్రను శ్రీనివాసదీక్షితులు నవలగా రచించారు. ఇది చారిత్రక, ఆధ్యాత్మిక నవల. ఆ నవలను పరిచయం చేయటం ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

## నవల కథా వస్తువు :

ఉడుతడిని రాజధానిగా చేసుకుని కౌశికుడనే జైన మత రాజు రాజ్యాన్ని పరిపాలించేవాడు. ఆ ఉడుతడి గ్రామంలో నివసిస్తున్న నిర్మలశెట్టి, సుమతి దంపతులకు చాలా కాలం వరకు సంతానం లేదు. శైవక్షేత్రాలన్నింటినీ దర్శించిన అనంతరం సుమతి గర్భం ధరించింది. ఆమె ప్రసవ సమయంలో కళ్ళు మూసుకున్నప్పుడు పార్వతీ మాత తనకు ప్రత్యక్ష్యమవుతుందని చంద్రశేఖరమ్మకు (నవలలోని మరొక పాత్ర) చెబుతుంది. ఆ విషయం విన్న చంద్రశేఖరమ్మ సాక్షాత్తు... పార్వతీమాత సుమతి కడుపున పుట్టబోతూందని, మంచి జాతకురాలవుతుందని చెప్పింది. సుమతి ఆడబిడ్డను ప్రసవించింది. ఆ బిడ్డకు అక్కమహాదేవి అని పేరు పెట్టారు. అక్కమహాదేవి అన్నప్రాశన సందర్భంలో వస్తువులను తాకించే ఏర్పాటు చేశారు. ఆ సమయంలో ఆ పాప తాళపత్రాలను, రుద్రాక్షలను ముట్టుకుంది. వస్తువులను మార్చి పెట్టినప్పటికీ తిరిగివాటినే ముట్టుకుంది. అక్కమహాదేవికి ఐదు సంవత్సరాల వయసు వచ్చిన తర్వాత గురుకులానికి వెళ్ళి చదువుకుంటానని తల్లిదండ్రులతో చెప్పింది. ఆ రోజుల్లో ఆడపిల్లలకు గురుకుల చదువులు అమలులో లేవు. కానీ తండ్రి నిర్మలశెట్టి ఉదయాన్నే అక్కమహాదేవిని గురుకులానికి తీసుకువచ్చి సాయంత్రం తిరిగి ఇంటికి తీసుకు వెళ్ళే విధంగా గురుకులాధిపతి ఒప్పుకున్నాడు. గురుకుల విద్యాభ్యాసంలో ఆమె అసమాన ప్రతిభావంతురాలిగా గుర్తింపు పొందింది. విద్యాభ్యాసం పూర్తైన తరువాత వివాహం చేయటానికి తల్లిదండ్రులు ప్రయత్నించారు. కానీ అక్కమహాదేవి తాను చిన్నప్పటినుంచి చెన్నమల్లికార్జునిడిని తన భర్తగా భావించానని, ఇంకెవరినీ తన భర్తగా భావించలేనని చెప్పింది. ఈ విషయంలో తల్లిదండ్రులు కలతచెందారు.

ఒకరోజు రాజ్యాధిపతి కౌశికుడు తన విజయయాత్ర సందర్భంలో అక్కమహాదేవిని చూశాడు. ఆమెను వివాహం చేసుకోవటానికి నిశ్చయించుకున్నాడు. ఈ పెళ్ళి విషయాన్ని మంత్రిద్వారా నిర్మలశెట్టికి తెలియచేశాడు. ధన, వస్తు కానుకలను ఆశగా చూపాడు. నిర్మలశెట్టి, అక్కమహాదేవి ఇద్దరూ పెళ్ళి విషయాన్ని తిరస్కరించారు. వారు ఈ వివాహానికి ఒప్పుకోకపోతే రాజదండనకు గురికావాల్సి ఉంటుందని రాజుగారి హెచ్చరికగా మంత్రి చెప్పాడు. విషయం శృతిమించిందని గ్రహించిన అక్కమహాదేవి చివరకు తను ఒక్కతే రాజైన కౌశికుడితో

మాట్లాడటానికి రాజగృహానికి వెళ్ళింది. అక్కడ రాజుతో తాను వీరశైవ మతానికి చెందిన స్త్రీనని, రాజు జైన మతస్తుడని వారి వివాహం జరగటం కష్టమని చెప్పింది. కానీ అక్కమహాదేవి వ్యామోహంలో ఉన్న రాజు ఆ మాటలు వినక తనను వివాహమాడాల్సిందేనని చెప్పాడు. అక్కమహాదేవి చివరకు మూడు షరతులు విధించింది. ఆ షరతులకు ఒప్పుకుంటేనే వివాహమాడతానని చెప్పింది. అక్కమహాదేవి మీద ఉన్న మోహంతో రాజు ఆ షరతులకు ఒప్పుకున్నాడు. మొదటి షరతు తన కోసం, తన పూజ కోసం ఒక కుటీరాన్ని నిర్మించడం. రెండవది తను పూజించే జంగమలకు కావాల్సిన భోజన వసతులను ఏర్పాటు చేయటం. మూడవ షరతు తరువాత చెబుతానంది. ఈ నిర్ణయాలన్నీ తాత్కాలికమేనని తన రాజభోగాలకు అక్కమహాదేవి అలవాటుపడుతుందని భావించి కౌశికుడు షరతులను అమలు చేయించాడు. జంగమలకు కావాల్సిన ఏర్పాట్లు చేయటంతో ధనాగారం నిండుకుంది. అక్కమహాదేవి కూడా తన గురువును పిలిచి శాశ్వత శివదీక్ష తీసుకుంది. ఈ విషయం తెలిసి రాజు అక్కడకు వచ్చాడు. అక్కమహాదేవి తన మూడవ షరతు ప్రకారం శైవుడినే వివాహమాడతానని చెప్పింది. రాజు అందుకు కోపగించుకుని వెళ్ళిపోయాడు. కామాతురుడైన రాజు మరుసటిరోజు అక్కమహాదేవి దగ్గరకు వెళ్ళాడు. దీక్షలో ఉన్న మహాదేవిని బలత్కరించే ప్రయత్నం చేశాడు. ఆమెను వివస్త్రను చేసేందుకు ప్రయత్నించాడు. అందుకు ప్రతిఘటించిన అక్కమహాదేవి ఈ శరీరం తనది కాదని చెన్నమల్లికార్జున స్వామిదని భావించి ఆ వస్త్రాలను అతడిపైనే విసిరి దిగంబరిగా నిలబడింది. 'తుచ్ఛమైన శరీరాన్ని తాత్కాలికమైన కామ సుఖం కోసం ఆశించి నీ బుద్ధి బయట పెట్టుకున్నావు. ఈ క్షణం నుంచి నీకు నాకు ఏ సంబంధం లేదని' తీవ్రస్వరంతో నిందించి అక్కడ నుంచి దిగంబరిగానే బయటకు వచ్చింది. తన పొడవైన కేశాలనే తన శరీర భాగాలను కప్పే వస్త్రాలుగా చేసుకుంది. మహామంత్రి చీర తెప్పించి అక్క మహాదేవికి ఇచ్చాడు. కానీ ఆమె తిరస్కరించింది. ఈ విషయం తెలిసి అక్కడికి అక్కమహాదేవి తల్లిదండ్రులు వచ్చారు. ఆమెను వస్త్రాలను ధరించమని ప్రాధేయపడ్డారు. కానీ అక్క మహాదేవి ఈ విషయాలను తోసిపుచ్చి ఇక భవబంధాలు వదిలేయమని, తన శరీరం చెన్న మల్లికార్జునిడిదని, తన పయనం ఆయన వద్దకని చెప్పి బయలుదేరింది. దిగంబరంగా పయనిస్తున్న అక్కమహాదేవిని గురించి పలువురు పలు విధాలుగా మాట్లాడుకున్నారు. దారిలో పలు ఇబ్బందులు, కష్టాలను చవిచూసింది. కళ్యాణ పట్టణం చేరుకుని అక్కడ అల్లమప్రభువు, బసవేశ్వరుడిని కలిసింది. అక్కడ అల్లమ ప్రభువు పెట్టిన పరీక్షల్లో నెగ్గింది. మూడువందలకు పైగా వచనాలు రాసింది, అక్కడ నుంచి బయలు దేరి శ్రీశైలం చేరుకుని కొంత కాలం తపస్సు చేసి శివుడిలో ఐక్యం కావడంతో ఆమె పయనం ముగిసింది.

## అక్క మహాదేవి పాత్ర :

అక్కమహాదేవి పార్వతీ దేవి అంశతో పుట్టింది. చిన్నతనం నుంచి కూడా తనకు కావాల్సినవి పొందటానికి ఎంతటి ప్రయత్నమైనా చేసేది. ఒక రకమైన మొండి తనాన్ని కూడా కలిగివుంది. చిన్నతనంలో తను ఆటల్లో ఓడిపోవడం కూడా అంగీకరించని మనస్తత్వం ఆమెది. స్త్రీలకు గురుకులంలో విద్యాభ్యాస ఆచారం లేక పోయినప్పటికీ పట్టుబట్టి గురుకులంలో చదువుకుంది. తన మనసు, శరీరం మల్లికార్జునుడికి అర్పించానని, మరొకరిని పెళ్ళిచేసుకోనని తల్లిదండ్రులకు ఖరాకండిగా చెప్పింది. తనను పెళ్ళిచేసుకోవడానికి నిశ్చయించుకున్న కౌశికుడికి తన మతాచారాన్ని చెప్పి తాను వివాహం చేసుకోవడం కుదరదని చెప్పింది. కానీ తల్లిదండ్రులకు తన వల్ల ఇబ్బంది కలగకూడదని భావించింది. చివరకు తను నమ్మిన మార్గాన్ని విడవకూడదని నిశ్చయించుకుంది. కౌశికుడితో వివాహానికి కొన్ని షరతులను విధించింది. ఆ కఠిన షరతులను కౌశికుడు పాటించలేడని అక్క మహాదేవికి తెలుసు. రాజభవనంలో ఉంటూనే తన భక్తిని విడవకుండా పూజాకార్యక్రమాలు కొనసాగించింది. షరతులు ఉల్లంఘించి తనను బలవంతంగా అనుభ

వించడానికి ప్రయత్నించిన కౌశికుడి చేతిలో ఓడిపోకూడదనుకుంది. తన శరీరం శివుడికి అర్పించడం వలన అది తనది కాదని, అది శివుడికి చెందినదని భావించింది. ఆ శరీరానికి ఏం జరిగినా దానికి తన దేవుడు శివుడిదే బాధ్యత అని నమ్మింది. తన దేవుడు కౌశికుడి చేతిలో ఓడిపోకూడదని తాను వివస్త్రగా నిలబడింది. ఇక తనకు మిగిలింది కేవలం చెన్నమల్లికార్జునిడి సన్నిధికి చేరడమని నిశ్చయించుకుంది. తన పయనంలో జనులు తనను పలు విధాలుగా అనుకున్నా... వాటిని పట్టించుకోకుండా తన గమ్యాన్ని చేరడమే ప్రధానం అనుకుంది. తన మతానికి చెందిన అల్లమ ప్రభువు, బసవేశ్వరులు తనకు ముఖ్యమైనవారుగా తలంచింది. చివరికి తన గమ్యస్థానమైన శ్రీశైలం చేరి అక్కడ శివైక్యం పొందింది.

అక్కమహాదేవి తన గ్రామమైన ఉడుతడి నుంచి శ్రీశైలం వెళ్ళే సమయంలో మార్గ మధ్యలో కొన్ని మహిమలు కూడా చూపింది. మూగ స్త్రీ అయిన మునెమ్మకు మాటలు వచ్చేలా చేయటం వంటి సంఘటనలు అక్కమహాదేవిలో మహిమలు ఉన్నాయనే విషయాన్ని తెలియజేస్తాయి. వాటిని మహిమలు అనటం కంటే తాంత్రిక విద్య అనడం సముచితమేమో. ఎందుకంటే వీరశైవంలో తాంత్రిక విద్య చాలా ప్రాధాన్యత కలిగి వుంటుంది. కానీ ఈ విద్యను ఆమె ఎక్కడ నేర్చుకున్నట్లు కనిపించదు. ఆ విద్య సహజంగానే ఆమెకు అబ్బినట్లు కనిపిస్తుంది.

ఎన్నో కష్టాలను ఎదుర్కొని, సనాతన సంప్రదాయాలను కాలదన్ని తనమతం, తన స్వామి గొప్పవారని భావించింది. తాను నమ్మిన సిద్ధాంతం కోసం సంఘాన్ని, తల్లిదండ్రులను చివరకు శరీరాన్ని త్యజించిన వీర విరాగిణి అక్కమహాదేవి. రాజునే ఎదిరించిన ధీరవనిత. ఆనాటి పురుషస్వామ్య వ్యవస్థపై ఇదొక గొప్ప తిరుగుబాటుగా భావించవచ్చు.

## వివాహం - అక్కమహాదేవి దృక్పథం :

మానవ మాత్రులను, అందులోనూ వీరశైవ మతం కానివారిని వివాహం చేసుకోవడానికి అక్కమహాదేవి ఇష్టపడలేదు. అందుకు కారణం ఆమె అవలంబించిన జీవన విధానం, భక్తిభావన లేదా తాత్విక చింతన. తన జీవితానికి ఒకరే భర్త అని నిర్ణయించుకుంది, ఆయనే చెన్నమల్లికార్జున స్వామి. ఐహిక జీవితంలో ఒక భర్తను, మరొక లోకంలో మరో భర్తను కలిగివుండటం ఆమెకు ఇష్టం లేదు. మరొక లోకం అనేది మరో జన్మకావచ్చు. లేదా పరలోకం కావచ్చు. జన్మజన్మలకు చెన్న మల్లికార్జునుడే ఆమె భర్త. మరొక మాటలో చెప్పాలంటే తనకు తిరిగి జన్మ అక్కర్లేదు. శివుడిలో ఐక్యం కావడమే ఆమె జీవిత లక్ష్యం. ఆ భావనే చిన్నప్పటి నుంచి అలవరుచుకుంది. ఆ మార్గాన్నే అనుసరించింది.

వీరశైవంలో దాదాపు ముప్పై మూడు మంది స్త్రీలు వచన రచనలు చేసినట్లు తెలుస్తుంది. అంటే వీరందరూ కూడా కవయిత్రులే. ఈ ముప్పై మూడు మందిలో కేవలం పద్నాలుగు మంది మాత్రమే వివాహితలు. తక్కిన వారు అవివాహితలు. దీని ద్వారా తక్కినవారు కూడా మానవులను వివాహం చేసుకోవడం ఇష్టం లేనివారిగా భావించవచ్చు. బహుశా ఈ సంప్రదాయాన్ని అక్కమహాదేవి కూడా అనుసరించి ఉండవచ్చు. ప్రతి విషయానికి స్త్రీ మీద ఆధారపడిన పురుషుడు తిరిగి స్త్రీపైనే ఆధిపత్యం వహించడమనేది వారికి ఇష్టం లేకపోయుండవచ్చు. తమపైన ఆధిపత్యపు హక్కుగానీ, మరొక హక్కుగానీ ఒక్క శివుడికి మాత్రమే ఉందని, తక్కిన ఏ పురుషుడికీ ఎటువంటి హక్కు లేదనే భావన కూడా వారిలో కనిపిస్తుంది.

## అక్కమహాదేవి తాత్వికత :

అక్కమహాదేవి దృష్టిలో శరీరం అశాశ్వతమైనది. శరీరం అందమైనది కాదు, అంద విహీనమైనదీ కాదు. అది కేవలం భగవంతుని సాన్నిధ్యానికి చేరడానికి ఒక సాధనం. అటువంటి శరీర సౌఖ్యం కోసం పరితపించడం వృధా. అందుకు తగ్గట్లుగానే అక్కమహాదేవి తన జీవితాన్ని మలుచుకుంది. ఐహిక సుఖాలను వదులుకుంది. చివరకు తల్లిదండ్రులతో కూడా బాంధవ్యాన్ని తెంచు

కుంది. చెన్నమల్లికార్జునుడే తనకు అన్నీ అని తలంచి, ఆ మార్గాన్నే అనుసరించింది.

**ముగింపు :**

సనాతన వ్యవస్థలోని ఆచారాలకు, సంప్రదాయాలకు ఎదురునిలిచి తాను నమ్మిన శైవమార్గాన్ని అనుసరించిన మహా భక్తురాలు అక్కమహాదేవి. సామాన్యులు ఆచరించడానికి సాధ్యంకాని జీవిత మార్గాన్ని ఎంచుకుని ఆధ్యాత్మిక చింతన ప్రాధాన్యతను వివరించిన తాత్విక గురువు. పురుషస్వామ్య వ్యవస్థలో స్త్రీ స్వేచ్ఛను కాంక్షించిన విదుషీమణి.

❀❀❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# బి. పి. కరుణాకర్ కథల్లో మానవీయ కోణం

**– జె. రజిత,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, తెలంగాణ విశ్వ విద్యాలయం, డిచ్‌పల్లి, నిజామాబాద్.

అంబాలీస్ కథల సంపుటి రచయిత బి.పి. కరుణాకర్. దీనిలో 34 కథలున్నాయి. ఈ కథల ద్వారా 1985కు ముందు కథాకాలం నాటి తెలుగువారి జీవితంలోని బహుళ పార్శ్వాలను, ఆనాటి మనుషుల ఆలోచనల తీరు తెన్నులను అర్థం చేసుకోవచ్చు. కరుణాకర్ కథలు ఎక్కువ శాతం మానవ సంబంధాల విశ్లేషణతో కొన సాగుతాయి. కరుణాకర్ కథల్లో ప్రేమరాహిత్యంతో తల్లడిల్లే మనుషులుంటారు. భగ్న ప్రేమికులూ ఉంటారు. తత్కారణంగా జీవితంలో నిస్పృహకు నిర్వీర్యతకు గురైన వారుంటారు. కరుణాకర్ కథల్లో వైవిధ్యంతోపాటు సమాజంలోని భిన్న దొంతరల్లో ఉండే వైరుధ్యాలను నిశితంగా పరిశీలించి చెప్పగలగడం ఈ రచయిత విలక్షణ దృష్టికి నిదర్శనం. ఈ సంపుటిలో ప్రత్యక్ష, పరోక్ష పాత్ర చిత్రణను రెండు రకాలుగా చిత్రించాడు. పాఠకుడికి పాత్రకు మధ్య కథకుడే సాక్షిగా నిలిచి సర్వం నిర్వహించటం ప్రత్యక్ష శిక్షణ. ఇక్కడ పాఠకుడు ఊహించవలసింది ఏమి ఉండదు. పరోక్ష పాత్ర చిత్రణలో కథకుడు పాత్రకు పరోక్షంగా ఉండిపోతాడు. పాత్ర సంభాషణలో కథకుడు ప్రవేశించడు. పాత్ర సహజంగా వర్ధిల్లుతుంది. దీన్నే నాటకీయ పద్ధతి అంటారు. ఇదే అత్యంత అనుసరణీయమని కథానిక లాక్షణికుల అభిప్రాయం.

నిజ జీవితంలో వ్యక్తులకైనా, సాహిత్య ప్రక్రియలో పాత్రలకైనా పేర్లు లేకపోతే గుర్తుపట్టడం కష్టం. ఒక్కొక్క రచయిత ఒక్కొక్క తీరులో పాత్రచిత్రణ చేస్తాడు. కొందరు స్త్రీల పాత్రల మీద, మరికొందరు పురుష పాత్రల మీద శ్రద్ధ తీసుకుంటారు. ఇంకొందరు రెండింటిని సమానంగా చిత్రిస్తారు. కొందరు తిరగబడే పాత్రలు చిత్రిస్తే... ఇంకొందరు అమాయక పాత్రల్ని చిత్రిస్తారు. కొందరు మధ్య తరగతి ప్రజలను తీసుకొని పాత్రలుగా మలిస్తే.... మరి కొందరు అట్టడుగున పడి నలిగిన బడుగు వర్గాల వారిని పాత్రలుగా మలిచి చిత్రీకరించడం మనం కథల్లోనూ, నవలల్లోనూ చూస్తాం. బి.పి కరుణాకర్ కథలు మానవ సంబంధాలను గురించిన విశ్లేషణతో సాగుతాయి. ముఖ్యంగా మానవసంబంధాల్లో ఎక్కువగా ఉన్నటువంటి స్త్రీ పురుష సంబంధాలలలోని వైరుధ్యాలను బి.పి. కరుణాకర్ రాసారు. ఈయన రాసిన కథల సంపుటి అంబాలీస్ కథల్లోని ప్రధాన పాత్రలను కొన్నింటిని పరిశీలిద్దాం.

### అంబాలీస్ కథలోని పాత్రలు :

బిపి. కరుణాకర్ రచించిన అంబాలీసస్ కథా సంపుటికి అంబాలీసస్ కథే తలమానికమైనది అని చెప్పవచ్చు. మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారి లౌక్యాలు, సంకుచిత ధోరణులు ఈ కథలో కన్పిస్తాయి. పెళ్లి కోసం వలయం పన్ని అబాసుపాలై భంగపడిన సీతను ఈ కథ ద్వారా రచయిత మనకు కన్నులకు కట్టినట్లు చూపించాడు. అంబాలీసస్ కథలో రంగారావు, సీత, వీరాబాయి ప్రధాన పాత్రలు రంగారావు పాత్ర మంచితనం. ఆ మంచితనాన్ని, అతిశయాన్ని ఆసరాగా తీసుకొని ఎదుటి వారి నుంచి ఒక సర్టిఫికెట్ కొట్టేయాలనే తత్త్వం గల మనిషిగా రంగారావు పాత్ర ఉంటుంది. మనం చాలా మంది రంగారావులను సున్నితంగా చూస్తాం. అలాంటి వారు మనకు తారసపడుతుంటారు. ఒక విచిత్రమైన మనస్తత్వం నుండి ఒక విశేషం ఉద్భవిస్తుంది. ఇక్కడ అదే జరిగింది. ఒక రోజు సైన్సుటీచర్ రంగారావు ఆఫీసుకు వెళ్తే అక్కడ సీత వీరాబాయిల పరిచయం ఏర్పడుతుంది. ఆయనకు అక్కడ వీరిద్దరి గురించి అదోరకమైన అభిప్రాయం ఏర్పడుతుంది. రెండు నెలలు గడిచాక రంగారావు ఒక ఉద్యోగితో కలిసి సీత ఉన్న చెన్నూరు వెళ్తాడు. అక్కడ సీత ఆరాత్రి ఉండమంటే ఉంటారు. అర్థరాత్రి సీత అతని లేపి ముద్దులు పెట్టి తనను పెళ్లి చేసుకోమని నానా

అల్లరి చేస్తుంది. దానితో రంగారావు... "నేను మిమ్మల్ని పెళ్లి చేసుకోను నాలుగు సంవత్సరాల క్రిందట ఒక ప్రమాదంలో దెబ్బతగిలింది. నేను సంసారి జీవితానికి పనికి రాను" అని చెప్పి మెల్లగా అక్కడ నుండి జారు కుంటాడు. తర్వాత రంగారావుకు పెళ్లయి ఒక పాపకు తండ్రి అవుతాడు. ఆ పాపకు సీత అని పేరు పెడతాడు. రంగారావు ఎందుకిలా చేసాడు. ఈ పాత్ర ద్వారా రచయిత సమాజంలో ఉండే విభిన్న మనుషుల మనస్తత్వాన్ని కనులకు కట్టినట్లు చూపించారు.

అంబాలీస్ కథలో సీత పాత్ర చాలా ప్రధానమైంది.పెళ్లి కోసం వలయం పన్ని అబాసు పాలై, భంగపడిన సీతను కళ్లకు కట్టినట్లు చూపించాడు.సీత ఉద్యోగం చేసే అమ్మాయి. అయినా పెళ్లికోసం పద్మవ్యూహం పన్నాల్సి రావడం విషాదం. ఆనాటి సామాజిక జీవనంలో మను షులు ఎలాంటి దుస్థితిలోకి నెట్టబడ్డాడో సీత పాత్ర ద్వారా రచయిత చూపించాడు. కేవలం పెళ్లికోసం తనని కనీసం ముట్టుకోని వ్యక్తిని తనపై అత్యాచారం చేయ బోయా డంటూ అల్లరి పెట్టడానికి ప్రయత్నించడం నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

"అంత కోరికగా ఉంటే పెళ్లి చేసుకోవచ్చుగా... పెళ్లి మటుకు వద్దుగాని వళ్లు కావాలి... కలేజా వుంటే పెళ్లి చేసుకొని చూపించు" అంటుంది. చివరకు విషయం తెలుసుకొని శాంతిస్తుంది. మనుషుల్నించి ఇంతకన్నా భిన్నమైన ప్రవర్తన ఆశించలేమేమో!, ఈ విధంగా సీత పాత్ర అంబాలీస్ కథా సంపుటికే మకుటం లాంటిది.

అంబాలీస్ కథలో నామమాత్రమైన పాత్ర వీరాబాయి. ఈమె సీత పనిచేసే బ్లాకుకు ఎస్. ఇ. రంగారావు పౌర్ట్రీకి వచ్చినపుడు అతనికి మంచి మర్యాదలను చేసింది. వీరాబాయి సభ్యతా, సంస్కారం కలిగిన వ్యక్తిగా ఈ కథలో మనకు కన్పిస్తుంది. ఈ కథ వీరాబాయి పాత్ర చాలా చిన్నదే అయినా మంచి లక్షణాలు కలిగిన పాత్రగా మనకు కన్పిస్తుంది.

రవ్వ కథలోని పాత్రలు మనస్తత్వ చిత్రణకు సంబం ధించినవి. స్త్రీల మనోభావాలను చిత్రించటం కనాకష్టం. అయినా కరుణాకర్ తను చిత్రించిన పాత్రల స్త్రీ పురుష మనోభావాలతో పాఠకుల మనోభావాలను కదిలించే రీతిలో చిత్రించాడనడంలో సందేహం లేదు. రవ్వ కథలో హేమలత పాత్ర ప్రవర్తనకు సంబంధించింది. వీరు ఒక్కొక్కసారి ఒక్కొక్క రీతిగా ప్రవరిస్తుంటారు. ఉద్యోగాలు చేస్తున్నా మనుషులు అపార్థం చేసుకోవడం వల్ల ఎదు రయ్యే అవమానాలు వాటి నుంచి బయట పడడానికి చేసే ప్రయత్నాలు ఈ రవ్వ కథ వివరిస్తుంది. వంద రూపాయల కోసం గొడవ పడడం, అల్లరి పాలు కావటం గమనిస్తే 1960-70 నాటి మధ్యతరగతి దీనావస్థ సంకు చిత మనస్తత్వాలు ఎలా ఉండేవో బోధపడతాయి. ఈ కథలో రామారావుది ప్రధాన పాత్ర. ఈ పాత్ర చుట్టే కథ మొత్తం నడుస్తుంది. హేమలత, రమణారావు, ప్రసూణాం బల పాత్రలను కూడా ఈ కథలో చిత్రించారు.

రవ్వ కథలో రామారావు పాత్ర సున్నితమైంది. మనిషిగా కనపడతాడు. ఎదుటి వ్యక్తిని ఏ విధంగాను ఇబ్బంది పెట్టటానికి ఇష్టపడని మనస్తత్వం కలిగిన వ్యక్తి. ఈ విష యాన్ని గమనిస్తే ఇట్టే తేట తెల్ల మవుతుంది. రామారావు పాప కాలేజ్ ఫీజుకు అని పంపించిన డబ్బు పోతే, భార్య హేమలత, పక్కింటి ప్రసూణాంబ మీద నేరం మోపి నపుడు... హేమలత వంక ప్రేమతో చూస్తూ "ఎందుకు తొందరపడ్డావు" అని నెమ్మదిగా అడుగుతాడు. అంతేకాక రమణారావు, ప్రసూణాంబను దోషుల్ని చేయటం ఇష్టం లేక డబ్బు దొరికిందని చెప్పి వాళ్ల ఇంటికి వెళ్లడానికి బయలుదేరుతాడు. అలాంటి దయార్థహృదయుడు, మృధుభాషి, ఈ విధంగా ఈ పాత్ర ద్వారా కథానాయ కునికి ఉండవలసిన లక్షణాలకు మించి సుగుణాలు కలిగిన వ్యక్తిగా రామారావు పాత్రను మలిచాడు రచయిత.

రవ్వ కథ మొత్తానికి కర్త హేమలత పాత్రే. ఈ పాత్ర విభిన్న మనస్తత్వానికి చెందినది. ఎక్కడో పెట్టి మరెక్కడో వెదకడం, లేనిది ఉన్నట్లుగా ఊహించుకోవడం, విచిత్రంగా ప్రవర్తించడం మొదలైన లక్షణాలు ఈ పాత్రలో కన్పిస్తాయి. ఈమెకు ప్రసూణాంబతో మూడేళ్లు నుండి అనుబంధం ఉన్నా ఆమెనే డబ్బు

తీసిందని ఆమెపై నిందమోపడం అనేది అమానుషం. అంతేగాకుండా కోపం వచ్చినపుడు విచిత్రంగా ప్రవర్తిస్తుం టుంది. ఏమి చెప్పినా వినదు. చేతిలో ఏమి ఉన్నా విసిరి కొడుతుంది. ఇటువంటి ప్రవర్తన ఇంట్లో చెల్లుతుందికానీ, బయటివాళ్లతో ఎలా వీలవుతుందని? రచయిత ఈ పాత్ర ద్వారా తెలియ జేసాడు. ముఖ్యంగా మానవ స్వభావం ఎంతో ఉన్నతమైందిగా ఉండాలని హేమలత లాగా మనుషులు ప్రవర్తించకూడదని రచయిత హేమలత పాత్రద్వారా సమాజానికి హితోపదేశ సందేశాన్ని ఇవ్వటం రచయిత మానవీయతను కనపరుస్తుంది ఈ కథ.

రవ్వ కథలో ప్రసూణాంబ పాత్ర చాలా విలువైంది. తను ఏ నేరం చేయక పోయినా హేమలత తిట్లను, నలు గురిలో అవమానాలను ఎంతో సహనంతో భరించిన సహనశీలమైన వ్యక్తి. నిజానికి ప్రసూణాంబలాంటి మనుషులు సమాజంలో చాలా అరుదుగా ఉంటారు. చివరికి సహనాన్ని ఆపుకోలేక రామారావుతో "హేమలత వైపు కుడిచేతి చూపుడు వేలు ఆడిస్తూ చూడండి... నేనూ అభిమానం కలిగిన మనిషినే, నన్ను అవమానించి, అనుమానించినందుకు నేను కాబట్టి దిగమింగి ఊరు కుంటున్నాను. వేరే ఎవరైనా అయి ఉంటేనా."పళ్లు పటపటా కొరుకుతూ బయటకు వెళ్లిపోతుంది. ఎవరైనా ఎవరి సహనాన్ని పరీక్షించ కూడదని రచయిత ప్రసూ ణాంబ పాత్రద్వారా సమాజానికి తెలియజేసిన సహృ దయుడు బిపి కరుణాకర్.

అంశ కథలోని పాత్రల్లో ముఖ్యమైనవి రెడ్డప్ప, ఇతని తండ్రి వెంకట్రామయ్య. కృష్ణయ్య. బిపి కరుణాకర్ కలం నుండి జాలువారిన కథ అంశ. ఈ శీర్షికకు అనుగుణంగా నడిపించక పోయినా కథలోని పటుత్వం పాఠకులకు అందింది. నిరుద్యోగం వలన ఒక యువకుడు పడుతున్న బాధలను, అగచాట్లను రచయిత ఈ కథలో కన్నులకు కట్టినట్లు చూపించారు. ఎం.ఏ చదువుకొని తల్లిదండ్రు లను ఉద్ధరిస్తాడనుకున్న కొడుకు చివరకు తమకన్నా ముందే పాడెక్కుతుంటే చూడలేని దీన స్థితిని ఈ కథ ద్వారా రచయిత చూపించారు. రెడ్డప్ప పేద కుటుం బంలో పుట్టి ఎంఏ పూర్తి చేసిన నిరుద్యోగి. నిరుద్యోగం వల్ల పడుతున్న బాధలను, అగచాట్లను ఈ పాత్ర ద్వారా రచయిత వ్యక్తం చేశాడు. రెడ్డప్ప ఎం.ఏ పూర్తి చేసి సుమారు అయిదు ఏండ్లు ఖాళీగా ఉంటాడు. ఉద్యోగం లేక పోవడం వల్ల రెడ్డప్ప ఇంట్లో వాళ్ల అవమానాలకు ఛీత్కారాలకు గురవుతుంటాడు.

రెడ్డప్ప ఉద్యోగం కోసం ఇరవై ఊళ్లకు పైగా ఇంటర్వ్యూలకు వెళ్లాడు. ఆ ఇంటర్వ్యూలకు ఎం.ఏ కైనంత ఖర్చు అవుతుంది. ఈ లోపల అతనికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చే వయస్సు దాటి పోతుంది. పెళ్లీడుకొచ్చిన చెల్లెలు సీత ఉంది. అదీకాక అప్పులూ ఉన్నాయి. మంచి నీళ్లు తాగి ఆకలి చంపుకుంటాడు. ఒకరోజు వరంగల్‌లో ఇంర్వ్యూకోసం బయలుదేరుతాడు. రెడ్డప్ప సర్టిఫికెట్స్‌న్న సూట్‌కేస్‌ను ఒక కుర్రాడు దొగిలించి పరుగెత్తుతాడు. రెడ్డప్ప ఆ కుర్రాడిని వెంబడిస్తే రెడ్డప్పను రాళ్లతో కొట్టి ఆ సూట్‌కేసును విసిరి వేస్తాడు. సూట్‌కేస్‌లోని సర్టిఫికెట్లు ఆపిన రైలు కింద ఎగురుతూ ఉంటాయి. దానిని అందుకోవడానికి ప్రత్నిస్తే రైలు కదులుతుంది. రెడ్డప్ప దానికింద పడిపోతాడు. ఈ విధంగా రెడ్డప్ప నిరుద్యోగం వలన ఎటువంటి దురవస్థలను ఎదుర్కోవలసి వచ్చిందో రచయిత దయార్థ్ర హృదయంతో చిత్రించాడనిపిస్తుంది.

వెంకట్రామయ్య రెడ్డప్ప తండ్రి. ఈయన జిల్లా పరిషత్‌లో గుమాస్తాగా పని చేస్తుంటాడు. చాలీచాలని జీతం. రెడ్డప్ప చదువుకోసం ఎన్నో అప్పులు చేశాడు. పెళ్లీడుకొచ్చిన సీత అనే కూతురు ఉంది. ఇటువంటి పరిస్థితులలో కుటుంబాన్ని లాగుతూ రావడం చాలా కష్టం. అలాంటి గురుతర బాధ్యతను వెంకట్రామయ్య పోషించాడు. నిజానికి నేటి సమాజంలో వెంకట్రామయ్య తండ్రిలాగా ఉండే వ్యక్తులు చాలా తక్కువ మంది కన్పిస్తారు. వెంకట్రామయ్య పాత్ర ద్వారా రచయిత ఒక తండ్రికి పిల్లల పట్ల ఉండవలసిన బాధ్యతలను చాలా చక్కగా చూపించారు. నేటితరంలోని దండ్రులకు ఈ పాత్ర ఆదర్శం.

కృష్ణయ్య రెడ్డప్ప మిత్రుడు. నిజమైన స్నేహానికి అద్దం పట్టే పాత్ర ఇది. ఇద్దరూ కలిసి ఒకరి బాధలను ఒకరు సాయంత్రం వేళల్లో ఓవర్ బ్రిడ్జిమీద కులుసుకొని తీరికగా చెప్పుకునేవాళ్లు. రెడ్డప్ప వెళ్లే ఇంటర్వ్యూలన్నింటికీ ఇతనే సహాయం చేసేవాడు. నేటి యువతరం స్నేహానికి భాష్యం చెప్పేదిగా ఈ పాత్రను అభిర్ణించవచ్చు. నిజానికి ఇలాంటి మిత్రులు దొరకటం కూడా ఒక వరం. ఒక అదృష్టం. ఇలా బిపి కరుణాకర్ మానవ సంబంధాలను, ముఖ్యంగా స్త్రీ పురుష సంబంధాలను అతి దగ్గరగా చూపిస్తూ చిత్రించాడు. మానవ మనుగడ కోసం జీవిత లక్ష్యాలను వివరిస్తూ అనేక రకాల పరోపకార సందేశాలను అందిస్తూ అనేక కథలను రాసి తనవంతు బాధ్యతగా తెలుగు సాహిత్యానికి హితోధికంగా కృషి చేస్తున్న ఒక గొప్ప సృజనకారి. ఆధునిక మనోభావాలతో మానవ సేవే మాధవ సేవగా భావిస్తూ... పాఠక లోకాన్ని ఆకట్టుకుంటున్న అక్షర కథాశిల్పి.

❀ ❀ ❀

# కాళోజీ కైతల కవాతు

– జె. శంకర్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

"ఒకే ఒక్క సిరా చుక్క

లక్ష మెదళ్ళకు కదలిక" అనే సార్వజనీన సత్యాలను, సామాజిక వాస్తవాలను అక్షరీకరించి ప్రజా చైతన్యాన్ని కలిగించిన కవిత్వం, ప్రజల నాలుకల పైన ముద్రాకృతి రూపంలో కాలంతో పాటు కదులుతూఉంటుంది. కాళోజీ మౌళికంగా రాజకీయ కార్యకర్త. కాళోజీ గారి కవిత్వం స్వాతంత్ర్యోద్యమానికి, దేశ యుద్ధాలకు సంబంధించిన వైన, నైజాం పాలనకు వ్యతిరేకమైన లేక పౌరహక్కులకు సంబంధిచినవైన ఆయన వ్యక్తిత్వంతో విడదీయలేని అంశాలు.కాళోజీ జీవితాన్ని, కవిత్వాన్ని వేరు పాయల్లో వుంచక పోవడం వల్ల ఆయన జీవితంలో ప్రతి సంఘటనని ఆయన కవిత్వంలో చూడవచ్చు. కవిత్వాన్ని ఇంత సహజ విషయంగా భావిండం వల్లనే ఆయన కవిత్వంలో ఏవిధమైన నగిషీలు కనిపించవు. తన భావాల్ని వీలున్నంత సులువుగా వ్యక్తం చేయడమే కాళోజీ లక్ష్యం. నిజాం పాలన నుండి మొదలుకొని స్వతంత్ర భారతంలో నేటి వరకు ప్రజా వ్యతిరేకమైన, పౌరహక్కులకు భంగం కలిగించే సమకాలీన సామాజిక, రాజకీయ విషయాలెన్నిటినో రాజ్యాంగ పరిధిలో నిరసిస్తూ, ధిక్కరిస్తూ, ప్రతిఘటిస్తూ, సాగుతూ వచ్చింది, కాబట్టి కాళోజీ కవితకు ప్రజా పీఠిక లభించింది.ఒక రకంగా కాళోజీ కవిత కాలం ప్రసవిస్తున్న మిథ్య. ఆయన నా గొడవ ప్రజల గొడవ అది సమకాలీన సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాహిత్య చరిత్ర పరిణామానికి గచ్ఛద్వాఖ్యానం.

నిజాం నిరంకుశ పాలనకు ప్రజలు విసిగి,బ్రతుకు చితికి ఎదురు తిరుగుతున్న రోజుల్లో కాళోజీనా గొడవను ప్రకటిస్తూ తలెత్తాడు. ఆనాటి సంఘర్షనాత్మకమైన, సంక్లిష్ట తెలంగాణ సామాజిక జీవితంలో భాగంగా ఉంటూ పౌర హక్కలకు ఏ స్థాయిలో భంగం కలిగినా ప్రతిఘటించ సాగాడు. భాదితులను చూసి సున్నిత మానవీయ హృదయంతో కన్నీరు కారుస్తూ చలించి పోయాడు.ఆ చింతనలే కవితలుగా రూపు దిద్దు కున్నాయి.

"మనకేమని అనరాదు
మనది కానిది ఎమున్నది
దేశము దేశీయులదే
దేశములన్న మనమే" అన్నది కాళోజీ అభిమతం. ఆయన కవిత్వ పరామార్శ కన్నా ముందు ఆయన జీవన దృక్పథం చూడాలి. నేను ప్రస్తుతాన్ని అనే కవితలో..

"నేను ప్రస్తుతాన్ని
నిన్నటి స్వప్నాన్ని"అని ఒక్క మాటలో తన మనస్తత్వం చెపుతూనే, 'నేను జీవనాన్ని,జీవనదాన్ని' అని చెప్పు కున్నాడు. కాళోజీ ప్రాపంచిక దృక్పదాన్ని ఒక్క మాటలో నిర్వచించాలంటే ఆయన ఓ చెమ్మగిల్లిన కన్ను

"అవనిపై జరిగేటి అవక తవకలు చూసి
ఎందుకో నాహృది ఇన్ని ఆవేదనలు?"అని ఈ రెండవ గుణం కూడా ఆయన నిండుదనానికి, గుండె బలానికి కారణం.కరిగిపోయే గుండె మాత్రం కాదు, మండిపోయే ఒళ్ళు కూడా ఉంది. కాళోజీ ఎవరిని అనుకరించలేదు. కాళోజీని ఎవరు అనుకరించ లేరు.ఆయన ప్రభావం లేని తెలంగాణ కవిగానీ,సామాజికులు గానీ లేరు.

కాళోజీ కవిత్వం ఎలా ఉండాలంటాడు అంటే ఈప్ప కవితలో

"నాకున్నది కోరిక
నా గొడవ నీకు రాసిన ఉత్తరంగా ఉండాలని
చదువరులకు కవిత్వంగా ఉండాలని"ఇంకా కవిత్వం ప్రశాతంగా ఉన్నప్పుడు నెమరు వేసుకొనే ఆవేశంగా ఉండాలంటారు.

గంగకు జీవనంగా ఉండాలని
జీవమును తీరంగా ఉండాలని

ధాత్రిని ధాత్రిగా వుంచేదిగా ఉండాలని
మనిషిని మనిషిగా చేసేదిగా ఉండాలని"అంటాడు.
కాళోజీ కవితకు ప్రేరణ అశ్రువులు
"అశ్రువులె లేనట్టి ఆసువు లేలా నాకు
కన్నీరు కలదేని ఎన్నైన వున్నట్లే
కన్నీరు బరికించు కన్నీరు కదలించు
కన్నీటి చుక్కలో కడలులుపొంగు" అను అనువాద కవితలో వేదన తన వేదంగా చెప్పుకున్నాడు.

కాళోజీ కవిత్వం సమాజానికి హెచ్చరిక లాంటిది. అతడు ఒక్కమాటు సమాజం వైపు కన్నెత్తి నిశాతంగా గమనిస్తే సమాజం నిలువునా గజ గజ వణికిపోయి తనలో తరతరాలనుండి దాచు కున్న కళ్లను ఒక్కమాటు బయట పారేస్తుంది. అట్లా చేయకుండా ఇంకా రహస్యంగానే వుంచటంఅతని ముందు సాధ్యం కాదు. కాళోజీకి గుడ్డి ఆశలు లేవు తాను చూస్తున్నది, తనకు తోస్తున్నది రాస్తాడు.బీజం ఆలోచిస్తే కాళోజీ శాస్త్రజ్ఞుడు గర్భితమై ఉన్న కవి.

కాళోజీ వ్యత్యాసాల గూర్చి "అన్నపు రాసులు ఒక చోట ఆకలి మంటలు ఒక చోట" అని లోకాన్ని రెండు భాగాలుగా నిర్దాక్షణ్యంగా, నిర్భయంగా బద్దలు కొట్టి నాడు. లోకమంతా ఆశ్చర్య పోయి అతని వంక చూసింది. ఎందుకంటే కాళోజీ సామాన్యుడు కాదు.

ద్వైత జగత్తు కవితలో "కుటిలమంతులు, దేబెమెగాలు
జగతిలో రెండే రెండు రకాలు
ప్రజాస్వామ్యం గణరాజ్యం
చతుర నాయకమ్మన్యుల భోజ్యం" అంటాడు. ఈ నాడు కుటిలుడు కానీ అమయకుడల్లా దేబెముఖం క్రింద లెక్క గనుకనూ,కుటిలమతి కానిదిస్వార్థం చేకూరడం లేదుగనుకనూ,ఈ గేయం ఆసాతం చదివితే సముద్ర మథనం గుర్తుకు వస్తుంది.ఇదే ఆనాడు 'వాళ్ళు' చేసింది.ఈ నాడు 'వీళ్ళ' చేస్తున్నది. కాళోజీలో కక్ష కట్టే శక్తిలేదు.అతడు చెప్పినవి సత్యాలు - స్థూల దృష్టికి కూడా సులభగా అందే నిజాలు. జగతిలో సామాన్యులను దగా చేయడం ఎంత సులభమో, దీనికి కావల్సిన కొద్దిపాటి చాకచక్యం ఏమిటో
"దండె కొట్టు తెలివి చాలు
జోక వచ్చు గింజలు తాలు"లో చెప్పారు. రహస్యాన్ని చీల్చి చెండాడుతూ, రహస్యాంగా మన గుండెకు అద్దెటట్టు చెప్పాడు. చాదస్తం కవితలో.."ప్రతి చాదస్తం ఒక దేవుడే ఏదో ఒక చాదస్తంలో గొకుడే" అని విగ్రహారాధననీ,మూఢ భక్తినీ, మాతం మత్తు మందుని నిరసించాడు.

కాళోజీ 20.వ శతాబ్దపు తెలంగాణ ప్రప్రథమ ప్రజాకవి కాదనడం సాహసం, ఔననడం నిజాన్ని పరిగ్రహించడం. లుప్తం కానీ వస్తువూ, లోపంలేని సృష్టి వుండవు. కావ్య సంసారములోను లోపాలుంటాయి. అవి ప్రతిభావంతు డైన కవిబ్రహ్మ కవితా తేజస్సుకు లోంగిపోయిన క్రీనీడ వలె పడుంటాయి.కవిత్వంనికి ఎవి లక్షణాలో ఎవి కావో "తన సరస్వతీ భక్తుల్లారా!"లో సుస్పష్టంగా చెప్పి మన సందేహాలకు సమాధానం ఇచ్చాడు. కాళోజీ అనగా కల్లా, కపటాలకు లాలోచిపడని జీవితం అని అర్థం. పునారావత్తి కవితలో

"ఉదయం కానే కాదనుకోవడం నిరాశ.
ఉదయించి అట్లానే ఉండాలనుకోవడం దురాశ"అని అంటాడు. మన ఊరుప్రక్కన పారే నది శతాబ్దాలుగా ప్రవహిస్తుంటుంది.అదే గట్టు. అదే చేట్టు. అదే మిట్ట. అయితే నదిలోని జలం ఒక క్షణం ఒక చోట ఆగడం లేదు కాలము ఇంతే అని చెబుతున్నాడు. ఈ వర్షధార జల నిర్మలము, నిర్వర్ణమూ, నిర్గంధమూ, అయిన సత్యమానవత్వం పది కాలాల పాటు లోకంలో నిలిచి ఉండడానికి జీవన ప్రధాంనం చేస్తుంది. నరుడు నేను అనే శీర్షికలో

"ఇచ్చయె నా ఈశ్వరుడని
ఖచ్చితముగా నమ్ముతాను" అంటూ కన్నీరంటే ఊరికే రాదు. హృదయ వేదన వహ్నిజ్వాలా దగ్ధమై అందులోంచి కరిగి జారిన బాధా కణాల కన్నీరు. ఆ కన్నీటిలో ఎన్నో ఉన్నాయి. 'కన్నీటిలో ఎన్నెన్నో కలవు'అనే గీతిలో
"హడలెత్తిన ఎదల గడగడలు
తడబాటులో దాగని దడదడలు" అన్న గీతి మనలో మనం పాడుకుని వింటే కన్నీరు పొరలి వస్తుంది. కాళోజీ వాన కాలం మబ్బు వంటి వాడు. కరుణ రసం మెండు

దీనికి శోకం స్థాయి, లోకంలో ఎక్కడ ఏ దౌష్ట్యం జరిగినట్టు విన్నా, కన్నా భరించలేడు. కన్నీరై కరిగి పోతాడు. అయితే కరుణికుడు, పిరికి వాడు కాదు. నిర్దాక్షిణ్యంగా నిజం చెబుతాడు. రహస్యాన్ని బద్దలు కొట్టి మనకు అందిస్తాడు.

"ఎవరికి చేపని ఎండిన చనులు

రసహీనములు రాజకీయములు"ఇలాంటి విచిత్రాలు అడుగడుగున చూడవచ్చు. ఇవే కాకుండా ఆయనొక సామాజిక తత్త్వవేత్తగా, ఆలోచకునిగా, దార్శనికునిగా, కవిగా ఎల్లకాలాలకు నిలుపగలిగిన కవితలు మరెన్నో ఉన్నాయి. ముల్కి నిబంధనలు, ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు, 1969 ఉద్యమం నుంచి ఇవ్వాటి దాకా కాళోజీ తెలంగాణ అనుభవంలో ఒక పేగు బంధమై ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని ముందుండి నడిపించాడు.తెలంగాణ ఎర్పడాలనే స్పష్టమైన రాజకీయ అవగాహణతో రాసిన కవితలన్నిటికి ఒకటే పల్లవి. "ఎవరనుకున్నారు ఇట్లౌనని ఎవరనుకున్నారు" అన్న దగ్గర ఒక న్యాయమైన, సహజ మైన విచికిత్సతో ప్రారంభించి

"నమ్ముకొని పెత్తనము ఇస్తే

నమ్మకము పొగొట్టు కుంటివి" ఒక కష్ట జీవి అను భవం తెల్సుకొని....

"దోపిడి చేసే ప్రాంతేతరులను

దూరం దాకా తన్ని తరుముతా

ప్రాంతం వారే దోపిడి చేస్తే

ప్రాణంతోనే పాతర వేస్తం" అని అణిచివేత, దోపిడీ లను, వాల్లతో మిలాఖతయిన ప్రాంతం వారిని నిర్థ్వం దంగా ఖండిస్తున్నాడు. కాళోజీ కవిత్వంలో భాష, శైలి, రూపం, వస్తువు తెలంగాణ ప్రాంతంలో సార్వజనీనమైనవి.

"ఏ భాష నీదిరా యేమి వేషమురా?

ఈ భాష ఈ వేష మెవరి కోసమురా?" అని వలస వాద ఆలోచనా నిర్మితిని బహిర్గతం చేయగలిగాడు.

కవియే నిజమైన ప్రపంచ పౌరుడు.కవి అంటే ఎప్పుడూ ప్రతి పక్షంలో ఉండేవాడు. తనకు సమాజానికి సామ రస్యం కుదిరే దాక అంతర్ బహిక యుద్ధం చేస్తూ, యుద్ధరావాన్ని కవిత్వంగా గొంతెత్తి ఆలాపించే వాడు. రాజ్యం మీద తన జీవితాన్ని కత్తి గట్టి పోరాడుతున్నపుడు కవి అంటేపక్షి మీద ప్రేమతో, అంతకుని మీద కోపంతో శోకం శ్లోకమైన వాడు. అందుకే కాళోజీ భౌతికం గా కూడా మనలో బ్రతికే ఉంటాడు, ఉండాలని ఆకాంక్షిస్తూ, ఆ మేరకు కాళోజీ నుంచి హామిని కూడాపొందుతూ..

"నేను బ్రతికే వుంటాను

నా పరాయితనం పోగొట్టే ఆర్ద్రత" అని భరోసా ఇచ్చాడు.

"గగనం గగనాకారం సాగరం స్సాగరోపమ్మ" కాళోజీ కవి నిరంకుశుడు. అతన్ని నిలువరింపగల అంకుశం కలుగనే కలగదు. అతనికి దురాశలు లేవు. ఆశల ఉచ్చులు లేవు. అతడు దేనికి చిక్కడు. వేదనకు ఆవేదనకు నివేదనకు తప్ప. కాళోజీ కవిత అక్షరం కాదు నాదంా నినాదం పెదవులు పలుకవు, గుండెలు పలుకుతాయి, పూలు పూస్తాయి. నిప్పులు రాలుస్తాయి. కాళోజీకి కల్లా, కపటం, ద్వేషం, కార్పణ్యం, పగ, వగలు తెలియవు. నిర్మలమైన అద్దం లాంటి వాడు. ప్రతి పలుకు,ప్రతి పదం స్వచ్ఛంగా, నిర్మలంగా, ఎండలా, వెన్నెల్లా, అగ్గిలా, ఆరాటంలా, మందహాసంతో దర్శనమిస్తాడు. కాళోజీ గొడవ, లొల్లి, ఆగంకు హద్దులు లేవు అని విశాలాచ పృధ్వీ, అది గాలి, కాంతి, దావానలం, మందానిలం వంటిది.

"దాన్ని దర్శించే కన్ను కావాలి! ఎద కావాలి!

కాళోజీ కవితకు అంబరాలు లేవు

కాళోజీకి ఆడంబరాలు లేవు

కాళోజీ మంది మనిషి

కాళోజీ కవిత ప్రజల పరువం" కాళోజీని మేం మరువం.

**ఆధార గ్రంథాలు :**

1. నాగొడవ - ప్రచురణ్ణ కాళోజీ ఫౌండేషన్,వరంగల్,హైదరాబాద్.ముద్రణ జులై,2012.
2. ప్రజా కవి కాళోజీ సాహిత్య సమాలోచన(జాతీయ సదస్సు - విశేష సంచిక) - సంపాదకులు డా॥. గంటా జలంధర్ రెడ్డి, 2012.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# దర్గామిట్ట కతలు - హిందూ ముస్లిం సమైక్యత

- కొండయ్య కోసూరు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, మధురై కామరాజు విశ్వవిద్యాలయం, మధురై

## హిందూ ముస్లిం సహజీవనం :

తెలుగు సాహిత్యంలో ముస్లిం కవులు రచనలు చేశారు. వీరు తమ యొక్క సమస్యలను కాకుండా తమ భావనలు, కల్పనలతోనే సాహిత్య సృష్టి చేశారు. వీరిలో ఉమర్ ఆలీషా మొదలుకొని చాలామంది సాహిత్య రచన చేశారు. వీరిదంతా ముస్లిం వాదసాహిత్యం అనలేము. ఎందుకంటే వీరి సాహిత్యమంతా తెలుగులో 'మెజారిటీ' సాహిత్యాన్ని బలోపేతం చేయడానికే ఉపయోగపడింది.

ఇక్కడ 'మెజారిటి' అంటే తెలుగు సాహిత్యం. దళిత, స్త్రీవాదాలు కాకుండా మిగిలిన సాహిత్యమంతా మెజారిటి సాహిత్యం అవుతుంది. సాహిత్య రచన పరంగా చూసినపుడు వాటి పరిమాణమే ఎక్కువ. పైన పేర్కొన్న ముస్లిం కవులు ఈ మెజారిటి సాహిత్యాన్ని మరింత అభివృద్ధి చేయటానికే దోహదపడ్డారు.

ముస్లింవాద సాహిత్యంలో ఇప్పటి వరకు ఆత్మన్యూనతా భావంతో వచ్చిన సాహిత్యామూ, బాబ్రీ మసీదు సంఘటన తర్వాత వచ్చిన రచనలలో హిందూ మతంపై జిహాద్ ప్రకటించినట్లుగా వచ్చినవే ఎక్కువ. ఇవి విప్లవాత్మక ధోరణిలో ఉన్నవి ఇక్కడ హిందువుల వైపు నుండి చూస్తే ముస్లింలు శత్రువులుగా, ముస్లింల వైపు నుండి చూస్తే హిందువుల శత్రువులుగా కనిపిస్తూనే ఉన్నారు. ఒకరినొకరు అర్థం చేసుకునే రీతిలో ఈ మధ్యకాలంలో సాహిత్యం రాలేదు, ఎవరూ రాయలేదు. ఇలాంటి సమయంలో హిందూ ముస్లింల సమైక్యత గురించి రచన చేసిన వారిలో మహమ్మద్ ఖదీర్‌బాబు అగ్రగణ్యుడు.

ఖదీర్‌బాబుది నెల్లూరు జిల్లాలోని కావలి. ఇక్కడే ఈయన జన్మించాడు. కావలిలోని జవహర్ భారతి డిగ్రీ కాలేజీలో బి.యస్సీ చదివారు. ఆరేళ్ళు ఆంధ్రజ్యోతిలో సబ్ ఎడిటర్‌గా పనిచేశాడు. ప్రస్తుతం ఒక వెబ్‌సైట్‌లో పని చేస్తున్నారు. మొదట్లో ఈయన రాసిన కొన్ని కవితలు, పాత హిందీ పాటల మీద ఆదివారం ఆంధ్ర జ్యోతిలో ఒక సంవత్సరం పాటు రాసిన 'కాలమ్' అనే అంశం ఈయనకు గుర్తింపు తెచ్చాయి.

కథా సాహిత్యంలో ఈయన 'దావత్' అనే కథలో ప్రవేశించారు. తర్వాత 'జమీన్' అనే కథ రాసాడు. ఈ కథకు జాతీయ స్థాయిలో 'కథాప్రైజ్ స్టోరీ' అవార్డు వచ్చింది. తర్వాత ఆంధ్రజ్యోతిలో 'దర్గామిట్ట కతలు' అనే శీర్షికతో ఇరవై అయిదు కథలు రాశాడు. ఇవి ఇరవై ఐదు వారాల పాటు వచ్చాయి. ఇండియా టుడే 2000 వార్షిక సంచికలో 'దుద్‌బఖష్' అనే కథ రాశాడు. కవితలలో కరీంభాయ్, జిహాద్, జిహాద్ - 2, నూర్ - పాచక్మీ, బిషాని, జంగ్, జవాబ్ మొదలైన కవితలు రాశాడు.

'దర్గామిట్ట కతలు' స్వీయ జీవిత అనుభావాలతో వ్రాసినవి. రచయిత ఖదీర్‌బాబు ముస్లిం. కాబట్టి ముస్లిం బాలుడి 1970-80 సంవత్సరాల మధ్య జీవితాన్ని చూపిస్తాయి, ప్రతిబింబిస్తాయి. తను పుట్టి పెరిగిన ఊరు, తను నివసించిన కసాబ్ గల్లీ, కావలిలోని పాత ఊరు మొత్తం కళ్ళకు కనిపించేలా చిత్రించాడు. ఇది నెల్లూరు మాండలికంలో సాగిపోయే రచన. ఇందులో నెల్లూరు మాండలికం, యాస, ముస్లింల ఉచ్ఛారణా రెంటినీ కలబోసిన సజీవ రూపాలు కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తాయి.

ప్రతి సాహిత్య ప్రక్రియలోనూ సమాజం ప్రతిబింబిస్తుంది. సమాజంలోని సంఘటనలో, సన్నివేశాలో, మనషులో వీటిలో ఏవైనా రచయితకు స్పందన కలిగిస్తాయి. ఆ స్పందనతో రచనను సృష్టిస్తాడు. స్పందన అనేది ఆనందంలోంచి, ఆవేదనలో నుంచి, మరే ఇతర కారణంలో నుండైనా రావచ్చును. ఇలా కల్గిన స్పందన రచయిత నైపుణ్యంతో ఇది సాహిత్యంగా బయటికి వస్తుంది.

నేటి ముస్లింలు సమాజంలో పడే ఆవేదనను, సమస్యలను చూసి ఖదీర్‌బాబు స్పందించి, వాటిని తన బాల్యంతో కలిపి 'దర్గామిట్ట కతల'లో చిత్రించాడు.

## ఆర్థికతలో - హిందూ ముస్లిం సమైక్యత :

'దర్గామిట్ట కతల'లో ముస్లిం ఆచార సాంప్రదాయాల తర్వాత ముస్లింల ఆర్థిక సమస్యలను, ఇబ్బందులను వివరిస్తాడు. ముస్లింలు ఆర్థికంగా వెనుకబడి ఉండటానికి కారణాలు తెలుపుతాడు. కరెంటు పనివాడయిన తన తండ్రి ఇల్లు కట్టుకుంటే దానికి కిటికీలు, తలుపులు కూడా పూర్తిగా పెట్టించలేక పోతాడు. దానితో ఇళ్ళంతా బయటికి కన్పించకుండా ఉండటం కోసం తన తల్లి వేసిన మల్లె చెట్టు వేస్తుంది. అది పూలు పూస్తే, వాటిని అమ్మి ఇంట్లోకి కావలసిన పంచదార మొదలైన నిత్యావసర వస్తువులను కొనేది. ఆ పూలు కొని, వాటిని మాలలుగా కట్టి బజార్లో అమ్ముకుని కుటుంబాన్ని పోషించుకునే'పూల రిహానా' కూడా కన్పిస్తుంది. ఇది ముస్లింలు ఆర్థికంగా ఎలా ఉన్నారనేది చెబుతుంది, తెల్పుతుంది.

"అల్పాదాయ ముస్లిం మతస్థుల జీవితాల్లోని ఇరుకుదనాన్ని, ఇబ్బందినీ, సంఘర్షణీ, మాత్రమే కాక ఈ కథలు 'లో' తరగతి ముస్లిం మహిళల జీవన విధానానికి అద్దం పట్టాయి. డొక్కాడని చేతి వృత్తుల వలయంలో విద్యకి, ఉద్యోగానికిగానీ, సుఖానికీ, శాంతికీ దూరంగా ఒక జీవన సంక్షోభంలో కార్మికులుగానే మిగిలిపోతున్న పిల్లలు, వీటన్నింటికీ మూలమైన ..... ఇందులో మల్లె పూలమ్మి పిల్లల్ని పోషించుకునే తల్లులు మనకు తారాసపడతారు! కరెంటు పని వాళ్ళుగా మిగిలి పోయిన తమ్ముళ్ళు ఎదురౌతారు". ఆర్థిక పరిస్థితి సరిగ్గా లేనందున తమ జాతి వారిలో చాలామంది అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్య చేయించుకునే స్థోమత లేక, అందక చనిపోయారు.

ఖదీర్‌బాబు తన కథల ద్వారా హిందూ ముస్లిం జీవనాన్ని కూడా చూపించాడు. 'దర్గామిట్ట కతల'లో తన తండ్రి 'ఖదీర్ అహ్మద్' అనే తన పేరును 'ఖదీర్ బాబు' అని మార్పించిన దగ్గర నుండీ ఈ సమైక్యత కన్పిస్తుంది. తన తండ్రి కేవలం హిందువులకు పలకడం ఇబ్బంది అవుతుందనే బాధతో పేరును మార్చమని సుబ్బరాజు మాష్టారుతో మార్పించేస్తాడు. ఖదీర్‌బాబు తండ్రి కరీం భాయ్ ప్రాణ స్నేహితులు పెండెం రవి, పలావు వెంకారెడ్డి, వీరు ఇద్దరూ హిందువులే. పెండెం రవి తనకు కరెంటు పని వాడిగా చేసిన గురువు. తనను జీవితంలో తన కాళ్ళ మీద తాను నిలబడేలా చేసిన వ్యక్తి రవి.

ఈ విధంగా కరీంభాయ్‌ని చూసుకుంటాడు. కరీం కూడా ఆయన అంటే ఎంతో భయంగా, భక్తిగా ఉంటాడు. అతేకాదు తన ఇంట్లో పండుగ అంటే మొదటి రవి వాళ్ళకి భోజనం పెట్టిన తరువాతనే తన టంట్లో ఎవరైనా తినేది. అంత కృతజ్ఞత కరీంభాయ్‌లో కన్పిస్తుంది.

కరీంభాయ్ జీవితంలో ఇంకో హిందూ శ్రేయోభిలాషి అయిన మిత్రుడు పలావు వెంకారెడ్డి. ఈయన అసలు పేరు. రేమాల వెంకారెడ్డి. కరీంభాయ్‌కి పెళ్ళి సంబంధం వచ్చిన తర్వాత వాళ్ళు తన గురించి వివరాలు సేకరించటానికి వెంకారెడ్డిని అడిగితే "ఆ పిల్లోడికేమి సామీ. బంగారం. కళ్ళూ మూసుకుని యిచ్చెయ్యి' అని పలావ్ వెంకారెడ్డి బరోసా యిచ్చి......" పెళ్ళికి పెద్దగా వ్యవహరించాడు వెంకారెడ్డి. ఇలా కరీంభాయ్ జీవితంలో సర్తాజ్‌బీ తన జీవిత భాగస్వామి కావడానికి వెంకారెడ్డి కారణం అయ్యాడు. సర్తాజ్‌బీని తన సొంత తోబ్బువులా చూసుకుంటాడు. పెళ్ళయ్యే నాటికి ఆమెకి 14 సంవత్సరాలు. దానితో వెంకారెడ్డి తనను 'అమ్మాయ్' అని పిలిచేవాడు. పండుగలప్పుడు తన చెల్లికి సారె పంపినట్లు పిండివంటలు తెచ్చి ఇచ్చేవాడు.

ఎప్పుడైనా ఏదైనా పెళ్ళికి గానీ, మరి ఏదైనా శుభ కార్యాలకు వెళ్ళాలంటే తమ బంధువుల వద్దకు వెళ్ళకుండా వెంకారెడ్డి ఇంటికెళ్ళి ఆయన భార్య లేదా కోడలి నగలు తెచ్చుకుంటుంది. నగలు అవసరం వచ్చినపుడు తెచ్చుకోడానికి వీళ్ళ ఇంటికే వెళ్ళేది అంటే తన పుట్టింటికి వెళ్ళినంత స్వతంత్రంగా వెళ్ళగలిగేది. అని అర్థం చేసుకోవడానికి అవకాశం ఉంది. వీరి మతాలు వేరు అనే భావన ఇక్కడ లేదు. ఎందుకంటే వీరు ఆత్మ బంధువులు.

ఈ విధంగా కరీం సాయిబుకు జీవనోపాధిని కల్పించినది ఒకరు. జీవిత భాగస్వామిగా తన తోబుట్టువు లాంటి ఆమెను చేసినది ఇంకొకరు.

ఖదీర్‌బాబు చిన్నతనంలో యాభై రూపాయల కాగితాన్ని పోగొట్టుకున్నప్పుడు తనను ఆదుకున్నది మస్తాన్ సురేష్. ఇతనూ హిందువే. చిన్న తనంలో చేసిన స్నేహం, చిరు తిళ్ళ దగ్గర నుండి చిక్కు సమస్య వచ్చినపుడు దాకా దేవుడిలా తీర్చుతాడు. అందుకే ఖదీర్‌బాబు 'నేరెళ్ళ మస్తాన్ సురేష్ నా దేవుడు' అనే కథలో ఈ సంబంధాన్ని వివరిస్తాడు. హిందూ ముస్లిం సహజీవనాన్ని తెలిపేందుకు ఈ పాత్రల మధ్య ఉండే సత్సంబంధాన్ని ఉదాహరణగా చెప్పడానికీ వీలుంది.

## పండగలు - హిందూ ముస్లిం సమైక్యత :

ముస్లింలు జరుపుకునే కొన్ని పండుగలలో హిందువులు కూడా కలిసిపోతారు. కొంతమంది హిందువులు తమ దగ్గరి ప్రాంతంలో ఉన్న ముస్లిం దర్గాలలోని పీరును నమ్ముకుని కోరికలు ఫలిస్తే తమ యొక్క మొక్కు తీర్చుకుంటుంటారు. సంతానం లేదనే వారు కోరుకుంటే, సంతానం కల్గిన తరువాత ఏమి చేస్తారని మొక్కుకుంటారో అది చెల్లిస్తారు. అలాంటి వారిలో 'పుట్టబోయే బిడ్డకు నీ పేరు పెట్టుకుంటాము' అని మొక్కి, అదే పేరు పిల్లలకు పెడుతుంటారు. వరప్రసాదంలా పుట్టిన పిల్లలు హిందువులు అయిన ముస్లిం పీరు పేర్లు పెట్టడం జరుగుతుంది. ఇలాంటివి ఎక్కువగా దర్గాలలో జరుగుతుంటాయి.

ఖదీర్‌బాబు స్నేహితుడు నేరెళ్ళ మస్తాన్ సురేష్. ఇతడు హిందువు. అయినా వరప్రసాదం వల్ల పుట్టినాడని అతనికి ఆ పేరు పెట్టుటుంటారు తల్లిదండ్రులు. "వీళ్ళ నాయిన నేరెళ్ళ సుబ్బరావు కసుమూరు దర్గాకు పొయ్యొచ్చినపుడు వీడు పుట్టినాడంట. అందుకని వడి పేరు మధ్యలో 'మస్తాన్' వచ్చేలా చేసి 'మస్తాన్ సురేష్' అని పెట్టుకున్నాడు.

ఇదే విధంగా నెల్లూరులో జరిగే రొట్టెల పండుగకు ఇలాగే మొక్కుబడి కోసం వస్తారు. ఇక్కడ తమ కోరిక ఎలాంటిదో అలాంటి రొట్టెను నీళ్ళలో పట్టుకుని తింటే ఆ కోరిక తీరుతుంది. అని భక్తుల నమ్మకం. కోరిక తీరిన తరువాత అలాంటి రొట్టెలు చేసి నీళ్ళలో వదలాలి. నెల్లూరులో ఉండే మహిమగల దర్గాలు రెండు ఉన్నాయి. కాలీషావలి పీరు దర్గా. ఇది కసుమూరులో ఉంది. నెల్లూరుకు దగ్గరలో ఉంది. లి హజరత్ పీరు దర్గా. ఇది నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరుకు దగ్గరలో ఉన్న అనుమసముద్రం పేటలో ఉన్నది. ఈ రెండింటి దగ్గర ఉర్సు జరుగుతుంది.

ఇక్కడ ఉద్యోగం లేని వారికి 'ఉద్యోగ రొట్టె', పెళ్ళికాని వారికి 'పెళ్ళిరొట్టె', సంతానం లేని వారికి 'సంతాన రొట్టె' అంటూ అన్ని రకాలైన రొట్టెలు ఉంటాయి. నెల్లూరులో దర్గామిట్ట ప్రాంతంలో ఉండే 'బారాషహీద్ దర్గా' అనే దర్గా దగ్గర ఉండే చెరువు దగ్గర ఈ పండుగ జరుగుతుంది. దీనికి హిందువులు, ముస్లింలు అనే తేడా లేకుండా వస్తారు.

"నెల్లూరు దర్గామిట్టలో 'బారాషహీద్ దర్గా'లో ప్రతి సంవత్సరం జరిగే రొట్టెల పండుగకు ఎల్లవగా ముస్లింలతో పాటు హిందువులు కూడా ఎగబడి వస్తారు. కులమతాలకు తావు లేకుండా ఒకరి నుంచి మరొకరు మొక్కు పేరుతో వుండే రొట్టెను చెరువులో పట్టుకోవటం, తినటం, కోరికలు తీర్చుకోవటం జరుగుతుంది. ఇలాంటి సమైక్యత కల్గివుండే మరొక పండుగ మొహర్రం. ఆ పండుగలో హిందువులు, ముస్లింలు కలిసి పోతారు.

పీర్లమీద ఉన్న భక్తి, నమ్మకంతో పీర్ల పండుగకి హిందూ ముస్లిం అనే తేడా లేకుండా చందాలు ఇస్తారు. పీర్ల సాయిబు అంటే వీరికి గౌరవం, భక్తి, భయం కూడా ఉన్నాయి. పీర్ల సావిడి గగ్గరకు వచ్చి హిందూ ముస్లింలు ఫాతేహా చేయిస్తారు. ఈ విధంగా ఈ పండుగలు హిందూ ముస్లిం సమైక్యతకు అద్దం పడతాయి. 'దర్గామిట్ట కతల'లో ఖదీర్‌బాబు హిందూ ముస్లింల మధ్యగల సంబంధాన్ని గురించి వాస్తవంగా చిత్రించాడు.

## ముగింపు :

ముస్లింవాద సాహిత్యంలో ఆత్మన్యూనతా భావంతో

వచ్చిన సాహిత్యామూ, బాబ్రీ మసీదు సంఘటన తర్వాత వచ్చిన రచనలలో హిందూ మతంపై ధర్మయుద్ధం ప్రకటించినట్లుగా వచ్చిన రచనలే అధికంగా వచ్చాయి. కాని ఒకరినొకరు అర్థం చేసుకునే రీతిలో ఇలాంటి సమయంలో వచ్చిన 'దర్గామిట్ట కతల'లో ఖదీర్‌బాబు ముస్లింల ఆర్థిక ఇబ్బందుల గురించి, ఆచార సంప్ర దాయాల గురించి, బాల్యంలోని తన జ్ఞాపకాలను గురించి చెప్పినా ఎక్కడా పైన చెప్పిన హిందూ ముస్లిం శత్రుత్వం గాని, ఆత్మ న్యూనత గాని కన్పించదు. అందులో చదువు తున్నంత సేపు మధ్యతరగతి అంచున ఉన్న ప్రతి కుంటుంబ జీవనంను చూస్తాము. హిందువులు, ముస్లింలు ఏ విధంగా కలిసి పోయారన్నది తెలుస్తుంది. ఈ కథలలో రాజకీయ ప్రభావం లేదు. మన మిత్రుడు ఏ విధమైన కష్టాల్లో ఉన్నాడో కన్పిస్తుంది.

ఖదీర్‌బాబుకు వచ్చిన ఉత్తరాల్లో (దర్గామిట్ట కతలపై వచ్చినవి) ఎక్కువగా హిందువులురాసినవే ఉన్నాయనే అంటాడు. ఇవి ముస్లింవాద సాహిత్యంలో అంతకు ముందులేని గొప్పగుణాన్ని కలిగి ఉంది. ప్రస్తుతం హిందూముస్లిం సమైక్యతను ఈ విధంగా చెప్పేవారే కావాలి. రచయితకు తన మత ఆచారాలను కాపాడు కోవాలనే తపన ఉంది. అభివృద్ధిని నిరోధించే ఆచారాలను ఖండించే తత్వం కూడా ఉంది.

❀❀❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# తెలంగాణ తొలి దళిత వాగ్గేయకారుడు మాస్టార్జీ

– ముత్తిరెడ్డి రాజు, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, తెలంగాణ విశ్వ విద్యాలయం, డిచ్‌పల్లి, నిజామాబాద్.

" దోనెపూడి మోహన ప్రసాద్ 18 గ్రంథాలు రాసారు. బుర్రకథలు రాసారు. గుంటూరు జిల్లా రేపల్లె లో దళిత కుటుంబంలో పుట్టిన ఇతను అంబేద్కర్ వారసుడుగా అంబేద్కర్‌ను గురించి పాటలు రాసిన మొదటి వ్యక్తి. తెలంగాణ రాష్ట్రంలో అంబేద్కర్‌ను, అంబేద్కరిజాన్ని తెలుగు ప్రజలకు పాట రూపంలో పరిచయం చేసిన మొట్టమొదటి వ్యక్తి మాస్టార్జీ" అంబేద్కర్ పేరు చెప్పి ఎంతో మంది దళిత సాహిత్యంలో గౌరవం పొందు తున్నారు. ఆధునిక దళిత సాహితీవేత్తలం అనుకునే వారు కూడా మాస్టార్జీ లాంటి అపూర్వమైన వాగ్గేయ కారులను మరిచి పోయారు. ఇతరులను తమతమ సాహిత్యంలో గొప్పగా ప్రసస్తావించుకుంటారు. గద్దార్ లాంటి గొప్ప గాయకులకు గురువుగా పరిగణింప బడుతున్న మాస్టార్జీ అంబేద్కర్‌ను ఎత్తుకున్నంతగా మరెవరూ ఎత్తుకో లేకపోయారు. అసలు కొంతమందికి ఇప్పటికీ అంబేద్కర్, అంబేద్కరిజం, కాన్షీరాం, బహుజన ఫిలాసఫీ, అలాగే బాబూ జగ్జీవన్, పూలే, సావిత్రీ బాయి లాంటి వారు తెలియక పోవటం విచారించదగ్గ విషయం.

భారతదేశ జనాభా 130 కోట్లు. దీనిలో ఎస్సీ ఎస్టీలు 30 కోట్లకు పైగానే ఉన్నారు. కానీ సమాజాన్ని చదివిన వారు సామాజిక స్పృహ ఉన్న వారిని అంచనా వేయటం కష్టతరం. వీరిలో ప్రపంచ మహనీయులు గురించి చాలా మందికి తెలియకపోవచ్చు. కానీ ఇంకొకపక్క ప్రపంచం లోనే అతి పెద్ద స్టేడియం ఉన్న అహ్మదాబాద్ లో ప్రపంచంలోని రెండు గొప్ప పెద్ద దేశాల మధ్య సత్సం బంధాలు నెలకొల్పుకోటానికి ఇద్దరు ప్రధాన మంత్రులు స్నేహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వారు వారి దేశాల ప్రజల కలలను సాకారం చేసుకోటానికి కృషి చేస్తున్నవారే. అంతకు ముందు మరో ప్రధాని దేశం వెలిగి పోతుందనే నినాదాన్ని ప్రపంచానికి వినిపించారు. ఎంతోమంది మహానుభావులు, రాజకీయ నాయకులు దళితుల గురించి మాట్లాడినారు. మాట్లాడిన వారంతా గొప్ప వార య్యారు. కానీ దళితుల అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నట్లుంది. గొప్ప గొప్ప సిద్ధాంతాలతో దళితుల అభివృద్ధి కోసం ముందుకు వచ్చి చైతన్యాన్ని కలిగించిన వారున్నారు. కానీ అంబేద్కరిజం, కాన్షీరాం, బహుజన ఫిలాసఫీ, అలాగే బాబూజగ్జీవన్, పూలే, సావిత్రీ బాయి లాంటి వారు తెలియని పరిస్థితి ఉన్నపుడు ఈ బూర్జువా సిద్ధాంతాలు ఈ 30 కోట్ల మందికి అర్థం కాక పోవటంలో ఆశ్చర్యపడనక్కర్లేదు. ఇక స్త్రీల పరిస్థితి చెప్పనక్కర్లేదు.

ఆధునిక చదువుల తల్లీ దళితవర్గాల సరస్వతీ సావిత్రిబాయి పూలే చేసిన కృషివల్లే నేడు అన్ని కులాల స్త్రీలు విద్యావంతులై అన్ని రంగాలలో చైతన్యవంతు లవుతున్నారు. కాని కొంతమంది స్త్రీలు ఆచార సంప్ర దాయాలంటూ ముందడుగు వేయలేకపోతున్నారు. కొన్ని చోట్ల అగ్రకులాల వారికి ధీటుగా దళిత స్త్రీలు విద్యా వంతులయ్యారు. అయితే కులం పేర, మత, ఆచార సంప్రదాయాలతో వీరు అగ్రవర్ణాల అహంకారానికి బలౌతున్నారు. దళితులు కుల అణిచివేతను, అంటరాని తనాన్ని నిరసిస్తూ సంఘటిత మవుతున్నారు. అయితే ఇది సహింపలేని కొంతమంది అగ్రకులస్తులు దళిత స్త్రీలపై దాడులు చేస్తున్నారు. కంచికచర్ల, కారంచేడు, చుండూరు, తిమ్మ సముద్రం, మద్దికెర, కోదాడ వంటి ప్రాంతాలలో దళిత స్త్రీలపై జరిగిన దారుణ ఘోర సంఘటనలు నేటికీ మన కండ్ల ముందు తచ్చాడుతాయి. బ్రాహ్మణ వాదులు దళితులను బానిసలుగా, అంటరాని వారుగా చేసి నందువల్ల నేటికీ సాధారణ కులాలవారే అన్ని విధాల దోపిడీకీ గురవుతున్నారు. డా॥ బి. ఆర్ అంబేద్కర్ రాజ్యాం గంలో స్త్రీలకు హిందూకోడ్ బిల్లు ద్వారా కొన్ని హక్కులను కల్పించారు. రాజ్యాంగంలోని స్త్రీల స్థానాన్ని గుర్తిస్తూ వెట్టి చాకిరీ నిర్మూలన, వరకట్న నిషేధం, వ్యభిచార నిషేధం

వంటి చట్టాలను, అనేక సంస్కరణలు చేసారు. అవి కేవలం చట్ట రూపంలో ఉన్నాయి. అనేక రకాల కులాలలో ఉన్న స్త్రీలకు ప్రత్యేక రక్షణ కల్పించలేక పోతున్నారు. మాస్టార్జీ స్త్రీల పక్షం నిలబడి గేయరూపంలో వారికి ఉత్సుకతను కలిగించాడు.

"ఈ మగవాడి రాజ్యంలో సెల్లీ/
మంట సెగలోలె లేవాలి మల్లీ", ఎన్ని కష్టాలు వచ్చినా ఖర్మంటూ కూర్చోవడం సరికాదని ధైర్యంగా ముందుకు సాగాలంటాడు. మనుధర్మ శాస్త్రం ప్రకారం స్త్రీలు ఏ విధంగా బలౌతున్నారనేది వివరిస్తూ....

"నీ నోటికే తాళంబు బెట్టి / కాళ్ల చేతులకు సంకెళ్లు గట్టి / నిన్ను వంటింటి జైల్లోకి నెట్టి/
సంప్రదాయాలతో నిన్నదరగొట్టి / పుట్టినపుడె నిన్ను బానిసగా మార్చినా / మనుధర్మ శాస్త్రాన్ని మంటల్లో కాలుస్తూ"
అని స్త్రీలను మేలు కొలిపాడు.

**బాల్య వివాహాల గురించి గేయాలను రాస్తూ....**

"నీకు నూరేండ్ల ముసలోన్ని చూసి / నీ గొంతుకే ఉరితాడు వేసి/ నీ బ్రతుకులో నిప్పులే బోసి/ అయ్యో ముండగా నిన్ను మార్చేసిన"....

పురుషాధిక్యతను చండాడమని స్త్రీలను చైతన్య పరిచాడు. అదేవిధంగా పురుషుడికి ఎదురు తిరిగితే ఏమవుతుందో అనే సందేహాన్ని కూడా నివృత్తి చేసాడు.

"ఇప్పుడు కాగితం నీకిస్తనంటె/ బత్కులేనట్టు నువు కుమిలి చస్తవ్/
వాడు లేకుంటే బత్కు లేనట్టే/ కాళ్ల కాడనే బడి చస్తనంటవ్/ ..... ఆ అల్సుతోనే నిన్నణగదొక్కేటి"

దుర్మార్గుల ఆటలు కట్టించాలని చైతన్యవంతమైన గేయాలను అందించారు. వేదాలలో ఉన్న ధర్మాలను ప్రబోధిసస్తున్న వారిని చిత్రించాడు.

"సత్య సావిత్రి లాగుండ మంటర్ /
సీతమ్మోరి లాగుండుమంటర్" లాంటి నాటి వాస్తవిక సమకాలీన జీవితాన్ని చిత్రించాడు. ఆడవారు తెగించితే లేదా ధైర్యం చేసినట్లయితే.... దాని తీవ్రత మరో రూపం దాల్చుతుందనే హెచ్చరికను కూడా చేసాడు.

"లేదు ద్రౌపదిగ నేనుంటనంటే/ దిమ్మ దిరగేసి అమ్మోనంటర్" ...ఇలాంటి నీతి సూత్రాలు నీకు మాత్రమే పెట్టిన నీతి లేని ధర్మాలకు, తిరుగు బోతులకు సరైన బుద్ధి చెప్పాలంటూ స్త్రీలకు ఉద్భోధించాడు. ఈ సమాజంలో స్త్రీలకు ఉన్న హక్కులను, ఆ హక్కుల ద్వారా వారికున్న స్థానాన్ని తెలుపుతూ.గేయాలు రాసాడు.

"మీ బానిసపు ఉరి సంకెళ్లన్నీ / పెల్లు పెల్లునా పగులగొట్టేసి / రోజూ మగవాడు మిమ్ము దోచేటి / చండశాసనం కాలరాసేటి / హిందూకోడు బిల్లన్నదేనాడో / బాబా చట్టమే జేసిండు చూడు / అందుకే అంబేద్కరిందుకోడు బిల్లు"...... ను సంపూర్ణంగా అమలు చెయ్యాలంటే పోరాటం చెయ్యాలని ఆ పోరాటం ద్వారా తమ హక్కులను కాపాడుకోవాలంటాడు. మనుధర్మానికి వ్యతిరేకంగా ఉండాలంటూ పితృసస్వామ్య వ్యవస్థలో స్త్రీలు పడుతున్న బాధలు మన కళ్లకు కట్టినట్లు తన గేయాల్లో చిత్రించాడు.

ముఖ్యంగా హిందూధర్మం ప్రకారం దళిత స్త్రీలు ఎలా బలి అవుతున్నారో... చిత్రీకరిస్తూ....

"దుష్టులు దుర్మార్గులు / ఈ దేశపు భూస్వాములు/ తిండి బలిసి కండ బలిసి/ అండనున్న ధనం బలిసి/ కండ్ల కెక్కిన కామదాహపు / కొర్కెలెల్లా తీర్చుకోను".... అంటూ ఇలా అంటరాని కులాల స్త్రీలపై లైంగిక హింసను తుడిచివేయాలని కోరుకున్నాడు.

దళిత కోణంలోంచి మార్క్సిస్టు ద్వంద్వ వైఖరిని ఖండించిన గీత రచయితలలో మాస్టార్జీ ప్రముఖుడుగా చిత్రింప బడ్డాడు. సాహిత్యంలో దళిత కవులకు గానీ, విమర్శకులకుగానీ, మార్క్సిస్టు ఉద్యమాలను విమర్శించాల్సిన అవసరమేమొచ్చింది. వారి దృక్పథాన్ని వారు చెప్పుకోవచ్చు గదా! "మార్క్సిస్టుల జోలి" వాళ్లకెందుకు? ఇలాంటి సందేహాలని కొంత మంది వెలిబుచ్చుతుంటారు. ఇలాంటి వాళ్లు గుర్తించని అంశం ఒకటుంది. దళిత కవులూ, విమర్శకులూ తమ దృక్పథాన్ని చెప్పే క్రమంలో

ఇతర దృక్పథాల నుంచీ, దళిత దృక్పథం ఎక్కడ విడు వడుతుందనే విషయాన్ని స్పష్టం చేయాల్సి ఉంటుంది. ఇతర దృక్పథాల కారణంగా తమ సమస్యలను ఎలా పక్కకు నెట్టబడింది అనే విషయాన్నే వీళ్లు మాట్లాడుతారు. అందుకే కుల సమస్య చిన్న ఉపరితల అంశంగా చూసిన మార్క్సిస్టు తప్పుడు అవగాహన గురించి మాట్లాడుతారు.

ఈ దేశంలో మార్క్సిస్టు సిద్ధాంతాలతో ఎన్నో ఉద్య మాలు చేస్తూ పీడితులకు, తాడితులకు బానిస సంకెల్ల నుండి విముక్తులను గావిస్తామని చెపుతూ ఎన్నో దశా బ్దాల నుండే పోరాటాలు చేస్తున్నారు. కాని కొంత మంది నాయకులు పార్టీలలో పనిచేస్తూ ఇతర వర్గాల వారిని విమర్శిస్తున్నారు. ఇక్కడి విద్యా వ్యవస్థను తీవ్రంగా తూర్పారబడుతూ ఈ దేశంలో నేర్పించే చదువులన్నీ అశాస్త్రీయమైన చదువులని ఈ చదువులు అవినీతి పరులుగానూ, లంచగొండితనాన్ని ప్రేరేపించే చదువులని అలాంటి చదువులు చదివి సమాజానికి ద్రోహం తలపెట్టే పౌరులుగా తయారు చేయడం కన్నా విప్లవపార్టీలో చేరి విముక్తి కలిగిన పిదప శాస్త్రీయ చదువులు చదువుకొండని ప్రచారం చేస్తూ వారు మాత్రం ఈ అశాస్త్రీయ చదువుల్లోనే పట్టా పుచ్చుకొని ఈ వ్యవస్థలోనే

ఉద్యోగాలు చేస్తున్న ద్వంద్వ నీతిపరుల మీద మాస్టార్జీ అస్త్రాన్ని సందించాడు.

"ఇది బూర్జువా చదువని-ఈ చదువులు మా కొద్దని / మార్క్సిస్టు మాటలు మళ్లీ మళ్లీ చెప్పగానే నిజమేనని నమ్మాము నిజం తెలియకున్నాము/ మా నాయకులు చెప్పింది అచ్చరాలా నిజమేమోనని మా పిల్లా పాపలను చదువులు చదివించకుండా / పెద్ద కాపు కమతాల్లో పాలేర్లుగా పనికి బెట్టి ఎట్టి చేసి బతికాము ఏమి తెలియ కున్నాము" అంటూ ఆవేదనను వ్యక్తం చేసాడు. ఈ శాస్త్రీయ చదువులు వద్దంటున్న నాయకులే వారి పిల్లలను.... కాన్వెంటు స్కూల్లో చేర్పిస్తారని ఎద్దేవా చేసాడు.

"కె.జి. నుండి పి. జి వరకు-- చదువుకొని/ సమాజంలో
బతుకుతున్న సవమాన్యునికివ్వకుండా
చదువుకున్న ఆ చదువులకే సర్కారు ఉద్యోగమడిగి/
దొరకలేదనే సాకుతో- దేశమిడిచి ఎల్లిపోయి
అరబ్బులకు అమెరికాకు అమ్మి బతుకుతున్నాడు...."

అంటూ తమ పిల్లలను ఇప్పటికీ వారు విమర్శిస్తున్న విద్యా విధానంలోనే ఉన్నత విద్యలు చదివిస్తున్నారు. అంతేగాక అమెరికా అరబ్బు దేశాల్ని సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ దేశాలను విమర్శించి ఆ దేశాలలో పెట్టు బడి దారీ విధానం పోయి సోషలిస్టు వ్యవస్థ నెలకొనాలని ఒక వైపు కోరుతున్నారు. మరోవైపు ఆ దేశాల్లోనే తమ పిల్లలను ఉద్యోగాలు చేయడం కోసం ఎగబడి పంపు తున్న సూడో మార్క్సిస్టుల ద్వంద్వ వైఖరిని బహిర్గతం చేస్తూ....

"ఎనుకటికెయ్యేండ్ల నాడు-మాల మాదిగలు చది వితె/ మనువన్నామూర్ఖుడపుడు మన చదువులనాపినోడు/ మనమేడ చదువుకుంటె వాళ్ల చేతులుండరని/ మార్క్స ముసుగు తొడుగుకున్న మనువాద బ్రాహ్మణులు /మన చదువుల నాపుతుండ్రు తమ వాదన కుట్రలతో/ మనువు గాడు ఆపె చదువు మార్క్సిస్టు ఆపె చదువు/ ఇద్దరొక్క టన్న మాట ఇపుడు తెలుసుకున్నామో"..... అంటూ వెనుకటికెయ్యేండ్ల నాడు మాలమాదిగ కులాలకు సంబం ధించిన వారు చదువు వద్దని నిషేధాన్ని విధించిన మనువు ప్రభావం నేటికీ కొనసాగుతూ దళితులను చదువుకు దూరం చేస్తున్నారు. జ్యోతిభాపూలే, సావిత్రిబాయి పూలే, డా॥ బి. ఆర్.అంబేద్కర్ కృషి ఫలితంగా విద్యావంతులైన దళితుల్ని ఈ ఆధునిక మనువాదులైన మార్క్సిస్టులు దళితుల్ని చదువుకు దూరం చేయడానికి చేస్తున్న కుట్రను ఎండగడుతూ... మాస్టార్జీ వారి దోషాలను ఎత్తి చూపాడు.

"మనువుగాడు ఆపె చదువు-మార్క్సిస్టు ఆపె చదువు / ఇద్దరొక్కటన్న మాట ఇపుడు తెలుసుకున్నామో"...అనే ఈ చివరి మాటలు మార్క్సిస్టులనబడే వారికి మెత్తని చీవాట్లు పెట్టినట్లు ఉంటాయి. ఇంతకు ముందు మార్క్సిస్టు భావజాలంతో పని చేసేవారు సైతం తమను తాము ప్రశ్నించుకుంటున్నారు. తప్పుడు చైతన్యంతో దళితుల ప్రగతిని అడ్డుకుంటున్న మార్క్సిస్టు వాదుల

ద్వంద్వ వైఖరిని విమర్శించారు. తెలుగు రాష్ట్రాలలో బసిని, మాతంగిణి, జోగిని వంటి వ్యవస్థలు నిజామాబాద్, మెదక్, కర్నూలు, కోస్తా జిల్లాలలో కొనసాగుతున్నాయి. దళిత స్త్రీలు శ్రామికులుగా పని చేస్తున్నారు. నేటికీ అగ్రవర్ణాల వారి దగ్గర వెట్టి చాకిరి చేస్తున్నారు. అటు స్త్రీలను, ఇటు దళిత పేద వర్గాల వారిని చైతన్య పరుస్తూనే.... వారు మోసపోయే స్థితిని, అలాగే మార్క్సిస్టు ద్వంద్వ వైఖరిని దళిత ప్రజానికానికి తెలియ జేయటానికి స్వయంగా తాను విజ్ఞాన వంతుడై పొందిన విజ్ఞానాన్ని ఇతరులకు పంచడంలో నాటి నుండి నేటి వరకు కూడా కృషి చేస్తున్న మాస్టార్జీ తెలంగాణ తెలుగులో మొదటి తరానికి చెందిన తొలి దళిత వాగ్గేయకారుడుగా ముందువరుసలో ఉన్న వ్యక్తి. ఇతని సాహిత్యం మీద పరిశోధనలు జరగాల్సిన అవసరం ఎంతో ఉంది.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# సాహితీ సార్వభౌములు

- పి. అన్వేష్ గౌడ్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

సాంప్రదాయ తెలుగు సాహిత్య చరిత్రలో తమ అపూర్వ ప్రతిభా పాండిత్యాలతో సాహితీ సామ్రాజ్యాన్నేలిన కవిసార్వభౌములు అనేకం ఉన్నారు. దాదాపు ఈ కవులందరూ రాజాస్థానాలను అలంకరించినవారే మొట్ట మొదటి కావ్యం రాసిన నన్నయ నుండి చిట్టచివరి ఉత్తమ ప్రబంధం రాసిన చేమకూర వేంకటకవి వరకు, రాజుల మెప్పుకొరకు రాజాశ్రయం కొరకు కావ్యాలు రాసి రాజాంకితం చేసినవారే ఎక్కువ. చక్రవర్తులు తాము మెచ్చిన కావ్యాలు రాసిన కవులకు మణులు, మాణిక్యాలతో పాటు గ్రామాలు అగ్రహారాలను కూడా దానం చేసేవారు. ఈ విధంగా అనేకమంది సార్వభౌములు, సామంతులు, సంస్థానాధీశులు తెలుగుసాహిత్యానికి అంకురార్పణ జరిగిన నాటినుండి అనంతమైన ఫలపత్రపుష్పాలతో విలసిల్లే వరకు అమితమైన సాహిత్య సేవ చేశారు.

అయితే కొందరు రాజులు మాత్రం సాహిత్య పోషణతో పాటు, సాహిత్య సృజన కూడా చేశారు. ఒకవైపు రాజ్యపాలనా భారం వహిస్తూనే, మరోవైపు కలం పట్టి కావ్యరచన చేసి కవి చక్రవర్తులుగా కీర్తి ఘడించారు. ఊపిరి సలుపని కార్యాలలో ఉండి కూడా ఉత్తమ గ్రంథాలను రాసిన వీరి కృషిని పరిశీలిస్తే వీరికి భాషపై గల అభిమానం, సాహిత్యంపై మక్కువ అవగతం అవుతాయి.

రాజకవి అనగానే మనకు శ్రీకృష్ణదేవరాయలే ముందుగా స్మరణకు వస్తాడు. కానీ అంతకు ముందు, ఆ తర్వాత కూడా అనేక మంది రాజులుగా సామ్రాజ్యాలను ఏలుతూనే కవులుగా పాఠకుల హృదయాలను ఆక్రమించారు. మనకి లభిస్తున్న ఆధారాలను బట్టి మొట్టమొదటి రాజకవి క్రీ.శ. 12 వ శతాబ్దానికి చెందిన

**నన్నెచోడుడు** : ఒరయూరు పురాధీశ్వరుడైన నన్నెచోడుడు "కవిరాజశిఖామణి'గా పేరొందాడు. ప్రథమాంధ్ర ప్రౌఢ ప్రబంధం "కుమార సంభవం" ను రచించి ప్రబంధ ప్రజాపతిగా బిరుదు పొందాడు. మొట్టమొదటగా జాను తెలుగు, వస్తు కవితలను గురించి వివరించి, మార్గ పద్ధతికి భిన్నమైన దేశీకవితా పద్ధతిని తెలుగు సాహిత్యలలో ప్రవేశపెట్టాడు. నన్నెచోడుడు కావ్యం మదపుటేనుగు నడకవలె, మదనాగం వలె, పరసతి వలె అందంగా ఉండాలని కావ్య లక్షణాలు సూచించి, తర్వాత కవులకు ఆదర్శం అయ్యాడు. ప్రబంధంలో మంగళాచరణ, సుకవిస్తుతి,

కుకవినింద,పురుషార్థ ప్రాధాన్యం, వర్ణనా నైపుణాల్ని వివరించి ప్రబంధ కవులకు మార్గదర్శకంగా నిలిచాడు. 30 రకాల అలంకారాలను సూచించి తెలుగు సాహిత్యానికి ఎనలేని కృషిచేశాడు నన్నెచోడుడు.

తర్వాత తెలంగాణ ప్రాంత వైశిష్ట్యాన్ని ప్రపంచ ప్రఖ్యాతం చేసిన కాకతీయ సామ్రాజ్య పరిపాలకులలో పేరెన్నదగినవాడు 'మొదటిప్రతాపరుద్రుడు''. రుద్రదేవుడిగా ప్రసిద్ధి చెందిన ఈయన "నీతిశాస్త్రం" అనే రాజనీతి శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. కానీ ఇది అలభ్యం. కాకతీయుల సామంతులు కూడా సాహిత్య చరిత్రలో నిలిచిపోదగిన రచనలు చేశారు. వారు గోనబుద్ధారెడ్డి మరియు బద్దెన.

కోనవంశపు రెడ్డిరాజు అయిన 'గోనబుద్ధారెడ్డి' రాయచూర్ ప్రాంతాన్ని పరిపాలించిన కాకతీయుల సామంతరాజు. ఈయన తన తండ్రిపేర రంగనాథ రామాయణంను రచించాడు. ఇదే తొలి తెలుగు మరియు తొలి ద్విపద రామాయణం. పండితులకు మాత్రమే అర్థమయ్యే రామాయణాన్ని పామరులు కూడా పాడుకునే విధంగా ద్విపద ప్రక్రియలో పండిత, పామర జనరంజకంగా రచించిన ఘనత బుద్ధారెడ్డికే దక్కుతుంది. తర్వాత కాకతీయ సామ్రాజ్యంలో చిన్న ప్రాంతానికి సామంతరాజు "బద్దెభూపతి' లేదా బద్దెన. ఈయన "నీతిశాస్త్ర ముక్తావళి" అనే గొప్ప రాజనీతి శాస్త్ర గ్రంథాన్ని, నీతిశతకాలలో ఉత్తమమైన 'సుమతీ శతకాన్ని'' రచించాడు. సామంత

రాజయిన బద్దెన, రాజల యొక్క అధికారాలు ఎట్లా ఉండాలో వివరించి, ప్రభువులు ప్రజల కోసమే అని నిర్ధారించాడు. నేటి సమాజానికి ఎంతో ఉపయుక్తమైన నీతులను వ్రాసి చరితార్థుడయ్యాడు.

కావ్య యుగమనగానే శ్రీనాధుడు తర్వాత పోతన గుర్తుకురావడం సహజం. కానీ శ్రీనాధునికి ఆశ్రయం కల్పించి అనేక ఉత్తమ కావ్యాలు రాయడానికి అవకాశం కల్పించిన కవిరాజు విద్వాంసుడు "పెదకోమటి వేమా రెడ్డి". ఈయన కొండవీడు సామ్రాజ్యాధిపతి పెక్కు గ్రంథాలను రాసిన ప్రతిభా మూర్తి. ఈయన అస్థానంలో వామనభట్ట బాణుడు, నృసింహ కవులు ఉండేవాడు. వేమారెడ్డి అమరుక శతకానికి వ్యాఖ్య "శృంగార దీపిక', గాధాసప్తశతికి వ్యాఖ్యా "సప్తశతిసార టీక"ను రచించాడు. అంతేకాకుండా సాహిత్య చింతామణి, సంగీత చింతామణి, వీరనారాయణ చరిత్ర-అనే రచనలు చేసి, చివరికి శత్రురాజులు దండెత్తడంతో మనోవ్యధతో మరణించాడు.

ఒకవైపు కరవాలం ధరించి, రణరంగంలో శత్రువులను జయిస్తూనే, మరోవైపు కలం ధరించి సాహితీ రంగంలో పాఠకుల హృదయాలను జయించిన, సాహితీ సమరాంగణ సార్వభౌముడు "శ్రీకృష్ణదేవరాయలు". ఇంకోవైపు భువన విజయలో అష్టదిగ్గజ కవులను ఆదరించిన ఆంధ్రభోజుడు. కనుకనే దేవరాయలు రెండంచుల పదునుగల ఖడ్గం. సాధారణంగా ప్రభువులు, కవులను స్తుతిస్తారు. కాని దేవరాయలు "కవితా ప్రావీణ్య ఫణీశ" అని తిమ్మన చేత, 'నిస్తంద్ర ప్రతిభా" అని పెద్దన చేత స్తుతించబడ్డ మొట్టమొదటి రాజకవి. ఈయన తెలుగులో నాయికా నామంతో వెలసిన మొదటి కావ్యం ఆముక్తమాల్యద అనే చక్కని ప్రబంధాన్ని మదాలస చరిత్ర, జ్ఞాన చింతామణి వంటి అనేక కావ్యాలు వ్రాశాడు. ఆముక్తమాల్యదలో "తలపక్షచ్ఛట' గ్రుచ్చి బాతువులు. . . . "అనే పద్యం ఆయన నిషిత దృష్టికి, మాలదాసరి కథలో మఱ్రిచెట్టు వర్ణన ఆయన సూక్ష్మ పరిశీలనకి తార్కాణం. ఈ విధంగా శ్రీకృష్ణదేవరాయల పరిపాలనలో సామాజికంగాను, సాహిత్యపరంగాను, విజయనగర సామ్రాజ్యం స్వర్ణయుగమైనది. తర్వాత రాయలకాంలో చెప్పుకోదగ్గ పరిపాలకుడు "నాదెండ్ల గోపన" ఈయన మొదట గుత్తికోట పరిపాలకుడిగా తర్వాత కొండవీటి సామ్రాజ్య పరిపాలకుడిగ ఉన్నాడు. ఈయన మహామంత్రి తిమ్మరుసు మేనల్లుడు. ఈయన "కృష్ణార్జున సంవాదం" ఈనే ద్విపద కావ్యాన్ని, సంస్కృతంలో చంద్రికా వ్యాఖ్యాను వ్రాశాడు.

విజయనగర సామ్రాజ్య పతనానంతరం దక్షిణ దేశానికి వలస వెళ్ళిన తెలుగు సాహిత్యాన్ని ఆదరించిన తంజావూరు పాలకుడు "రఘునాథ నాయకుడు" సంగీత, సాహిత్య ప్రియుడు, కవులకే కాక కవయిత్రులకు కూడా స్థానం కల్పించిన కల్పతరువు. ఈయన బహుముఖ ప్రజ్ఞాశాలి సంస్కృత కావ్యాలు, ప్రబంధ కావ్యాలతో పాటు, ద్విపద కవ్యాలు, యక్షగానాలు కూడా రచించాడు. ఎంతో మంది కవులను ఆదరించి, అపర శ్రీకృష్ణదేవరాయలు, అభినవ ఆంధ్రబోజుడు అనిపించుకున్నాడు తన తండ్రి పేర " అచ్యుతాభ్యుదయం" రచించి నాయకాభ్యుదయ ప్రక్రియకు శ్రీకారం చుట్టాడు. అంతేకాకుండా రఘనాథ నాయకుడు గొప్ప వీణా విద్యాంసుడు జయంత సేన రాగాన్ని, రామానందతాళాన్ని సృష్టించాడు. సాహిత్యంతో పాటు సంగీత "సామ్రాజ్యాన్నేలిన రాజకవి రఘునాథ నాయకుడు. తర్వాత ఇతని కుమారుడు 'విజయ రాఘవ నాయకుడు" పాలనాభారంతో పాటు సాహిత్య పాలనా, పోషణా భారాన్ని కూడా వహించాడు తన తండ్రి మీద రఘునాథాభ్యుదయం రచించాడు. అనేక యక్షగానాలు రచించాడు. విజయరాఘవ నాయకుని కాలం సాహిత్య చరిత్రలో యక్షగానాలకు స్వర్ణయుగంగా భాసిల్లింది.

ఈ విధంగా ఎంతోమంది సాహితీ సార్వభౌములు తమ సాహిత్యాభిలాషతో సారస్వత లోకంలో సుస్థిర స్థానాన్ని సంపాదించు కున్నారు. ఒకవైపు పాలనా భారం, ఇంకోవైపు శత్రుదాడులు, మరో వైపు వ్యక్తిగత భాద్యతలు నిర్వర్తిస్తూనే నాల్గవ వైపు అద్భుత రచనలు చేసిన వీరిని చతుర్ముఖ బ్రహ్మలుగా పేర్కొనవచ్చు. సాహిత్య జిజ్ఞాసతో వీరు తెలుగుజాతికి చేసిన సేవ చిరస్మరణీయమైనది.

**ఉపయుక్త గ్రంథాలు :** 1. తెలుగు సాహిత్య దీపిక-ఎన్.కె. మదిలేటి 2. తెలుగు సాహిత్య చరిత్ర-ద్వా.నా శాస్త్రి

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# శ్రీ నారాయణతీర్థలవారి శ్రీ కృష్ణలీలాతరఙ్గిణి - ధ్రువాగానము - దరువులు

- పసుమర్తి వేంకట రమణ, పరిశోధక విద్యార్థి, సిద్ధేంద్ర యోగి కళాపీఠం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కూచిపూడి.

ప్రస్తుత వ్యాసమునందు శ్రీనారాయణతీర్థులవారి శ్రీ కృష్ణలీలాతరఙ్గిణి అను సంస్కృత యక్షగానమును, నాట్య శాస్త్రములో భరతుడు వివరించిన ధ్రువాగానముతో సమన్వయ పరచుటజరిగినది. ఇందు ముందుగా శ్రీ తీర్థులవారి చరిత్రను సంక్షిప్తముగా, తరువాత శ్రీకృష్ణలీలా తరఙ్గిణి గ్రంధము యొక్క కథా క్రమ ము సంక్షి ప్త ముగా, చివరగా శ్రీకృష్ణలీలాతరఙ్గిణి యందు ధ్రువా గానమును (దరువులను) వివరించు ట జరిగినది.

## శ్రీ తీర్థులవారి చరిత్ర :

శ్రీ తీర్థుల వారు 15,16 వ శతాబ్దపు సుప్రసిద్ధ వాగ్గేయ కారుడు. వీరి జన్మస్థలము 'ఆంధ్రదేశము' లో 'గుంటూరు' జిల్లాలో గల 'మంగళగిరి' క్షేత్రము సమీప ములో గల 'కాజ' గ్రామము. వీరు బ్రాహ్మణ కుటుం బములో జన్మించిరి. వీరి ఇంటి పేరు 'తల్లావఝుల' వారు, వీరి తండ్రి గారు శ్రీ 'గంగాధరుడు'. తల్లి గారు శ్రీమతి 'పార్వతి'. వీరి మొదటి నామధేయం 'గోవింద శాస్త్రి'. గోవింద శాస్త్రికి చిన్న తనము నుండి 'శ్రీకృష్ణుని' పట్ల అచంచలమైన భక్తి. 8 వ. యేటనే ఉపనయ నముచేసిరి. తరువాత 12 వ యేట వరకు 'వాసుదేవా చారి' గారి వద్ద విద్యాభ్యాసము జేసిరి.

ఒకనాడు గోవిందశాస్త్రి కలలో ఒక యతీంద్రుడు కనిపించి, ద్వాదశాక్షరీమంత్రమును 12 కోట్ల జపము చేసిన శ్రీకృష్ణ భగవానుని దర్శించగలవని చెప్పి అంతర్ధాన మయ్యెను. వెంటనే 'గోవింద శాస్త్రి' తల్లి తండ్రులకు స్వప్నము గురించి తెలిపి వారి అనుమతితో 'వేదాద్రి' పుణ్యక్షేత్రము చేరుకొని భగవంతుని ధ్యాన ముచేయగా, శ్రీకృష్ణభగవానుడు యతిరూపములోదర్శనమిచ్చి 'గోవిందశాస్త్రి' కి 'ద్వాదశాక్షరీ' మంత్రమును ఉపదేశించి అంతర్ధానమయ్యెను.

'గోవిందశాస్త్రి' ద్వాదశాక్షరీ మంత్రజపమునుచేసి యోగసిద్ధులను, ఆత్మజ్ఞానమును పొంది, కాశీ క్షేత్రము చేరి, అచ్చుట శ్రీ శివరామానందులవారి శిష్యులై సన్యాస మును స్వీకరించిరి. గురువు అనుగ్రహముతో 'శ్రీ నారాయణతీర్థులు' అను నామధేయమును పొంది సదా చారులుగా ప్రకాశించినారు.

## శ్రీకృష్ణలీలాతరఙ్గిణి గ్రంధ పరిచయం :

యతి అయిన శ్రీనారాయణతీర్థులవారు సంస్కృ తములో కృష్ణలీలాతరఙ్గిణి యక్షగానం, తెలుగులో పారి జాతాపహరణ యక్షగానం, సంస్కృతములో శాండిల్య భక్తి సూత్ర వ్యాఖ్య, వేదస్తుతీక మొదలగు గ్రంధ ములను రచించిరి. ఇందులో 'శ్రీకృష్ణలీలాతరఙ్గిణి' గ్రంధము నృత్య, సంగీతములలో ప్రాచుర్యం పొందింది.

భాగవతములోని దశమస్కంధములో శ్రీకృష్ణ జన నము నుండి రుక్మిణీ కళ్యాణము వరకుగల కథల లోని ముఖ్యఘట్టములను తీసుకొని, శ్రీ తీర్థులవారు శ్రీకృష్ణ లీలాతరఙ్గిణిని అను గ్రంధమును 12 తరంగ మలుగా (భాగములుగా) రచించిరి.

## కృష్ణలీలాతరంఙ్గిణి గ్రంధపరిచయం :

శ్లో॥ ఆదౌ కృష్ణావతార స్తదను నరహరే ర్బాలలీలా విలాసో
వత్సానాం పాలనం, తచ్చరిత మథ గవాం పాలనం, ప్రౌఢభావ:
గోపీవస్త్రాపహార స్తదనుగిరివరోద్ధారణం, రాసలీలా
కంసాదీనాం నిరాస స్తదను జలనిధౌ ద్వాకర కాయాం ప్రవేశ: 10

రౌహిణేయస్య కృష్ణస్య వివాహ స్తరనంతరం,
రుక్మిణ్యాదృష్టమహిషీసహితో గీయతే మరై: 11
ఇ త్యేవం సం(పే)ణోక్తా కృష్ణలీలాతరఙ్గిణీ,
ఆద్య కృష్ణవతారో యం సంగ్రహేణాభి నీయతే.12

శ్రీకృష్ణలీలాతరఙ్గిణీ యక్షగానమును 1) శ్రీకృష్ణ జననము, 2)బాల్యక్రీడలు, 3) గోవత్సపాలనము, 4) గోపాలనము, 5) గోవర్ధనొద్ధరణము, 6) గోపీసమా గమము, 7,8.) రాసక్రీడ, 9) మధురాప్రవేశము, 10) కంసవధ, 11) ద్వారకా ప్రవేశము, 12) రుక్మిణీ కల్యాణ ములను 12 తరంగములుగా విభజించిరి.

ఒక్కొక్క తరంగము నందు కథాగమనమును పద్య, గద్య, దరువు రూపములుగాను, కథలోని కృష్ణ లీలలను, మహిమలను కీర్తనలరూపముగా రచించిరి. అంతేకాక ఒక్కొక్క తరంగములలోని కథను 'శ్లోకములు'గా ముందుగా వివరించిరి. ఈ విధానము భరతుడు వివ రించిన పూర్వరంగ (నాట్యప్రదర్శనకు ముందు ఆరోజు ప్రదర్శించు ప్రదర్శనయొక్క కథను సూత్రధారుడు ముందుగా వివరించుట పూర్వరంగం) విధానముగా నున్నది.

**ఉదాహరణ : మొదటి తరంగము :**

శ్లో॥ ఉగ్రసేన స్తత: కంసో దేవకీవసుదేవయో:,
తయో: కారాగృహే వాస: కంసేన విహిత: కాల.13
బ్రహ్మ సురేంద్రో ధరణ సనక్షాద్యాస్తతో హరి:,
భగవత్ప్రార్థనా తేషాం తత్తత్ స్థాననివేశనమ్. 14
నారదస్యాపతేశేన షట్సుతానాం విదారణమ్,
దేవక్యాస్సప్తమో గర్భ: సంకర్షణ ఇతీరిత: 15
గోకులే కృష్ణగమనం దుర్గాయా మధురాగమ:,
కథాయా స్సంగ్రహస్త్వేవం చరిత్రేస్మి న్నిగద్యతే. 16

**అర్థము :**

శ్రీకృష్ణావతారమందు ఉగ్రసేనుడు దేవకీవసుదేవు లకు వివాహము చేసి అరణము ఇచ్చి పంపుట కంసుడు రథము నడపుచూ పోవుటయు, అప్పుడాకాశవాణిని విని దేవకీవసుదేవులను కారాగృహము నం దుంచుటయు, బ్రహ్మాదిదేవతలును, భూదేవియు శ్రీవైకుంఠమునకు పోయి భూభారనివారణార్థము భగవం తుని బ్రార్థించు టయు, భగవదనుగ్రహమును, భగవత్సహాయ్యార్థం దేవగణములు యదువంశమున అవతరించుటయు, నార దోపదేశమున దేవకీపుత్రుల ఆర్గురిని కంసుడు వధించు టయు, దేవకీ సప్తమగర్భమున ప్రవేశించిన బలరాముని యోగమాయ రోహిణిగర్భమున ఉంచి తాను యశోద గర్భము జొచ్చుటయు, భగవ దవతారమును, గోకుల మున బ్రవేశించుటయు, యశోదగర్భమున అవతరించిన యోగమాయ కారాగృహ మున చేరి కంసుని పరిభవించి, దేవతలచే పూజవడయుటయు (దేవతలచే పూజలందు కొనుట), ఇట్లు భగ వదవతారచరిత్ర (భగవంతుడు అవతరించు చరిత్ర) సంగ్రహముగా తొలుత (ముందుగా) జెప్పబడుచున్నది.

కథాగమనము నందు దరువులు, గద్యములు, పద్య ములు, కీర్తనలు - వివరణ.

దరువులు : ఈ దరువులను ధ్రువాగానమునందు వివరించితిని.

గద్యము : కథాగమనమునందు 'అశరీరవాణ శ్రవణము' నందు.

**గద్యము :**

అథ దేవకీవసుదేవయో: వివాహోత్సవా నంతరం వసుదేవగృహప్రవేశమయే తయో స్సారథ్యం కుర్వతి కంసే దేవక్యాస్త్వష్టమో గర్భ: కంసమృత్యు రిత్యశరీరవాక్యం శ్రు త్యా కంసో వసుదేవం ప్రత్యాహ. 17

ఇట్లుండగా దేవకుడు తన కమార్తె దేవకిని వసుదేవున కిచ్చి వివాహముచేసెను. అంత నా వధూవ రులు వారు తమఇంటికి బోవునపుడు కంసుడు రథమునడుపు చుండెను అంతలో అశరీరవాణి కంసునితో ఇట్టు అనెను. "కంసుడా! దేవకి యొక్క అష్టమగర్భమున ఉదయించిన శిశువు నిన్ను జంపును" ఆ మాట లు విని కంసుడు వసుదేవునితో ఇట్లనియె.

శ్లో॥ వసుదేవ హనిష్యామి కరిష్యా మ్యాత్మనో హితమ్,
దేవకీం భగినీ మేనాం మృత్యుబీజం మ మాప్య హమ్. 18

"వసుదేవా ! ఈ దేవకి నాకు చెల్లె లైనను నా చావునకు మూలము కానున్నది. కావున ఈమెను వధించెదను. అంత నాభయము దీరును". అని అనగా వసుదేవుడు దేవకిని వధించవద్దని కంసుని ఈ విధముగా కీర్తించు చున్నాడు. (10.వ. కీర్తన.)

**కీర్తన :**

పల్లవి : హే కంస రాజసుతా హే నరశ్రేకష్ఠ

అను పల్లవి :

హే సత్యసంధకుల జలధిభవరత్న

చరణం: హే సౌమ్యగుణయుక్త హితజనాసక్త
కల్యాణవేద్యాం చ కలితబహుభద్రాం
ముంచ భగినీ మద్య ముహురధికహృద్యాం
సత్మం వదామి తవ సత్యసంధో స్మి

చరణం : దాస్యావి తజ్జాత వత్సా ననింద్య................

కంసా! నీవు రాజపుత్రుడవు. ఉత్తమపురుషుడవు. సత్యమైనమర్యాదగల వంశమునందు రత్నముగా పుట్టి నావు. మంచిగుణములు గలవాడవు. నీకు హితమును కోరువారిని ప్రేమించువాడవు.ఇప్పుడే పెండ్లి చేసికొని మంగళవతి యగు నీచెల్లెలు దేవకి నీకుమిక్కిలి ప్రియ మైనది గదా! ఈమెను చంపకుము నామాట వినుము నేను సత్యము తప్పువాడనుకాను సత్యము పలుకు చున్నాను.......ఈ విధముగా శ్రీకృష్ణలీలాతరజ్గిణి యందు కధాగమనమును దరువులు, పద్యములు, గద్యములు, శ్లోకములతో రచనచేసిరి.

శ్రీ నారాయణతీర్థులవారి శ్రీకృష్ణలీలాతరంజ్గిణి - ధ్రువాగానము.

ఈ ధృవాగానముగురించి భరతుడు నాట్య శాస్త్రములో 6 వ, అధ్యాయము, 32 వ. అధ్యాయము ల యందు వివరించిరి.

ప్రవే - శాక్షేప - నిష్కామ - ప్రాసాదిక - మధాంతరమ్॥

ధృవాగానము 5 విధములు 1.ప్రవేశగానము, 2.ప్రసాదగానము, 3.ఆక్షేపగానము, 4.అంతర గానము, 5.నిష్కామగానములు. (తరువాత కాలములో (నేడు) వీటినే నాట్యమునందు దరువులు అయిన వి).

## ప్రవేశ ధ్రువాగానము (ప్రవేశదరువు) :

అనగా రంగమునందు ప్రవేశించు పాత్రయొక్క భావమునును, ప్రకృతి, అవస్థానమును సూచించు గానము. (ఈ గానము గ్రంథమునందు లేక ప్రదర్శన యందు నాయ కుడు,నాయికి లేక ఇతరపాత్రల ప్రవేశిం చునపుడు ( రాముడు, సీత,కృష్ణుడు మొ॥ ) వారి వారు పరిచయ ము చేసుకొనుచూ రంగస్థలమునందు ప్రవేశించెదరు).

**ఉదా : ప్రథమ తరంగం నందు దేవకీ ప్రవేశం :**

దరువు-నాదనామక్రియారాగము-ఆదితాళము.(8వ కీర్తన)

ఆయాతి దేవకీ దివ్యసుందరీ విష్ణు
మా యేవ సాక్షా దియ మమరనారీ
నరాధిపవర గేహినీ శ్రీ
నారాయణీయదివ్యమూర్తిజననీ
ఇందువద నారవిందలోచనా శుభ
కుందరదనీ కుటిలకుంతలఘనా

ఆ యుగ్రసేనును తమ్ముడగు దేవకుడను వాని కూతురు దేవకీ వచ్చుచున్నది. సాక్షాత్‌విష్ణుమాయా అనునట్లు, దేవతా స్త్రీయో అనునట్లు, రాజగృహమున నవతరించి వసుదేవుని లక్ష్మియా అనునట్లు విలసిల్లి శ్రీమన్నారాయణ దివ్యలీలావతారమునకు తల్లియై పూర్ణచంద్రుని పోలు మోమును, తామరల పోలు కన్ను లును మల్లెమొగ్గలను పోలు పలువరుసయును, మేఘమును పోలిన కురులు కల్గిసకలసద్గుణవతియై ఉండెను.

"దేవకీదేవి ప్రవేశించుచుండగా ఆమె ఎవరో, అమె గొప్ప తనమును, అందమును వివరించు ప్రవేశించు చున్నది. కనుక ఇది "ప్రావేశ ధ్రువాగానము" అయినది..

## ప్రసాదకి ధ్రువాగానము(ప్రసాద దరువు) :

ప్రవేశించి పాత్రయొక్క చిత్తవృత్తిని సామాజికులకు తెలి యజేయు గానము. ప్రసాదము, సంభ్రమము, అనుస్మరణము, అతిశయవాక్యములు, గర్వము, ప్రార్థన,

శృంగారము-అద్భుతదర్శనము అను వానియందు మధ్యలయాశ్రయమగు "ప్రాసాదికీధ్రువాగానము" చేయ వలెను.

భూదేవి కంసుని దురాగతముల పాపభారముచే పరితపించచున్నాను రక్షించమని శ్రీ మహా విష్ణువు ని ప్రార్థించుచునున్నది.......

శ్లో॥ శరణముపగతా హం త్వాం శరణ్యం జనానాం
నిఖిల భయవియోగం యోగిచింత్యం మహాంతం
సురరిపుగణభారం దుస్సహం దుర్భర మ్మే
పరిహర పరమాత్మ భక్తిసిద్ధైకమూర్తె 24.

స్వామీ! శ్రీమన్నారాయణా! సకల చేతనులకు రక్షకుడవు. సకల భయములను తీర్చువాడవు. యో గీ శ్వరులచే ధ్యానింపబడువాడవు. మహానుభావుడవు. పరమాత్మవు. రాక్షసులు(రాజవేషమున) మిక్కుట ముగా పుట్టియున్నారు. వారి భారమును సహించలేక వచ్చి శరణు వేడినదానను. భక్తులను అనుగ్రహించు నాథా! దుర్భర మైన యీ భారమును వారించి నన్ను రక్షింపుము.

కంసుని దురాగతముల వలన కలిగిన భూభారముచే భూదేవి తనను ఈ భారము నుండి కాపాడు మని ప్రార్థించుటవలన ఈ గానము 'ప్రాసాదకి ధ్రువాగానము' అయినది.

## ఆక్షేప ధ్రువాగానము(ఆక్షేప దరువు) :

రసాంతమును సూచించుటకు చేయబడు గానము. ఇది రెండు రకములు. 1.స్థిత ధ్రువాగానము. 2.ద్రుత ధ్రువగానము. ఔత్సుక్యము, అవహిత్థ, చింత, పరిదేవ నము, శ్ర మ, దైన్యము, విషాదము అనెడి భావము లందు స్థితధ్రువనుగానము చేయవలెను. కరుణ, వేదితమును లందును 'ద్రుత ధ్రువాగానము' చేయ వలెను.

శ్రీకృష్ణలీలాతరఙ్గిణి యందు నాల్గవ తరంగములో కాళింగుని మర్ధించుచున్న కృష్ణుని, దైన్యస్థితిలో నున్న భర్తను చూచి నాగపత్నులు భర్తను కరుణించమని ఈ విధముగావేడుకొనుచున్నారు. ఇందు స్థిత, ద్రుత ధ్రువాగానములు కలిగియున్నది.

శ్లో॥ ఫణేషు తస్య నృత్యంతం క్షీణశక్తే ర్ముహు ర్ముహు:,
భర్తృభిక్షాం ప్రార్థయంత్యో నాగపత్న్యో జగుర్హరిమ్9

ఆ కాళీయుడు శక్తి హీనుడై పడియున్నను, శ్రీకృష్ణుడు ఆతని శిరములపై మరల మరల నృత్యము చేయుచునే ఉండెను. శక్తి హీనుడగుల వలన కాళీయుడు దైన్యస్థితి పొందుట వలన ఇది స్థిత ధ్రువాగానము అయినది. దానిని చూచి ఆ నాగపత్నులు పతి భిక్షపెట్టమని వేడుకొను చుచున్నారు.

**కీర్తన 8 ముఖారి రాగం ఆదితాళం**

పల్లవి : దేవ కురు శిక్షాం దేహి పతిభిక్షాం

అను పల్లవి :
దీనపరిపాలనాయ స్వీకురు దీక్షాం

చ॥ 1 : ఆగమైకశరణ మశేషలోకకారణం
ఆహు రాగ మేన తత్త్వా మానంద మఖండితం

చ॥ 5 : అజ్ఞాతవస్తు కి మస్తి విజ్ఞానస్య తే
ఆజ్ఞాపయ యదుచిత మస్మాకం జగత్ప్రభో......

ప। : ఓ మహాత్ముడా! దుష్టులను శిక్షించుట యుచితమే అయినను మాయందు కరుణించి మాకు పతిభి క్ష నిమ్ము.

అప। దీనులగు మమ్ము రక్షించుటయందు దీక్షను గైకొనుము.

చ॥ 1 : నీవు వేదమే నివాసముగా కలవాడవనియు సృష్టికర్తవనియు, పరమానంద స్వరూపుడవ నియు వేద వేత్తలు చెప్పుదురు.

చ॥ 5 : ఓ సర్వజ్ఞా! నీవు జ్ఞానరూపుడవు నీకు తెలియని దేది కలదు? కావున ఓజగన్నాయకా! మేమికపై ఆచరించ వలసినదేదియో ఆజ్ఞాపించుము.

"శ్రీకృష్ణుడు కాళీయుని మర్ధించగా అతని దైన్యస్థితిని చూచి అతని భార్యలు భర్తను కుణించమని వేడుకొను చున్నారు కనుక ఇది ద్రుత ధ్రువాగానము అయినది. స్థిత, ద్రుత ధ్రువాగానము'లు రెండు ఇందుకలవు. అందుచే ఇది "అక్షేపిత ధ్రువాగానము" మయినది.

## అంతర ధ్రువాగానము : (స్వగత దరువు)

గతి పరిక్రమణ నిరూపణాద్యవసరములందు చేయబడు గానము. ఎక్కువభారముచే క్రుంగినపుడు, మూర్ఛ నందినపుడు, పతనముచెందినపుడు, విషాదము చెందినపుడు మొదలగు సందర్భములలో చేయుగానము అంతరగానము అనబడును. (తనలో తానుపాడు కొనునది)

కంసునికి రుక్మిణికి శ్రీకృష్ణునితో వివాహమునచేయుట ఇష్టములేదని చెలులవలన తెలుసుకొని మూర్చిల్లి లేచి రుక్మిణి తనలో...

పన్నెండవ తరంగము - 4వ కీర్తన. ఆహిరీ (ఆనంద భైరవి) రాగము - ఆది(జంపె) తాళము.

పల్లవి : వీక్షే కదా దేవదేవం గోపాలమూర్తిం

అనుపల్లవి :

సాక్షాస్మదనకోటి సౌందర్యభాష్యం. ..................

ప॥ : గోపాలరూపుడగు ఆ దేవదేవుని ఎప్పుడు చూతునో!

అ॥ప॥ : ఆ మన్మథకోటి సమానసుందరాకారునిఎప్పుడు చూతునో! అనుచూ తనమనస్సులో తను అనుకోనుచున్నది.

''రుక్మిణీ తనలో తాను అనుకొనుటవలన ఇది 'అంతర ధ్రువాగానము' అయినది.

## నిష్క్రమణ ధ్రువాగానము : (నిష్క్రమణ దరువు)

పాత్ర నిష్క్రమించునపుడు చేయు గానము.

యోగమాయ అయిన దేవిని చంపబోవగా ఆమె ఆకాశమున తన నిజస్వరూపమును జూపగా దేవ తలు ఆమెను పూజించి కీర్తించిరి. దీనిని చూసి కంసుడు..

## మొదటి తరంగము :

శ్లో॥ దురంతచింతాగ్రాహేణ గ్రస్తో యం కంసకుంజర:
అలబ్ధశరణో స్వస్థ స్సదనం స్వీయ మాగత:47.

ఇట్లా దేవి మహిమను చూచి ఆ కంసుడు మితిలేని చింత పొందినవాడై దిక్కు తోచక మనసు కుదరక దిగు లొందిచేయునది లేక యింటికి పోయెను. (రంగ స్థలము నుండి నిష్క్రమించును)

''పాత్ర నిష్క్రమించినది కనుక ఇది 'నిష్క్రమణ ధ్రువాగానము'' అయినది.

నాట్యశాస్త్రముందుగల ఈ ఐదు ధ్రువగానములనే తరువాత వాగ్గేయకారులు దరువులు అనిరి. ఇవే కాక కధాగమనములో సందర్భమును బట్టి మరి కొన్ని దరువు లను ప్రయోగించిరి. అందులో ఒకటి "సం వాద దరువు".

## సంవాద దరువు :

కధాగమనములో నాయకి నాయలకు మధ్యగాని, పాత్రలమధ్యగాని జరిగే సంభాషణ ను 'సంవాద దరువు' అందురు.

ఉదా : పంచమ తరంగం 3 వ కీర్తన. ధన్యాసిరాగం - ఆటతాళం.

గోపికలందరూ వారివస్త్రములనుగట్టుమీద ఉంచి దిగంబరులై మడుగులో ప్రవేశించి స్నానము చేయు చుండగా శ్రీకృష్ణుడు గోపికలవస్త్రములను తీసుకొని చెట్టుపైకూర్చున్న శ్రీకృష్ణునికి, గోపికలకి జరిగే సంభాషణ (సంవాదము)...

కృష్ణ : అవరణ మమ న హి తే దాతుం
భావయ గోపవధూజనబృంద

గోప్య : దేవయదావరణం మమ నీతం
దేహ విభో భవతా తదనంత ................................

కృష్ణ : ఓ గోపికలారా! మీకు యిచ్చుటకు నా వద్ద ఆవరణమే (వస్త్రము)లేదు బాగుగ ఆలోచిం చుడు.

గోపికలు :

ఓ అనంతుడా! నీవిప్పుడు మా వస్త్రములను కొనిపోయితివి గదా. దానిని మాకు మరల ఇమ్ము.

శ్రీ కృష్ణునికి, గోపికలకు వస్త్రములను గూర్తి సంభాషణ జరుగుచున్నది గాన ఇది 'సంవాద దరువు' అయినది.

## ముగింపు :

శ్రీతీర్థుల వారు తన శ్రీ కృష్ణలీలాతరఙ్గిణిని ధ్రువా

గానము నందు రచించినను, ఈ గ్రంథమునందు 'దరువు' లనే పదమునే ప్రయోగించిరి. శ్రీ కృష్ణలీలా తరఙ్గిణిని నాట్యప్రయోగమునకు, ఇటు శాస్త్రీయ సంగీత సాంప్రదాయమునకు అటు భజన సాంప్రదాయమునకు పాడుటకు అనువుగా రచించిరి, మోక్షసాధకులకు మోక్షసాధనము ' శ్రీకృష్ణలీలాతరఙ్గిణి ' గ్రంథము. అందుకనే శ్రీతీర్థులవారు గ్రంథ కథ ప్రారంభము నకు ముందు, చివర ఈ విధముగా వ్రాసిరి.

శ్లో॥ వాసుతేవే భగవతి భక్తిప్రవణయా ధియా,
వ్యజ్యతే భక్తి సారాఢ్యా కృష్ణలీలాతరంగిణీ.

ఈ కృష్ణలీలాతరంగిణీ భక్తిసారమును తెలుపుచున్నది కావున దీని అర్థము శ్రీకృష్ణుని యందు భక్తి విశేషము గలవారికి తెలియును గాని సామాన్య జనులకు బోధపడదు.

శ్లో॥ కామదా కామినామేషా ముముక్షూణా చ మోక్షదా,
శృణ్వతాం గాయతాం భక్త్యా కృష్ణలీలాతదఙ్గిణ్యాం.

ఈ శ్రీకృష్ణలీలాతరంగిణి గ్రంథమును భక్తియుక్తులై వినినను, గానము చేసినను, భోగములను కోరువారికి భోగములను, మోక్షము కోరువారికి మోక్షమును ఇచ్చును.

దీని వలన శ్రీ నారాయణతీర్థుల వారి శ్రీకృష్ణలీలా తరంగిణి యొక్క ప్రాముఖ్యత తెలియుచున్నది.

**ఆధార గ్రంథములు :**

1. నాట్యశాస్త్రం-తెలుగు అనువాదం శ్రీ పొణంగి శ్రీరామ అప్పారావు.
2. శ్రీకృష్ణలీలాతరఙ్గిణి-వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్.
3. శ్రీకృష్ణలీలాతరఙ్గిణి-శ్రీ గుండ్లపల్లి ఆదినారాయణ.
4. తెలుగు తెలుగు నిఘంటువు - తెలుగు అకాడమి.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# రాయలసీమ జనపదాలలో పదప్రయోగాలు

**- ఆచార్య ఎం. రామనాథంనాయుడు,** తెలుగు విభాగం, కర్నాటక సార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూరు.

జనపదాలలో జానపదులు నిద్ర లేచినప్పటి నుండి నిద్రపోయేవరకు వాళ్ళ వాళ్ళ పనులలో నిమగ్నమై వుంటారు. అప్పుడప్పుడు ఒకరితో ఒకరు కలుసు కున్నప్పుడు రకరకాల పదాల్ని తమ మాటల్లో వుప యోగిస్తుంటారు. ఆ పదాలు వాళ్ళకే అర్థమయ్యేది. కొత్త వాళ్ళకు అర్థంకావు. ఆ పదాలకు అర్థాలు వెతికితే కష్టం. సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోవాలి. జానపదులు వాడే పదాలు ఎంతో అనుభవంతో సందర్భానుసారంగా తగిన విధంగా వుంటాయి. ఆ పదాలు ఆయా ప్రాంతాల యాసతో, కూడి వుంటాయి. ఒక ప్రాంతంలో వాడే పదం మరొక ప్రాంతంలో వాడితే ఆ పదానికి అర్థం తెలియక తికమక పడాల్సి వుంటుంది.

ఉదాహరణకు డబ్బును మనీ, క్యాష్, కాంచాలం, రూకలు, వరహాలు, రూపాయి, దమ్మిడి, ధనం, పైకం వంటి రకరకాల పేర్లతో పిలుస్తుంటాం. "ఒళ్ళులో దమ్మిడీ నానం లేదు" అని, "అర్థం లేని వాడు వ్యర్థం" అనీ, "డబ్బుకు లోకం దాసోహం" అనీ అంటుంటారు. రాయల సీమలో ఎక్కువగా 'దుడ్లు', 'లెక్క' అనీ, కోస్తాంధ్రలో 'డబ్బు' అనీ, తెలంగాణాలో 'పైసలు' అని వాడు తుంటారు.

జానపదులు ఫలానా మాటలనే మాట్లాడాలి. ఫలానా మాటలను మాట్లాడకూడదనే నియమం ఏమీ లేదు. వాళ్ళకు తోచినట్టు, నోటికొచ్చినట్టు బూతు మాటల్ని కూడా నిర్భయంగా, నిర్మొహమాటంగా ఎవరి ముందరంటే వాళ్ళ ముందర ఏ జంకూ గొంకూ లేకుండా మాట్లాడు తుంటారు. వీళ్ళకు లోపల ఒకటి పెట్టుకుని, బయటకు ఒకటి మాట్లాడ్డం రాదు. మనస్సుకు తోచింది మాట్లాడే శుద్ధ అమాయకులు. కులాలతో, మతాలతో వీరికి పనిలేదు. ఆనందంగా కాలం గడిపేస్తుంటారు.

కాని నేడు పరిస్థితి మారింది. కాలానికి తగినట్టుగా బతకాలి. నేర్చిన విద్యలు ఖర్చు చేయకుండా బతక నేర్చిన తెలివిని తన దగ్గర పెట్టుకుని బతికితే తప్ప ఈ భూమ్మీద జీవించడం కష్టం. బలహీనుడైన మిత్రుడికంటే బలవంతు డైన శత్రువు మేలు అంటుంటారు. ఎంతో జాగ్రత్తగా మసలుకుంటే తప్ప జీవనం సాగించడం కష్టమైపోతుంది. గడ్డుకు మించి నడుచుకుంటే ఈ కంటి నీళ్ళు ఆ కంటికి పోయిస్తుంది నేటి సమాజం. కొన్ని సందర్భాల్లో భార్య భర్తని దండిస్తూ వుంటుంది. నువ్వేం న్యాత బిడ్డవా! కింద మింద కూడా నెరిసిపోయింది. ఇంకా నేర్చుకోకుంటే ఎలా? వాళ్ళు చూడు ఎంత తెలివిగా మసలుకుం టున్నారో. వాళ్ళ తెలివి ఎన్నాళ్ళకు రావాలి నీకు. ఇంకా అదే కాలం అనుకున్నావా! ఒకరికొకరు మర్యాదలు చేసుకుని బతికే కాలం ఎప్పుడో పోయింది. ఇప్పుడంతా రంగులు మారిపోతున్నాయి. ఊసరవెల్లి చూడు ఒక నిమిషంలో ఎన్ని రంగులు మారుస్తుందో. అలాగే మను షుల ప్రవర్తన కూడా వుంది. ఇప్పుడొక మాట వెంటనే మరొక మాట మార్చేస్తుంటారు. నరంలేని నాలుక ఏమైనా మాట్లాడుతుంది. అంటే మొత్తానికి మాటమీద నిలబడే కాలం పోయిందని చెట్టు నీడను చూపిస్తుంటారు. అంటే పొద్దు తిరిగే కొద్దీ నీడ మారుతుంటుందని, కాలం మారే కొద్దీ మనుషులు మారాలని చెపుతారు. మాటకు కట్టు బడితే ఎన్ని అవస్థలు పడాల్సి వుంటుందో రామాయణం తెలియజెప్పుతుంది. అలాంటి ఇబ్బందులు పడ్డానికి నేటితరం ఇష్టపడటం లేదు.

జానపదుల్ని కోడి నిద్ర లేపుతుంది. కోడి కూసిందంటే తెల్లవారిందని లేచి వాళ్ళ వాళ్ళ పనులకు వాళ్ళు బయలు దేరుతారు. వీళ్ళు కోడికూసే జామును కోడిగుజ్జాము అని అంటారు. రాత్రి మాటల్లో పడి చాలా సేపు మేలుకొని వుంటే 'నడిజాము' అయింది పడుకోండి మళ్ళీ తెల్లవారుతోనే ఎక్కడికో బయలుదేరాలని అంటుంటారు. ఇంకా సూర్యుడు పుట్టక ముందు అయితే తెల్లగా పటం ఎగిరిందంటే తెల్లవారి పోయిందనీ, బారెడు పొద్దు ఎక్కితే

అన్నం పొద్దు అయిందని, నిల్చున్నప్పుడు మన నీడ కన బడకపోతే మిట్టమధ్యాన్నం అయిందనీ, పొద్దు పడమర వైపు వాలితే సద్దిపొద్దు అయిందనీ, సూర్యుడు కనిపించ కుండా పోతే పొద్దుగుంకిందని, దీపాలు వెలిగించే సమ యాన్ని సందలగుంక అనీ రకరకాల పదాలు సమయానికి బదులుగా వాడుతుంటారు. పల్లె ప్రజలు గడియారాలు లేని సమయాల్లో పొద్దు చూచుకుని సమయాన్ని గుర్తించేవాళ్ళు. ప్రస్తుతం గడియారాలు వున్నా కుడా చాలామందికి సమయం చూసేది రాక అన్నం పొద్దు, సద్దిపొద్దు మొదలైన మాటలనే వాడుతున్నారు. ఇంకా ఉత్తుత్తి మాటలు, న్యామతా వుండడం, త్యారగా రావడం, అరుట్లు, ఆసరా, గంటు సుతరామూ, ముందుచూపు, అరగాసు, ఆము, పుచ్చిన్లు, ఓగు, నాలీసు, పుట్టుజెడ, ఉరువులు, సొట్లు, కక్కుర్తి, ఇరుసుమురుసు వంటి ఎన్నో మాటలను సందర్భం వచ్చినప్పుడల్లా మాట్లాడుతుంటారు.

- ఎవరికీ ఉపయోగపడని, పనికిరాని మాటలు చెప్పుకుంటుంటే వాని మాటలు నమ్మకండ్రా వాడు అన్నీ ఉత్త మాటలు చెపుతాడని అంటారు.
- పనిపాట లేక తినింది అరగక భారంగా కదులు తుంటే ఏంరా! అట్ల న్యామతా వుండకపోతే ఏదైనా పనిపాట చేసుకోకూడదా అని అంటారు.
- కష్టపడకనే వస్తువులన్నీ కావాలనుకున్నప్పుడు ఊ! వచ్చేస్తాయ్ అన్నీ త్యారగా! అంటే ఊరకే కష్టపడ కుండా ఏమిరావని వాళ్ళ ఉద్దేశం లిఒకరని గురించి ఒకరు ప్రగల్భాలు చెప్పుకుంటూ, మైమరచి మాటలు చెప్పుకుంటుంటే పెద్దలు చూచి ఏమండ్రా! ఎంత సేపయినా అరుట్లు కొట్టుకుంటావుంటే పని పాట ఎవరు చేస్తారని దండిస్తుంటారు.
- ఏదైనా ఒక విషయం గురించి మాట్లాడుకుంటూ నువ్వు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా వాడు మాత్రం సుతరామూ ఒప్పుకోడు. ఎందుకంటే వాడి మన స్తత్వం నాకు తెలుసని అంటుంటారు.
- ఒకరికి ఒకరు తోడు నీడగా వుండి ఒకరు లేక పోయేసరికి నాకిక ఆసరా! ఎవరు? అని బాధపడు తుంటారు.
- సంపాదించిన సంపదను 'గంటు' అంటారు. ఏందిరా ఎత్తుకొని పోతున్నావని అంటే నీగంటు యాడా ఎత్తకపోలేదులే అనీ, నీ గంటూ, మూట భద్రంగా నీ దగ్గరే పెట్టుకో అని ఎగతాళిగా మాట్లాడుతుంటారు.
- సంసార జీవితాన్ని కాని, ఏదైనా ఒక పనిని చేసేట ప్పుడు కాని ఒక పద్ధతి ప్రకారం చేయనివారిని, జరుగబోయేదాని గురించి ఆలోచించని వారిని ముందుచూపు లేనివాడు అంటారు. ఇలాంటి వారిని గురించే "గుడ్లొచ్చినప్పుడు గూటికి తారాడేవార"నే సామెత పుట్టుకొచ్చింది.
- గొప్పగా ఆలోచించకుండా, పెద్ద చిన్న అనేవి గుర్తిం చకుండా ప్రవర్తిస్తుంటే వాళ్ళని అరగాసు అంటారు. "కాసిచ్చయినా అరగాసు సహవాసం విడిపించు కోవాల"ని పెద్దలంటుంటారు.
- పిల్లలు కాని, పెద్దలు కాని హుషారుగా లేకుండా మొద్దుగా, మజ్జరంగా వుంటే వానికి ఒళ్ళంతా ఆమెక్కి పోయిందని అంటారు.
- ఒకరి మీద మరొకరికి పుచ్చిన్లు అంటే వున్నదీ లేనిదీ చెప్పి వాళ్ళకు తంటాలు పెట్టేస్తుంటారు. అలాంటి వారిని 'తంట్లమారి' అని కూడా అంటుంటారు. ఆడవాళ్ళనైతే 'మందర' అంటారు. అదే మగ వాళ్ళనైతే 'నారద మహర్షి' అంటారు. నారదుడు కలహభోజనుడు కదా మరి!
- పని పాట లేకుండా గాలికి తిరిగే వాళ్ళని 'ఓగు' అంటారు. ఏరా! ఓగు నాయాలా! అని పిల్లల్ని ముద్దుగా కూడా పిలుస్తుంటారు.
- ఇండ్లు కట్టడం, రోడ్లు వేయడంలో పనితనం గట్టిగా లేకపోతే వాడన్నీ నాలీసు పనులు చేయిస్తాడు. ఇకమీదట వాడికి ఏ పనులు అప్పజెప్పకండి అని అంటుంటారు.
- పుట్టుకతో వచ్చిన బుద్ధి పుట్టుజెడ పోదని అంటారు.
- ఒకరిని నమ్మి ఏదైనా వస్తువు ఇస్తే అందులో కొంత నొక్కేసి మోసం చేస్తాడు. వీడు సరిలేదు అని ఆ

వస్తువుని మరొకరి చేతికి ఇస్తారు. వాడు అసలుకే మోసం చేసినపుడు వీడు ఏమో అనుకుంటే ఉరువులే ముంచేవాడుగా వున్నాడే అని అంటారు.

- ఏదైనా పని చేయలేనప్పుడు చేయనని చెప్పకుండా సొట్లు చెప్పడం.
- వాడు మనకు చెప్పేవన్నీ 'గచ్చులే' అంటారు. అంటే అబద్ధాలు అని అర్థం.
- దొరికింది కదా అని తెగ తినేస్తుంటే, ఏం రా! నీ కొచ్చిందనీ నిధానంగా తిను. అంత కక్కుర్తి ఎందుకు అని అంటారు.
- బాగున్న వ్యక్తులు ఏదో మనస్తాపం వచ్చి ఒకరకంగా వుంటే వాళ్ళని చూచిన ఇతరులు వాళ్ళెందుకో ఈ మధ్య ఇరుసు మురుసుగా వున్నారని అంటుంటారు.

## విశేషంగా కొన్ని పద ప్రయోగాల్ని పరిశీలిద్దాం :

**అబ్బిరింత** : ఊరిలో జరిగిన విషయాలన్నీ తెలిసి కూడా నాకేం తెలీదబ్బా, వాళ్ళ మొగం ఎవరు చూసిరని ఏమీ తెలిసీ, తెలియనట్టు నటిస్తుండేవాళ్ళని అబ్బిరింత అంటారు. ఇలాంటి వాళ్ళని చూచి ఓహో! చాలులేయే నంగనాచి "బిత్తిరి బిడ్డని కంటే ఎలుకెత్తుకు పోయి ఎన్నుకుప్పలో పెట్టినంట" అని ఎత్తిపొడుస్తుంటారు.

**అరచేతిలో** స్వర్గం : స్వర్గం సుఖసంతోషాలకు నిలయమని, దేవతలు అమృతం తాగడంవల్ల వాళ్ళకు చావు లేదని, సకల ఐశ్వర్యాన్ని కల్పవ ృక్షం ప్రసాదిస్తుందని, స్వర్గంలో రంభ, ఊర్వశి, మేనక వంటి ఎందరో సుందరీ మణులు తమ నాట్యంతో మైమరపిస్తారని ప్రజల నమ్మకం. అదే నరకంలో అయితే చేసిన తప్పులకు తగిన శిక్షవేస్తారనే భయం. పాపం చేసినవాళ్ళు నరకానికి, పుణ్యం చేసిన వాళ్ళు స్వర్గానికి వెళుతారని ప్రజల గట్టి నమ్మకం. అయితే మనం చేసిన పాపాలకు అప్పుడే భగవంతుడు చూపిస్తాడని, ఈ యుగంలోనే పాప కార్యాలకు ఫలితం అనుభవించక తప్పదని అంటుంటారు.

గ్రామీణ ప్రాంతాలలో బాగా మాటలు నేర్చినవాళ్ళు అమాయకులను మాటల్లో ముంచి నీకు అది కొని పెడుతా, ఇది కొనిపెడుతా, నిన్ను పూలల్లో పెట్టి చూసుకుంటా, నీకే మాత్రం కొరత రానివ్వను, నన్ను నమ్ము అని ఏవేవో మాయమాటలు వినసొంపుగా చెపుతారు. ఆ మాటలు వింటుంటే కడుపులో బిడ్డలు అట్టాగే జారిపోతారు. మాయమాటలు చెప్పి ఇతరుల్ని నమ్మించడాన్ని అరచేతిలో స్వర్గం చూపించడం అంటారు.

అడుగులకు మడుగులొత్తడం: సమాజంలో మన మంచి కోరే మిత్రులు కాని, బంధువులుకాని మనం చెడుదారిన వెళుతుంటే లేదా తప్పుడు పనులు చేస్తుంటే మనకు బుద్ధి మాటలు చెప్పి, మనల్ని సరిదిద్దాలని చూస్తారు. మనం బాగుండాలన్నదే వీళ్ళ ఉద్దేశం. ఇలాంటి వాళ్ళు మన చెడును కోరరు. అయితే కొంతమంది మనం ఏమి చేసినా మీరు చేసిందే సరి అని మనకు వత్తాసు పలుకుతుంటారు. దీనికి కారణం ఏదైనా వుండవచ్చు. మన నుంచి ఏదైనా ఆశించి ఆ పని చేయవచ్చు. లేదా శకుని లాగా మనతోనే వుండి మన చెడు కోరవచ్చు. ఇలాంటి వాళ్ళను "సమయం చూచి చలి కాచుకునే రకం" అని అంటారు. మనం చెడు మార్గంలో వెళుతుండేది అందరికీ తెలుస్తుంటుంది. అయితే మన దగ్గర వున్నవాడు మనల్ని సరిదిద్దక, సక్రమ మార్గంలో నడిపించకుండా వుంటే వాడు చూడరా! వానికి బుద్ధి చెప్పకుండా వాని అడుగులకు మడుగుతొత్తుతున్నాడని అంటారు.

**అయినాతి** : అయినాతి మొగోడు, అయినాతి ఆడది అని అంటుంటారు. అంటే బలమైన మనుషులని, ఆజానుబాహులు అని అర్థం. అయినాతి భూమి అని కూడా అంటారు. సారవంతమైన భూమి అని దీనర్థం. తోటలో ఏపుగా పెరిగి, మంచి ఫలాలు ఇచ్చే చెట్టు ఎండిపోయినప్పుడు ప్చ్! అయినాతి చెట్టు పోయేరా అనీ, విశ్వాసానికి మారుపేరైన కుక్కను పెంచుకుని, అదిలేకపోతే అయినాతి కుక్కను పోగొట్టుకుంటినని బాధ పడుతుంటారు. అయినాతి మనుషులు, భూమి, చెట్టు, కుక్క ఏదైనా కావచ్చు. ఇతరులకు మేలు చేసేవిగా చెప్పుకోవచ్చు.

**ఆరుబాటం** : పనులన్నీ చేసేశాక చివరి నిమిషంలో వచ్చి హడావిడి చేయడాన్ని 'ఆర్భాటం' అంటారు.

ఇలాంటి వాళ్ళని చూచి ఓహో! వీడు ఇంతవరకు ఎక్కడ పడివున్నో పనులన్నీ అయిపోయాక, అందరికంటే ఎక్కువ పనులు చేసినవాడి మాదిరి అందరూ చూసేట్టు 'ఆర్భాటం' చేస్తున్నాడని అంటారు. ఇంకా "ఆరుబాటం రెడ్డిసాని కోడిచారుతో గుుకడుక్కున్నట్టు" అని అంటుంటారు.

**ఈడవ** : 'ఈడవ' అంటే వంశక్రమం, వరుస, పద్ధతి అని చెప్పుకోవచ్చు. పెళ్ళి సంబంధాలు చూసేటప్పుడు సహజంగా ఇటు ఏడుతరాలు, ఆటు ఏడుతరాలు చూడమంటారు పెద్దలు. బిడ్డ నడవడికలో ఏదైనా కొంచెం తేడా వస్తే తల్లి బాగుంటే కదా బిడ్డ బాగుండేదని, ఆవు చేను మేస్తే దూడ గట్టున మేస్తుందా! అని తల్లి మీద నిందలు మోపుతారు. ఇంకా చెడ్డ వ్యక్తులను చూసి వీళ్ళకు ఎంత దూరంగా వుంటే అంత మంచిదని వీళ్ళ ఈడవే మన కొద్దని అంటారు.

**ఉడుతా భక్తి** : ఏదో చేతనైన సహాయాన్ని చేసినప్పుడు ఉడుతా భక్తి అని అంటారు. శ్రీరామ కథలో ఉడుతది చిన్న సహాయం. వానర సైన్యం - రాముని ఆధ్వర్యంలో లంకా నగరానికి సముద్రం మీద వారధి కడుతున్నారు. ఆ మహా ప్రయత్నంలో ఉడుతవంటి చిన్న ప్రాణి ఏ సహాయం చేయగలదు శ్రీ రామచంద్రుడికి? ఏమీ చేయలేనని అది అనుకోలేదు. తన్న చిన్న శరీరాన్ని సముద్రపు నీళ్ళతో తడిపింది. తర్వాత ఇసుకలో పొర్లాడింది. తన శరీరానికి అంటుకున్న కొద్దిపాటి ఇసుకను సముద్రంలో జారవిడిచింది. ఊసపుల్లకు కాశిపుల్ల తోడైనట్టు ఎంతో కొంత సహాయం చేసింది. ఆ విచిత్రం చూచిన రాముడు సంతోషంతో బుజ్జి ముండను ఎత్తుకుని ముచ్చటగా తన వేళ్ళతో దాని వీపు నిమిరాడు. అప్పటి నుంచి ఉడుత వీపు మీద రాముని వేళ్ళ గుర్తులు అలానే వుండిపోయాయి. అలాగే సమాజంలో పెద్ద పెద్ద కష్టాల్ని ఎదుర్కుంటున్న వారికి మనం ఆ కష్టాలన్నీ తీర్చలేక పోయినా మనకు తోచినది చేస్తే అంటే మాట సహాయం కావచ్చు. ధనసహాయం కావచ్చు. మన స్తోమతకు తగినట్టు సహాయం చేస్తే 'చేయికి చేయి తోడు' అన్నట్టు అదెంతో మేలు చేసినట్టు అవుతుంది. ఏదో ఉడుతాభక్తి సహాయం చేశామనే తృప్తి కలుగుతుంది.

**ఉప్పురాతికి పనికిరారు** : తల్లిదండ్రులకు బిడ్డలు చేదోడు వాదోడుగా వుండాలి. అలా కాకుండా వాళ్ళకు భారంగా అయినప్పుడు ఉప్పురాతికి పనికి రారు అని యాష్టపడుతుంటారు. ఉప్పు మనకు ఎన్నో రకాలుగా వుపయోగపడుతుంది. ఉప్పులేని పప్పుకూర అంటారు. పప్పుకూరను ఎంత బాగా చేసినా ఉప్పు వేయకపోతే చప్పగా వుంటుంది. పప్పుకూర రుచి తెలియాలంటే ఉప్పు వేయాల్సిందే. ''ఉప్పులేనికూర ఒప్పదు రుచులకు'' అన్నారు.

ఉత్తమాటలు చెప్పుకుంటూ పొద్దుగడిపేసిన రోజు ఈ రోజు ఉప్పురాతి పని జరుగలేదని అంటారు. అలాగే ఊర్లో మనకు ఉప్పురాతి మర్యాద లేదని కూడా బాధ పడుతుంటారు. ఇంకా 'ఉప్పు తిన్నవాడు నీళ్ళు తాగక తప్పదు' అని అంటారు. అంటే తప్పు చేసిన వాళ్ళు దాని ఫలితం అనుభవించక తప్పదని దానర్థం.

**ఎకసక్కాలు** : కొందరు నాతో ఎకసక్కాలాడవద్దని చాలా పరుషంగా మాట్లాడుతుంటారు. అంటే తమాషాలు చేయవద్దని అర్థం. ఇంకా కొంతమంది బలహీనున్ని చూచి ఆహా, ఓహో, ఆ, మళ్ళీ అంటూ ఎగతాళిగా ఎక్కిరించడం, తాస్కారంగా మాట్లాడటం జరుగుతుంటుంది. బలహీనుడు బలవంతుల్ని చూచి ఏమీ చేయలేక తోటి వాళ్ళతో అబ్బ వాళ్ళు మాట్లాడుతుంటే ఒళ్ళంతా ఉప్పు కారం పూసుకున్నట్లుంది అని అంటుంటారు.

**ఎత్తినోళ్ళ సంకబిడ్డ** : పసితనం ఏమీ తెలియని తనం. బిడ్డను ఎవరు సంకలో పెట్టుకుని ముద్దు చేస్తే వాళ్ళతో ఆడుకుంటారు. తన, మన అనే తేడా తెలియదు వాళ్ళకు. అయితే పెద్దవాళ్ళు కూడా కొందరు ఎవరికి చెప్పే మాటలు వారికి చెప్పి అందరితోనూ బాగుంటారు. ఎవరితోనూ నిష్ఠూరం తెచ్చుకోరు. అలాంటి వాళ్ళను నువ్వేంరా! ఎత్తినోళ్ళ సంకబిడ్డ, ఏమాటకామాట, ఏ పాటకాపాట పాడి ఏ బాధల్లేకుండా జీవిస్తున్నావని అంటారు.

**ఓపికకు పరీక్ష** : ఎవరయినా దేనికోసమో పదే పదే

గుర్తుచేసి విసిగిస్తుంటే ఇక మీదట నాకు ఓపిక లేదు. ఊరకే వుండానని నా ఓపికకు పరీక్ష పెట్టవద్దు నేను మంచోడు కాదని అంటారు. ఇంకా చెప్పే వాళ్ళకు వినేవాళ్ళు లోకువ అన్నట్టు వింటుంటే ఎక్కడ లేని పురాణాలు, ఊళ్ళోని రామాయణాలు చెప్పి విసిగిస్తుంటారు. అప్పడు వీళ్ళు ఇక నాకు వినే ఓపిక లేదు ఎవరు యాడ చస్తే నాకేంటి. చాలించు నీ పురాణం. నా ఓపికకు పరీక్ష పెట్టొద్దని అంటుంటారు.

**కిమ్మల్లోపన్లు** : రెండోకంటికి, రెండో చేతికి తెలీకన్నా లోలోపల చేసే పనులను లోపాయికారి పనులంటారు. మనసులో ఒకటి పెట్టుకొని బయట ఒకటి మాట్లాడుతూ చేసే పనులను ముచ్చుపనులని, ముచ్చోడు రాజుకన్నా బలవంతుడని అంటారు. వాడు చేసే ముసవ చేష్టలు, పంగమాలిన పన్లు నాకు నచ్చవు. వాడు చేసే పన్లన్నీ కిమ్మల్లో చేసే పన్లని వాపోతుంటారు. కొంత మంది పద్ధతులే అలాంటివి.

**కిసరేపించడం** : పిల్లల్ని గాని, పెద్దల్నిగాని ఈ మాట ఆ మాట అని కిసరేపించడం అంటే విసుగు, కోపం తెప్పించడన్నమాట. వాళ్ళకు గిట్టని, పట్టని మాటలతో, సూటిపోటి మాటలతో ఇబ్బంది పెట్టడం, ఎంతో ఓర్పు, సహనం కలిగిన వాళ్ళను కూడా నానారకాల మాటలతో కలబెట్టి కోపం తెప్పించి వాళ్ళ దగ్గర తిట్టించుకోవడం జరుగుతుంటుంది. అదో సరదా. అమాయకంగా వుండే వాళ్ళని కూడా ఏవేవో పనికిరాని మాటలతో కలబెట్టి కిసరేపించడం జరుగుతుంది.

**కొట్టిన పిండి** : ఒకరు రోజూ చేస్తున్న పనిని గురించి అడిగితే అది అతనికి కొట్టిన పిండి అవుతుంది. ఎందుకంటే ఆ పనిలో అతనికి సామర్థ్యం, పట్టు వుంటుంది కాబట్టి, దీన్నే నల్లేరుపై బండి నడక మాకు అని కూడా అంటారు. అంటే అంత సులభమైన పని అన్నమాట. హనుమంతుడికి సముద్రాన్ని దాటడం కొట్టిన పిండి. ఎందుకంటే ఆయనకు ఆ శక్తి, సామర్థ్యం వుంది కాబట్టి సముద్రాన్ని అవలీలగా దాటేస్తాడు.

**గాడిద కష్టం** : బరువులు మోయడం గాడిదలకు అలవాటై పోయింది. ఉప్పు అమ్మేవాళ్ళు ఉప్పు మూటల్ని గాడిదలపై వేసి ఊరూరు తిరిగి అమ్ముకొస్తారు. ఉప్పు అమ్మిన తర్వాత ఉప్పు భారం తగ్గుతుందనుకుంటే చింత గింజల మూటలు వేస్తారు. మొత్తానికి బరువు మాత్రం తగ్గదు. అలాగే చాకలి వాళ్ళు బట్టలుతకడానికి ఊరందరి బట్టల్ని మూటలు మూటలుగా కట్టి గాడిదలపై వేస్తారు.

"గంగిగోవు పాలు గరిటడైనను చాలు, కడవడైననేమి ఖరము పాలు" అని వేమన ఏ ఉద్దేశంతో చెప్పాడో గాని నేడు గాడిద పాలను ఆరోగ్య నిమిత్తం అమ్ముతున్నారు. మనం ఎవరి కాళ్ళపైనన్నా పడి క్షమించాలని కోరాలనుకున్నప్పుడు మనసు ఒప్పుకోదు. నేను పోయి వాడి కాళ్ళు వట్టుకోవడమా! అని బిర్రు చేనస్తుంటే వసుదేవుడంతటి వాడే గాడిద కాళ్ళు పట్టుకున్నాడట మనమెంతని అంటుంటారు.

అలాగే తల్లిదండ్రులు పిల్లల్ని దండిస్తూ రాను రాను రాజుగారి గుర్రం గాడిదయిందని అంటారు. ఇంకా తప్పు చేసిన వాళ్ళకు గుండు గీయించి, అడ్డనామాలు పెట్టి గాడిద పైన ఊరంతా ఊరేగిస్తారు. నువ్వు పాట పాడితే గాడిదలు పరిగెత్తుకుని వచ్చేస్తాయని ఎగతాళి చేస్తారు. అమ్మా నాన్నలు చిన్న బిడ్డల్ని ఆట పట్టించడానికి నువ్వు నా బిడ్డవు కాదు నిన్ను ఉప్పమ్ముకునే వాళ్ళ దగ్గర కొనుక్కోమని చెపుతుంటారు. ఇంకా ఎవరైనా ఏదో విషయం మాట్లాడుతున్నప్పుడు గాడిద గుడ్డేం కాదు అని ఎగతాళిగా మాట్లాడుతారు. ఈ రోజు నాకు గ్రహచారం లేక గాడిద దగ్గర తన్నించుకున్నట్టు అయిందని అంటారు. టి.వి.లలో కట్నం తీసుకున్నవాడు 'గాడిద' అని ప్రసారం చేస్తుంటారు. పాపం గాడిద ఏం చేస్తుంది.

గ్రామీణ ప్రదేశాల్లో ఉమ్మడి కుటుంబాలు ఎక్కువ. వాళ్ళ జీవనం వ్యవసాయం పై ఆధారపడి వుంటుంది. పల్లెల్లో పుట్టి ఉద్యోగ నిమిత్తం లేదా వ్యాపార నిమిత్తం పట్టణాలకు వెళ్ళిన కుటుంబాలలోని ఆడబిడ్డని సున్నితంగా పెంచుకుని వుంటారు. పెళ్ళీడు వచ్చాక పెళ్ళి సంబంధాలు చూస్తుంటారు. సేద్యం ఎక్కువగా , జనం ఎక్కువగా వుండే ఇళ్ళలో బిడ్డని ఇవ్వాలంటే భయపడ

తారు. ఆ ఇంట్లో మన బిడ్డ బతకలేదురా! ఆ గాడిద కష్టం మనబిడ్డ చేయలేదు. యాడయినా సుఖంగా వుండే చోట చూద్దామని అంటుంటారు.

ఇంకా కూలి చేసుకునేవాళ్ళు కూడా ఫలానాచోట పని ఎక్కువ కూలి తక్కువ. ఆ గాడిద కష్టం మనం చేయ లేంరా స్వామీ! ఎక్కడయినా మనకు సరిపోయే చోటుకెళ్ళి కూలీ చేసుకుందాం అని చెప్పుకుంటారు.

ఇళ్ళల్లో నిమిషం తీరిక లేకుండా ఎప్పుడూ ఏదో ఒక పని వుంటే ఈ గాడిదకష్టం నేను చేయలేను. ఈ గాడిద చాకిరి ఎవరు చేస్తారు? మావల్ల కాదని వాపోతుంటారు. ప్రతి ఒక్కరికి సేద అవసరం. గాడిదలాగా యజమానికి ఎవరూ సహాయం చేయలేరు.

**గాల్లో దీపం** : గాల్లో దీపం వెలగదు. కాని వెలిగించా లని ప్రయత్నం చేస్తారు. ఏదైనా పని జరగాలంటే మనం ప్రయత్నం చేయాలి. యత్నం, ప్రయత్నం, ఆపై దైవయత్నం అని అంటారు. ఒక రాయి వేసి చూద్దాం. పండురాలితే ఆనందం. రాలకపోయినా నష్టమేమీ లేదు. దీన్నే అడ్డేట్లో గుడ్డేటు అంటారు. అలానే గాల్లో దీపం వెలిగిస్తారు. అది వెలిగితే వెలుగుతుంది లేదంటే ఆరిపోతుంది.

**గుడ్డి ప్రేమ** : తమ బిడ్డలపై వున్న మమకారంతో వాళ్ళు ఎలాంటి చెడుదారిన నడుస్తున్నా, తప్పుడు పనులు చేస్తున్నా ఏమీ తెలియనట్టు వుండడాన్ని గుడ్డి ప్రేమ, అతి ప్రేమ అని అంటారు.

మహాభారతంలో ధృతరాష్ట్రుడు తమ బిడ్డలపై వున్న అమితమైన ప్రేమవల్ల దుర్యోధనాదులు పాండవులపై ఎలాంటి దుర్మార్గానికి ఒడిగట్టినా పళ్ళెత్తు మాట అనకండా లోలోన సంతోషపడేవాడు. తనకు కళ్ళు కనిపించక పోయినా దుర్యోధనాదులు చేసే ఆగడాలను ఇతరుల దగ్గర చెప్పించుకుని సంబర పడేవాడు.

మీ బిడ్డలపైన మీకు ఇష్టం వుండవచ్చుగాని కళ్ళు మూసుకుపోయిన ప్రేమ అంటే గుడ్డి ప్రేమ అనవసర మని, ఆ గుడ్డిప్రేమే మీ బిడ్డల భవిష్యత్తును ముంచు తుందని, ఇకనైనా కళ్ళు తెరవండని కొందరు హెచ్చ రిస్తుంటారు.

**జాణతనం** : ఊరికి ఒకరిద్దరు నేర్చినవాళ్ళు, జాణ తనం గలవాళ్ళు వుంటారు. ఎవరైనా వాళ్ళని ఫలానా పనిని చేసి పెట్టమని అడిగినపుడు నేను ఆ పనిని చేయ నని చెప్పకుండా ఈ మాట ఆ మాట చెవులు కింపైనట్టు చెపుతూ కాలం గడిపేస్తారు. అసలు పనిని మాత్రం ముట్టుకోరు. ఆ పనిని వాళ్ళు వేరే వాళ్ళ దగ్గర చేయించు కున్న తర్వాత అప్పుడేదో పని చెప్పారు మర్చిపోయాను. ఇప్పుడు చెప్పు చేసిపెడతానంటారు. ఇదే జాణతనం. ఆ పని చేసేసుకుని వుంటారని వాళ్ళకు తెలుసు. తెలిసినా ఎదుటి వ్యక్తికి నొప్పి పుట్టించకుండా, తన చేతికి కష్టం తగలకుండా తెలివిగా తప్పించుకోవడం జాణతనం. వాళ్ళు నేరుగానే నీ జాణతనమంతా చూపిస్తివి, ఊ! కాని మాకేం తెలివిలేకకాదు అని నిష్ఠూరం చేస్తుంటారు. ఆ నిష్ఠూరాన్ని పోగొట్టడానికి ఏవో చిన్న చిన్న పనులు చేసిచ్చి "చేతికి అందరు, నేటికి దొరకర"న్నట్టుగా తప్పించుకు తిరుగుతుంటారు.

**తెరపవదలడం** : వర్షాకాలంలో రెండు మూడు రోజులు వరుసగా వర్షం పడితే పల్లెవాసులు చాలా కష్టపడుతుంటారు. వంట చేసుకోవడానికి కట్టెలు నాని పోయివుంటాయి. మాసిపోయిన బట్టలు ముగ్గిన వాసన కొడుతుంటాయి. ఆహారధాన్యాలు మొలకెత్తుతుంటాయి. వరి, రాగి కసువులు నానిపోయివుంటాయి. గొడ్లు, మేకలు మేతలేక అరుస్తుంటాయి. కోళ్ళు, కుక్కలు, తేమకు బయటపోకుండా ఇంటిలోకి దూరుతుంటాయి. అలాం టప్పుడు వానదేవుడు కరుణించి కొంతసేపు వర్షం పడ కుండా ఆగుతుంది. ఆ సమయాన్ని తెరపవదలడం అంటారు. అప్పుడు వెంట వెంటనే తమ పనులు చేసుకుంటారు పల్లె ప్రజలు.

ఒక్కొక్కసారి ఎండకాస్తున్నప్పుడు వర్షపుజల్లులు కురుస్తాయి. ఆ సమయంలో పిల్లలంతా వీధుల్లో కొచ్చి ఎగురుతూ కుక్కలకు, నక్కలకు పెళ్ళి అని కేకలు పెడుతుంటారు.

**తేనెపూసిన కత్తి** : తేనెపూసిన కత్తి నొప్పి లేకుండా శరీరంలోకి దిగిపోతుంది. శరీరంలోని అవయవం తెగిందే

తెలీదు. రక్తం కారదు. అంటే గుట్టు చప్పుడు కాకుండా నరాలు తెంపేస్తారని అర్థం. ఇంకా వాడు తేనె పూసిన కత్తి రా! అనీ, వాడు తడికత్తులతో గొంతుకోసేసే రకం అని అంటుంటారు.

**దర్భిం మీద తాళంలేరు** : ఒక పనిని సక్రమంగా సాధించుకోవాలంటే ఆవేశం, ఆత్ర ృత పనికిరాదు. ఓర్పు, సహనం అవసరం. అయితే వయసు మీద వున్నవాళ్ళు ఆ పనిని సాధించేది ఎప్పుడెప్పుడా అని ఆత ృత పడు తుంటారు. అప్పుడు అనుభవం గల పెద్దవాళ్ళు వాళ్ళను వారించి, వుండం(డా! మీకు అనుభవం లేదు. అలాంటి పనులను చాలా జాగ్రత్తగా అదును చూసి సాధించు కోవాలని నచ్చజెప్పుతుంటారు. వాళ్ళ మాట వినకుండా ఎగిరెగిరి పడుతుంటే వీళ్ళు దర్భిం మీద తాళలేకున్నారు. వీళ్ళు ఎక్కడో ఒక చోట తన్నులు, దెంగులు తినడం ఖాయం అని అంటుంటారు.

**దావాంతరం** : సమాజంలో జీవిస్తున్న ప్రతిఒక్కరూ దేవుడిచ్చిన దాంతో తృప్తి పడాలి. ఈ జన్మకు ఇంత ప్రసాదించాడని అనుకుని జీవించాలి. అలా కాకుండా ఉన్న దాంతో తృప్తి పడకుండా రేయింబవళ్ళు కష్టపడటం లేకపోతే అన్యాయంగా వేరే వాళ్ళ సొత్తును దోచుకోవడం వంటి పనులు చేయడం, పిల్లలు తిను బండారాల్ని నోటికి కుక్కుకోవడం వంటివి చూసి వీళ్ళకేంరా! అంత దావాం తరం వచ్చింది అని అంటారు.

**దండగ** : దండగ అంటే వ ృథా, పనికి రానిదని అర్థాలున్నాయి. ఇంట్లోని వాళ్ళకు ఏ పనిలోనూ సహాయంగా లేకుండా దండగ్గా కూర్చొని తినేవాళ్ళని 'దండగ మారి' అంటారు. పని, పాట లేని సోంబేరి అని కూడా అంటారు. తల్లిదండ్రులు సోంబేరి బిడ్డ మాట ఎవరైనా ఎత్తినప్పుడు వాని మాట నాముందర ఎత్తకండి వాడు శుద్ధ దండగ మారి నా కొడుకై పోయాడని కోపగించుకుంటుంటారు.

**నవిసిపోవడం** : పిల్లవాడు ఏదైనా తినే పదార్థాన్ని ఆత్రంగా తింటుంటే వీడు చూడు తిండికి ఎలా నవిసి పోయాడో అని అంటారు. ఎక్కువగా తింటుంటే రేయ్! నీది కడుపా కందుకూరు చెరువా! అని అంటూనే వీని కడుపులోకి ఏదో దూరిందని చెపుతుంటారు. అలాగే వీడు తిండికి బెక్కెత్తి పోయినట్లున్నాడని కూడా అంటారు.

**నసయాపారం** : తాడో పేడో తేల్చేయకుండా ప్రతి విషయాన్ని నానబెట్టి అలా చేస్తే ఏమవుతుందో, ఇలా చేస్తే ఏమవుతుందోనని ఏ పనిని జరగనివ్వకుండా నసగుసలు చేస్తున్న వ్యక్తిని చూసి నీతో పెట్టుకున్నవాడు ఒకడూ బాగుపడలేదు. నీది ఎప్పుడూ నసయాపారమే. దేన్నీ తేల్చకుండా అన్నీ కుళ్ళి పోయేదాకా నాన బెడతావు. ఇవన్నీ ఒకసారిగా చేయాలంటే అయ్యే పనేనా! అని అంటుంటారు. అలాగే ప్రతి విషయానికి చీటికి మాటికి చాలా విసిగిస్తుంటే నీ నసయాపారం నాకొద్దు. నీ దారి నీది, నా దారి నాది అని కూడా అంటారు.

**నెత్తిరాయి** : ఒక మనిషి ఎవరికీ ఉపయోగపడకుండా భారంగా తయారైనప్పుడు వీడు నాకు నెత్తిరాయి అయ్యాడని తన వాళ్ళు అంటుంటారు. నెత్తిన రాయి పెట్టుకుంటే ఎలా బరువుగా వుంటుందో అలాంటి బరువును అప్రయోజకుడైన బిడ్డని కన్న నేరానికి మోయాల్సి వస్తుందని తల్లిదండ్రులు వాపోతుంటారు. ఇంకా కొంత మంది వాళ్ళ పనులు వాళ్ళు చేసుకోకుండా బయట ఏవేవో తంటలు తేవడం, ఊరకే వుండే ప్రాణానికి ఉపద్రవం తీసుకు రావడం చేస్తుంటారు. అలాంటి వాళ్ళను చూచి వీడు మాకు నెత్తిరాయి అయిపోయాడని, వీడిని ఎక్కడికైనా దూరంగా పంపించేయాలని అంటుం టారు.

**పక్కలో బళ్ళెం** : కొంతమంది మనతో కలసి మెలిసి వుంటూనే మన ఆయువు పట్టులన్నీ శత్రువులకు అందించడం, అదను చూసి మనపైకే తిరగబడటం జరుగుతుంటుంది. మనతో బాగుంటూనే మనకే గోతులు తవ్వడం అంటే ఇదే. ఇంకా కొందరు, మనతో వుంటూ, మనం పెట్టింది తింటూ నమ్మకంగా వుంటూనే మన మర్మాలు, బలహీనతలు పగోడికి అందించడం. ఇలాంటి వాళ్ళను తిన్నింటి వాసాలు లెక్క పెట్టే వాళ్ళని అంటారు. మహాభారతంలో శకుని కౌరవ పక్షాన చేరి వాళ్ళనాశనాన్ని

కోరుకున్నాడు. అలాంటి వాళ్ళనే పక్కలో బళ్ళెం అంటారు. బళ్ళెం అంటే ఆయుధం, ఆయుధం మనకు వుపయోగ పడాలేగాని శత్రువులకు వుపయోగపడకూడదు. మనతో వున్నవాడు ఇతరులకు వుపయోగపడినప్పుడు ఈ మాటను వాడుతారు.

**పన్యారం** : అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టు వున్నదంతా ఇతరులకు పంచేయడం. పన్యారం అంటే అంగడిలో లాగా అందరికీ కనిపించేటట్టు వస్తువు లన్నింటినీ పెట్టుకోవడం. ఈ దృశ్యాన్ని చూచినవాళ్ళు ఏంది అన్నీ పన్యారం పెట్టుకోనుండావే అని అంటారు.

**పుచ్చిన్లు** : పుచ్చిన్లు అంటే ఇతరులమీద వున్నదీ, లేనిదీ కల్పించి చాడీలు చెప్పడం. కొంతమందికైతే ఇదే పని. ఎవరు దొరికితే వాళ్ళని కూర్చోబెట్టుకుని రతిరతి అంటే ప్రతిదీ పూసగుచ్చినట్టు పుచ్చిన్లు చెపుతారు. తంటాలు పెట్టేసి తమాషా చూస్తుంటారు. పుచ్చిన్లు చెప్పేది ఒక రోగం కావచ్చు. అయితే దానివల్ల కలిగే అనర్థాలు ఎన్నో.

**పొంచులు** : పొంచులు పెట్టడం, పొంచులు వినడం కొందరికి అలవాటు. ఏదైనా వస్తువును దొంగలించడానికో లేదా అసలు వ్యక్తులకు తెలియకుండా ఒక వస్తువును ఎత్తుకుపోవడానికో ప్రయత్నిస్తుంటారు. దాన్నే పొంచులు పెట్టడం అంటారు. అవకాశం దొరికినప్పుడు దోచుకు పోతారు.

పొంచులు వినడం అంటే పల్లెల్లో ఇండ్ల దగ్గర 'పంచ' లేదా 'పడసాల' దగ్గరికి ఎవరికీ తెలియకుండా వచ్చి ఇంట్లో వాళ్ళు ఏమేం మాట్లాడుకున్నది విని ఊరంతా వాళ్ళ మీద పుచ్చిన్లు చెప్పడం. ఇలాంటి వాళ్ళని 'సలితేలు' అని కూడా అంటారు. అంటే సడి సప్పుడి లేకుండా వచ్చి కుట్టి వెళ్ళిపోవడం. తేలుకుట్టినట్టు తెలీదు కాని శరీరం లోకి మాత్రం దాని విషం ఎక్కిపోతుంది. అలాగే కొంత మంది సలితేలులాగా ఏమాట ఎవరి చెవున పడవేస్తే విషయం పెద్దదై కొట్లాడుకుని చస్తారో అలాంటి వాళ్ళ చెవిన విషయం పడేస్తారు. కొంతమంది వాళ్ళు చెప్పింది నిజమా! అబద్ధమా అని ఆలోచించకుండా పోట్లాటకెళ్ళి నెత్తికి తెచ్చుకుంటుంటారు.

**బిడివిసిడి** : సహజంగా పనిపాట లేకుండా తిని తిరుగు తుండే వాళ్ళని సోంబేరులని, పోకిరీలని అంటుంటారు. ఇంట్లో ఎన్నో పనులువున్నా ఒక్క పనికీ సహాయపడకుండా యారకతిని ఎండకు పడుకొని పెద్దలు అవస్థలు పడుతున్నా చూసీ చూడనట్టు ప్రవర్తిస్తున్నవాళ్ళను 'బిడివిసిడి' వుండేది చూడు వాడు అని అంటారు. పనికి సహాయం చేయకపోగా ఇంకా ఏవేవో పనికిరాని పనులు చేస్తుంటే నీకింకేం పని లేదా 'బిడివిసిడి' అలాంటి పనులకు పోయావని కోపగించుకుంటుంటారు.

**భూతద్దంలో చూడటం** : ఇద్దరి వ్యక్తుల మధ్య మాట మాట పెరిగి ఏదో అనరాని మాట ఒకటి అనేసింటారు. అప్పుడు ఆ మాటనే పట్టుకుని వేలాడుతూ చిన్నది పెద్దది చేస్తున్నప్పుడు ప్రతి విషయాన్ని భూతద్దంలో చూడొద్దని అంటుంటారు. భూతద్దంలో చూస్తే చిన్న వస్తువు పెద్దదిగా కనబడుతుంది. కాబట్టి చిన్న విషయాన్ని పెద్దది చేయవద్దని నాకు మీ పట్ల చెడు ఉద్దేశం లేదని ఈ విషయాన్ని ఇంతటితో వదిలేద్దామని సర్దుకు పోతుం టారు.

పల్లె ప్రాంతాల్లో ఎవరికి తగిన విధంగా వారు పరువు ప్రతిష్టలతో బతుకుతుంటారు. బంధువర్గంలో హుందా తనంగా బ్రతకపోతే చిన్నతనంగా వుంటుందని, పరువు తక్కువగా వుంటుందని భావిస్తారు. ఇంకా కొంతమంది ఏమీ లేకపోయినా మా పరువు, ప్రతిష్ట ఇంత అంత అని బొడాయి కొడుతుంటారు. వాళ్ళ పరువు వీధిన పడ్డా, వాళ్ళ పరపతి తిరపతిదాకా వెళ్ళినా, సిగ్గూ శరమూ ఏమీ లేకుండా జీవిస్తుంటారు. అలాంటి వాళ్ళకు పరువెక్క డుంది. భూతద్దంలో వెదకినా దొరకదని అంటుంటారు.

**బెప్పరక పోవడం** : ఉన్నట్టుండి జరగరానిది ఏదైనా జరిగినప్పుడు ఎగిరి పడుతుంటారు. ఆ ఎగిరి పడడాన్నే బెప్పరకపోవడం అని అంటారు. ఉరుములు, మెరుపులు లేకుండా పిడుగు పడటంతో బెప్పరక పోవడం జరుగుతుంది.

**ముక్కు మీద బట్ట** : ముక్కు మీద కోపం వాడికి అని మామూలుగా అంటుంటాం. ఆలూమగల మధ్య ఏదైనా

తగాదా వచ్చినప్పుడు ముక్కు మీద కోపాన్ని అణచుకుని ఏదోలా సర్దుకుని సంసారం సాగిస్తుంటారు. ఇలాంటి తగాదాలే మరొకరి సంసారంలో వచ్చినప్పుడు వారికి సంసారాన్ని ఎలా చక్కదిద్దుకోవాలో తెలియజెప్పుతూ నేను చూడు నా కోపాన్ని దిగమింగుకుని, ముక్కుమీద బట్ట వేసుకుని వాడితో ఒక్క నిమిషం కూడా సంసారం చేయరు అని తన మొగుని మీద ఏవేవో చెప్పి, నేను అలాంటి వాడితోనే సంసారం చేస్తున్నప్పుడు నీ మొగుడు చాలా మంచోడు, నీవు సర్దుకుపో అని చెపుతుంటారు.

**ముళ్ళ కంప మీద బట్ట** : మన వస్తువు ఇతరుల చేతిలో తగులుకు పోయినప్పుడు దాన్ని జాగ్రత్తగా ఊడబెరుక్కోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. లేని మంచితనాన్ని ప్రదర్శిస్తాం. ఎదుటివారికంటే మనం బలవంతులైనా కూడా వాళ్ళనేమీ అనకుండా నోటిని అదుపులో పెట్టుకుని మన వస్తువు మనకు అందేవరకు ఓపికగా వుంటారు. ఆ సందర్భంలోనే ముళ్ళకంప మీద పడ్డ బట్టను ఆవేశంగా లాగితే చిరిగిపోతుంది. కాబట్టి జాగ్రత్తగా మసలుకుని మన పనిని సాధించుకోవాలని పెద్దలు అనుభవ పూర్వకంగా చెపుతుంటారు.

అలాగే ఆడవాళ్ళను అరటాకుతో పోలుస్తుంటారు పెద్దలు. అరటాకు ముల్లుపై పడ్డా, ముల్లు అరటాకుపై పడ్డా నష్టం అరటాకుకే కాబట్టి జాగ్రత్తగా మసలుకోవాలని బోధిస్తుంటారు.

**యాగోలుకొని** : యాగోలుకుని అని అంటే ఏదో లోకంలో వుండడం. కళ్ళ ముందే మన వాళ్ళు కష్టపడు తుంటే వాటిని పట్టించుకోకుండా వున్నప్పుడు ఏందిరా! మీ వాళ్ళు అట్లా కష్టపడుతుంటే ఏదయినా సాయం చేసేది పోయి అట్లా యాగోలుకుని కూర్చున్నావు అని దండిస్తుంటారు.

**యామారించడం** : యామారించడమంటే నమ్మించి మోసం చేయడమని చెప్పవచ్చు. చిన్న పిల్లల దగ్గర తినుబండారాల్ని కాకిస్తుందా! గద్దిస్తుందా! అని కళ్ళు మూసుకుని యామారించి నాబెరుక్కుని తినేయడం జరుగుతుంటుంది. అలాగే అమాయకుల్ని కొందరు తెలివివంతులు యామారించి మోసం చేస్తుంటారు.

**యాష్ట** : రోజూ ఒకే రకమయిన కూరలు తినితిని యాష్ట అయిపోయిందని అంటారు. ఇంకా వాటిలో యాగలేక నాకు యాష్టయిపోయిందని కూడా అంటారు. ఇక్కడ వాడితో అన్నప్పుడు భర్త కావచ్చు లేదా బిడ్డ కావచ్చు. అలాగే భార్యతో అస్తమానం భర్త పోరుతుంటే ఆమె దీనంగా ఏమి నాపై అంత యాష్టగా వుండేది. నీకంత మనెగ్గడగా వుంటే నేను మా పుట్టింటికి వెళ్ళి పోతానులే అని ఏడుస్తూ బాధపడుతుంటుంది.

**లోకరీతి** : లోకానికి తగినట్టుగా నడుచుకోవాలి. లేక పోతే కాకులై పొడుచుకు తింటారు. సమాజంలో బతకనేర్చిన వాళ్ళు కాకుల్లో కాకులై, హంసల్లో హంసలై జీవిస్తుంటారు. అందరితో పాటు గుంపులో గోవిందా అనాలే తప్ప వేరుగా నడచుకోకూడదు. అది తప్పయినా, ఒప్పయినా గొర్రెదాటు అని వెక్కిరించినా అందరూ నడచే దారిలోనే నడవాలి తప్ప వేరుగా వెళ్ళకూడదు. ఒకవేళ నేరుగా వెళ్ళితే అందరిదీ ఒక దారయితే ఊలిపిరికట్టిదొక దారి అని వేలెత్తి పొడుస్తారు. లోకంలో ఎవరెవరికి తగిన విధంగా వాళ్ళు నియమాలు పెట్టుకుని వుంటారు. వాటికి అనుగుణంగా నడచుకోవాలే తప్ప వాటిని వేలెత్తి చూపకూడదు. ఎందుకంటే లోకరీతే అంత అని అంటారు. అలాగే కాలానికి తగినట్టు కప్పడం వేసుకుని జీవించాలి.

**వాలకం** : 'వాలకం' అంటే నడవడికను గుర్తించేది. పద్ధతి అని కూడా చెప్పవచ్చు. మనిషిని చూడగానే అను మానం రావడం, ప్రవర్తనలో మార్పు కనిపించడం వంటి వాటితో వాళ్ళు ఎలాంటి వాళ్ళనేది గుర్తిస్తారు. వాని వాలకం చూడరా! ఎలా వుందో! నాకెందుకో వాని వాలకం చూస్తే మనకు టోకరా ఇచ్చేట్టున్నాడని అంటారు. ఒక వ్యక్తి, ఒక కుటుంబం, ఒక ఊరు మొత్తం నడుచుకునే విధానం ద్వారా వాళ్ళ వాలకం ఎలాంటిదో కనిపెట్టేయవచ్చు. వాలకమనేది జానపద రూపకం అని ఆర్వీయస్ సుందరంగారు చెప్పారు. అలాగే యక్షగాన యుగంలో యక్షగానం ఎన్ని వాలకాలు వేసిందో చెప్పనలవి కాదు అని యస్వీ. జోగారావుగారన్నారు.

**శంఖులో తీర్థం :** ఎవరు ఎన్ని మాటలు చెప్పినా వినని వాళ్ళు వాళ్ళకు తగినవాళ్ళు చెప్పేసరికి ఎంత కష్టమైనా ఓర్చుకుని, నష్టమైనా భరించి ఆ పనిని పూర్తి చేస్తారు. ఆ సందర్భంలో చూడు శంఖులో పోస్తేనే తీర్థం అని అంటుంటారు. ఇక్కడ తీర్థం అంటే మాట అని అర్థం.

**శాండాలం :** ఉపకారం చేసి దానికి తగిన ఫలితం ఆశించే కాలం ఇది. ఫలితం దొరక్క పోగా ఇంకా తనకు నష్టం కలిగినప్పుడు నాయాలిది నాకే శాండాలం అయిపోయ, వానికి సహాయం చేసినదానికి అని అంటుంటారు. ఒకరి కోసం తాను కష్టపడడమే కాకుండా ఇంకా జేబు నుంచి తానే ఖర్చు చేసినప్పుడు శాండాలం అనే మాటను వాడుతారు. పిండీ నూక లెత్తుకుని పిన్నమ్మింటికి పోయినట్టనే సామెతను కూడా ఈ సందర్భంలో చెపుతారు.

**సరోళ్ళు :** 'సరోళ్ళు' అంటే సరిసమానమైనవాళ్ళు, ఒకే జాతి, కులం వాళ్ళ దగ్గరి బంధువులు అని చెప్పవచ్చు. సరోళ్ళ ముందర నన్ను అనరాని మాటలు అనడం, వాళ్ళ ముందర నన్ను అవమానించడం సరిపోతుందా! అని వాపోతుంటారు. వేరేవాళ్ళ ముందర ఎన్ని మాటలన్నా ఓర్చుకుంటారు గాని సరోళ్ళ ముందర అంటే ఒళ్ళు వుడికి పోతుంది. అందుకే కాబోలు "అత్త తిట్టినందుకు కాదు తోడికోడలు నవ్వినందుకు" కోపం వచ్చిందని చెపుతుం టారు. ఎంతటి అవసరం వచ్చినా సరోళ్ళ దగ్గరికి పోకూడదని అంటుంటారు. ఎందుకంటే దగ్గరి బంధువుల దగ్గర అమర్యాదగా వుంటుందని వాళ్ళ భావన.

**సవక :** దగ్గరి వాళ్ళకెప్పుడూ సవకే. సవక అంటే అగ్గువ అని అర్థం. దూరపుకొండలు నునుపుగా కనిపించినట్లు దూరపు బంధువులకు ఎక్కువ మర్యాదలు చేస్తారని, దగ్గరి వాళ్ళని చులకనగా చూస్తారని అర్థం.

**సున్నపాకు తొటిం :** తాంబూలం వేసుకునేటప్పుడు తమలపాకుకున్న తొటిం గోరుతో గిల్లి పారేస్తారు. అంటే అది పనికిరాదని వాళ్ళ ఉద్దేశం. కుంటుంబంలోని తన వాళ్ళు తన మాట వినకపోతే నా ఆస్తిలో సున్నపాకు తొటిం కూడా ఇవ్వనని అంటారు. తొటిం పనికిరానిది. పనికిరానిది కూడా (నా ఆస్తిలో) ఇవ్వననేది దీని అర్థం. ఇంకా కొందరు 'చిల్లిగవ్వ' కూడా ఇవ్వనంటుంటారు. మన సొత్తును ఫలానావాళ్ళ దగ్గర వుంచితే వాళ్ళు భద్రంగా చూసుకుంటారని సున్నపాకు తొటింకూడా పోగొట్టరని అంటారు. అలాగే డబ్బును అప్పుగా కాని లేదా ఇచ్చిన అప్పును తీర్చమన్నప్పుడు కాని నిజంగా నా దగ్గర ఇప్పుడు చిల్లిగవ్వ కూడా లేదని అంటుంటారు. ఇంకా సున్నపాకు తొటిం కానిలే వాళ్ళ భాగం వాళ్ళకిచ్చేయాలి గాని ఒకరికి తక్కువ ఒకరికి ఎక్కువ ఎందుకు చేయాలని కూడా అంటుంటారు.

**సైగసైగ్గా :** పల్లె ప్రాంతాల్లో ప్రొద్దున లేచినప్పటి నుండి పడుకునే వరకు ఏదో ఒక పని వుంటుంది. అలాంటి పనులెన్ని వున్నా ఏవీ పట్టించుకోకుండా సైగ్గా వుండడం కొందరికే వీలవుతుంది. కొన్ని పనులను చెప్పినా చేయకుండా సైగసైగ్గా తప్పించుకోవడంబీ అప్పు తీసుకుని చెప్పిన సమయానికి చెల్లించకుండా అడిగేంతవరకూ సైగ్గా వుండి పోవడంబీ తనకు ఊరిలోని అన్ని విషయాలు తెలిసి కూడా ఏమీ తెలియనట్టు సైగసైగ్గా వుండిపోవడం జరుగుతుంటుంది.

జనపదాలలో ఇలాంటి పద ప్రయోగాలు కోకొల్లలు. జానపదులు వుపయోగించే ఎన్నో పదాలకు నిఘంటువుల్లో కూడా అర్థాలు దొరకవు. ఒకవేళ దొరికినా వాటికి, వీటికి పొంతన వుండదు. పల్లె ప్రజలు నోటికొచ్చిన పదాలను సహజంగా ఆయా సందర్భాలకు అనుగుణంగా మాట్లాడు తుంటారు. వాళ్ళ భావనలే వేరు. అలాంటి పదాలను ప్రాంతాలవారు సేకరించి నేటి తరాలవారికి పదాల వివరణలతో సహా అందిస్తే జానపద సాహిత్యానికి ఎంతో మేలు చేసిన వాళ్ళమవుతాం.

# జానపద సాహిత్యం - లోక సాహిత్యం

- రొండి అర్జున్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, తెలంగాణ విశ్వ విద్యాలయం, డిచ్‌పల్లి, నిజామాబాద్.

" లాలీ లాలీ... లాలీ లాలీ... వటపత్రసాయికీ వరహాల లాలీ, రాజీవ నేత్రునికి రతనాల లాలీ, మురిపాల బుద్ధునికి ముత్యాల లాలీ..., జగమేలు స్వామికి పగడాల లాలీ" అనే పాట జానపద సాహిత్యంలో రూఢీ కెక్కిన గీతం. ఒక విధంగా ఇది లోక సాహిత్యం. ఎందుకంటే ప్రపంచంలో ఈ పాట ఎక్కడ విన్నా ఒకేతీరుగా లయ వస్తుంది. కాబట్టి ఇది జానపద సాహిత్యంలో మొదటి గేయం. ఇది ఆది కాలం నుండి ఈనాటి వరకు కూడా జానపదులు పాడుకునే సుప్రసిద్ధ గీతాలలో ప్రధానంగా స్థిరపడి పోయింది. స్త్రీల చైతన్యం వారి పనిపాటలతోనే మొదలైందని అంటారు. నాట్ల పాటలు, కలుపు పాటలు, పొలి పదాలు, కోత పాటలు అన్నీకూడా స్త్రీలు పాడుకునేవే. అలాగే తెలుగు తమిళం, కన్నడం భాషల్లోని బాంధవ్య గీతాలలో స్త్రీ చిత్రణ చాలా వరకు ఒకటిగానే కనిపిస్తుందని విమర్శకుల అభిప్రాయం. ఉదా: పండుగలు, పబ్బాలు, ఆచారాలు, సంప్రదాయాలలో పోలికలు ఉండటమే. జానపద సాహిత్యంలో సమాన భావాలు ఒకటిగా ఉండి ఎంత విశ్వజనీనమైన పోలికలు కలిగి ఉన్నాయని పై పాటలలో మనకు రుజువు అవుతుంది. చందమామను కొండెక్కి రమ్మనడం, కోటివేలు తెమ్మనడం, పాలు పెరుగు తెమ్మనడం ...ప్రతీ కన్నతల్లి ఇల్లాలిగా ఈ పాటను పాడుకోవాల్సిందే. చందమామ రావే జాబిల్లి రావే అని తన కన్నబిడ్డకు గోరు ముద్దలు తినిపించటడానికి ప్రతీ కన్న తల్లి చందమామను చూపించాల్సిందే. ఈ పాటలు ఏ పురుషుడు పాడడు. ఒకవేళ ఈ పాటలు మగవారు పాడితే కర్ణ కఠోరంగా ఉంటాయి. శరీరం అంతా జెర్రులు పారినట్లు ఉంటుంది. ఈ గీతాన్ని ఆధునిక సంగీత వాయిద్యాలతో సినీ పరిశ్రమ వాడుకదారులు అనేక రకాల సంగీత, నృత్యాభినయాలతో ప్రదర్శింప చేస్తుంటారు. ఇలా ఈ గీతాలు ఎన్నో మాతృగీతాలు ఉద్భవించటానికి ఒక మాతృక అయింది.

ఇటువంటి కథాగేయాలు లేని దేశంలేదు. ప్రాంతం లేదు. భాషలేదు. సంస్కృతి లేదు. రామాయణపు పాటలనే తీసుకుంటే ప్రాశ్చ దేశాలలోని అనేక సంస్కృతులలోకి వీటి మూలాంశాలు ప్రవేశించాయి. వాల్మీకి రామాయణంలో కనిపించని అనేక మూలాంశాలు జానపద రామాయణాలలోను, విదేశీ రామాయణాలలోనూ కనిపిస్తున్నాయి. బహుశా వాల్మీకి కాలం నుండీ, అంతకంటే ముందే రామాయణ కథ జానపదులలో ప్రచారంలో ఉండేదని అంటారు. ఈ రామాయణం కథా స్రవంతే వివిధ దేశాలకు ప్రవహించిందని అంటారు. వీరావేశంలో జానపదులు పాడుకునే వీరగాథలు డెన్మార్కు, స్కాట్లండు, స్పెయిన్ మొదలైన దేశాల్లో అత్యధికంగా ఉన్నాయని, పోర్చుగ్రీసు సాహిత్యంలో వీరగాథలు తప్ప వేరొక ప్రక్రియే కానరాదని డా॥ తంగిరాల అన్నారని తెలుస్తుంది.

జానపద సాహిత్యంలో సంతతికోసం వ్రతాలు చేయటం, సప్త సంతాన ప్రతిష్ట చేయించటం, తీర్థ యాత్రలు చేయటం, కర్ణ కఠోర దీక్షలు చేయగా చేయగా చివరకు భగవంతుడో, ఏ మహా పురుషుడో ప్రత్యక్షమై పండో, విభూతో, మంత్రజలమో ఇవ్వడం తద్వారా బాల నాగమ్మ, వీరనాగమ్మ, గాంధారి లాంటి వారికి పిల్లలు పుట్టిన చిత్రీకరణలు జానపద సాహిత్యంలో ప్రత్యక్షం అవుతాయి.

"చెల్లమ్మా, ఏమమ్మా, నీకు ఇంత కోపమేలవచ్చే / కోపము నా మీద కొంచెమన్న బెట్టవద్దు" అంటూ జానపద సాహిత్యంలో మరో పాట " నూటనొక్క గుడిలోనే యమ్మ/ పూజలైనను కొంటువున్నదమ్మ/ పంతులేకుంటే సంతు యిచ్చునమ్మ/ బిడ్డలు లేకున్న బిడ్డలిచ్చునమ్మ" అంటూ జానపద సాహిత్యంలో పెనవేసుక పోయిన నమ్మకాలకు ప్రతీకగా ఈపాటలో లక్ష్మమ్మకు ప్రతి గ్రామంలో గుళ్లు ఉన్నాయి. జానపదుల ప్రీతి విశ్వా

సాలను గడించిన పాత్ర లక్ష్మమ్మది. అత్త ఆడబిడ్డ ఘాతుకానికి బలై పోయిన లక్ష్మమ్మ చితి చల్లారగానే శిలయైపోయి దేవతగా మారిపోయిందనే నమ్మకం ఈ పాటలో కనపడుతుంది. భర్త వెంకయ్యకు అత్తకు ఆడబిడ్డలకు కళ్లు పోయాయి. లక్ష్మమ్మ వంటి వారికి మహిమలు తమంత తామే అబ్బుతాయి. ఆనాడు మాతృ స్వామ్య వ్యవస్థ ఉంది కాబట్టి స్త్రీకి జానపద సాహిత్యంలో ప్రధాన పాత్ర ఉందని చెప్పుకుంటారు. ఉదాహరణలు వివిధ సంఘటనల రూపంలో విరివిగా కనిపిస్తాయి. పౌరాణిక గేయాలు, వీరగాథలు, సాంఘిక గేయాలు, అద్భుత రస గేయాలు ఇలాంటి అన్ని రకాల కథా గేయాలలోనూ ఇటువంటి కథాంశాలు కానవస్తాయి.

వాల్మీకి రామాయణంలో కూడా జానపద మూలాంశాలు బోలెడన్ని ఉన్నాయి. ఇక జానపద రామాయణాల్లో సరేసరి, సీత కమలంలో పుట్టిన వృత్తాంతం అనేక కథా గేయాల్లో ఉంది. పసి తనంలో ఆడు కుంటూ శివ ధనుస్సునే ఎత్తిన సీత జానపదుల కల్పనలో అద్భుత స్త్రీ. ఆమెకు అలౌకిక శక్తులున్నాయనే నమ్మకం జానపదులకుండేది. 'సంక్షేపరామాయణం' మొదలైన కథా గేయాల్లో లక్ష్మణుడు రాముడిని వెదుకుతూ వెళ్లే ముందు ఏడు గీతలు గీచి "గిరిదాటవద్దని'ని సీతను శాసించినట్లు ఉంది. ఇంకొక విషయం జానపదుల్లో అత్యంత ప్రసిద్ధమైన మూలాంశం ఏమిటంటే రాయిగా ఉన్న అహల్యను మానవమూర్తిగా మార్చడం, ఊర్మిళ పద్నాలుగేళ్లు నిద్రపోవటం, కైకేయి చిటెకెన వ్రేలితో రథాన్నెత్తడం, సీతను చంపినందుకు గుర్తుగా రక్తసిక్తమైన ఖడ్గాన్ని తీసుకొని రావడం లాంటి సంఘటనలు జానపద సాహిత్యంలో స్త్రీల పాత్రల ప్రాముఖ్యతను తెలియ జేస్తాయి.

సంస్కృతి పరంగా కొన్ని ఆలోచనల్లో స్త్రీల ఆచారాలే నేటికి కొనసాగుతున్నాయి. సంస్కృతిలో భాగంగా స్త్రీలకు జానపద సాహిత్యం సమాన హక్కులను తెచ్చిపెట్టింది. ఇదే మానవ మనుగడకు అద్దం పడుతుంది. తెలుగువారి అచ్చమైన సంస్కృతిని తెలుసుకోవాలంటే జానపద విజ్ఞానమే శరణ్యం అని చెప్పక తప్పదు. ఇది అతిశయోక్తి కూడా కాదు. సంస్కృతి అన్నది మహత్తరమైన సాధనకు మారు పేరుగా మనం చెప్పుకుంటాం. కానీ నిజానికి "ఒక జాతి ప్రజీనీకం యొక్క సంపూర్ణ జీవిత చరిత్రయే సంస్కృతి చరిత్ర అని ఖండవల్లి లక్ష్మీరంజనం తన ఆంధ్రుల చరిత్ర సంస్కృతిలో వివరించారు. ఇంత గొప్ప చరిత్ర సంస్కృతి మానవ మనుగడ కోసం కొనసాగుతున్నది అంటే దీని వెనుక ఉన్నది దీని నేపథ్యంలో స్త్రీని తప్పకుండా చెప్పాల్సిందే. వాస్తవానికి ఆనాడు మాతృస్వామిక వ్యవస్థ ఉండేది కాబట్టి స్త్రీయే ఆనాడు ప్రధానం గనుక స్త్రీయే ముందు స్త్రీయే వెనుక, స్త్రీయే సర్వస్వం అనికూడా చెప్పవచ్చు.

"నాకు నల్లచీర నెమలి వన్నె రవికె/ వడినిండ బియ్యము పళ్లూ కొబ్బరిగిన్నె/ పసుపు కుంకుమ యిచ్చి పంపేమాయన్న" లాంటి గేయాలు కృష్ణశ్రీ పల్లెపదాల్లో ఉన్నాయని తెలుస్తుంది. ఈ గేయంలో తెలుగువారి సంస్కృతికి సంబంధించిన అనేక విషయాలున్నాయని తెలుస్తుంది. అన్నాచెల్లెళ్ల అనుబంధమూ, పుట్టింటి ఆచారాలు, అలంకరణలు, విశేషాలు బోధపడతాయి. "అత్తింటి కోడలవు కావుగావున్నె" అన్న గీత పాదాన్ని చెప్తే దాని వెనుక ఒక జాతి ఆచారాల చరిత్రే తెలుస్తుంది. అలాగే సంస్కృతిలో భాగంగా ఒక వృత్తిని కళాత్మంగా సూటిగా, సుమధురంగా వివరించే శక్తి జానపద సాహిత్యంలో కనపడుతుంది. జల్తారు పట్టు చీరలు, రత్నా రవికలు, ఒడ్డాణాలు, బాజా బందూలు, గుళ్ల పేరులు, కాసుల కంటెలు, అద్దాల రవికలు జానపద సాహిత్యంలో తప్ప మరెక్కడా కనపడవు. ఇలాంటి తరతరాల సంస్కృతిని పరిరక్షించటం జానపద సాహిత్య ప్రయోజనంగా చెప్పవచ్చు.

"చెమ్మచెక్క చేరడేసి మొగ్గ" అన్న పాట త్రిశ్రగతిలో తకిట ఆవృత్తాలతో నడుస్తుంది. ఇలాంటి జానపద సాహిత్య అధ్యయనం సౌందర్య దృష్టితో పాటు అన్ని రకాలుగా మానవ మనుగడకు దోహదకారి అని చెప్పక తప్పదు.

ఉదా:

"కమ్మలు కడియాలు కస్తూరి బావిరీలు/
నలుగూకు రావె సీతమ్మ/
నీ పాలిటి దేవుడు ఏను గోపాలసామి/
నీ కంటిచ్చయినోడె నిలిచి ఉండాడు/
నలుగూకు రావె సీతమ్మ/
అత్తారు పన్నీరు సిత్తార గిన్నెలతో/
ఏగ ఏగను రావె సీతమ్మ/ "

అంటూ తెలుగు వారి పెళ్లిళ్లలో తలంబ్రాలు సంస్కృతికి ప్రతిబింబంగా కనిపిస్తాయి.

స్త్రీని వివాహనంతరం అత్తవారింటికి పంపే అప్ప గింతల కార్యక్రమం సమయంలో సామాన్యులు కన్నీరు మున్నీరు అవుతారని జానపద సాహిత్యంలో వివరింప బడింది. అవి వేడుక పాటలు కాదు కానీ....స్త్రీకి ఇచ్చే ఒక మంచి వీడ్కోలు వేడుక. చాలా చక్కని చిక్కని చిత్రీ కరణ సంఘటనలు జానపద సాహిత్యంలో ఉన్నాయి. " అత్త మామలు గాని ఆడబిడ్డలుగాని/ లేరమ్మ నీ, దెంత పున్నెమోగాని/ మగడు ఒక్కడు గాన మనసు కెక్కిన యట్లు/ మర్దించి నీ వశము చేసుకోవమ్మ" అని చెప్పే తీరులు చిత్రింపబడి ఉన్నాయి.

జానపద సాహిత్యంలో వలపు పాటలకు కూడా గొప్ప ప్రాధాన్యత ఉంది. మనిషి వ్యవసాయాది ఆహార నిర్మాణ పద్ధతుల్ని నిర్మించుకున్న సమాజాలలోనే ఎక్కువగా వలపుపాటలు చిత్రీకరించబడ్డాయి. తెలుగు కన్నడ సాహిత్యాలలో వలపు పాటలది అగ్రస్థానంగా ఉంది. ఈ పాటలు సంప్రదాయం ముఖ్యంగా స్త్రీలకు సంబంధించి నవే. కానీ సంవాద కోలాటం లాంటి సందర్భాలలో వాద సంవాదాలకు పురుషులు కూడా పాడటం జరుగుతుంది. మూడు రకాల ఈ వలపు పాటలలో ప్రియురాలి మనో భావాలను అత్యంత మనోహరంగా చిత్రించే గీతాలలో "చల్ మోహన రంగా" అనే పాట చాలా ప్రాముఖ్యతను పొంది ఉన్నది.

అయితే జారిణికి సభ్య సమాజంలో స్థానం లేదు కానీ వలపు పాటలలో ముఖ్యమైన స్థానమే ఉంది. సభ్య సమాజంలో నిషిద్ధమైన వాటిని ఉపయోగించే స్వాతం త్ర్యాన్ని జానపద విజ్ఞానం అందిస్తుందనడంలో సందేహం లేదు. ఉదా: నే చిన్న దాన్నిరా నెల్లూరు భోగం దాన్నిరా/ కాల కురుసా దాన్నిరా కల్లూరు బోగం దాన్నిరా/ నేను చిన్న పాయమపుడు/ చింతచెట్టు ఏసి ఉంటే/ చింత చెట్టు చిగురు కొచ్చె/ చిన్నా బిడ్డ తల్లినైతి/ రాగి చెట్టు రచ్చ కొచ్చె / రాజులేలే పాయమాయె" అని చిత్రితమైన జానపద సాహిత్యాలు మానవతా విలువలు చిగురింప చేసే విధంగానే ఉంటాయి. ఎందుకంటే జానపద సాహిత్యంలో స్త్రీ స్థానం గొప్పది. స్త్రీ చిత్రణ గొప్పది. స్త్రీకి స్త్రీచేత ఇప్పించిన సందేశాలు గొప్పవి. స్త్రీ ఆధారంగా సభ్య సమాజానికి ఇప్పించిన సందేశాలు అద్భుతాలు. ఎందుకంటే జానపద సాహిత్యంలో స్త్రీ అంటే ఒక అమ్మ. అమ్మ ప్రేమకు అంతులేదు అని నిరూపించేదే జానపద సాహిత్యం.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# మహాకవి గురజాడ - అభ్యుదయానికి అడుగుజాడ

- **సాలి రోజా,** పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

## ప్రవేశిక :

గురజాడ అప్పారావు పేరు తెలియని తెలుగు వారుండరు. గురజాడ గురించి తెలియచేయడం అంటే తెలుగు సాహిత్యాన్ని ఒక కొత్త కోణంలో చూడటమే అవుతుంది. తెలుగుజాతి ప్రగతి పథం వైపు నడిచే క్రమాన్ని తెలుపుట అవుతుంది. గురజాడ వారి పుట్టుక జన చైతన్యానికి శుభోదయం. గురజాడ కలం తెలుగు సాహిత్యానికి నవోదయం వంటిది.

దేశం అంటే మట్టికాదని, దేశం అంటే మనుషుల్యను ఏలుగెత్తి చాటి దేశాన్ని ప్రేమించమని, హితవు పలికి తాను నమ్మిన మంచి కోసం సాటి జనుల కోసం సరికొత్త సాహిత్య ఉద్యమానికి సారథ్యం వహించిన సాహిత్య నిర్మాత. తేటైన తెలుగు మాటలతో ముత్యాలు సరాలు కూర్చి, జాతి జనులకు కానుక ఇచ్చిన మహాకవి. కేవలం కల్పనా కథలతో కృధత శైలితో కృత్రిమ వర్ణనలతో, అర్థరహితమైన అలంకారాలతో, తనకు తానే పరాయినై డొల్లబారిన తెలుగు భాషకు జవసత్వాలు కల్పించిన మహాకవి గురజాడ. గిడుగు వారి వ్యవహారికి ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్తూ సగటు మనిషికి సాహిత్యంలో స్థానం కల్పించి సత్య సాహిత్యానికి నాంది పలికిన నాటక కర్త. వాడుక భాషను ఉపయోగించడం ఎలాగో ప్రజలకు నేర్పిన ఆధునిక తొలి కవితా గురువు.

## ఉద్దేశ్యం :

గుజరాడ అప్పారావు తన రచనల ద్వారా సంఘ సంస్కరణ దృక్పథంతో సమాజహితం కోరుతూ చేసిన రచనల్లో కన్యక, పూర్ణమ్మ, లవణరాజుల కల గేయాలలో ఆనాటి సమాజంలో వేళ్ళూనుకున్న రాజరిక వ్యవస్థ, ధనం కోసం ఆశ పడిన తల్లిదండ్రుల మనస్తత్వం, కులం కంటే గుణం మిన్న అనే సందేశాలను అందించిన గొప్ప కవి గురజాడ.

## ముఖ్యాంశాలు :

### కన్యక :

కన్యక కవితలో రాచరిక వ్యవస్థ లోపాన్ని, సమాజంలో స్త్రీ దుస్థితిని చక్కగా తీర్చిదిద్దారు. కన్యక శెట్టి కూతురు. అందానికి ప్రతిరూపం. ఆ అందమే ఆమె ప్రాణాలకు ముప్పు తెచ్చింది. సంపదతో తులతూగే కన్యక మహిళా వివక్షకు, రాచరికపు హింసకు పురుషాధికత్యకు, కాల పరిస్థితులకు గురికాక తప్పలేదు. తోటి వాళ్ళతో దుర్గను కొలవటానికి వెళ్తున్న కన్యకపై, రాచ వీధుల్లో విహరిస్తున్న రాజు కన్ను పడింది. ఆ వన్నె ఆమె ప్రాణాలను బలిగొన్నది. కానీ కన్యక రాజును ఎదిరించి ప్రజల కళ్ళు తెరిపించింది. కన్యక చేసిన సాహసం పాఠకులను ఆలోచింపచేసేలా చేస్తుంది.

కండ కావరమెకి నీవీ
దుండగము తలపెట్టినందుకు
వుండడా వొక దైవమంటూ,
వుండి వూర్కొనునా ?

నీవు ఒక దేశానికి రాజు మాత్రమే. ఈ విశ్వాన్ని శాసించే దేవుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. అతడు నీవంటి వాడు చేసే దుష్ట చేష్టను చూస్తూ ఉంటాడు. నీకు తగిన శిక్షను విధిస్తాడని రాజును ఎదిరిస్తుంది. కన్యకను ఇటు తండ్రి, అటు కులపెద్దలు ఎవరూ రక్షించలేరని, సమాజంలో మార్పు రావాలని, తనకు జరిగే అన్యాయాన్ని అవమానాన్ని ఎదురించే వాళ్లు ఏవరూ లేరా ? అని రాజుతో

పట్టమేలే రాజువైతే
పట్టు నన్నిపు డనుచు కన్యక
చుట్టి ముట్టిన మంటలోనికి

మట్టిలా జనియెన్ అని పలికి కన్యక మంటలలోకి దూకింది. రాజుకు అపకీర్తి మిగిలింది. తను స్వేచ్ఛగా ఆత్మాహుతి చేసుకొని, జనహృదయాలలో వీర వనితగా

కీర్తించబడింది. అగ్ని ప్రవేశం ద్వారా రాచరికంలో బ్రతుకుతున్న వాళ్లలో మార్పు రావాలనీ, ప్రజలు బానిస సంకెళ్లు తెంచుకోవాలనీ కుల పెద్దల మూర్ఖత్వాన్ని నిరసిస్తూ కన్యక అగ్ని ప్రవేశం చేసింది.

**పూర్ణమ్మ :**

పూర్ణమ్మ కవితలో బాల్య వివాహాలను ఖండించాడు. ఇందులో పూర్ణమ్మ పేద పూజారి కూతురు. డబ్బు మీద ఆశతో ఆమె తండ్రి ముసలి వానికి ఇచ్చి పెళ్లి చేశాడు. ఆ దురాచారాన్ని ఖండించడమే ధ్యేయంగా గురజాడ "పూర్ణమ్మ" కథను పాఠకుల హృదయానికి హత్తుకునేలా చిత్రించాడు. డబ్బు మీద ఆశతో పూర్ణమ్మకు తన తండ్రి చేసిన ద్రోహాన్ని

కాసుకులోన తల్లీ తండ్రీ
నెవరూ న్యాయం విడనాడి
పుత్తడి బొమ్మను పూర్ణమ్మను వొక
ముదుసలి మొగుడుకు ముడివ్రేసి

కాటికి కాళ్లు చాచిన వానితో పెళ్లి చేసి, వాడు మరణించినప్పుడు ఇదంతా ఆమె తలరాత దురదృష్టం అని తప్పించుకొని తిరిగే వారినీ, సాంప్రదాయ ముసుగులనూ గురజాడ దుయ్యబట్టారు.

పూర్ణమ్మకు జరిగిన అన్యాయం, దురాచారం ఇతరులకు (బాలికలకు) జరగకూడదని చెప్తూ - పూర్ణమ్మను తలచుకోవాలి అని ఈ విధంగా చెప్తాడు.

"నలుగురు కూచుకని నవ్వే వేళల
నా పేరొక తరి తలవండి
మీ మీ కన్న బిడ్డల నొక తెకు
ప్రేమను వ పేరివ్వండి"

నలుగురూ ఒక్క చోట చేరి నవ్వుకునే సమయంలో "నా పేరొకరి తరి తలవండి" అంటూనే పూర్ణమ్మ నాలాగా చేయకండీ అని మనలో పరోక్షంగా అభ్యుదయ భావాలు నింపి, పూర్ణమ్మకు జరిగిన ద్రోహాన్ని తెలుపుతూ గురజాడ జాతిలో జాగృతిని మేల్కొలుపు చేశాడు. ఈ కథ ఒక పూర్ణమ్మది కాదు. వేల మంది పూర్ణమ్మల మనోవేదనకు మౌన వేదనలకు అక్షర రూపం.

**లవణరాజు కల :**

ందులో దళిత జీవితాన్ని ఉదాత్తంగా చిత్రించాడు. ఈ కవితలో కథానాయకుడు లవణరాజు. ఇతనిలో అభ్యుదయ భావాలు ఎక్కువ లవణరాజు నిండు కొలువును తీరి ఉండగా జాలికుడు ఒక గుర్రాన్ని తీసుకొని వస్తాడు. ఆ గుర్రాన్ని చూడగానే లవణునికి పూర్వం జ్ఞానం గుర్తుకు వస్తుంది. ఏడు నిమిషాలలో ఏడు ఏళ్ళుగా కలిగిన అనుభూతిని కథగా చెప్పాడు. ఈ కథ గతాన్ని తెలిపినప్పటికీ వర్తమానానికి ప్రగతి మార్గంగా నిలుస్తుంది.

లవణరాజు తాను ఇష్టపడిన దళిత అమ్మాయిలో వున్న వర్ణ (కల) భయాన్ని పోగొట్టేందుకు, మతాధిపత్యాన్ని నిరశించాడు.

"మాలిన వృత్తులు మాల వారిని
కులము వేర్చిన బలియు రొక దే
శవమున కొందరి వెలికి దొసిరి
మలినమే మాల"

మలినమైన వాళ్ళు అని వెలి వేస్తారు ఆ వెలివేసిన వారి శరీరమే మాల. ఇది అసాంఘిక చర్య, లవణరాజు ప్రజలందరూ సమానమేనని తెలుపుతూ మంచి, చెడూ అనే వాటిని గూర్చి తను ప్రేమించిన దళిత అమ్మాయికి తెలియజేస్తాడు.

మంచి చెడ్డలు మనుజులందున
యెంచి, చూడగా, రెండె కులములు
మంచి యున్నది, మాలయైతే
మాలనే అగుదున్

మంచి, చెడు అనేవి రెండు మనషుల్లో వున్న కులాలు. మంచిని పెంచుకుంటూ ప్రేమ, స్నేహంతో సహజీవనం సాగిస్తే చెడు అనేది లేకుండా పోతుందని తన ప్రియురాలికి "మాల" గొప్పదనాన్ని చెపుతూ కులాల పైన ఉన్న కుళ్లను తొలగించాడు.

ఈ కవిత ద్వారా గురజాడ సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలు, అంటరానితనాన్ని నిర్మూలించాడు. వీటిని నిర్మూలించాలంటే కులాంతర వివాహాల ద్వారానే సాధ్యమని తెలిపాడు. మనిసిని ఆలోచింపచేసే వాస్తవ గాథ.

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

మనిషి మనిషిగా బ్రతకమని చెప్పే కవి. గురజాడ కన్న కల, తరతరాలుగా మానవ దళిత జాతి కంటున్న కల.

**ముగింపు :**

గురజాడ అప్పారావు కన్యక, పూర్ణమ్మ, లవణరాజు కల కవితలలోని ఆనాటి కాలంలో పేరుకు పోయిన వ్యవస్థలలోని లోపాలను ఎత్తి చూపుతూ లోకానికి వెలిగెత్తి చాటిన సంఘ సంస్కరణ వాదిగా నిలిచాడు. తన రచనతో సమాజ అభివృద్ధిని కాంక్షించిన మహా కవి. భావి తరాల అడుగుజాడ మన గురజాడ.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) - డా॥ జి. నాగయ్య
2. గురజాడ రచనలు
3. ప్రకాశిక - 1 - డా॥ టి. సత్యనారాయణ.

# "పల్లెకు దండం పెడతా (దీర్ఘ కవిత) - ఒక పరిశీలన

- మల్లె చెంచురామారావు, తెలుగు లెక్చరర్, డి.సి.ఆర్.యం. డిగ్రీ కళాశాల, ఇంకొల్లు.

బి. హనుమారెడ్డి, ప్రకాశం జిల్లా అద్దంకి మండలంలోని వెంకటాపురంలో 1-7-1941న భీమవరం రాఘవరెడ్డి, శేషమ్మ దంపతులకు జన్మించారు. ఈయన మట్టిని నమ్ముకున్న మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టారు. ఒంగోలులో న్యాయవాదిగా స్థిరపడ్డారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘానికి ప్రస్తుతం అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. ప్రకాశం జిల్లాలో ఒక మంచి రచయితగా గుర్తింపు పొందారు. వెన్నెల పువ్వు, పల్లెకు దండం పెడతా, మావూరు మొలకెత్తింది, గుజ్జన గూళ్ళు, వీక్షణం, వెన్నెలగీతం, మూన్‌లైట్ మెలోడి, పావని వంటి రచనలు చేశారు.

హనుమారెడ్డి రెండవ రచన "పల్లెకు దండం పెడతా" ఐదు పదుల సంవత్సరాల క్రిందట పల్లెలలో పూజనీయమైన ఆత్మీయతా గంధం ఎలాగుబాళించేదో ఈయన ఆలోచించి, ఆవిరైపోయిన ఆ సంస్కారం, సంస్కృతి, ఆత్మీయతను స్పృశించారు. ఆ తలపోతల వడపోతే ఈ కావ్యమై గుబాళించింది. అదృశ్యమైపోయిన అలాంటి పల్లెకే హనుమారెడ్డి దండం పెడుతున్నారు.

ఇది ఇంకో విధంగా కర్షక సాహిత్యం, కాడి బరువూ, కవిత పరువూ రెండు తెలిసిన హనుమారెడ్డి రచించిన ఈ దీర్ఘకవిత వారి సాహిత్య ప్రస్తానంలో మైలురాయిగా నిలుస్తుంది. కాలంలో పాతబడ్డ కర్షక పదజాలానికి ఆధార గ్రంథం అవుతుంది.

ఇది ఇంకోవిధంగా కర్షక సాహిత్యం. కాడి బరువూ, కవిత పరువూ రెండూ తెలిసిన హనుమారెడ్డి రచించిన ఈ దీర్ఘకవిత వారి సాహిత్య ప్రస్తానంలో మైలురాయిగా నిలుస్తుంది. కాలంలో పాతబడ్డ కర్షక పదజాలానికి ఆధార గ్రంథం అవుతుంది.

పల్లెటూరి రైతు కుటుంబం నుంచి వచ్చి, తన చిన్నతనంలో పల్లెటూళ్ళ వైభవాన్ని, క్రమంగా పతనమైపోయిన సంస్కృతినీ, వక్రమైపోతున్న ఆర్థిక, రాజకీయ శక్తుల వల్ల నలిగిపోయి, అంతకంతకూ పేదవాడైపోతున్న రైతునీ గమనించి, సామ్రాజ్యవాద కుట్రలకి వేదన చెంది, తన చిన్ననాటి సంస్కృతిలన్నింటి నేపథ్యంలో విశ్లేషించుకుంటూ ఒక సమగ్ర జీవన విధానాన్ని పాఠకుల ముందుంచారు హనుమారెడ్డి.

హనుమారెడ్డి ఎవరి అనుభవాల్లోంచో పల్లెను ఎవరి గొంతులోంచో పలుకలేదు. ఆవూరు తనదే. ఆ కన్నీరు తనదే. "ఈ మట్టిని అనుసరించి మనిషి నయ్యాను, నా తల్లి ఊపిన ఊయలలు నేను మరువలేను" - అనే మాటలు అచ్చంగా కవివే.

"నాది రైతు వంగడం
నల్లరేగడి నా పాదు
నా తండ్రి అల్లుకొమ్మ నాకు
తడి దుక్కి నా కవితా వస్తువు
స్నేహ ప్రపంచం నా పూల పందిరి - 1

నా బంగారి నా కవితా వ్యాసంగానికి ఊపిరి" - అని హనుమారెడ్డి తన మనుసలోని మాటగా చెప్పారు.

ప్రభాత స్వరాలతో ప్రారంభించిన ఈ కావ్యాన్ని ప్రతిఘటన ఘోషలతో ముగిస్తారు. ఈ కావ్యంలో కథనం వుంది, మధనం వుంది. ఈ రెండింటినీ పదునుగా అభివ్యక్తం చేసే కవిత్వ జీవగుణముంది.

"మట్టి మనసు
వరిమళ్ళలో హరితగీతం పాడుకుంటుంది
పల్లె మనసు
చలువ పందిళ్ళులో దృశ్యకావ్యం రాసుకుంటుంది"
- 2

ఇందులో ఆరబోసింది ఆకు పచ్చని కవిత్వం. పల్లె అనగానే ఒళ్ళు మరచే హనుమారెడ్డి 'పల్లెకు దండం పెడతా' అంటున్నారు. ఒకప్పుడు సకల మానవాళికి అన్నం పెట్టగలిగి ఇప్పుడు రైతుకే అన్నం ప్రశ్నార్థకంగా మారిన పల్లెకు దండం పెడుతున్నారు. స్వయం సమృద్ధమై సౌభాగ్యామృత భరితమై, కోడి పుంజుల కళ్ళల్లో మణి దీపాలు వెలిగే ఒక పల్లీయ వ్యవస్థకు వేదనామయ వాక్కుల్తో నమస్కరిస్తున్నారు.

ఈ రచనలో రామయ్య మట్టి మనిషి, మట్టితో సంబంధం లేకుండా ఎందరో వాడుతున్న, అరిగిపోయిన మాట కాదిది.

"మట్టి ధ్యాసలో ఐక్యమైన రామయ్యకు
డొంక మలుపులు తెలియలేదు
ఆలోచనల తేరులో సాగిపోతున్నాడు
డొంక తరుగుతూ ఉంది." - 3

మనసంతా మట్టి అయిన వాడికి దూరాలు తెలియవు. రామయ్యే కాదు, రామయ్య కోడెలు, పశువులైనా జ్ఞానం కలవి. దారి, రంగు తెలుసు, ఖామందు చేసు వాసన తెలుసు - అందుకే

'మరు జన్మలో మట్టిళ్ళనై
పరిమళిస్తానంటున్నాడు రామయ్య' - 4

హనుమారెడ్డి "కన్నీళ్ళ పన్నీటితో" రాయలేనన్నారు గాని అది ఆయన తరం కాలేదు. అంటే ఈ దీర్ఘ కావ్యంలో కవిత్వాంశం కంటే రైతు లోకం కడగండ్ల పైనే దృష్టి పెట్టాడు. ఈ ఆర్తిలోనే కవిత్వస్ఫూర్తి తొణికిసలాడింది. హనుమారెడ్డి స్వతహాగా మృదు స్వభావి, భావుకజీవి. శబ్దార్థాల పరిమళం తెలిసినవాడు.

ప్రాంతీయతా స్పృహవల్ల భాషే కవిత్వంగా మారి పోయే ఒక ప్రత్యేక లక్షణం సాహిత్యంలో ప్రవేశించింది. దీన్ని హనుమారెడ్డి చాలా ఆత్మీయంగా వినియోగించు కున్నారు. ప్రకాశం జిల్లాలోలని పల్లె జీవితాన్నీ, రైతు జీవితాన్నీ ప్రతిబింబించే గొప్ప తెలుగు నుడికారాన్ని హనుమారెడ్డి ఈ దీర్ఘకవిత నిండా వినియోగించుకున్నారు.

"చక్కని కొంద్ర తలచి
కర్రి కోడె గర్వపడింది
కట్టు చాలు కోవున చూచి
ఎల్లకోడె మురిసింది
మందళ్ళ మలుపుల్లో
తుంగ బొటికల గుత్తి గంధవోడి చల్లింది" - 5

పై పంక్తుల్లో ఏ ఒక్క పదాన్ని మార్చి దాని సమానార్థ కాన్ని అందరికీ తెలిసిన తెలుగులో గాని, సంస్కృతంలో గాని ప్రయోగిస్తే కవిత్వం కాకుండా పోతుంది.

రైతుల పనిముట్లు, పరిభాషలు ఈ దీర్ఘకవితలో ఎంతో సహజంగా ఒదిగాయి. ఇవి చాలా రైతు కవితల్లో కనబడవు. ఇందులో హనుమారెడ్డి ప్రత్యేకత కనిపిస్తుంది. వార్నె, జడ్డిగం, దుక్కి, బాడవ, గరిసె, పొంతకుండ, అద్రు, తమిరె, గగ్గి - ఈ మాటలన్నీ ఇవాళ ఏ నాగరికతలకు తెలవవు. కనుక వాటి అర్థాలు కూడా తెల్పి మేలు చేశారు కవి. ఒక రకంగా చెప్పాలంటే ఈ కావ్యాన్ని రైతు పద కోశం'గా పేర్కొనవచ్చు.

భాషను కవిత్వంగా మార్చటమే కాకుండా, భాషతో కవిత్వాన్ని మిళితం చెయ్యడంలో కూడా ఈ కవి నైపుణ్యాన్ని చూపించారు. ఒకరోజు సేద్యం తరువాత ఆ సాయంత్రాన్ని కవి ఇలా వర్ణించారు.

"పక్షులు గూళ్ళకు చేరి
కూనల నోట్లో గడ్డిగింజలు తురుముతన్నై
ఆకాశం ఎర్రకలువలు పరుచుకుంది
పల్లె నల్లదుప్పటి మడత విప్పుకుంటుంది
బట్టల గొర్రెపిల్ల గుమ్మికిందకి చేరింది
పవ్వల కిర్రులతో కోడెలు బుసలు కొట్టుకుంటూ
వేగంతో మట్టుకు చేరాయి
కొష్టంలో నిరీక్షిస్తున్న ఉలవల బుట్టను సన్మానిం చాయి"- 6

ఇలా సాయం సంధ్యా సమయంలో ఒక రైతుగా, ఒక వ్యక్తిగా కథాగమనంలో కనిపిస్తాడు. అక్కడక్కడ రైతు ప్రతినిధిగా వ్యవహరిస్తాడు. అతనికి భార్య బిడ్డడు ఉం టారు.

"రామయ్య మనసు
మట్టికి అర్చన చేస్తున్నది - పల్లె ఆరతులిస్తున్నది" - 7

అని రామయ్య మనసును గురించి కవి చెప్పారు.

మట్టికి సంగీతం రాదు
రామయ్య గుండె పొరల్లో నడవటం తప్ప
మట్టికి కోపం రాదు
పల్లెకు అనురాగం పంచడం తప్ప
మట్టిలోంచి వచ్చిన మనిషి
మట్టి స్వభావం తెలుసుకుంటే
ఎంత బాగుండు.... ఎంత బాగుండు" - 8

అని మట్టి స్వభావమును గురించి చెబుతూ, ఆ మట్టిలో నుండి వచ్చిన మనిషి దాని స్వభావాన్ని తెలుసుకుంటే బాగుంటుందని కవి ఆశించారు.

మట్టితనానికి కేంద్రం పల్లెటూరు, రైతు జీవితం. అందుకే రైతు నగరానికి వలస పోవడం, నగర సంస్కృతికి బానిస కావడం ఈయనకు గొప్ప విషాదంగా కనిపిస్తుంది. ఈ కవితలో రామయ్య మధ్య తరగతి రైతుగా నడుస్తాడు. అనేక కారణాల వల్ల పంటలు ధ్వంసం కాగా పట్టణానికి వెళ్ళిపోయి కూలి చేసుకునైనా బ్రతువచ్చుననే ఆలోచన రామయ్యకు వచ్చింది. అక్కడ కవి మట్టితనాన్నీ, పెల్లతనాన్నీ ఉద్బోధిస్తూ ఇలా రాస్తారు.

"పల్లెను విడిచిన బిడ్డ బిడ్డకు
పైకి ఎదిగిన పట్నవాసికి
పేరు పేరున మనవి చేస్తున్నాను
పల్లె పొదులోంచి పట్నం ప్రభవించింది
రైతుబిడ్డ పునాదిపై పట్నం ఇకిలిస్తున్నది
పట్నంలోని ప్రతి మనిషికీ
తల్లి వేరు పల్లెలోనే ఉన్నది - 10

ఇలా పల్లె పొదులలో నుంచే పట్నం పుట్టిందని, పట్నంలోని ప్రతి మనిషికి తల్లివేరు పల్లెలోనే ఉందని కవి చెప్పారు. కనుక మట్టినీ, పల్లెనూ గొప్పగా ప్రేమించే కవిగా ఈ రచన ద్వారా హనుమారెడ్డి నిలుస్తారు.

రైతు వ్యవసాయానికి ముఖ్యాధారమైన పశువులను (ఎడ్లను), వాటి శ్రమను కూడా కవి గొప్పగా చెప్పారు.

"రేగళ్ళ నాగళ్ళ దున్నీ... దున్నీ
మెడపై పూచిన ఎర్ర పువ్వుని
కాకి ముక్కుకి బహుమాన మిచ్చిన
ముసలెద్దు అర్రున కారే ఎర్ర నీరుపై
వయసుడిగిన శార్దూల పద్యం చెప్పనా!" - 10

అని భూములను దున్నీ దున్నీ కాడి మాను రాపిడి వల్ల ఎద్దుల మెడలపై ఏర్పడిన పుండ్లను ఎర్రని పువ్వుగా చెప్పి వాటిని కాకులు ముక్కులతో పొడుస్తుండగా స్రవిస్తున్న ఎర్రని నీరును ఇలా వ్యవసాయంలో శక్తినంతా కోల్పోయి బక్కచిక్కి ఉన్న ఎద్దుల స్థితిని హృదయ విదారకంగా వర్ణించారు హనుమారెడ్డి.

రైతు జీవితానికి, దేశీయమైన పల్లె సంస్కృతికీ, వీటికి విరుద్ధమైన విషయాలకీ మధ్య పెరుగుతున్న కృత్రిమ, అన్యాయ విషయాలకీ మధ్యగల ఆవేదన ఈ కవితలోని ప్రధానమైన అంశం. ఒకప్పటి పల్లెటూళ్ళ శోభను కవి ఇలా వర్ణించారు.

"పండరి భజన, బృందావన భజన
కుంటి పంతులు కొరడా ఝులిపింపుతో
ఐదడుగుల విన్యాసం చేసింది.
బాధలన్నీ మరచి భవిష్యత్తు చూచినట్లు
కోలాటపు కోలలు
గజ్జల గుత్తి తగిలించుకుని
గరిడీ కొప్పులోంచి జడలల్లింది - జడ విప్పింది
అనావృష్టిపోయి పదును వర్షం కురిసినట్లు - 11

ఇలా ఎన్నో ప్రజా సంబంధమైన కళల విన్యాసం కవితాత్మకంగా ఈ కావ్యంలో రూపుదిద్దుకుంది.

ప్రకృతి వైపరీత్యాల వల్ల, నాసిరకం విత్తనాలపై అదుపు లేకపోవడం వల్ల, సామ్రాజ్యవాద దోపిడీవల్ల రైతులు సంక్షోభానికి లోనైన తీరును కవి ఈ కావ్యంలో వర్ణించారు.

"నా ఊరు............ నా రేగడి
దరితోచక పొగలుతోంది
యన ఏలికలు భూమ్మీదకు రాలేదింకా
విహాయసంలో
ప్రపంచీకరణకు పట్టాభిషేకం విందులో ఉన్నారు.
నగరాలు కొల్లగొట్టాయి,
మూలలు పల్లెల్లో........ వ్యాపకాలు పట్టణాల్లో - 12

కావ్యంలో మొదటిభాగం అంతా సుభిక్షమైన పల్లె వాతావరణాన్ని, కల్మషం లేని జీవన విధానాన్ని, ఉండంతలో రైతు ఎలా ఉండేవాడో కవి చక్కగా వర్ణించారు.

"తొలి కోడి పల్లెకు మేలుకొలుపు పాడింది
మలి కోడి ఊరిపై వెలుగుల్ని చల్లింది.
తూర్పు కొండలు నైరాస్యంగా దిగిపోతున్నై
ఉదయ కిరణాలకు విశ్వగీతిని వినిపించడానికి
సారంగరాగం శ్రుతి సిద్ధం చేసుకున్నది.
వేకువమ్మ మందిరాన్ని విడిచి
ఆరుబయట రెక్కలార్చుకుంటుంది
పల్లెంతా మేల్కొంది - 13

అని పల్లె మేల్కొలుపును హనుమారెడ్డి గొప్పగా వర్ణించారు.

వ్యవసాయానికి ముఖ్యాధారమైన వాన విలువ కిటికీలలోంచి సౌందర్య దర్శనం చేసే వారికేమి తెలుస్తుంది. ఆ వాన విలువ రైతుకే తెలుస్తుంది. రామయ్యను చూడండి.

"నాలుగు ముత్యాలు రాలాయి
రామయ్య పరవశించాడు
ఒక జల్లు విసిరింది.
నృత్యం చేశాడు రామయ్య
జడివాన కురిసింది.
పరవళ్ళు తొక్కాడు, పొలమంతా చిందులేశాడు
తడిచి మొలకెత్తాడు - 14

ఇలా వర్షపు జల్లులో రామయ్య పరవశించాడు ఆనందంతో గంతులు వేశాడు. హనుమారెడ్డి వర్షంతో రైతుకు ఉన్న అనుబంధాన్ని ఆత్మీయంగా వర్ణించారు. హనుమారెడ్డి "పల్లెకు దండం పెడతా" కవితలో ఒకవైపు ప్రకృతి అందచందాలను, భూస్వామ్య విలువలతో మిళితమైన ఆ మనుగడలోని అచ్చమైన తనాన్ని కాల్పనికంగా ఆరాధిస్తున్నాడు. ఇంకోవైపు చరిత్ర డొంకలో రైతుబండి బోల్తాపడిన వైనాన్ని సామాజిక పరిణామాల్లోంచి వాస్తవికంగా వర్ణిస్తున్నాడు.

"నడుస్తున్న చరిత్రలో
విశ్వవేదికపై పచ్చని పల్లె లేదు.
ఆవిరై గాలిలో కలిసింది." - 15

చరిత్ర గతిలో పల్లెలన్నీ కనుమరుగై పోతున్నాయని కవి బాధను వ్యక్తం చేశారు.

వ్యాపార పంటలు గ్రామీణ జీవితాన్ని ఎలా దుఃఖ భాజనం చేశాయో, అది రైతు ఆత్మహత్య చేసుకునే దశకి ఎలా తీసుకువచ్చిందో ఈ కవితలో వర్ణించబడింది. ఉల్లి, మల్లెలు పోయాయి సజ్జలు, జొన్నలు పోయాయి. తిండి పంటల చోట్లో వ్యాపారపు పంటలరాకవీటి సేద్యంలో నిలువు దోపిడీ, కరువులు, చచ్చు విత్తనాలు, పూర్తికాని ప్రాజెక్టులు, గిట్టుబాటులేని ధరలు - వీటివల్ల పల్లెలు విధ్వంసమయ్యాయి. గ్రామరాజ్యం రాజకీయమైంది. రైతులు - రైతుకూలీలు వలస ప్రారంభించారు. వ్యాపార పంటలు గ్రామీణ జీవితాన్ని దుఃఖభాజనం చేశాయి.

నగరీకరణ, వ్యాపారం, మార్కెట్ స్వేచ్ఛ ఎలా మనదేశీయ విద్యనీ, సంస్కృతినీ ధ్వంసం చేశాయో కవి వివరించారు.

"పాడి వ్యాపారమైంది.
పంట కొండెక్కింది.
పల్లెల్లో రైతు బక్కనీళ్ళకు భూభ్రమణం చేస్తున్నాడు
వాని ముఖాన నష్టజాతకం కక్క్యగీసుకొని
తిరుగుతుంది - 16

పాడి, పంటలు తరిగి పల్లెల్లో రైతు గంజినీళ్ళ కోసం ఎలా వలస పోతున్నాడో హనుమారెడ్డి బాధతో చెప్పారు.

హనుమారెడ్డి ఈ కావ్యంలో రామయ్యను మాయ మర్మంలేని వానిగా, మట్టితల్లి ముద్దుబిడ్డడుగా చెబుతారు.

అన్నా!
జడ్డిగంలో గింజ జరజారగనే
బండిజల్ల నిండిందని రెడ్డిగం వేశావు
వెండి మీసాల వెంకన్నా!
చచ్చు విత్తనాలు విత్వాని తెలియదు నీకు.
ప్రతి మొక్క నిన్న మారాకు వేస్తే
తెల్ల బంగారం దాచడానికి గిడ్డంగులు కట్టావు
పిచ్చికాల పిచ్చన్నా!
పురుగు పుక్కిళ్ళు తెలియవు నీకు - 17

ఇలా కవి రామయ్యను అమాయక రైతుగా ఈ కావ్యంలో చిత్రించారు.

హనుమారెడ్డి "పల్లెకు దండం పెడతా" అనే దీర్ఘ కవితలో పల్లెటూరు, పల్లె మనసు, పల్లె వాతావరణం, ఆచారాలు, సంప్రదాయాలు, పండగలు, కొలుపులు, సంస్కృతి, ఈ తరం రైతుకు జరుగుతున్న నష్టం, ప్రపంచీకరణ ప్రమాదం, రైతు కూలీగా మారడం, నగరాలకు వలస, రైతు తనలో తాను నలిగిపోవడం, క్రమంగా మధ్యతరగతి రైతు మాయంకావడం, ప్రభుత్వ పాత్రను, ప్రజల పాత్రను తనలో తాను చర్చించుకొని రైతు తిరుగుబాటు నిర్ణయం తీసుకోవటం వంటి అంశాలను స్పృశించారు.

"రామయ్య ఆవేశాన్ని ఎవ్వరూ ఆపలేరిపుడు
నా నాగటి చక్కని చాలు ముందు
నా కర్రికోడె చల్లని చూపు ముందు
ప్రపంచీకరణ తలవంచే రోజు వరకు
మట్టి తడి బంధాల్ని గుండెల్లో దాచి ఉంచుతా!
నా రేగడి గడ్డపై పచ్చ బావుటా ఎత్తి ఉంచుతా!
ప్రభాత ప్రస్థానం సాగిస్తా
రైతు సోదరులారా!
నేల మనది.............
గాలి మనది.................
నీరు మనది.............
ఆకాశం పూచిన వెన్నెల పాటల్లో
సామూహిక అభ్యంగన స్నానాలు చేద్దాం.
మన మట్టిని మనం ప్రేమిద్దాం.
మన చరిత్ర మనం రాసుకుందాం.- 18

ఈ కవితలో ఒంటిని కాల్చుకుని, సంపదలు కోల్పోయి, నిరాకారిగా కృష్ణమయ్య ఒడ్డున నిల్చున్న వేప చెట్టు ఎండిన మోడులోంచి సైతం చివురు చీల్చు కొస్తుందని చేదు చెట్టు రామయ్యకు తీయని సందేశం ఇచ్చిందని.

"మనిషికి పాఠాలు నేర్పించి
వృక్ష సంపద పల్లెకు ఊపిరి....
మనువు, తనువు త్యాగం చేసే
పశు సంపద పల్లెకు ప్రాణం...
రామయ్యకు కొండంత బలం ఇచ్చిందీ.. సందేశం
చెట్టుకున్న నిస్వార్థం
పశువుకున్న పరిత్యాగం
చివురంతైనా మనిషి కుంటే దౌర్భాగ్యం ఎందుకు! - 19

అని వృక్షాలు, పశువులు మనిషికి పాఠాలు నేర్పిస్తాయని, అవి పల్లెకు ఊపిరి, ప్రాణం అని వీటికున్న, నిస్వార్థం, పరిత్యాగం, కొంచమైనా మనిషికుంటే దౌర్భాగ్యం ఎందుకొస్తుంది అంటారు హనుమారెడ్డి.

రైతు ఆత్మహత్యల నేపథ్యంలో ఈ కవి రామయ్యకు వచ్చిన ఆత్మహత్యలోచనను విరమించి, అతనిలోనే అఖిల భారత రైతు సంఘాల ఉద్యమాలవల్ల ఆత్మ విశ్వాసాన్ని రగిలించడం ముగింపులో గొప్పగా చెప్పారు కవి. భవిష్య దుజ్వల భావనతో ఉద్యమశీలంగా ఈ కవితను హనమారెడ్డి ముగిస్తారు.

"ఛిద్రమైన రైతు బతుకు కోటి శిఖలతో
పల్లె నుండి ఢిల్లీ చేరింది
దద్ధరిల్లింది హస్తిన
కంపిచాయి రాష్ట్రాలు

ప్రభుత్వాలు దిగి వచ్చాయి.
కొత్త ప్రణాళికలు పాతమంత్రులు రాశారు
40 శాతం బడ్జెట్ రైతన్నకు కేటాయింపు
గంగమ్మ తల్లి గలగలా పారింది.
....................................
....................................
కవి హృదయం తడిచింది.
పల్లెకు దండం పెట్టింది - 20

ఈ దీర్ఘకవిత పల్లె సంస్కృతిపై గౌరవం కలిగిస్తుంది. సమకాలీన పరిస్థితులపై అవగాహనను రగిలిస్తుంది. ఈ దీర్ఘ కవితను చదివిన పాఠకులందరూ ఏకీభావన పొంది "పల్లెకు దండం పెడతారు"

❀ ❀ ❀

# ఆధునిక తెలుగు సాహిత్యం - ప్రకృతి

- కె. సుధాకర్, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఆధునిక కవులలో ముఖ్యంగా భావకవులలో ప్రకృతి ప్రీతి, ప్రకృతిని ఆరాధించే ప్రధాన లక్షణాలు ప్రాచీన సాహిత్యం నుండేకాక కాక కాల్పనిక కవితాసంప్రదాయం నుండి కూడా స్వీకరించబడింది. ప్రకృతి భావకవిత్వంలో ఒక విశిష్ట స్థానాన్ని పొందింది. ప్రకృతి కన్నతల్లిలా ఒడిలోకి తీసుకొని బుజ్జగించేది. గురువులా ఉద్బోధించేంది, దేవతలా ఆశీర్వదించేది, స్నేహితుడిలా హితాన్ని తెలిపేదీ, ఆశ్వాసించేదిగా కనబడుతూ ఆత్మతృప్తికీ, సత్యాన్వేషణకీ ఆధారమైంది. దాన్ని చూసి భౌతికానందాన్ని పొందడం, తర్వాత అనంతర్ముఖుడవడం, ఆత్మానందాన్ని పొందడం, అందులో తాదాత్మ్యాన్ని పొందడం, అందులో తాదాత్మ్యాన్ని భుజించడం, భగవద్దర్శనానికి దాన్ని ప్రతిబింబంగా భావించుకొనడం మొదలైనవిందులో ఇమిడు న్నాయి. ఆనాటి నవ్యకవులందరిలో వీటిల్లో పై చెప్పిన వాటిల్లో ఏవో కొన్నైనా వాళ్ళ రచనలలో లేకుండా లేవు. గురజాడ 'నీలగిరి పాటలు', విశ్వనాథవారి 'కిన్నెరసాని', 'కోకిలమ్మ పెళ్లి', వేదుల సత్యనారాయణ 'దీపావళి' మొదలైనవి, రాయప్రోలు వారి తృనకంకణాదులు, వేంకట పార్వతీశ్వర కవుల 'కవిగీతం', 'ప్రకృతి', దువ్వూరి 'కవిమనోరథం' పింగళి - కాటూర్ల 'తొలకరి' తుమ్మల దేవులపల్లి, పెనుకుర్తి, దాశరథిల రచనలలో ప్రకృతి ఒక ఉన్నత స్థానాన్ని అలంకరించింది.

భావకవి సమకాలీన సమాజ పరిస్థితులలోను, కృత్రిమ నాగరిక జీవితంతోను విసుగెత్తినప్పుడు 'ఆకులోనాకునై, పూవులో పూవునై, నునులేత రెమ్మనై ఈ అడవి దాగిపోనా ఎటులయిన ఇచటనే ఆగిపోనా' అని ప్రకృతి ఒడిలోకి పారిపోవాలని చూస్తాడు. గడ్డిపువ్వు నుంచి గగన గంగ వరకు ప్రకృతిలో ప్రతి అణువూ అతనికి ప్రాణవంతంగా కనిపిస్తుంది. గడ్డిపూవు గుడ్డిదిగా కనిపించదు. అది దాక్కుని చూస్తుంది. దారంట గడ్డి నిరుక్కొని కూస్తుంది. ఒక్కడే నడుస్తూ ఉంటే, చుక్కలు పాడుస్తూ ఉంటే మక్కువగా కూర్చో అని పిలుస్తుంది. గరికతో జన్మజన్మాల అనుబంధాన్ని తలపోస్తాడు. నిర్మలజ్యోతినీ సందర్శిస్తాడు. మందారమేమో ఒడ్డున వంగి నీటిలో తన అందాలు తానే చూసి మాట్లాడు తుంది. భావకవికి ప్రకృతి మోహినీ మూర్తిగా దర్శనమిస్తుది. సెలయేరులు రాగాలెత్తి గానం చేస్తాయి. తళతళ వెన్నెల సిగ్గులతో అలలు తాండవమాడు తాయి. జగమెల్లా నందన వాటికగా కనిపిస్తుంది. చల్లగ వెన్నెలలు కన్నతల్లిలా కనిపిస్తాయి. కాని మనసేమో మాటు మణగదు. 'కన్నెకాటుక కళ్లు, చిన్నినాథుని చూచి కదలులాడివేళ, ఆకాశమధ్యాన, అటనొక్క, చెలిమబ్బు మెరుపులో మెరుస్తుంది.

ఈ విధంగా భావకవి ప్రకృతిని ప్రణయోద్దీనకారి గాను, తపోపశమనకారిగాను భావించాడు. ఒక్కప్పుడు ప్రకృతిలో తన అంతరంగం విప్పి విరహ వ్యథల కథలు వినిపించినాడు. కవితలు అల్లినాడు. ప్రకృతి చల్లని ఒడిలో వేదనలు మరిచిపోయినాడు. అందుకే భావకవికి ప్రకృతి అన్నా, ప్రకృతి ఒడిలో జోలలు కట్టుకున్న పల్లెటూళ్లన్నా, ప్రకృతి అంతా నిర్మలమైన మనస్సుగల పల్లెటూరివారన్నా ఎంతో ప్రేమ. అడవి మల్లెలవంటి పల్లెలను, ఆకృత్రిమైన అంతరంగమున పల్లీయులనూ వర్ణించడం ప్రకృతి కవిత్వంలో ఒక భాగమయింది.

ఈ ప్రకృతి కవిత్వాన్ని అందిపుచ్చుకున్న నిన్నటితరం కవులలో ఇస్మాయిల్, ఆదూరి సత్యవతీదేవి ముఖ్యులు. ఆ తర్వాత బి.వి.వి. ప్రసాద్‌లు చాలా ప్రముఖంగా పేర్కొనవచ్చు. ఇతని కవిత్వం అంత ప్రకృతి పరచుకొని ఉంటుంది. ప్రకృతిలోని సమస్త సౌందర్యాన్ని అక్షరాలలో చిత్రించడం ఈయనకు వున్న ప్రత్యేకతగా మనం

చెప్పుకోవచ్చు. ఉదాహరణకు ఇతను రాసిన కొన్ని ప్రకృతి కవితలను ఇక్కడ విశ్లేషణ చేయడం జరిగింది.

యవ్వనంలో సాధారణంగా మిత్రుల్ని కలుస్తాం. రాత్రింబవళ్ళు విందులు, వినోదాలు, విహారాలు, సినిమాలు, తిరగడాలు ఇంకా ఇతర అలవాట్లు, ప్రియురాలు, ప్రేమ, విరహం ఇవే జీవితంగా కన్పిస్తుంది. చెరగని చిరునవ్వుతో, ఉరకలెత్తే ఉత్సాహంతో జీవితం ఎగిసిపడుతుంది.

ఆ వయసులో అనుక్షనం తన ఆత్మతృప్తిని, పువ్వు నవ్వులో, పిల్లగాలి చల్లదనంలో, వెన్నెల తాకిడిలో, నిశ్శబ్ద పర్వత దర్శనంలో నిమగ్నమయిన గుంపుకు దూరంగా ఉన్నట్లు అనిపిస్తాడు. కానీ గుండెకు దూరంగా ఉన్నట్లనిపించడం. అతనికి పరవశకేంద్రం ప్రకృతి. అన్వేషణే అతని రక్తనిష్ఠ గుణం.

"ప్రశ్నాపరంపరలతో నన్ను నేను వేధించుకొంటున్నపుడు
నన్ను తాకిన వాన చినుకు
ఆకాశంలో మెరిసే ఇంద్రధనుస్సును చూడమని చెప్పింది.
సప్తవర్ణాలలో నా చూపులు కరుగుతున్నపుడు
నన్ను గురించీ, ఇంద్రధనువు గురించీ ప్రశ్నించాలన్నా ధ్యాసే
నానుండి మాయమైంది"

ప్రకృతి స్పర్శ అతనికి కలిగేదాకా ప్రశ్నల పరంపరల్లోనే ఉన్నాడు. సందేహాలతో సంక్షుభితుడిగానే ఉన్నాడు. అయితే వానచినుకు తాకి ఆకాశంలోని ఇంద్రధనుస్సును చూడమని చెప్పిందట. సందేహాలతోనే ఇంద్రధనుస్సును సమీపించాడు కానీ దాని దర్శనంలో ప్రశ్న అదృశ్యమయింది. ప్రకృతి ప్రశ్న కాదు. ప్రకృతి సమాధానం. ప్రకృతి పరిష్కారం. ప్రకృతిలో మనం పరమాణువులం. ఇక ప్రకృతిని ప్రశ్నించే సమస్య ఉత్పన్నం కాదు కదా!

ప్రసాద్ ఒంటరివాడు కాడు, ఏకాంతజీవి. ఒంటరితనమంటే దిక్కుతోచనితనం ఏకాంతమంటే ప్రశాంతత. సమాధానంలో విశ్రాంతి పొందడం. అతనూ మనిషే. అనికే స్నేహితులు, అనుభూతులు అన్నీ ఉన్నాయి.

"ఉదయం వికసించింది. పుష్పాలు రేకులు విప్పాయి
తుమ్మెద వాలింది. గాలితెర కదిలింది
నన్ను ఎరిగిన మిత్రుడు, నన్నుచూసి చిరునవ్వు నవ్వాడు"

అంటే అతని ఆంతర్యం తెలిసిన స్నేహితుడున్నాడు. ప్రకృతిలో అతని అనుబంధం అతనికి తెలుసు. ఉదయాన్ని చూసి ఉల్లాసపడిన కవిని చూసి మిత్రుడు చిరునవ్వు నవ్వాడట.

ప్రసాద్ మనసులో ఒక స్త్రీమూర్తి ఉంది. ఆమె ప్రేయసో, ఊహాసుందరో! కాని ఆమెకు తన బతుకును సమర్పించాడు.

"నా జీవితాన్ని పాలించే మహారాజ్ఞీ!
నీ రాకకోసం
నా హృదయమందిర కవాటాలు తెరిచి
నా నిండా వెలుగులు నింపుతాను.
సజీవ నిత్యచైతన్య ప్రకృతి సంపదకు
మన చిన్న హృదయాల కలయిక
మణి కిరీటమై నిలవాలి
కాలప్రవాహం వెంటసాగే
సాధారణ జీవనగమన్ నుండి వేరుపరచి
మన ప్రేమ మనలను
నక్షత్రకాంతిలో, అనంతత్వంలో, మౌనంలో నిలిపి ఉంచుగాక!"

అతని ప్రియురాలు ఉంది. ఆమె జీవనసహచారే కానీ ఆమె ప్రాపంచిక పరిమితుల్ని దాటింది. సాధారణ జీవనానికి వేరయింది. వాళ్ళ ప్రేమ అనంతత్వంలో ఒక అవిభాజ్య భాగంగా ఉండాలని ఆశిస్తున్నాను.

అతని ప్రేయసి రక్తమాంసాలున్న, రాగద్వేషాలున్న వ్యక్తిగా కొన్నిసార్లు కనిపిస్తుంది. ఆమెపట్ల అంతులేని ఆరాధనా కన్పిస్తుంది.

"వాగు ఒడ్డున నీ ధ్యానంలో కూర్చొనప్పుడు

నీ మృదుగమనమూ, కలభూషణమూ, నిర్మల హృదయమూ
మరింత స్పష్టంగా దర్శించగలిగాను"

ఆమె అపూర్వ సౌకుమార్యమూ, సున్నితత్వం, సౌందర్యం అతని పువ్వులాంటి మనసులో పుప్పొడిలా ఉంటాయి. ఆమె ఈ ప్రపంచానికి చెందినదయినా ఆమెను తన భావకవిత్వంతో స్వయంకల్పిత స్వర్గంలో ప్రతిష్ఠిస్తాడు. ఇలాంటి కవిత్వాలే కాకుండే ప్రకృతి వైపరీత్యానికి సంబంధించిన కథలు కూడా ఆధునిక సాహిత్యంలో పురుడుపోసుకున్నాయి.

❀❀❀

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# కడప జిల్లా జానపద కళారూపాలు - ఒక పరిశీలన

- **యస్.వి. వసుమతి,** తెలుగు పరిశోధకురాలు, యస్.వి. యూనివర్శిటి, తిరుపతి.

నాటి ప్రాచీన మానవుని మొదలు, నేటి ఆధునిక మానవుని వరకు కళలు మనోఉల్లాసానికి, సుఖ దుఖా:ల వ్యక్తీకరణకు ఉపయోగించుకుంటున్నాడు. ప్రపంచంలోని ప్రతి సంస్కృతిలో కళలు ఆవిర్భవించి క్రమ క్రమంగా వికాసం పొంది, తమ జాతి ప్రత్యేకతలను చాటుకొంటు న్నాయి. ఒక నాటి అటవిక కళలే జానపద కళలుగా రూపాంతరం చెంది, నేటి ఆధునికి కళలకు మూల మైనాయి. కళలలకు కాణాచి రాయలసీమ. నాటి రాజులు ఎన్నో కళలను పోషించారు. నేటి ప్రజలు కళాభిమా నులుగా మారి వాటిని కాపాడుకుంటు వస్తున్నారు. నేటి ప్రజలే కళాభిమానులుగా మారి వాటిని కాపాడుకుంటు వస్తున్నారు. జానపద ప్రదర్శన కళలు పండుగ సమయా లలో, దేవుని ఉత్సవాల సంధర్భంలోను, ఊరేగింపుల సమయంలోను, జాతర సమయాలలోను వీటిని ప్రదర్శిస్తుంటారు. కడప జిల్లాలో చాలా ప్రాచీన కాలం నుంచి నేటి వరకు చెక్క భజనలు, కోలాటం, వీధినాట కాలు, బుర్రకథలు, ఉట్టి కొట్టడం, కర్రసాము, ఎద్దుల పందాలు, జక్కి ఆటలు ముఖ్యమైనవి. దీనిభాగంలో కళా ప్రదర్శనలు ఈ విధంగా ప్రదర్శించబడతాయి.

### వీధినాటకాలు :

వీటిని అనేక చోట్ల వివిధ రకాల పేర్లతో పిలుస్తారు. ఇవి కడప జిల్లాలో కోతపాటలుగా, బండి పాటలుగా, జోలపాటలుగా ప్రాభవంపొందాయి. ఇవి ఉత్సవాలు, ఊరేగింపులో దేవునితో బాటుగా ముందుకు కదుల్తూ వేస్తారు. అలాగే గ్రామ పెద్ద ఇంటి ముందు వేస్తారు. వీటిని వీధిభాగోతాలు అని, యక్షగానం అని కూడా అందురు.

### తోలు బొమ్మలాటలు :

తోలు బొమ్మలాటలు ఆంధ్రప్రదేశ్‌లో ప్రదర్శించ బడినా కాలక్రమేగా ఒక్క అనంతపురం సంత వేలూరులో తప్ప మిగిలినచోట మరుగున పడిపోయాయి. నేడు ఎక్కడ ప్రదర్శించబడడంలేదు.

### కోలాటం :

కోలాటం అనునది దేవుని ఉత్సవాలలోను, పండుగ సమయంలో వేస్తారు. ముఖ్యంగా దసరా, దీపావళి, కృష్ణాష్టమి పండుగ సమయాలలో కోలాటం వేస్తారు. కోలాటం ప్రాచీన కాలంలో స్త్రీలు వేసేవారు. నేడు స్త్రీలు, పురుషులు ఇరువురు కలసివేస్తారు. కోలాటంలో పాట లను కోపులంటారు. ఈ కోపులలో ఒక్కొక్క నృత్య కళా రూపాలు ఉంటాయి. పల్లెలలో వీటిని రాత్రి సమయా లలో, తీరిక సమయాలలోనే నేర్చుకొంటారు.

### చెక్క భజనలు :

కడప జిల్లాలోనే ప్రఖ్యాతిగాంచిన నృత్యరూప ప్రదర్శన ఈ చెక్కభజన. దీనికే చిడతలతో కూడిన ఆట అని కూడా అంటారు. దీనిని ఆడ, మగ భేదం లేకుండా ఆడతారు. ఎక్కవ కడప జిల్లాలోని పెద్దపుత్త, పాయసంపల్లి, బ్రహ్మం గారి మఠం, బద్వేలు, మైదుకూరు, పులివెందులలోని కొన్ని ప్రాంతాలలో ఎక్కువగా వీటిని సాధన చేస్తారు. ముఖ్యంగా బ్రహ్మంగారి మఠంలోని భజనలకు పుల్లయ్య ఈ చెక్క భజనకు గురువుగా చెబుతారు. వీరు చెక్క భజనచేయునపుడు స్త్రీ, పురుషులు ఇరువురు కాళ్ళకు గజ్జెలు కట్టి చేతిలో చిడతలు బట్టి, ఒక్కొక్క అడుగు వేస్తు ముందుకు కదులుతారు. నాట్యం చేయునపుడు పాటపాడే గురువు మధ్యలో ఉండి, చేతిలో చిడతలు పూని, లయబద్ధంగా అడుగులు వేస్తాడు. ఈ అడుగులను చూస్తు మిగిలిన వారు కూడా లయ బద్దంగా కదులు తారు. ఈ విధంగా కదలడాన్ని మొదటి అడుగు, రెండవ అడుగు పోటు, ఒంటి మెలిక, మూడవ మెలిక, గుర్రపు అడుగు ముఖ్యమైనవి. చెక్క భజనచేసే ప్రదేశాన్ని 'గరిడి' అని బృందాన్ని జట్టు అంటారు. ఒక్కొక్క భజన బృందంలో

15 మంది నుంచి 30 మంది ఉంటారు. వీరు భజన చేయు మధ్యలో దేవుని చిత్ర పటాన్ని ఉంచి, దీపస్తంభాన్ని వెలిగిస్తారు. హార్మోనియం, డప్పువాయిద్యాలతో కూడిని పాటలు పాడుతూ జనాన్ని ఆనందంతో రంజింపజేస్తారు. ఒకటిన్నర అడుగు పొడవు, మూడు అంగుళాల వెడల్పు, చెక్కకు మధ్యలో చేతితో పట్టుకోవడానికి పిడిని అమర్చి ఉంటారు. చెక్కకు రెండు కొనల మధ్యలో రెండు అంగుళాలను తొలచి వాటిలో ఇనుప లేదా ఇత్తడి రేకు లను బిగిస్తారు. ఈ విధంగా రెండు చెక్కలను చేయించి కుడిచేతితో పట్టుకొని, ఎడమ చేయిని అడుగులకు అనుగుణంగా ఆడిస్తు నృత్యం చేస్తారు. ఎక్కువగా చెక్క భజన పాటలలో రామాయణం పాటలు, జానపద గేయాలు, కృష్ణుని గురించి పాటలును పాడుతారు.

ఈ చెక్కభజన పాటలలోనే జడకోపు లాట, మెడలో పూలు వేసుకొని చేయు నృత్యాలు ప్రసిద్ధమైనవి. జడకోపు లాటలో భాగంగా 30 మంది కళాకారులు గుండ్రంగా నిలబడి మధ్యలో గల స్తంభం నుంచి తాళ్ళను వేలాడ దీసి వాటిని నడుముకు కట్టుకొంటారు. గురువు పాట పాడుతూ ఉంటే వీరు ఇద్దరు ఇద్దరు కలిసి జడలు అల్లుతూ పోయి మరలా జడ అల్లికను తీసివేస్తారు. ఈ జడఅల్లడం, తీసివేయడం వంటి దృశ్యం చూపరులను కట్టి పడేస్తుంది. జడ అల్లడంలో చాలా రకాలున్నాయి. ముఖ్యంగా 1) మోకు జడ 2) పట్టెడ 3) గొలుసు 4) నూగ్గాయ జడ మొదలైనవి.

ఇంకొక రకమైన నృత్యం మెడలో దండవేసికొని పూలు రాలకుండా గజ్జె కట్టి అభినయంతో నృత్యం చేయడం. ఈ విధమైన సాధనకు 3 నెలలు కాలం పడుతుంది.

**పండరిభజన :**

పండరిపురంలోని పాండురంగని పేరు మీద తమ భక్తిని ప్రదర్శిస్తూ ఆడిపాడే భజన పాటలను పండరి భజనలు అందురు. భజన చేయువారు కాళ్ళకు గజ్జె గట్టి, గోచి పోచి పంచె కట్టి, తలకు గుడ్డ గట్టి చేతిలో పసుపు జండాలతో ఈ పాటలును పాడతారు.

**జక్కివేయడం :**

పల్లెలలో ఎక్కువగా స్త్రీలు, ఆడపిల్లలు ఎక్కువగా పండులలోను, వెన్నులలో గుండ్రంగా నిలబడి జక్కివేస్తు పాడతారు. ఈ ఆటలలో కాలు కదపకుండా ఓరగా నిల బడి అటుఇటువారితో చేతి చేతిని కలుపుతూ పాటలు పాడడాన్ని జట్టి జాము అందురు.

**బుర్రకథలు :**

బుర్ర కథలు నాడు గ్రామీణప్రాంతాలలో బాగా ప్రాచుర్యం పొందాయి. పండుగలప్పుడు దేవళంలో ఉన్న ఒక ఎత్తు అరుగు (వేదిక) పైన ఈ బుర్ర కథలు చెబుతారు. ఇకడు కథను చెబుతూ ఉంటే మిగిలిన ఇద్దరు కథ చెప్పే అతనికి వంతపాడుతూ 'తందానతాన' అంటారు. అయితే నేడు ఇవి తమ ప్రభావాన్ని కోల్పోయి నవి. ముఖ్యంగా బుర్ర కథలలో రామయణం, బాల నాగమ్మ, హరిశ్చంద్రుని కథలు, పలనాడు కథలు, కడప వీరవనిత హోన్నూరమ్మ, సీతాస్వయంవరం కథలు ఎక్కువగా చెబుతారు.

**ఉట్టికొట్టడం :**

కడప జిల్లాలో ముఖ్యంగా పల్లెలలో ఎక్కువగా ఉట్టి కొట్టడం చేస్తారు. కృష్ణాష్టమి పండుగ రోజున చేస్తారు. బద్వేలులోని అక్కిపాళెం గ్రామంలో ఈ ఉట్టి కొట్టడం ఘనంగా జరుగును. దేవుని ఉత్సవం జరుగు సందర్భంలో పెద్ద కొయ్యను గ్రామంలో మధ్యలో నిలబెట్టి కొయ్యకు జిగురు బంక పూస్తారు. కొయ్య చివరలో మామిడి ఆకులు, పూలు, వేపాకు, చిల్లరనాణేలు, డబ్బు అన్ని ఒక రంగుల కుండలో వేసి కడ్తారు. ఈ కుండకు ఒక పెద్ద తాడును కట్టి నృత్యరూపకంలో కొయ్యపైకి పోయో వారి మీద పసుపు నీళ్ళు, పేడనీళ్ళు (కల్లాపి) చల్లుతారు. అయిననూ అంచెలంచెలుగా సమూహంగా నిలబడిపైకి వెళ్ళి కుండను పగుల కొట్టి క్రిందకు దిగుతారు. ఈ విధంగా ఉట్టి పగుల కొట్టిన వారికి బహుమానాలు అందజేస్తారు.

**గొబ్బి తట్టడం, ఎడ్లపందాలు, గంగిరెద్దులాట :**

ముఖ్యంగా సంక్రాంతి పండుగ అనునది జానపదుల పండుగ. జానపదులు అంతా గ్రామాలలో చాలా గొప్పగా చేసే పండుగ. వీరు కుల, మత భేదాలు లేకుండా ఇరుగు పొరుగులతో కలిసి గొబ్బెమ్మల చుట్టూ చేరి చేతుల్ని లబద్ధంగా గుణంగా చరుస్తూ, ప్రదక్షిణం చేస్తూ గొబ్బి పాటలు పాడుతుంటారు. ఈ గొబ్బి పదాల్లో అధిక భాగం దేవుళ్ళకు సంబంధించి ఉంటాయి. జానపదులు పేడతో చిన్న ముద్దను గోపురంలా చేసి ఇంటిముందు వేసిన ముగ్గుల నడుమ ఉంచి, దానిపై గుమ్మడిపూలు పెడ తారు. ఈ గొబ్బెమ్మను తంగేడుపూలు, బంతిపూలతో కూడా అలంకరిస్తారు. ఒక్కొక్కసారి పసుపు ముద్దతో చేసిన గొబ్బెమ్మను తాంబూలపళ్ళెంలో ఉంచి, పూలతో అలంక రించి ఊరిలోని ప్రతి ఇంటిముందూ గొబ్బెమ్మను ఉంచి గొబ్బి పాట పాడుతుంటారు. ఈ విధంగా పాడ తారు.

"గొబ్బీయల్లొ గొబ్బీయల్లో కొండాలయ్యకు గొబ్బిళ్ళు
ఆదిలక్ష్మి, అలవేలమ్మకు అందమైన గొబ్బిళ్ళు" అని పాడతారు.

రాయలసీమలోని చాలా ప్రాంతాలలో ప్రతి సంక్రాంతి పండగ సమయంలో ఎడ్ల పందాలను నిర్వహిస్తారు. కడప జిల్లా కూడా ఎడ్ల పందాలకు పేరెన్నిక గన్నది. ఎద్దులను బండ్లకు కట్టి పరుగులు తీయిస్తారు. దీన్ని ఊరిలోని పెద్ద మైదానాలలో జరుపుతారు. ఊరిజనం చుట్టుపక్కల జనాల కేరింతలలో ఎడ్లపందాలు జోరుగా సాగుతాయి. ఒక్కోసారి ఈ ఎడ్లపందాల్లో బండ్లు పల్టీలు కొట్టి ఎందరో మరణిస్తుంటారు కూడా అయినా పల్లెల్లో వారి ధైర్య సాహసాలకు ప్రతీకగా ఎడ్లపందాలు జరిపిస్తుంటారు బండ్లు బాగా అలంకరించబడి ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. అలాగే బండ లాగుడు పోటీలు కూడా నిర్వ హించి బహుమతులు ప్రకటిస్తారు. పొడవుగా ఉన్న బరు వైన బండను ఎవరి ఎడ్లు ముందుగా లాగగలిగితే వారిని గెలిచినట్లు ప్రకటించేవారు. అలాగే గాండ్లు కదలకుండా వాటిమధ్యలో కట్టెలను కట్టి బండ్లను ఎద్దులు ఈడు త్సాయి. ఎక్కువగా ఈ పోటీలు సంక్రాంతికి, నరసింహ జయంతికి, ఉగాదికి, జాతరల సందర్భంలో కడప జిల్లాలోని ప్రతి పల్లెలో జరుపుతారు.

గంగిరెద్దుల వారు కూడా సంక్రాంతికి ఎక్కువగా ఆడతారు. ఎద్దులను బాగా అలంకరించి, కొమ్ములకు రంగులేసి ఎద్దుమీద రకరకాలైన గుడ్డలను వేస్తారు. ఈ ఎద్దులలో పెద్దదానిని రాముడని, చిన్నదానిని సీత అని పిలుస్తారు. వీటికి గజ్జెలు కూడా కట్టి రాగయుక్తంగా అక్కడ ఉన్న వ్యక్తి దానిని ఆడిస్తాడు. వాడు పాడేపాటకు లయబద్ధంగా ఎద్దు తల ఆడించడం, మోకాలి మీద నిలబడడం, అందరికి నమస్కారం చేయడం వంటివి చేస్తుంది. ప్రదర్శన అయ్యాక గ్రామ ప్రజలు ఇచ్చే దాన్యం, చిల్లర, డబ్బు స్వీకరిస్తారు.

**కర్రసాము :**

కర్రసామునే కట్టె విద్య అందురు. ఒకప్పుడు యుద్ధ విద్యలైన కర్రసాము, కత్తిసాము నేడు ప్రయోగాత్మకంగా నూతన పద్ధతులలో రూపొంది చివరకు పండుగలలో, జాతరలలోను, ఊరేగింపులలోను ఈ కర్రసాము చేస్తుం టారు. పంచెనులంగోటి మాదిరిగా పైకి ఎగచెక్కి, తప్పెట వాయిద్యానికి అనుగుణంగా అడుగులు వేస్తు కర్రను అతి వేగంగా అటు ఇటు తిప్పుతూ ఆడతారు.

**దొమ్మరాటలు :**

ఈ ఆటలు నేడు తమ వైభవాన్ని కోల్పోయాయి. ముఖ్యంగా దొమ్మరివారు ఈ ఆటలను ఆడతారు. ఈ ఆటలో దొమ్మరివారు కుటుంబంలోని చిన్న, పెద్ద, ఆడ, మగ భేదం లేకుండా ఆడతారు. ఈ ఆటలో బాగంగా గుండ్రంగా ఉన్న రింగుకు చుట్టు మంట వేసిదానిలో దూరడం, తీగమీద నడవడం, నిండు బిందెలను పంటితో ఎత్తడం, ఆడవారి ఎదమీద పెద్ద బండలను పెట్టుకొని, పెద్ద సుత్తితో కొట్టడం వంటి ప్రదర్శనలు చేస్తారు. వీరు ఈ ప్రదర్శన చేయునపుడు ఒకడు మధ్య డోలుకొడుతూ పాటపాడుతూ ఉత్సాహంకలిగిస్తాడు. ఇంకొకరు చిల్లర అడుగుతూ క్రింద పడినవి తీసి కొంటాడు. కొందరు దాన్యాన్ని ఇస్తారు.

**కనికట్టు - కాటిపాపలు :**

కాటిపాపడునే కనికట్టువాడు అని అంటారు. ఈ విద్యనే నేడు ఇంద్రజాల, మహేంద్ర జాల విద్యగా రూపాంతరం చెందినది. వీరు గ్రామంలో జానపద పండుగలైన సంక్రాంతి, శ్రీరామ నవమి పండుగలపుడు వస్తారు. నెత్తిన కిరీటాన్ని, చేతిలో బుడబుక్కల మంత్రం, ముఖంమీద పెద్ద బొట్టు పెట్టుకొని, వివిధ రకాల దుస్తులు ధరించి, శివుని పాటలు పాడుతూ కనికట్టు విద్య చేస్తారు. ఈ విద్యలు చేసేటపుడు గచ్చకాయలు, చిల్లర డబ్బులు, చిన్న చిన్న తేళ్ళు, చిన్న పాములు వెంట సంచిలో తెచ్చుకుంటారు.

**ముగింపు :**

మానవునికి కనీస అవసరాలైన గాలి, నీరు, ఆహారం, నీడ ఎంత అవసరమో మానసిక ఉల్లాసానికి సంగీతం, సాహిత్యం వంటి కళలు కూడా అంతఅవసరము అని చెప్పవచ్చు. మానసిక ఉత్తేజాన్ని కలిగించి జానపదులు పగలు పడిన శ్రమనంతా మరిపించడమే ఈ జానపద కళలల యొక్క పరమార్థం. జానపదకళలు ఆనందాను భూతిని కలిగించి, ప్రజలలోని ఈర్షద్వేషాలును తొలగించి పల్లెలలో విశాలదృక్పదాన్ని అలవరచుకోవడానికి ఎంత గానో ఉపయోగపడతాయి. అయితే ప్రభుత్వం వీటిని సరిగా ఆదరించకపోవడము నేటి యువతరం వీటిని సరిగా చూడకపోవడం వలన చాలామటుకు తెగమరగవు తున్నవి. నేటి యువతరం చరవాణి (స్మార్ట్‌పోన్) లు విరివిగా వాడడం వలన పెడత్రోవపడుతున్నారు. అందు వలన ప్రభుత్వం కళలును ఆదరించి, యువతను కూడా కళల వైపు మళ్ళించాలి.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. తెలుగు జానపద గేయ సాహిత్యం - డా.రామరాజు - పేజి. 5-10
2. రాయలసీమ జానపదప్రదర్శన కళలు (వ్యాసం) - ఆచార్య పి.శ్రీనివాసుల రెడ్డి - పేజి. 220-225
3. కడప కౌస్తుభం - జానపద దృశ్య కళారూపాలు - డా.పి. రమాదేవి - పేజి. 92-95
4. రాయలసీమ ఫుడ్ ఫెస్టివల్ తిరుపతి - రాయలసీమ జానపద ప్రదర్శన కళలు - ఆచార్య పేట శ్రీనివాసుల రెడ్డి - పేజి. 11-16
5. కడప జిల్లా గ్రామదేవతలు - డా.యస్.వి. పద్మనాభ రెడ్డి - పేజి. 1-5
6. క్షేత్ర పర్యటనలో పలువురితో చర్చించి, సేకరించిన సమాచారం.

# వట్టికోట ఆళ్వారుస్వామి నవల"ప్రజల మనిషి"- ప్రజా చైతన్య

**డా. మఠపతి మాంతయ్య,** అసిస్టెంట్ ప్రొఫెసర్(తెలుగు),
డాక్టర్ బి.ఆర్.ఆర్. కళాశాల, జడ్చర్ల, తెలంగాణ

**1.ఉపోద్ఘాతం :-**

వట్టికోట ఆళ్వారుస్వామి (1915--1961) తెలంగాణ ప్రజాసాహిత్యానికి పాదులు వేసిన రచయిత, ఉద్యమకర్త, పాత్రికేయుడు. ఆయన రచనలు నిజాం పాలనలోని సామాజిక, రాజకీయ పరిస్థితులను, గ్రామీణ ప్రజల దుస్థితిని, స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రతిబింబిస్తాయి

వట్టికోట ఆళ్వారుస్వామి నల్లగొండ జిల్లా చెరువు మాదారం గ్రామంలో 1915 నవంబర్ 1.
జన్మించాడు. తల్లిదండ్రులు: తల్లి మాచవరం సింహాద్రమ్మ, తండ్రి రామచంద్రాచార్యులు. పేద వైష్ణవ బ్రాహ్మణ కుటుంబం ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉన్న కుటుంబం.

**2. వట్టికోట ఆళ్వారుస్వామి బాల్యం - విద్య**

ఆళ్వారుస్వామి చిన్నతనంలోనే తండ్రి మరణించడంతో కుటుంబ ఆర్థిక భారం పెరిగింది.
చదువు కొనసాగించడానికి తన ఉపాధ్యాయుడు సీతారామారావుకు వంటపనులు చేసి పెడుతూ చదివాడు; అలాగే హోటల్ సర్వర్, వంటపనులు వంటి పనులు చేసి బతుకు తెరువు వెతుక్కోవాల్సి వచ్చింది.
స్వయంకృషితో తెలుగు, ఆంగ్లం, సాహిత్యం అధ్యయనం చేసి, గ్రంథాలయోద్యమం ద్వారా జ్ఞానాన్ని విస్తృతం చేసుకున్నాడు.
నిజాం వ్యతిరేక పోరాటాల్లో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. ఆంధ్రమహాసభ, అభ్యుదయ రచయితల సంఘం వంటి ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. దాశరథి వంటి మహాకవులు ఆయనను "పదమూడో ఆళ్వార్"గా కీర్తించారు---జీవులపై భక్తి ఉన్న మనిషిగా.
మీరు "ప్రజా చైతన్య" అంశంపై మరింత లోతైన విశ్లేషణ (పాత్రల వారీగా, సంఘటనల వారీగా) కావాలంటే చెప్పండి; ఆ దిశలో వివరించగలను.

**3.వట్టికోట ఆళ్వారుస్వామి ప్రధాన రచనలు:-**

వట్టికోట ఆళ్వార స్వామి తెలంగాణ నేపథ్యం అనేక నవలలు, కథలు రాశారు. వాటిలో ప్రజాధరణ పొందినవి..

1.గంగు (+ఘఅస్త్రబ) -- 1940--45 మధ్య రాసిన ఈ నవల పూర్తికాలేదు. తెలంగాణ గ్రామీణ ప్రజల కష్టాలు, సామాజిక, రాజకీయ పరిస్థితులను చిత్రించిన ముందడుగు రచనగా పరిగణించబడుతుంది.

2.ప్రజల మనిషి (గ్రాఖీఘయిఖ్రీఖ మీఖఅఙంష్త్రఙ) -- 1952లో ప్రచురితమైన ఈ నవలను తెలంగాణ తొలి నవలగా పరిగణిస్తారు. హైదరాబాద్ సంస్థానంలోని సాధారణ ప్రజల జీవితం, సామాజిక, రాజకీయ పరిస్థితులను ఇందులో చూపారు.

3.జైలు లోపల (Jailu Lopala / Inside Jail) -- వట్టికోట జైలు అనుభవాల ఆధారంగా రాసిన ఈ పుస్తకం ఆయన ఉద్యమ జీవితానికి నిదర్శనం.

3.గాలిపటం -- స్త్రీలపై లైంగిక వేధింపుల అంశాన్ని 70 ఏళ్ల క్రితమే ఈ కథలో చిత్రించారు. 'మీ టూ' ఉద్యమానికి ముందే ఇలాంటి సమస్యపై వట్టికోట రచన చేయడం విశేషం.

ఇతర రచనలు, కథలు

పతితుని హృదయం -- 1952 నాటి జైలు కథల సంకలనంలో ఉన్న కథ; శిక్షాస్మృతి స్వభావాన్ని ప్రశ్నించే కథనం.

ఆలు కూలి -- కుటుంబంలో స్త్రీ అనుభవించే కష్టాలను చిత్రించిన కథ.

ఆయన దేశోద్ధారక గ్రంథమాల (1938లో స్థాపన) ద్వారా సుమారు 35 పుస్తకాలను ప్రచురించారు; అలాగే తెలంగాణ, గుమాస్తా వంటి పత్రికలను నడిపారు

## 4. సాహిత్యం - ఇతర కృషి :-

1938లో హైదరాబాద్లో దేశోద్ధారక గ్రంథమాలను స్థాపించి సుమారు 35 పుస్తకాలను ప్రచురించారు. తెలంగాణ ప్రజలను చైతన్యపరచడానికి, విద్యాభివృద్ధికి ఈ గ్రంథమాల కృషి చేసింది.

తెలంగాణ పేరుతో ఒక తెలుగు పత్రికను ప్రారంభించి ప్రజలలో చైతన్యం కలిగించారు.

సురవరం ప్రతాపరెడ్డి స్థాపించిన గోల్కొండ పత్రికలో ప్రూఫ్ రీడర్గా, తెలుగు తల్లి పత్రిక నిర్వాహకుడిగా పనిచేశారు.

## 4. ప్రజల మనిషి"నవల- ప్రజా చైతన్య:-

వట్టికోట ఆళ్వారుస్వామి రాసిన "ప్రజల మనిషి" (1955) తెలంగాణ తొలి నవలగా పేరుగాంచింది. ఇది నిజాం పాలన కాలంలోని తెలంగాణ గ్రామీణ జీవితాన్ని, దొరల దౌర్జన్యాన్ని, పోలీసు అణచివేతను, ప్రజల్లో చైతన్యం పెరగడాన్ని సమర్థవంతంగా చిత్రిస్తుంది.

## 4.1. నవల నేపథ్యం :-

రచనా సంవత్సరం: 1955 (తెలంగాణ సాయుధ పోరాటానికి పూర్వరంగం నేపథ్యంలో రాశారు).

కథాకాలం: సుమారు 1928--1938 దశాబ్ది; నిజాం పాలనలోని నిజామాబాద్ జిల్లా ప్రాంతం.

ప్రాముఖ్యం: తెలంగాణ ప్రాంతం గురించి, తెలంగాణ వ్యక్తి రాసిన తొలి నవలగా సాహిత్య చరిత్రలో స్థానం పొందింది.

## 4.2."ప్రజల మనిషి" నవల కథాసారం :-

కథ నిజామాబాద్ జిల్లాలోని దిమ్మెగూడెం అనే పల్లెటూరిలో సాగుతుంది. ఊరి దొర రాంభూపాల్ రావు గ్రామ ప్రజల ఆస్తులు, శ్రమను దోచుకుంటూ, అణచివేతకు పాల్పడుతూ ఉంటాడు. అతని అన్యాయాల నడుమ ప్రజల్లో కొంతమంది చదువుకున్న, లోకజ్ఞానం ఉన్న వ్యక్తులు చైతన్యం పొందుతూ, ప్రతిఘటనకు సిద్ధమవుతారు. ఈ ప్రక్రియలో "ప్రజల మనిషి" ఎవరు అనే ప్రశ్న కూడా విమర్శకుల మధ్య చర్చనీయాంశమైంది---కథానాయకుడు కంఠీరవం కాదని, కొమురయ్య అని కొందరు విమర్శకులు (ఉదా. బి.ఎస్. రాములు, అనుమండ్ల భూమయ్య విశ్లేషణ ఆధారంగా) వాదించారు.

## 4.3."ప్రజల మనిషి"నవల విశేషాలు

**తెలంగాణ తొలి నవల :** ప్రాంతీయ సాహిత్య చరిత్రలో ఇది మైలురాయి.

**సాంఘిక చరిత్ర :** ఇది కేవలం ఉద్యమ నవల మాత్రమే కాదు, నాటి అమలిన జీవితాన్ని, ప్రేమలు, ఆప్యాయతలు, వేదనలను సున్నితంగా చిత్రించిన సాంఘిక చరిత్ర.

**అహింసా దృక్పథం :** వట్టికోట అహింసా కమ్యూనిస్టు కాబట్టి నవలలో నెత్తుటి మరకలు లేవు.

**భాషా శైలి :** సంభాషణలు తక్కువ; తెలంగాణ జనసామాన్యం మాట్లాడే భాషను ఉపయోగించారు.

**చైతన్య సందేశం :** అణగదొక్కిన ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి ఉద్యమ కార్యకర్తల త్యాగ జీవితాలను చిత్రించారు.

సాహిత్య ప్రాముఖ్యం

తెలంగాణ సాయుధ పోరాటానికి పూర్వరంగంగా ఈ నవల పరిగణించబడుతుంది.

భూస్వామ్య వ్యతిరేక పోరాటాన్ని వర్ణించిన మొట్టమొదటి నవలల్లో ఇది ఒకటి.

దాశరథి వంటి మహాకవులు వట్టికోటను కీర్తిస్తూ తమ రచనలను ఆయనకు అంకితమిచ్చారు.

### 4.4. ప్రజా చైతన్యంపై నవల దృష్టి :-

"ప్రజల మనిషి" కేవలం దౌర్జన్యాన్ని చూపించడమే కాదు, ప్రజల్లో స్వయం చైతన్యం ఎలా పెరుగుతుంది అనేదానిపై కూడా దృష్టి సారిస్తుంది:

### 4.5. నిజాం పాలనలో అణచివేత :-

భూస్వాముల దౌర్జన్యం, పోలీసుల అత్యాచారాలు, ఉర్దూ–తెలుగు భాషా సంఘర్షణలు, ఉద్యోగాల అస్థిరత వంటి అంశాలు నవలలో ప్రతిబింబిస్తాయి.

### 4.6. చైతన్య ప్రక్రియ :-

కథలో పాఠశాల, గ్రంథాలయోద్యమం, ఆంధ్రమహాసభ లాంటి సంస్థల ప్రభావం, ప్రజల మధ్య చర్చలు, సంఘటిత ప్రయత్నాలు కనిపిస్తాయి. ఇది 1938 నాటికి తెలంగాణలో రాజకీయ చైతన్యం పొడచూపడంతో ముగుస్తుంది.

### 4.7. సామాజిక విశ్లేషణ :-

నవల ద్వారా ప్రజలు తమ శక్తిని గుర్తించడం, దుస్థితి నుంచి బయటపడే మార్గాలు ఆలోచించడం వంటి అంశాలు స్పష్టమవుతాయి.

### 5. ముగింపు :-

ప్రజా చైతన్యం దృష్ట్యాసాహిత్య విమర్శకుల విశ్లేషణల ప్రకారం, ఈ నవల ముగింపు ẏవిజయోత్సవం' లాంటిది కాదు; బదులుగా ప్రజా చైతన్యం మొలకెత్తిన స్థితిగా, భవిష్యత్తుకు దారి చూపే సంకేతంగా ఉంటుంది.కంఠీరవం వ్యక్తిగతంగా చాలా కష్టాలు ఎదుర్కొంటాడు --- నిజాం పాలనలోని అణచివేత, భూస్వాముల దౌర్జన్యం, పోలీసు అత్యాచారాలు.

కథాంతంలో అతను పూర్తిగా ẏవిజేత'గా నిలవడు; కానీ తన చుట్టూ ఉన్న ప్రజల్లో మార్పును చూస్తాడు --- భయం తగ్గి, ప్రశ్నించే ధైర్యం, సంఘటితమయ్యే ఆలోచన మొదలవుతాయి.ఈ మార్పే నవల ముగింపులోని ẏప్రజా చైతన్యం' సారాంశం: ఒక మనిషి పోరాటం ద్వారా సమూహ చైతన్యం మేల్కొంటుంది.కాబట్టి, ప్రజా చైతన్యానికి ముగింపు లేదు --- అది నవల చివరలో మొదలైన ప్రక్రియగా చూపబడుతుంది. వట్టికోట ఆళ్వారుస్వామి ఉద్దేశం కూడా ఇదే: పాఠకుల్లో చైతన్యాన్ని రేకెత్తించడం, కేవలం కథను ముగించడం కాదు.

### ఆధార గ్రంథాలు:-

1."ప్రజల మనిషి"....వట్టికోట ఆళ్వారుస్వామి
2.తెలంగాణలో సాహిత్య పునర్వికాసం -- కె. శ్రీనివాస్
3.జైలు లోపల...వట్టికోట ఆళ్వారుస్వామి
4.గంగు..........వట్టికోట ఆళ్వారుస్వామి
5.అగ్నిధార.........దాశరథి రంగాచార్య
6. తెలుగు వికీపీడియా

★ ★ ★

BHAVAVEENA
Vol. 17, Issue. 3, March (2) - 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal Sl.No. 34
under Arts and Humanities Category

# Assessment Patterns - Reading

*- B. Rohini,* Research Scholar, Dept. of Foreign Languages &Linguistics, S. V. University,Tirupathi.

**Introduction :**

Educational Assessment or educational evaluation is a methodological procedure of achieving and utilizing observational information on the aptitude, mentalities, and convictions to refine programs and improve learning. Assessment information can be acquired from legitimately inspecting work to survey the accomplishment of learning results or can be founded on information from which one can make derivations about learning. Assessment is frequently utilized conversely with test, yet not constrained to tests. Assessment can concentrate on the individual student, the learning network (class, workshop, or other composed gathering of students), a course, a scholastic program, the establishment, or the educational framework overall (otherwise called Granularity). The word 'evaluation' came into force in an educational settlement after the Second World War.

As a consistent procedure, evaluation builds up quantifiable and clear understands the learning results for getting the hang of, provisioning an adequate measure of learning chances to accomplish these results, executing a methodological method for social event, investigating and deciphering proof to decide how well understand learning matches desires, and utilizing the gathered data to educate improvement in understanding learning.

The last reason for appraisal rehearses in education relies upon the hypothetical system of the specialists and scientists, their presumptions and convictions about the idea of human personality, the inception of information, and the way toward learning.

To start with, understanding vocabulary, its guidance and its appraisal is ostensibly the most significant result of change developments structured to improve understanding educational plan and guidance. Second, given the national hunger for responsibility, we should have better (i.e., adroitly and psychometrically progressively reliable) apparatuses to drive the motors of responsibility at the national , state, and nearby level. Third, and significantly progressively significant, we need better appraisals with the goal that we can react to the requests of educators urgent for helpful devices to help them in addressing singular needs. It is doubly fitting that the evaluation of reading understanding gets a lot of consideration as to build itself. In the last investigation, a decision is made as much by how it is operational zed as by how it is conceptualized.

Models of understanding vocabulary and how to survey it have developed all through the 20th century. Numerous systems of appraisal have ascended to conspicuousness and afterward dropped out of utilization, some to be resurrected decades later, typically with new turns. Our point is to give an exhaustive record of what we think about surveying understanding vocabulary. Where conceivable also, fitting, we bring alternate routes into research and hypothesis about the vocabulary process, in light of the fact that originations of the procedure, on the grounds that they have affected how it is evaluated, will illuminate our understanding. We trust to light up the examples, cycles, and patterns in understanding appraisal.

Despite the fact that reading understanding evaluation as a formal, recognizable movement

is a 20th century marvel, it has been a piece of class rooms as long as there have been schools, required writings, students who are required to understand them, and educators need or have to know whether got them. In each century and consistently, every task given by an instructor, each book report or part synopsis, and each discussion about a book, story, article, or on the other hand section, has given a chance to appraisal. It was not until well into the 20th century that we started to take advantage of those lucky breaks. There are two conceivable clarifications for the generally late appearance of appreciation as a marker of understanding accomplishment.

**The Beginning:**

It is certainly justified regardless of our push to inspect early patterns in understanding appraisal, for they propose that almost the entirety of the instruments we use to gauge reading understanding today shown up here and there shape or structure before World War II.

In all actuality, the present organizations and approaches may look increasingly complex and complex, yet, as our audit illustrates, those arrangements were there, at any rate in prototypic structure, quite a while in the past. The main methodological endeavors to file reading capacity by estimating understanding go back to the period simply earlier to World War I. Binet, as a head of schedule as 1895,utilized perception test things, amusingly, to quantify insight as opposed to understanding accomplishment. In 1916, Kelly brought us the principal distributed understanding appraisal, the Kansas Silent Reading Tests.

Thorndike, in his great 1917 piece, Reading as Reasoning: A Study of Mistakes in Passage Reading, offered us our first expert look "inside the head" as he attempted to describe what more likely than not been going on in the brains of understudies to deliver the sorts of answers they concoct when responding to questions about content. As we showed before, the journey to get as close as conceivable to the "phenomenological demonstration of vocabulary" as it happens has constantly determined scientists to find new and more straightforward lists of understanding perception.

**The straight forward perspective on reading :**

The Simple View of Reading (SVR) offers one helpful approach to consider reading and the expertise holes students may have. SVR is generally referenced in logical investigations of reading. As per SVR, great reading perception requires two wide sorts of capacities: great word acknowledgment and great oral language appreciation.

Both of these areas — word acknowledgment and oral language cognizance — fuse other explicit capacities. For instance: The straightforward perspective on reading is The Simple View of Reading (SVR) offers one helpful approach to consider perusing and the expertise holes understudies may have. SVR is generally referenced in logical investigations of reading. As per SVR, great reading perception requires two wide sorts of capacities: great word acknowledgment and great oral language appreciation. Both of these areas — word acknowledgment and oral language cognizance — fuse other explicit capacities. For instance:

The Simple View of Reading has been utilized to distinguish four profiles of youthful students: a profile for understudies who are at or above evaluation level and three basic profiles of understudies with understanding troubles.

Students who have great or satisfactory language cognizance and great or sufficient interpreting. Youngsters with this profile are undoubtedly at or above evaluation level in reading.

Students who have great language appreciation however poor word acknowledgment/translating skills. This profile is named explicit word acknowledgment challenges (SWRD), in light of the fact that the youngster's reading issues are explicit to word acknowledgment, not language cognizance.

Students who have shortcomings in language perception and word acknowledgment/ unraveling abilities. This profile is frequently called blended understanding troubles (MRD), in light of the fact that the reading issues incorporate both word acknowledgment and cognizance. When showing battling readers, distinguishing the individual understudy's profile can help guarantee that intercession techniques are powerful.

Students with the subsequent profile, great language understanding yet poor word acknowledgment (SWRD), normally need phonics mediation. For the greater part of these youngsters, compelling phonics mediation, whenever joined by sufficient degrees of familiarity, should empower kids to accomplish grade-suitable understanding cognizance.

Students with the third profile, poor language perception however great word acknowledgment and deciphering (SCD), need not bother with phonics intercession. They require appreciation intercessions that address their particular needs in the area of perception.

Students with the last profile, shortcomings in both language understanding and word acknowledgment/deciphering (MRD), require both phonics intercession and mediation tending to their particular perception needs.

Educators can utilize the Simple View of Reading to recognize the youngster's profile of understanding trouble. From that point, the instructor should lead all the more fine-grained appraisals to decide the kid's particular abilities and how to target guidance.

At each evaluation level, particular kinds of challenges will probably be normal, which implies that kids can be assembled for separation of guidance in little, adaptable gatherings. For instance, in a run of the mill third-grade class, troubles with word-acknowledgment and translating would frequently include interpreting two-syllable or multisyllabic words, and youngsters with these necessities could be assembled. Kids with grade-fitting interpreting yet cognizance needs including foundational information may be in a subsequent gathering.

**Word acknowledgment incorporates:**

- ♦ Phonological and phonemic mindfulness,
- ♦ Phonics aptitudes,
- ♦ Automaticity of word acknowledgment,
- ♦ Reading of normal phonetically sporadic words,

**Oral language perception incorporates:**

Deciding the profile of understanding trouble and recognizing explicit expertise holes. The Simple View of Reading has been utilized to distinguish four profiles of younger students: a profile for understudies who are at or above evaluation level and three basic profiles of understudies with understanding troubles. Among others, Catts and his partners Moats, and Spear-Swerling have talked about these profiles:

Students who have great language appreciation however poor word acknowledgment / translating skills. This profile is named explicit word acknowledgment challenges (SWRD), in

light of the fact that the youngsters reading issues are explicit to word acknowledgment, not language cognizance.

Students with the last profile, shortcomings in both language understanding and word acknowledgment, require both phonics intercession and mediation tending to their particular perception needs. Educators can utilize the Simple View of Reading to recognize the youngster's profile of understanding trouble. From that point, the instructor should lead all the more fine-grained appraisals to decide the kid's particular abilities and how to target guidance.

**References :**

1. Allen, M.J. (2004). Assessing Academic Programs in Higher Education. San Francisco: Jossey-Bass.
2. Kuh, G.D.; Jankowski, N.; Ikenberry, S.O. (2014) University of Illinois and Indiana University, National Institute for Learning Outcomes Assessment.
3. National council on Measurement in Education Nelson, Robert; Dawson, Phillip (2014). "A contribution to the history of assessment: how a conversation simulator redeems Socratic method". Assessment & Evaluation in Higher Education.
4. Suskie, Linda (2004). Assessing Student Learning. Bolton, MA: Anker
5. Aebersold, Jo Ann& Field M.L (1997) "From reader to reading teacher", Cambridge: Cambridge University Press.
6. Anderson, R.C. (1996) "Research foundations to support wide reading" in Promoting Reading in Developing Countries, p.55-77. Newark: International Reading Association.
7. Novak, Sigrid (1982) "Reading laboratories: The conversion of the speed reading lab into an ESL reading lab".

భావవీణ

# BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

March (2) 2020

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253
UGC Care List Group - 1
Journal Sl. No 34 under Arts and Humanities Category




Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002.
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.